
‘ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.’

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+16 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 79

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

సోమవారం 10-6-2019


# 10లో 9 బాలురవే..

## ఎంసెట్ ఇంజనీరింగ్‌లో వారిదే హవా

**టాప్‌10లో తొమ్మిది ర్యాంకులు అబ్బాయిల సొంతం**

- ఆంధ్రప్రదేశ్ విద్యార్థి రవి శ్రీతేజకు ఫస్ట్ ర్యాంకు
- టాప్–10 ర్యాంకర్లలో ఐదుగురు ఏపీ విద్యార్థులు
- అగ్రికల్చర్, ఫార్మసీలో టాపర్‌గా భూపాలపల్లి విద్యార్థి కుశ్వంత్
- ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి
- ఈ నెల 20 తరువాత ప్రవేశాల కౌన్సెలింగ్
- త్వరలోనే ప్రవేశాల నోటిఫికేషన్, ఈసారి 90 వేల సీట్లు

2లో






# కంగారూలను కసితో...

ప్రపంచకప్‌లో భారత్ వరుసగా రెండో విజయం సాధించింది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 36 పరుగుల తేడాతో ఓడించింది. శిఖర్ ధావన్ (109 బంతుల్లో 117; 16 ఫోర్లు) సెంచరీ... కెప్టెన్ కోహ్లి (77 బంతుల్లో 82; 4 ఫోర్లు, 2సిక్స్‌లు), వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ (70 బంతుల్లో 57; 3 ఫోర్లు, సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. దాంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్లకు 352 పరుగులు చేసింది. అనంతరం ఆస్ట్రేలియా సరిగ్గా 50 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో భువనేశ్వర్, బుమ్రా మూడేసి వికెట్లు తీశారు. - స్పోర్ట్స్‌లో



# సరిలేరు నీకెవ్వరు...

- మట్టికోర్టులపై మకుటంలేని మహరాజు తానేనని స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ నిరూపించాడు. అతను రికార్డు స్థాయిలో 12వసారి ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు.

– స్పోర్ట్స్‌లో



శ్రీవారిని దర్శించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ -12లో

ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రధాని నరేంద్ర మోదీకి శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ ఈవో అనిల్ సింఘాల్. చిత్రంలో గవర్నర్ నరసింహన్, టీటీడీ జేఈవో తదితరులు.

# పావురాల ముట్టడి

**హైదరాబాద్‌లో 6 లక్షలకు చేరిన కపోతాలు.. పట్టించుకోకుంటే నిఫా తరహా ప్రమాదం: నిపుణులు**

- వాటి విసర్జితాల వల్ల ఇన్ఫెక్షన్లు, శ్వాసకోశ వ్యాధుల ప్రమాదం
- చర్మం, నోరు, ఊపిరితిత్తులు, ఉదరకోశం దెబ్బతినే అవకాశం
- డాక్టర్ వాసుదేవరావు బృందం అధ్యయనం హెచ్చరిక
- త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్న బృందం
- విదేశాల్లో పావురాలకు దాణా వేయడంపై నిషేధం

❖ శ్వాస సంబంధ వ్యాధులతో ఆస్పత్రులపాలయ్యే రోగుల్లో సగం మందికి ఆ సమస్యలు రావడానికి పావురాలు కారణమవుతున్నట్లు గతంలో ఢిల్లీలో గుర్తించారు.



❖ రెండేళ్ల క్రితం పావురాలకు బహిరంగంగా దాణా వేసే ప్రాంతాలు 490 ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 560కి చేరుకుంది.

❖ భారీ అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణదారులు కొనుగోలుదారులను ఆకట్టుకునేందుకు పావురాలకు దాణా వేసే ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నారు. పావురాలకు దాణా వేస్తే పుణ్యం వస్తుందన్న ఉద్దేశంతో చాలా మంది ప్రజలు వాటికి ఆహారం అందిస్తున్నారు.

సాక్షి, హైదరాబాద్

భాగ్యనగర సంస్కృతిలో భాగమైన శాంతి కపోతాలు... ప్రజారోగ్యానికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి! ఆహ్లాదం కోసమో లేక పుణ్యం వస్తుందనో నగరవాసులు పెంచుకునే పావురాలు వారికి తీవ్రమైన శ్వాసకోస వ్యాధులను వ్యాపింపజేస్తున్నాయి!! ప్రస్తుతం కేరళను వణికిస్తున్న ప్రాణాంతక నిఫా వైరస్ తరహా ఉపద్రవం భవిష్యత్తులో పావురాల వల్ల వచ్చే ప్రమాదం పొంచి ఉందని వైద్య నిపుణులు, పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. పావురాల విసర్జితాలతో తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు అమెరికా విడుదల చేసిన తాజా అధ్యయన నివేదిక హెచ్చరించింది. పావురాల విసర్జితాల నుంచి ఇన్‌ఫెక్షన్లు, వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయని, వాటి వల్ల డజనుకు పైగా రకాల అనారోగ్య సమస్యలు రావొచ్చని పేర్కొంది. ఈ ఇన్‌ఫెక్షన్లతో మిగతా 2వ పేజీలో ▶


NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE

Vencobb FRESH CHICKEN

ప్రతిపాదించిన నేటి గుడ్లు & చికెన్ హైదరాబాద్ జోన్ ధరలు

| | | | | |
|---|---|---|---|---|
| గుడ్ల రిటైల్ ధర ₹ 48 డజన్ | ఫారం దగ్గర లైవ్ బర్డ్ | 130 కిలో | డ్రెస్డ్ స్కిన్‌తో | 220 కిలో |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 152 కిలో | స్కిన్‌లెస్ | 251 కిలో |

Conditions Apply.

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది


# ఉగ్రవాదం ఉమ్మడి శత్రువు

- ఎదుర్కోవాలని భారత్, శ్రీలంక నిర్ణయం
- శ్రీలంక అధ్యక్షునితో ప్రధాని మోదీ భేటీ
- భారత ప్రధానికి గొడుగుపట్టిన సిరిసేన
- ఈస్టర్ ఉగ్రదాడి మృతులకు ప్రధానమంత్రి మోదీ నివాళి - 13లో








ఆదివారం చేప ప్రసాదం కోసం ఎగ్జిబిషన్ మైదానంలో కిక్కిరిసిన జనం

# ముగిసిన చేప ప్రసాద పంపిణీ

హైదరాబాద్: మృగశిర కార్తెను పురస్కరించుకొని బత్తిని సోదరులు నిర్వహించే చేప ప్రసాద పంపిణీ కార్యక్రమం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. రెండో రోజు కూడా వివిధ రాష్ట్రాల నుంచి ఆస్తమా రోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆస్తమా రోగులతో ఎగ్జిబిషన్ మైదానం కిక్కిరిసిపోయింది. రెండవ రోజు కార్యక్రమ ఏర్పాట్లను రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించి సంతోషంగా తిరిగి వెళ్తున్నారన్నారు. చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వం తరపున కల్పించిన మౌలిక సదుపాయాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మిగతా 4వ పేజీలో ▶

# కేరళపై ప్రధానిది సవతి ప్రేమ

**మోదీ వ్యాఖ్యలను ఖండించిన రాహుల్‌గాంధీ**



- తన సొంత నియోజకవర్గం వారణాసి మాదిరిగా కేరళ కూడా తనకెంతో ప్రియమైనదన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఖండించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలపై ప్రధాని సవతి ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. - 13లో

# పెట్టుబడి నిర్ణయాల్లో మహిళలూ ముందుండాలి..

- పురుషులతో పోలిస్తే సగం మందే సొంత నిర్ణయాలు
- డీఎస్‌పీ విన్‌వెస్టర్ పల్స్ సర్వేలో ఆశ్చర్యకర అంశాలు

- బిజినెస్‌లో




## ఎంసెట్ ఫలితాల్లో నారాయణ హవా

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఎంసెట్–2019 ఫలితాల్లో నారాయణ విద్యార్థుల హవా కొనసాగింది. స్టేట్ 2, 3, 4, 4, 6, 6, 7, 7, 9, 10 వంటి టాప్ 10లో 10 ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో టాప్ 100లో 51, అగ్రి మెడికల్ విభాగంలో టాప్ 100లో 27 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా ఎంసెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో టాప్ ర్యాంకులు సాధిస్తూ తమ విద్యార్థులు సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు.

## సత్తా చాటిన శ్రీచైతన్య

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఎంసెట్–2019 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు సత్తా చాటారు. ఇంజనీరింగ్‌లో స్టేట్ మొదటి ర్యాంకు, అగ్రి మెడికల్‌లో స్టేట్ మొదటి ర్యాంకు సాధించి రికార్డు సృష్టించారు. ఇంజనీరింగ్‌లో టాప్ 10లోపు 10 ర్యాంకులు, 100లోపు 76 ర్యాంకులు, అగ్రి మెడికల్‌లో టాప్ 10లోపు 6 ర్యాంకులు, 100లోపు 60 ర్యాంకులు తమ విద్యార్థులు సాధించినట్లు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ వెల్లడించారు. అలాగే రాబోయే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో కూడా తమ విద్యార్థులు విజయ పరంపర కొనసాగిస్తారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి చైర్మన్ బి.ఎస్.రావు అభినందనలు తెలిపారు.

## డా.కేకేఆర్ జయకేతనం

**హైదరాబాద్:** తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో డా.కేకేఆర్ గౌతమ్ స్కూల్స్ పూర్వ విద్యార్థులు సంచలనం సృష్టించారు. డా.కేకేఆర్ గౌతమ్ స్కూల్స్‌లో ఐఐటీ ఫౌండేషన్ తీసుకున్న పూర్వ విద్యార్థులు స్టేట్ ర్యాంకులు సాధించినట్లు చైర్మన్ డా.కోటేశ్వరరావు తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో జి.భానుదత్త 5వ ర్యాంకు, హితేంద్రకస్యప్ 8వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. అలాగే 100 లోపు 19 ర్యాంకులను సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

## ‘ఎస్సార్’ విజయభేరి

**కాజీపేట అర్బన్:** టీఎస్ ఎంసెట్ ఫలితాల్లో ఎస్సార్ విద్యా సంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ వరదారెడ్డి హన్మకొండలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో మాట్లాడారు. ఎస్సార్ విద్యార్థులు బి.వినయ్ బీపీసీ విభాగంలో రాష్ట్ర స్థాయి 260వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో పునిత్ బజాజ్ రాష్ట్ర స్థాయి 383వ ర్యాంకు, సుమైయ్యాఖాన్ 468, బి.గౌతమి 574, రాచపూడి మారుతి శ్రీరాం 597, వి.శ్రవణ్ రుషి 743, ఆర్.శ్రీవిద్య 867, సాయిచంద్ కేసేట్టి 875, ఎం.మనోజ్‌రెడ్డి 893, ఎస్.వరుణ్ 987 ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

## సత్తా చాటిన భాష్యం

**హైదరాబాద్:** తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో భాష్యం విద్యార్థులు సత్తా చాటారు. రాష్టస్థాయిలో బైపీసీ విభాగంలో భాష్యం మెడెక్స్ విద్యార్థులు కె.హరిప్రసాద్ 11వ ర్యాంకు, షేక్ ఎం.డి.రియాజ్ 16, ఎన్.ప్రమోద 34, వి.హర్షవర్థన్ 38, పి.మంజిత్ శ్రీరాజ్ 42వ ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు.

# 10లో 9 బాలురవే..

- ఇంజనీరింగ్ టాప్–10లో 9 మంది వారే
- ఏపీ విద్యార్థి రవి శ్రీతేజకు ఫస్ట్ ర్యాంకు

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఎంసెట్‌లో బాలురు సత్తా చాటారు. ఇంజనీరింగ్ విభాగం టాప్–10 ర్యాంకుల్లో 9 ర్యాంకులను బాలురే సాధించారు. ఇంజనీరింగ్‌లో టాప్ ర్యాంకును ఏపీకి చెందిన కురిశెట్టి రవి శ్రీతేజ కైవసం చేసుకున్నాడు. ఇంజనీరింగ్ టాప్ 10 ర్యాంకుల్లో ఐదు ర్యాంకులను తెలంగాణ విద్యార్థులు సాధించగా మరో ఐదు ర్యాంకులను ఏపీ విద్యార్థులు సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో భూపాలపల్లికి చెందిన ఎంపటి కుశ్వంత్ ఫస్ట్ ర్యాంకు సాధించాడు. ఈ విభాగంలోని టాప్–10 ర్యాంకులను సాధించిన వారిలో ఐదుగురు తెలంగాణ విద్యార్థులు ఉండగా ఏపీ నుంచి నలుగురు విద్యార్థులు ఉన్నారు. తెలంగాణ ఎంసెట్ ఫలితాలను ఆదివారం హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి విడుదల చేశారు. ఎంసెట్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ యాదయ్యతో కలసి ఫలితాలను ఆయన విడుదల చేశారు.



ఎంసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న టీఎస్ ఎంసెట్ కన్వీనర్ యాదయ్య, ఎంసెట్ చైర్మన్ వేణుగోపాలరెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

### 82.47%.. 93.01%..

ఎంసెట్‌కు మొత్తంగా 2,17,199 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 1,42,210 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు, 74,989 మంది అగ్రికల్చర్, ఫార్మసీ విద్యార్థులు ఉన్నారు. అగ్రికల్చర్ పరీక్షలకు 1,31,209 మంది హాజరవగా అందులో 1,08,213 మంది (82.47 శాతం) అర్హత సాధించారు. అగ్రికల్చర్ ఫార్మసీ పరీక్షలకు 68,550 మంది హాజరుకాగా, వారిలో 63,758 మంది (93.01 శాతం) అర్హత సాధించారు. విద్యార్థుల ఎంసెట్ మార్కులకు 75 శాతం వెయిటేజీ, ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీని అమలు చేశారు. ఈ పరీక్షలను ఆన్‌లైన్లో పలు దఫాలుగా నిర్వహించినందున నార్మలైజేషన్ చేసి విద్యార్థులకు ర్యాంకులను ఖరారు చేశారు. ఈ ఫలితాల్లో ఎంసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థుల్లో టాప్–10 ర్యాంకులతోపాటు వివిధ కేటగిరీల్లో టాప్ ర్యాంకులను సాధించిన విద్యార్థుల వివరాలను కూడా ప్రకటించారు.

### 20 తరువాత కౌన్సెలింగ్

ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 20 తరువాత ప్రవేశాల కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. ఈసారి జేఎన్‌టీయూ, ఉస్మానియా, కాకతీయ వర్సిటీల పరిధిలో ఇంజనీరింగ్‌లో 90 వేల వరకే సీట్లు ఉంటాయని తెలిపారు. జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తమ వర్సిటీల పరిధిలో గతేడాది 86 వేల సీట్లు ఉండగా ఈసారి 77,500 వరకు సీట్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు.



4 బట్టేపాటి కార్తికేయ, 5 గోర్తి భానుదత్త, 6 బి. సాయి వంశీ, 7 సాయివిగ్న, 8 హితేంద్ర కశ్యప్, 9 పి.వేద ప్రణవ్, 10 అభిజిత్‌రెడ్డి



4 సాయి స్వాతి, 5 ఆరె అక్షయ్, 6 మోనీష ప్రియ, 7 శివానీ శ్రీవాత్సవ, 8 సిద్ధార్థ్ భరద్వాజ్, 9 వి. పూజ, 10 తిప్పరాజు హాసిత

### ఇంజనీరింగ్‌లో...

| ర్యాంకు | పేరు | కంబైన్డ్ స్కోర్ | ప్రాంతం |
|---|---|---|---|
| 1 | కురిశెట్టి రవి శ్రీతేజ | 95.4834 | తాడేపల్లిగూడెం |
| 2 | డి చంద్రశేఖర ఎస్.ఎస్.హేతహవ్య | 94.6569 | విజయవాడ |
| 3 | గిల్లెల ఆకాశ్‌రెడ్డి | 93.1628 | వనపర్తి |
| 4 | బట్టేపాటి కార్తికేయ | 93.0393 | నెల్లూరు |
| 5 | గోర్తి భానుదత్త | 92.0528 | భీమవరం |
| 6 | బి. సాయి వంశీ | 91.7638 | హైదరాబాద్ |
| 7 | సూరపనేని సాయివిగ్న | 91.4714 | మాదాపూర్ |
| 8 | గౌరిపెద్ది హితేంద్ర కశ్యప్ | 90.7947 | గిద్దలూరు |
| 9 | పి.వేద ప్రణవ్ | 90.6039 | హైదరాబాద్ |
| 10 | అప్పకొండ అభిజిత్‌రెడ్డి | 90.3028 | మాదాపూర్ |

### అగ్రికల్చర్, ఫార్మసీలో..

| ర్యాంకు | పేరు | కంబైన్డ్ స్కోర్ | ప్రాంతం |
|---|---|---|---|
| 1 | ఎంపటి కుశ్వంత్ | 97.9473 | భూపాలపల్లి |
| 2 | దాసరి కిరణ్‌కుమార్‌రెడ్డి | 96.5340 | రాజమండ్రి |
| 3 | మరకని వెంకట సాయి అరుణ్ తేజ | 96.3524 | కాకినాడ |
| 4 | సుంకర సాయి స్వాతి | 96.2564 | తిరుపతి |
| 5 | ఆరె అక్షయ్ | 96.0615 | హైదరాబాద్ |
| 6 | మోనీష ప్రియ.జె | 95.9446 | మదురై (తమిళనాడు) |
| 7 | బుర్ర శివానీ శ్రీవాత్సవ | 95.4109 | నిజామాబాద్ |
| 8 | సిద్ధార్థ్ భరద్వాజ్ బృందావనం | 95.2323 | విశాఖపట్నం |
| 9 | వి. పూజ | 94.9352 | తిరుపతి |
| 10 | తిప్పరాజు హాసిత | 94.6426 | హైదరాబాద్ |

### విద్యాసంస్థల వారీగా పరీక్షలు రాసిన, అర్హత సాధించిన విద్యార్థుల వివరాలు

| | ఇంజనీరింగ్ | | అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ | |
|---|---|---|---|---|
| విద్యా సంస్థ | హాజరు | అర్హులు | హాజరు | అర్హులు |
| ప్రభుత్వ జూనియర్ కాలేజీలు | 7,960 | 6,737 | 9,886 | 9,055 |
| కేంద్రీయ విద్యాలయాలు | 463 | 401 | 212 | 203 |
| జవహర్ నవోదయ విద్యాలయాలు | 263 | 237 | 182 | 180 |
| ప్రభుత్వ/డీఆర్‌డీఏ పథకం | 482 | 424 | 468 | 442 |
| ప్రైవేటు/ కార్పొరేట్ కాలేజీలు | 1,22,041 | 1,00,414 | 57,802 | 53,878 |
| మొత్తం | 1,31,209 | 1,08,213 | 68,550 | 63,758 |

### ఎంసెట్ టాపర్ల అభిప్రాయాలు

**ఐఐటీలో సీటు సాధిస్తా..**

నాకు ఇంటర్‌లో 985 మార్కులొచ్చాయి. క్రమపద్ధతిలో చదివినందుకు మంచి ర్యాంకు సాధించా. ఏపీ ఎంసెట్‌లో నాలుగో ర్యాంకు వచ్చింది. జేఈఈ మెయిన్స్‌లో 33వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల కోసం ఎదురు చూస్తున్నా. ఐఐటీలో సీటు సాధిస్తా.

– చంద్రశేఖర ఎస్ఎస్ హేతహవ్య, ఎంసెట్ రెండో ర్యాంకు

**కంప్యూటర్ ఇంజనీర్ అవుతా..**

నాకు ఇంటర్‌లో 981 మార్కులు వచ్చాయి. ఏపీ ఎంసెట్‌లో 28వ ర్యాంకు వచ్చింది. జేఈఈ మెయిన్స్‌లో 117వ ర్యాంకు వచ్చింది. కంప్యూటర్ ఇంజనీర్ కావడం నా లక్ష్యం.

– జి.ఆకాశ్‌రెడ్డి, మూడో ర్యాంకు

# ఎంసెట్‌లో ర్యాంకు.. ఇంటర్‌లో ఫెయిల్

- 17,445 మంది విద్యార్థులకు కష్టకాలం
- మరో 4,281 మంది విద్యార్థులకు ఇంటర్ మార్కుల్లేక కేటాయించని ర్యాంకులు
- ఫెయిలైనవారిలో అగ్రికల్చర్ పరీక్షల్లో అర్హులే ఎక్కువ

**సాక్షి, హైదరాబాద్:** ఇదో విచిత్ర పరిస్థితి. ఎంసెట్‌లో ర్యాంకు వచ్చినా ఇంటర్మీడియట్‌లో ఫెయిలైన విద్యార్థులు వేలసంఖ్యలో ఉన్నారు. దీంతో వారంతా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ మొదటిదశ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు పొందలేని పరిస్థితి నెలకొంది. తెలంగాణ ఎంసెట్‌లో ఇంజనీరింగ్ పరీక్షకు మొత్తం 1,31,209 మంది విద్యార్థులు హాజరుకాగా అందులో 1,08,213 మంది అర్హత సాధించారు. కానీ, వీరిలోనూ 91,446 మంది విద్యార్థులకు మాత్రమే ఎంసెట్ కమిటీ ర్యాంకులను కేటాయించింది. మిగతా 13,251 మంది విద్యార్థులు ఇంటర్‌లో ఫెయిలయ్యారు. దీంతో వారికి ఎంసెట్ కమిటీ ర్యాంకులను కేటాయించలేదు. మరో 3,491 మంది విద్యార్థులకు సంబంధించిన ఇంటర్ మార్కుల వివరాలు లేకపోవడంతో ర్యాంకులను కేటాయించలేదని ఎంసెట్ కమిటీ వెల్లడించింది. అగ్రికల్చర్ విభాగంలో 68,550 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 63,758 మంది అర్హత సాధించారు. అయితే, అందులో 57,774 మందికే ఎంసెట్ కమిటీ ర్యాంకులను కేటాయించింది. మిగతా విద్యార్థుల్లో 4,194 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ కావడంతో వారికి ర్యాంకులను కేటాయించలేదు. మరో 1,790 మంది విద్యార్థుల ఇంటర్ మార్కుల వివరాలు లేకపోవడంతో వారికి ర్యాంకులను కేటాయించలేదని ఎంసెట్ కమిటీ వివరించింది. ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులంతా అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు రాస్తున్నారు. వారిలో ఉత్తీర్ణులైన వారికి ప్రస్తుతం కేటాయించిన ర్యాంకులు ఉండవు. అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల్లో వచ్చే మార్కుల ఆధారంగా తదుపరి ర్యాంకులను కేటాయించనున్నారు.

### ఇంజనీరింగ్ కేటగిరీలో..

| | హాజరు | | | అర్హత సాధించినవారు | | |
|---|---|---|---|---|---|---|
| కేటగిరీ | బాలురు | బాలికలు | మొత్తం | బాలురు | బాలికలు | మొత్తం |
| బీసీ–ఏ | /5,182 | 3,031 | 8,213 | 3,141 | 1,936 | 5,077 |
| బీసీ–బీ | 15,828 | 10,546 | 26,374 | 10,474 | 7,512 | 17,986 |
| బీసీ–సీ | 462 | 285 | 747 | 270 | 185 | 455 |
| బీసీ–డీ | 13,933 | 8,798 | 22,731 | 9,005 | 6,170 | 15,175 |
| బీసీ–ఇ | 5,627 | 1,626 | 7,523 | 2,748 | 998 | 3,746 |
| ఓసీ | 28,397 | 18,421 | 46,818 | 19,917 | 14,231 | 34,148 |
| ఎస్సీ | 7,055 | 5,058 | 12,113 | 5,180 | 4,037 | 9,217 |
| ఎస్టీ | 4,736 | 2,224 | 6,960 | 3,797 | 1,845 | 5,642 |

### అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగాల ఫలితాలు

| | హాజరు | | | అర్హత సాధించినవారు | | |
|---|---|---|---|---|---|---|
| కేటగిరీ | బాలురు | బాలికలు | మొత్తం | బాలురు | బాలికలు | మొత్తం |
| బీసీ–ఏ | 1,519 | 3,286 | 4,805 | 1,231 | 2,695 | 3,926 |
| బీసీ–బీ | 3,569 | 8,204 | 11,773 | 2,883 | 6,957 | 9,840 |
| బీసీ–సీ | 169 | 557 | 726 | 132 | 482 | 614 |
| బీసీ–డీ | 3,797 | 8,036 | 11,833 | 2,992 | 6,717 | 9,709 |
| బీసీ–ఇ | 1,866 | 4,394 | 6,260 | 1,328 | 3,579 | 4,907 |
| ఓసీ | 3,496 | 8,923 | 12,419 | 2,861 | 7,723 | 10,584 |
| ఎస్సీ | 4,201 | 9,669 | 13,870 | 3,643 | 8,509 | 12,152 |
| ఎస్టీ | 2,748 | 4,116 | 6,864 | 2,419 | 3,620 | 6,309 |

**ఐఐటీయే లక్ష్యం...**

మా నాన్న సురేష్‌నాయుడు ఆక్వా రైతు, అమ్మ అమరావతి గృహిణి. పదో తరగతిలో 10 గ్రేడ్ పాయింట్లు సాధించా. ఇంటర్‌లో 981 మార్కులు వచ్చాయి. ఏపీ ఎంసెట్‌లో 5వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లోనూ 5వ ర్యాంకు సాధించా. ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం.

– బట్టేపాటి కార్తికేయ, నాలుగో ర్యాంకు

**రీసెర్చ్ అంటే ఇష్టం...**

మా నాన్న నాగవెంకట విశ్వనాథం ప్రైవేటు ఉద్యోగి. అమ్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. పదో తరగతిలో 10 పాయింట్లు సాధించా. ఇంటర్‌లోనూ 10 గ్రేడ్ పాయింట్లు వచ్చాయి. ఏపీ ఎంసెట్‌లో 3వ ర్యాంకు, జేఈఈ మెయిన్స్‌లో కూడా 3వ ర్యాంకు వచ్చింది. అడ్వాన్స్‌డ్ ఫలితాల కోసం చూస్తున్నా. నాకు పరిశోధనలంటే ఇష్టం.

– భాను దత్త, ఎంసెట్ ఐదో ర్యాంకు

**ఐఐటీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తా...**

నాన్న శ్రీనివాస్‌కుమార్ రైల్వేలో సీనియర్ టెక్నికల్ ఇంజనీర్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్ చేయాలనే నా లక్ష్యం. ఇంటర్‌లో 984 మార్కులు వచ్చాయి. జేఈఈలో 248 ర్యాంకు వచ్చింది. అడ్వాన్స్‌డ్ ఫలితాల కోసం ఎదురుచూస్తున్నా.

– బి.సాయివంశీ, ఎంసెట్ ఆరో ర్యాంకు

**సివిల్స్ సాధిస్తా...**

నా తల్లిదండ్రులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో సివిల్స్‌లో మంచి ఉద్యోగం సంపాదించాలనేది నా లక్ష్యం. జేఈఈ మెయిన్స్‌లో 125వ ర్యాంకు సాధించా.

– గౌరిపెద్ది హితేంద్ర కశ్యప్, 8వ ర్యాంకు

**కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నా...**

మా నాన్న వెంకట కిరణ్‌కుమార్ న్యూరో సర్జన్, అమ్మ నాగశ్రీదేవీ గృహిణి. పదో తరగతి, ఇంటర్‌లోనూ 10 గ్రేడ్ పాయింట్లు సాధించా. ఏపీ ఎంసెట్‌లో 107, నీట్‌లో 1292 ర్యాంకు వచ్చింది. కార్డియాలజిస్ట్ కావాలనేదే నా లక్ష్యం.

– ఎం. వెంకటసాయి అరుణ్ తేజ, మూడో ర్యాంకు

**న్యూరో సర్జన్ కావడమే జీవితాశయం**

మా నాన్న లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అమ్మ లక్ష్మి టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. నీట్‌లో 55వ ర్యాంకు సాధించా. న్యూరో సర్జన్ కావాలనేది నా ఆశయం.

– ఎంపటి కుశ్వంత్, ఫస్ట్ ర్యాంకు

**న్యూరో సర్జన్ అవుతా...**

మా నాన్న సూర్యభాస్కరరావు రైల్వే ఉద్యోగి. అమ్మ విజయశాంతి గృహిణి. పదో తరగతిలో 10 గ్రేడ్ పాయింట్లు, ఇంటర్‌లోనూ 10 గ్రేడ్ పాయింట్లు సాధించా. నీట్‌లో జాతీయ స్థాయిలో 528 ర్యాంకు, ఏపీ ఎంసెట్‌లో రెండో ర్యాంకు వచ్చింది. న్యూరో సర్జన్ అవుతా.

– దాసరి కిరణ్‌కుమార్‌రెడ్డి, రెండో ర్యాంకు




# పావురాల ముట్టడి

▶ మొదటి పేజీ తరువాయి

చర్మం, నోరు, ఊపిరితిత్తులు, ఉదరకోశం దెబ్బ తింటున్నాయని అధ్యయనం తేల్చి చెప్పింది.

### విదేశాల్లో నిషేధం...

### మన దగ్గర ప్రాథమిక వివరాలే కరువు

సెంట్రల్ లండన్‌లో పావురాలకు బహిరంగ ప్రదేశాల్లో దాణా వేయడాన్ని నిషేధించారు. 2003లోనే అక్కడి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కానీ సెంట్రల్ లండన్ పరిధిలోకి వచ్చే కొన్ని ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో దాణా వేస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ గుర్తించి తాజాగా ఆయా ప్రాంతాల్లో నిషేధాన్ని విధించటమే కాకుండా గట్టిగా అమలుకు నిర్ణయించింది. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పావురాలకు దాణా వేస్తే 500 పౌండ్ల జరిమానా విధించనున్నట్టు హెచ్చరించింది. సింగపూర్ లాంటి నగరాలు కూడా జరిమానా హెచ్చరికలతో ప్రజలను కట్టడి చేస్తున్నాయి. దాణా వేస్తుండటం వల్లే పావురాల సంఖ్య భారీగా పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటోందని గుర్తించిన పలు అభివృద్ధి చెందిన దేశాలు సైతం తమ ప్రధాన నగరాల్లోని బహిరంగ ప్రదేశాల్లో పావురాలకు దాణా వేయడంపై నిషేధం విధిస్తున్నాయి. కానీ హైదరాబాద్‌లో మాత్రం పావురాలకు విచ్చలవిడిగా దాణా వేస్తున్నా పట్టించుకునే వారే లేకుండా పోయారు.



### నగరంలో భారీగా పావురాలు

హైదరాబాద్‌లో పావురాల సంఖ్యను కచ్చితంగా ఎంత ఉందో ప్రభుత్వం వద్ద ఎటువంటి సమాచారం లేనప్పటికీ దాదాపు 6 లక్షల పావురాలు నగరంలో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. పావురాలతో ఎలాంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయో తేటతెల్లం చేసేందుకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పక్షి విభాగాధిపతి డాక్టర్ వాసుదేవరావు బృందం హైదరాబాద్‌లో తొలిసారి అధ్యయనం జరుపుతోంది. నగరంలో శరవేగంగా పెరుగుతున్న పావురాలను కట్టడి చేసేందుకు వెంటనే చర్యలు ప్రారంభించకుంటే సమీప భవిష్యత్తులో ప్రజలు తీవ్రమైన శ్వాస సంబంధ వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని వాసుదేవరావు హెచ్చరిస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా ఆయన ఆధ్వర్యంలోని బృందం అధ్యయనం చేస్తోంది. ఈ అధ్యయన ప్రాథమిక వివరాలను 2017లో ‘సాక్షి’ తొలిసారి ప్రజల ముందుకు తెచ్చింది. అయితే ఈ రెండేళ్లలో పావురాల సంఖ్య లక్ష వరకు పెరిగిందని, వాటి సంఖ్యను వెంటనే నియంత్రించేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకు రావాల్సిన అవసరం ఉందని వాసుదేవరావు సూచిస్తున్నారు. లేదంటే నిఫా వైరస్ కలకలంతో కేరళవాసులు ఎలా భయపడుతున్నారో హైదరాబాద్‌వాసులు పావురాలను చూసి వణికిపోవాల్సిన పరిస్థితి రావొచ్చని ఆయన హెచ్చరిస్తున్నారు. వీలైనంత త్వరలో తమ అధ్యయనాన్ని ముగించి ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు ఆయన సిద్ధమయ్యారు. అధ్యయనంతుది అంకంలో ఆయన వైద్య ఆరోగ్యశాఖ సాయంతో ప్రత్యేక వివరాలను సేకరించనున్నారు.



డాక్టర్ వాసుదేవరావు

### పావురాల విసర్జితాలతో ప్రాణహాని ఇలా...

పావురాల విసర్జితాలు ఎండిపోయి పొడిలామారి గాలిలో చేరుతున్నాయి. పావురాల రెక్కల ద్వారా కూడా వేగంగా వ్యాపిస్తున్నాయి. వాటిని ఎక్కువగా పీల్చే వారు శ్వాస సంబంధ వ్యాధులకు గురవుతున్నారు. దీన్ని సాధారణ సమస్యగా నిర్లక్ష్యం చేస్తే క్రమంగా మగతగా అనిపించడం, తలనొప్పి ఉండటం, కొద్దిరోజులకే అది పక్షవాతానికి దారితీస్తుంది. అది చివరకు మృత్యువుకు కారణమవుతుందని నివేదికలు పేర్కొంటున్నాయి. ఇప్పుడు హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో ఈ తరహా కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని వాసుదేవరావు పేర్కొన్నారు. అయితే అందుకు పావురాలు కారణమన్న విషయాన్ని ప్రజలు ఇంకా గుర్తించడం లేదని, వాటిని ఇంకా పెంచుతూనే ఉన్నారని ఆయన చెబుతున్నారు. నగరంలో మరో రెండు, మూడేళ్లలో పావురాల సంఖ్య 10 లక్షలను దాటే పరిస్థితి ఉన్నందున ఇప్పుడు మేల్కొనకుంటే యావత్ హైదరాబాద్ జబ్బు పడే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఇదండీ సంగతి



మనం అడిగితే ఇలానే ఉంటుంది సార్!

## ఉద్యోగులకు అన్యాయం జరగదు

### శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగులకు అన్యాయం జరగదని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఆదివారం ఇక్కడి ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో ఉద్యోగులకు అన్యాయం జరగదని, ఉద్యోగుల సమస్యలన్నీ తెలిసిన వ్యక్తి సీఎంగా ఉండటం అదృష్టమన్నారు. ఇటీవలే డీఏ పెంచినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కొంత మంది స్వార్థపూరిత రాజకీయాల కోసం ఉద్యోగుల్లో చిచ్చుపెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటివారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీలో అర్హులైన వాటాదారులందరికీ ఇళ్ల స్థలాలు వస్తాయన్నారు. కార్యక్ర మంలో టీఎన్జీవోస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్, బి.రేచల్, రామినేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పాలన గాడితప్పింది: చాడ



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో పరిపాలన గాడితప్పిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఆరోపించారు. లోపభూయిష్టంగా మారిన సీఎం విధానాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు క్షేత్రస్థాయిలో పోరాటాలకు రూపకల్పన చేస్తామని ప్రకటించారు. ఆదివారం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఆయన సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చాక ఏకపక్ష నిర్ణయాలు, పార్టీ ఫిరాయింపులతో కేసీఆర్ ఒంటెత్తు పోకడలు ఏమాత్రం మార్చుకోలేదని విమర్శించారు. భూ ప్రక్షాళనలోని లోపాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు రైతులతో ముఖాముఖి నిర్వహణ, పోడు, సాగుభూముల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని తెలిపారు. జూలై 19, 20 తేదీల్లో సాగునీటి ప్రాజెక్టుల సందర్శన చేపడతామని చెప్పారు.

## 'ఎంఐఎంకు ప్రతిపక్ష హోదా ఇస్తే గద్దె దింపుతాం'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎంఐఎంకు ప్రతిపక్ష హోదా ఇస్తే ప్రజలు ఊరుకోరని, అదే జరిగితే టీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంఐఎం అడిగితే ప్రతిపక్ష హోదా ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో టీఆర్‌ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తోందని, స్థానిక ఎన్నికల్లో వేరే పార్టీ నేతలు గెలిస్తే వారిని బెదిరించి టీఆర్‌ఎస్‌లో చేర్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. మరోవైపు టీఆర్‌ఎస్ చేస్తున్న హత్యా రాజకీయాలకు బీజేపీ భయపడదని, వాటిని సహించబోమని స్పష్టంచేశారు. రాష్ట్రంలో నకిలీ విత్తనాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని, విత్తన భాండాగారం ఎటు పోయిందని ప్రేమేందర్ ప్రశ్నించారు. ఎన్నికల కోసమే ప్రభుత్వం ఎన్నికల ముందు రైతుబంధు పథకంపై హడావుడి చేసిందన్నారు. కిసాన్ సమ్మేళన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రైతులకు సహాయం అందించడానికి ముందుకు వచ్చినా, ఇంతవరకు కేంద్రానికి రాష్ట్రంలో ఉన్న రైతుల పేర్లు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శించారు.

## నేటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను సోమవారం (నేటి) నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 260 కేంద్రాల్లో నిర్వహించే ఈ పరీక్షలకు 61,431 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరగనున్నాయి. విద్యార్థులు పరీక్ష సమయం కంటే ముందుగా కేంద్రాలకు చేరుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సూచించింది.

## ఇంటర్ గణితం పేపర్‌లో తప్పులు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షల్లో భాగంగా ఆదివారం జరిగిన మొదటి సంవత్సరం గణితం ప్రశ్నపత్రంలో 3 తప్పులు దొర్లినట్లు విద్యార్థులు తెలిపారు. పరీక్ష ముగిసే అర్ధగంట ముందు ఈ విషయాన్ని అధికారులు తమకు చెప్పారన్నారు. సెక్షన్ బీలోని 14, 16 ప్రశ్నలు...అలాగే పార్టు 3లోని 22వ ప్రశ్న సైతం తప్పుగానే వచ్చిందని తెలిపారు. ఈ అంశంపై ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు స్పందించాలని కోరారు.

## ముగిసిన చేప ప్రసాద పంపిణీ

▶ మొదటి పేజీ తరువాయి

తెలిపారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించినట్లు వెల్లడించారు. ప్రజల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సంస్థలు చేసిన సేవలు అభినందనీయమని, ఇటువంటి సామాజిక సేవలను భవిష్యత్తులో కొనసాగించాలని సూచించారు. రెండు రోజుల పాటు 87 వేల చేప పిల్లలను పంపిణీ చేసినట్లు మత్స్య శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బత్తిని హరినాథ్ గౌడ్, మత్స్య శాఖ కమిషనర్ సువర్ణతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.





ఆదివారం హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న మంచిర్యాల జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతా మహేందర్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ తదితరులు

## అభివృద్ధికి పునరంకితమవుదాం

### జెడ్పీ చైర్‌పర్సన్లకు కేటీఆర్ అభినందనలు

సాక్షి, హైదరాబాద్: బంగారు తెలంగాణ సాకారం దిశగా సీఎం కేసీఆర్ నేతృత్వంలో సాగుతున్న అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తమవంతుగా కృషి చేయాలని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు కోరారు. పాలకవర్గాలు కొలువుదీరిన వెంటనే అభివృద్ధికి పునరంకితమవ్వాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా ప్రజల వద్దకు చేర్చేందుకు అందరు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. కొత్తగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు పట్నం సునీతారెడ్డి (వికారాబాద్), స్వర్ణ సుధాకర్ (మహబూబ్‌నగర్), నల్లాల భాగ్యలక్ష్మి (మంచిర్యాల), న్యాలకొండ అరుణ (సిరిసిల్ల), తీగల అనితారెడ్డి (రంగారెడ్డి), మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి (మేడ్చల్) ఆదివారం హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారిని అభినందించారు. మంత్రులు సీహెచ్ మల్లారెడ్డి, వి.శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీలు పి.మహేందర్‌రెడ్డి, పురాణం సతీశ్, ఎమ్మెల్యేలు సీహెచ్ రమేశ్‌బాబు, పి.నరేందర్‌రెడ్డి, బి.సుమన్, దుర్గం చిన్నయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యమా... రాచరిక పాలనా?

- తెలంగాణ ప్రజలు ఆలోచించాలి
- పార్టీ మారిన ఎమ్మెల్యేలు కాంగ్రెసోళ్లు ఎట్లయితరు?
- ఏపీ ఫలితాలే ఇక్కడా పునరావృతమవుతాయి
- భట్టి ఆమరణదీక్షలో మల్కాజ్‌గిరి ఎంపీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు
- రెండోరోజు కొనసాగిన భట్టి దీక్ష... ఆరోగ్యంలో క్షీణత
- మంద కృష్ణ, చెరుకు సుధాకర్, కంచ ఐలయ్యసహా పలువురి సంఘీభావం
- దీక్షాశిబిరానికి కర్ణాటక ఉపముఖ్యమంత్రి పరమేశ్వరన్
- కార్యకర్తలు అధైర్యపడొద్దన్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుత పాలన కావాలో... రాచరిక పాలన కొనసాగాలో తెలంగాణ ప్రజలు ఆలోచించాలని మల్కాజ్‌గిరి లోక్‌సభ సభ్యుడు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై తెలంగాణ అమరవీరుల కుటుంబాల సభ్యులు ఆలోచించాలని ఆయన కోరారు. సీఎల్పీని టీఆర్‌ఎస్‌లో విలీనం చేయడాన్ని నిరసిస్తూ సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క ఇందిరా పార్కు వద్ద చేపట్టిన ఆమరణదీక్ష ఆదివారం రెండోరోజు కూడా కొనసాగింది. ఈ దీక్షకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 12 మంది ఎమ్మెల్యేలను తీసుకుంటేనే అంతా అయిపోయిందని టీఆర్‌ఎస్, సీఎం కేసీఆర్ అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అయినా పార్టీ మారామని చెప్పిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వాళ్లు ఎలా అవుతారని, సీఎల్పీని టీఆర్‌ఎస్‌లో ఎలా విలీనం చేస్తారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ అప్రజాస్వామిక విధానాలకు నిరసనగానే ఎమ్మెల్యేల ఎన్నికల్లో టీఆర్‌ఎస్‌కు 95 లక్షల ఓట్లు వస్తే పార్లమెంటు ఎన్నికల్లో 75 లక్షలకు పడిపోయాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను తీసుకున్న టీడీపీకి తర్వాతి అసెంబ్లీ ఎన్నికల్లో అవే ఎమ్మెల్యేలు, ఎంపీ స్థానాలు వచ్చాయని, ఆంధ్రప్రదేశ్ ఫలితాలు తెలంగాణలోనూ పునరావృతమవుతాయని రేవంత్‌రెడ్డి చెప్పారు. దీక్షాశిబిరానికి వచ్చి సంఘీభావం తెలిపిన



భట్టి దీక్షలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంద కృష్ణమాదిగ తదితరులు

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోతే నష్టపోయేది అమాయకులేనని అన్నారు. దళితుడ్ని సీఎం చేస్తానని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు దళితుడు ప్రతిపక్ష నేతగా ఉండడం ఇష్టంలేకే ఆ హోదా కూడా తీసేస్తున్నారని ఆరోపించారు. భట్టికి లభించే గౌరవమే దళితులకు లభించే గౌరవమని చెప్పారు. తెలంగాణ ఇంటి పార్టీ అధ్యక్షుడు డాక్టర్. చెరుకు సుధాకర్ మాట్లాడుతూ అరాచకానికి దేశంలోనే సరికొత్త నిర్వచనం కేసీఆర్ అని అన్నారు. ప్రొఫెసర్ కంచ ఐలయ్య మాట్లాడుతూ కేసీఆర్ తెలంగాణలో అప్రజాస్వామిక వాతావరణం తెచ్చారని ఆరోపించారు. కేసీఆర్‌కు ఉద్యమ లక్షణ ం ఒక్కటి ఉన్నా సీఎల్పీ విలీనాన్ని ఆపాలని అన్నారు.

**అది దుర్మార్గం:రాజగోపాల్‌రెడ్డి**

రాజకీయాలను భ్రష్టు పట్టించేవిధంగా కేసీఆర్ వ్యవహరిస్తున్నారని, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడం దుర్మార్గమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలెవరూ అధైర్యపడవద్దని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చి తీరుతుందని అన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ప్రజాఉద్యమం తీసుకువస్తామని చెప్పారు. టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ మాట్లాడుతూ కేసీఆర్‌ను సీఎం చేసింది గాంధీభవనే అని, అదే రేపు ఆయన ప్రభుత్వాన్ని కూడా కూలుస్తుందన్నారు. రెండోరోజు దీక్షా కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శులు సలీం అహ్మద్, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, భద్రాచలం ఎమ్మెల్యే పొడెం వీరయ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ తదితరులు పాల్గొన్నారు. భట్టి దీక్షకు మద్దతుగా కర్ణాటక ఉపముఖ్యమంత్రి కె.టి. పరమేశ్వరన్ శిబిరానికి వచ్చారు. భట్టి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న ఆయన తన సంపూర్ణ సంఘీభావాన్ని ప్రకటించారు.

### క్షీణిస్తున్న ఆరోగ్యం

రెండోరోజు ఆమరణ దీక్ష చేస్తున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోగ్యం క్షీణించింది. బీపీలో మార్పులు వస్తున్నాయని, షుగర్ లెవల్స్, ఎర్ర రక్తకణాలు పడిపోయాయని ఆయనకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు వెల్లడించారని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి.

## లండన్ ఆసుపత్రిలో అక్బరుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: మజ్లిస్ పార్టీ శాసనసభాపక్ష నేత, చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ తీవ్ర అనారోగ్యానికి గురై లండన్‌లోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చేరారు. ఆయనకు రెగ్యులర్‌గా వైద్య సేవలు అందించే వైద్య బృందం ఆధ్వర్యంలో చికిత్స పొందుతున్నారు. గత పక్షం రోజులక్రితం రంజాన్ పర్వమాసం సందర్భంగా సౌదీ అరేబియాలోని మక్కాలో ఉమ్రా ప్రార్థనల కోసం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఉమ్రా ప్రార్థనల అనంతరం హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం సమయంలో అనారోగ్యానికి గురికావడంతో రెగ్యులర్ చెకప్‌కోసం వెళ్ళే లండన్‌లోని ఆసుపత్రికి ప్రయాణమయ్యారు. అక్కడి అసుపత్రిలో పరీక్షలు చేయించుకొని కొద్దిరోజులుగా కుటుంబ సభ్యులతో కలిసి అక్కడే ఉంటున్నారు. రంజాన్ కూడా అక్కడే జరుపుకున్నారు. కాగా, గత రెండు రోజుల క్రితం అక్బరుద్దీన్ తిరిగి ఆకస్మికంగా వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పికి గురికావడంతో కుటుంబ సభ్యులు అక్కడి ఆసుపత్రిలో చేర్పించారు. ఎనిమిదేళ్ల క్రితం చాంద్రాయణగుట్ట సమీపంలో అక్బరుద్దీన్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. ఈ దాడి నుంచి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. అయితే తీవ్ర గాయాలకు గురికావడంతో ఇప్పటికీ అక్బరుద్దీన్ కడుపు నొప్పితో బాధ పడుతూ ఉంటారు. మెరుగైన వైద్యం కోసం ప్రతి మూడు మాసాలకు ఒకసారి లండన్‌లోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకొని వస్తుంటారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సభలో ప్రసంగిస్తుండగా తీవ్ర అనారోగ్యానికి గురై స్థానికంగా చికిత్స పొంది తిరిగి కోలుకున్నారు. తాజాగా తిరిగి అనారోగ్యానికి గురయ్యారు. కాగా, దారుస్సలాంలో జరిగిన ఈద్–మిలాప్ సందర్భంగా తన సోదరుడు అక్బరుద్దీన్ త్వరగా కోలుకోవాలంటూ దేవుడిని ప్రార్థించాలని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పార్టీ శ్రేణులు, అభిమానులను విజ్ఞప్తి చేశారు.

## జెడ్పీలకు భవనాలెట్ల?

- జూలై 5 నుంచి కొత్త జిల్లా పరిషత్‌లు
- కార్యాలయాల కోసం వెతుకుతున్న యంత్రాంగం

సాక్షి, హైదరాబాద్: పరిషత్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో స్థానిక పరిపాలన కొత్త రూపు సంతరించుకోనుంది. జిల్లా పరిషత్ ఎన్నికలు పూర్తయ్యాయి. ప్రస్తుత పాలకవర్గాల పదవీకాలం జూలై 4తో ముగియనుంది. ఆ మరుసటి రోజు నుంచి కొత్తగా ఎన్నికైన వారి పదవీకాలం మొదలవుతుంది. కొత్తగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులు మొదటి సమావేశంలోనే పదవీ బాధ్యతలు చేపడతారు. పాలకవర్గం సైతం అదే రోజు కొలువుదీరుతుంది. జిల్లాల పునర్విభజనతో ప్రస్తుతం ఉన్న తొమ్మిది జిల్లా పరిషత్‌లు 32కు పెరగనున్నాయి. అన్ని జిల్లాల్లో జెడ్పీ భవనాల కోసం పంచాయతీరాజ్ శాఖ వెతుకులాట మొదలుపెట్టింది. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని జెడ్పీ భవనాలు అన్ని



రకాలుగా గొప్పగానే ఉన్నాయి. కొత్త జిల్లా కేంద్రాల్లో ఆ స్థాయి భవనాలు ఎక్కడా లేవు. ఒకటిరెండు కొత్త జిల్లాల్లో తప్పితే జెడ్పీలకు ప్రభుత్వ భవనాలు ఉన్న పరిస్థితి లేదు. దీంతో పరిపాలన భవనం, సమావేశ మందిరం వంటి హంగులతో ఉండే భవనాల కోసం అధికారులు వెతుకుతున్నారు. ఎక్కువ జిల్లాల్లో ఆ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని జెడ్పీ కార్యాలయాలుగా మార్చాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో మండల పరిషత్‌లకు కొత్తగా కార్యాలయాలు వెతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటివరకు సొంత భవనాలలో ఉన్న మండల పరిషత్ కార్యాలయాలను ఇప్పుడు ఇతర భవనాల్లోకి మార్చాల్సిన పరిస్థితి నెలకొంది. జెడ్పీ కార్యాలయాల కోసం భవనాల ఎంపిక ప్రక్రియను రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లాల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

### రెండు జెడ్పీలు ఆలస్యం...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపే విషయంలో జాప్యం వల్ల ఆ జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీకాలం ఆలస్యంగా మొదలైంది. 2019 ఆగస్టు 6తో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ పాలకవర్గం పదవీ కాలం ముగియనుంది. ఆ మరుసటి రోజు నుంచి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ పదవీకాలం మొదలుకానుంది.

## 'మిడ్‌మానేరు'కు కొత్త చిక్కు..!

- రూ.104 కోట్లు చెల్లిస్తేనే పునరావాసం, భూసేకరణ పూర్తి
- కాళేశ్వరం నిధులొస్తున్న నేపథ్యంలో నిధులకోసం ప్రభుత్వానికి వినతి

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి గుండెకాయలాంటి మిడ్‌మానేరు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపేందుకు కొత్త సమస్యలు వచ్చి పడుతున్నాయి. ఇంకా మిడ్‌మానేరు రిజర్వాయర్ పరిధిలో పూర్తికాని భూసేకరణ, నిర్వాసితులకు అందని పునరావాసం కారణంగా పూర్తిస్థాయి నిల్వలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మరో రూ.104 కోట్లు చెల్లిస్తే కానీ సహాయ పునరావాసం, ఇతర పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌లోనే 150 టీఎంసీల మేర గోదావరి జలాలను తరలించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రోజుకు 2 టీఎంసీల మేర నీటిని తరలించి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లిల అనంతరం నీరు మిడ్‌మానేరుకు చేరాలి. ఈ మొత్తం ప్రక్రియలో మిడ్‌మానేరు చాలా కీలకం. 25.8 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ ప్రాజెక్టును గత ఏడాదే 5 టీఎంసీల మేర నింపారు. వాస్తవానికి 10 టీఎంసీల వరకు నింపుదామని భావించినప్పటికీ ప్రాజెక్టు కింది ముంపు గ్రామాల్లో సహాయ పునరావాసం (ఆర్‌అండ్‌ఆర్) పూర్తికాని కారణంగా ఈ ఏడాదికి వాయిదా వేశారు. ఈ ఏడాది పూర్తిస్థాయిలో నింపేలా పనులన్నీ పూర్త య్యాయి. అయితే ఈ ప్రాజెక్టు కింద మొత్తంగా 13 గ్రామాలు ముంపు ప్రాంతాలుగా తేలగా, ఇందులో 10 గ్రామాల్లోని గృహాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయి. ముంపు కారణంగా 6,829 గృహాలకు పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 2013 వరకు 3,451 గృహాలకు పరిహారంగా రూ.311 కోట్లు చెల్లించారు. తర్వాత ఈ ఏడాది 1,413 గృహాలకు మరో రూ.225.78 కోట్ల మేర చెల్లించారు. మరో 1,800 గృహాలకు రూ.250 కోట్ల మేర సైతం చెల్లింపులు జరిగినా.. ఇంకా ఆరేపల్లి, సంకేపల్లి గ్రామాల్లో 170 ఎకరాల మేర భూసేకరణ జరగాల్సి ఉంది. దీంతో పాటే చీర్లవంచ గ్రామంలో ముంపునకు గురయ్యే సుమారు 200 ఇళ్లతో పాటే, మరిన్ని గ్రామాల్లో సహాయ పునరావాస ప్యాకేజీ కింద చెల్లింపులు చేయాల్సి ఉంది. ఆర్‌అండ్‌ఆర్ కిందే రూ.40 కోట్ల మేర చెల్లించాల్సి ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి. కొన్ని నిర్మాణాలకు సంబంధించి మరో రూ.60 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా రూ.104 కోట్లు మేర నిధులు సమకూరిస్తేనే 25 టీఎంసీల నీటినిల్వ సాధ్యమవుతుందని అంటున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి పరిహారాన్ని విడుదల చేయాలని ఇప్పటికే నీటి పారుదల వర్గాలు ప్రభుత్వానికి నివేదించాయి.

## ఎస్‌ఎల్‌బీసీ నెత్తిన మరో పిడుగు!

- నేటితో ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ కరెంట్ బిల్లుల చెల్లింపునకు తుది గడువు
- కట్టకుంటే కరెంట్ నిలిపివేత

సాక్షి, హైదరాబాద్: ఎలిమినేటి మాధవరెడ్డి శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్‌ఎల్‌బీసీ)లో టన్నెల్ తవ్వకపు పనులకు కొత్త చిక్కొచ్చి పడింది. ఇప్పటికే పాడైన బోరింగ్ మిషన్, సీపేజీలతో కొట్టుమిట్టాడుతున్న ప్రాజెక్టు పనులకు కొత్తగా కరెంట్ బిల్లుల రూపంలో మరో ఉపద్రవం వచ్చి పడింది. గడిచిన రెండు, మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కరెంట్ బిల్లుల చెల్లింపు చేయకుంటే ఈ నెల 10 నుంచి నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని జెన్‌కో అధికారులు ఏజెన్సీ సంస్థకు నోటీసులు పంపారు. టన్నెల్ తవ్వకం సందర్భంగా వస్తున్న సీపేజీ నీటిని తోడేందుకు ఏజెన్సీకి ప్రతినెలా రూ.2 నుంచి రూ.3కోట్ల మేర కరెంట్ బిల్లు వస్తోంది. గతంలో బిల్లులు లేక చెల్లింపు చేయకపోవడంతో ప్రభుత్వం విదిల్చిన అరకొర నిధులతో నెట్టుకొచ్చింది. తాజాగా మళ్లీ మూడు నెలలుగా రూ.7 నుంచి రూ.8కోట్ల మేర బిల్లులు పెండింగ్‌లో పడ్డాయి. వాటిని చెల్లించాలని లేదంటే విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఇదివరకే జెన్‌కో హెచ్చరించింది. దీనిపై ఇంజనీర్లు కొందరు రాష్ట్ర ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డితో చర్చించి కొన్నాళ్లు సరఫరాకు ఆటంకం లేకుండా చూడాలని విన్నవించారు. దీంతో సరఫరా కొనసాగిస్తూ వస్తుండగా, వారు విధించిన తుది గడువు సైతం ఈ నెల 10 సోమవారంతో ముగుస్తోంది. బిల్లు చెల్లింపు చేయకుంటే సరఫరా ఆగనుంది. ఇప్పటికే ఇన్‌లెట్ టన్నెల్ పనుల వద్ద ప్రస్తుతం భారీగా సీపేజీ ఉండటంతో నిమిషానికి 9,600 లీటర్ల మేర నీరు సీపేజీ రూపంలో వస్తోంది. ప్రస్తుతం ఏజెన్సీ వద్ద 6వేల లీటర్ల మేర మాత్రమే నీటిని తోడే సామర్థ్యం ఉండటంతో తంటాలు పడాల్సి వస్తోంది. ఇప్పుడు విద్యుత్ సరఫరా నిలిచిపోతే డీ వాటరింగ్ చేయడం కష్టం. అదే జరిగితే టన్నెల్ బోరింగ్ మిషన్ మునిగే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# రుణ లక్ష్యం.. బ్యాంకులు అలక్ష్యం!

- రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో మొండిచేయి
- ఐదేళ్లుగా అదే తంతు... ఆవేదనలో అన్నదాత
- 2014–15లో లక్ష్యం 18,717 కోట్లయితే.. ఇచ్చింది రూ. 17 వేల కోట్లు
- గతేడాది లక్ష్యం రూ. 42 వేల కోట్లయితే ఇచ్చింది రూ. 33 వేల కోట్లు

సాక్షి, హైదరాబాద్: రైతులకు పంట రుణాలు ఇవ్వడంలో బ్యాంకులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. ప్రభుత్వ సమక్షంలో లక్ష్యాలను ఘనంగా ప్రకటిస్తూ తర్వాత రైతులకు మొండిచెయ్యి చూపిస్తున్నాయి. రాష్ట్రం ఏర్పాటు కాకముందు తెలంగాణ ప్రాంతంలో పంట రుణాలు లక్ష్యానికి మించి ఇచ్చేది. తెలంగాణ ఏర్పాటయ్యాక ఎందుకో ఏమో బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. బ్యాంకుల తీరుపై అటు రైతులు, ఇటు సర్కారు పెద్దలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంతేకాదు మొదటిసారి తెలంగాణ ప్రభుత్వం రుణమాఫీ చేసినప్పుడు, విడతల వారీగా మాఫీ సొమ్మును బ్యాంకులకు అందజేసింది. ఆ సందర్భంగా బ్యాంకులు రైతుల నుంచి వడ్డీ వసూలు చేయడం కూడా విమర్శలకు దారితీసింది. నాలుగైదేళ్లలో పలుమార్లు జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌ఎల్‌బీసీ) సమావేశాల్లో అప్పటి వ్యవసాయ, ఆర్థికమంత్రులు పోచారం శ్రీనివాసరెడ్డి, ఈటల రాజేందర్‌లు వడ్డీ వసూలుపై తీవ్ర విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అయినా బ్యాంకులు తమ తీరు మార్చుకోకపోవడంతో రైతులు రుణాలు పొందలేకపోయారు.

**అప్పట్లో 121 శాతం.. ఇప్పుడు 79 శాతం**

2011–12 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ప్రాంతంలో బ్యాంకులు తాము నిర్దేశించుకున్న లక్ష్యానికి మించి 115 శాతం పంట రుణాలు ఇవ్వగా, 2012–13లో ఏకంగా 121 శాతం, 2013–14లో 103 శాతం ఇచ్చాయి. ఉదాహరణకు 2011–12లో బ్యాంకుల పంట రుణ లక్ష్యం రూ. 10,233 కోట్లు కాగా, రూ. 11,787 కోట్లు ఇచ్చాయి. ఇక తెలంగాణ ఏర్పాటయ్యాక 2014–15 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల లక్ష్యంలో 93 శాతమే ఇచ్చాయి. అలా తగ్గిస్తూ గతేడాది కేవలం 79 శాతమే ఇచ్చాయి. 2017–18 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల లక్ష్యం రూ. 39,752 కోట్లు కాగా, కేవలం రూ. 31,410 కోట్లు మాత్రమే ఇచ్చాయి. ఇంతకంటే దారుణంగా దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలు ఇస్తుండటం గమనార్హం. భూమి చదును చేయడం, బావులు తీయడం తదితర సమగ్ర మౌలిక సదుపాయాల కోసం రైతులకు ఇచ్చే ఈ రుణాల విషయంలో బ్యాంకులు తీవ్ర నిర్లక్ష్యం కనబరిచాయి. దీర్ఘకాలిక వ్యవసాయ రుణాల్లో 2011లో తెలంగాణ ప్రాంతంలో లక్ష్యంలో 205 శాతం, 2012–13లో 121 శాతం, 2013–14లో 200 శాతం రుణాలు ఇచ్చాయి. కానీ తెలంగాణ ఏర్పాటయ్యాక 2014–15 ఆర్థిక సంవత్సరంలో కేవలం 62 శాతమే దీర్ఘకాలిక రుణాలు ఇచ్చాయి. ఆ సంవత్సరంలో దీర్ఘకాలిక వ్యవసాయ రుణ లక్ష్యం రూ. 6,238 కోట్లు కాగా, కేవలం రూ. 3,885 కోట్లే ఇచ్చాయి. 2015–16లో దీర్ఘకాలిక వ్యవసాయ రుణ లక్ష్యం రూ. 7,494 కోట్లు కాగా, కేవలం రూ. 4,792 కోట్లే ఇచ్చాయి. 2017–18లో లక్ష్యం రూ. 7,320 కోట్లు కాగా, రూ. 3,731 కోట్లే ఇచ్చాయి. కేవలం 2016–17, 2018–19 ఏళ్లలో మాత్రమే లక్ష్యానికి మించి వ్యవసాయ రుణాలు ఇచ్చాయి. ఇలా బ్యాంకులు సహకరించకపోవడంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. రైతుబంధు పథకం వల్ల రైతులకు ఎంతోకొంత సాగు, విత్తన, ఎరువుల ఖర్చులకు ఉపయోగం కలుగుతోంది. ఇదీ లేకుంటే ఇంకా దారుణమైన పరిస్థితిని రైతులు ఎదుర్కోవాల్సి వచ్చేది. అయితే కొన్నిచోట్ల గతేడాది 'రైతుబంధు'సొమ్ము రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేయగా ఆ సొమ్మును పాతబాకీ వడ్డీ కింద బ్యాంకులు జమ చేసుకోవడమూ విమర్శలకు దారితీసింది. వడ్డీ వసూలు చేయవద్దని ప్రభుత్వం పదేపదే చెబుతున్నా బ్యాంకర్లు ఏమాత్రం అంగీకరించడంలేదు.



| ఏడాది | పంటరుణ లక్ష్యం | బ్యాంకులు ఇచ్చింది |
|---|---|---|
| 2014-15 | 18,717.95 | 17,019.92 |
| 2015-16 | 27,800.14 | 20,585.74 |
| 2016-17 | 29,101.36 | 26,282.40 |
| 2017-18 | 39,752.45 | 31,410.57 |
| 2018-19 | 42,494.53 | 33,751.72 |
| 2019-20 | 48,740.00 | - |

(రూ. కోట్లలో)

**పంట రుణ లక్ష్యం 48,740 కోట్లు...**

ఏడాదికేడాదికి పంట రుణ లక్ష్యాన్ని పెంచడంలో బ్యాంకులు ముందుంటున్నాయి. గతేడాది పంట రుణ లక్ష్యం రూ. 42,494 కోట్లు కాగా, ఈ ఏడాది ఖరీఫ్, రబీల్లో రూ. 48,740 కోట్లు ఇవ్వాలని ఇటీవల జరిగిన ఎస్‌ఎల్‌బీసీ సమావేశంలో వెల్లడించాయి. అలాగే దీర్ఘకాలిక వ్యవసాయ రుణాల లక్ష్యం గతేడాది రూ. 11,421 కోట్లు కాగా, ఈ ఏడాది రూ. 11,445 కోట్లుగా ప్రకటించాయి.పంట రుణాల విడుదల విషయంలో ఈసారి బ్యాంకులు ఎలా స్పందిస్తాయోనన్న చర్చ అటు రైతుల్లో, ఇటు వ్యవసాయశాఖ వర్గాల్లోనూ నెలకొంది. గతేడాది డిసెంబర్ 11వ తేదీకి ముందున్న రూ. లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తానని సర్కారు ప్రకటించిన సంగతి విదితమే.ఆ లోపున్న పంట రుణాలను పక్కనపెట్టి ఈ ఖరీఫ్‌కు కొత్తగా ఇస్తే సరిపోతుంది. కానీ బ్యాంకులు రైతుల పట్ల ఉదారంగా వ్యవహరించేలా ముందుకు రాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఖరీఫ్ మొదలైనా ఇప్పటికీ బ్యాంకులు కొత్త రుణాల విడుదలలో జాప్యం చేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

# కుమురం భీం జిల్లాలో ఆయిల్ నిక్షేపాలు!

- ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు ప్రాథమిక నిర్ధారణ
- నాలుగు రోజులుగా నిపుణుల సర్వే
- 8 నెలలపాటు కొనసాగనున్న పరీక్షలు


డ్రిల్లింగ్ కోసం తీసుకువచ్చిన బోర్‌వెల్ వాహనాలు

**సిర్పూర్(టి):** కుమురంభీం, మంచిర్యాల జిల్లాల పరిసరప్రాంతాల్లో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు ప్రాథమిక పరీక్షల్లో తేలడంతో నిపుణులు సర్వే చేస్తున్నారు. ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈసర్వేలో కుమురంభీం జిల్లాపరిధిలోని కాగజ్‌నగర్, సిర్పూర్(టీ), దహెగాం, పెంచికల్‌పేట మండలాల్లో ఈ నిక్షేపాలు ఉన్నట్లు గుర్తించారు. గత నాలుగురోజులుగా ఇక్కడ నిపుణుల ఆధ్వర్యంలో సర్వే పనులుకొనసాగుతున్నాయి. గ్రామాల్లో కేబుల్‌కనెక్షన్లువేసి అధునాతన పరికరాలతో చేస్తున్నసర్వే మొదటిదశ పూర్తికావస్తోంది. ప్రస్తుతం అందుతున్న వివరాలప్రకారం ఎనిమిది నెలలపాటు పరీక్షలు నిర్వహించి నిక్షేపాలుకచ్చితంగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తిస్తామని ఓఎన్‌జీసీ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం సిర్పూర్(టీ) మండలకేంద్రంలోని దుబ్బగూడకాలనీప్రాంతంలోసర్వేనిర్వహించడంతోపాటుఎంపికచేసిన స్థలాల్లో డ్రిల్లింగ్‌చేసి పరీక్షలు నిర్వహించారు. అలాగే శనివారం సిర్పూర్(టీ), నవేగాం, హుడ్కిలిగ్రామాల్లో కేబుళ్లను అమర్చి కంప్యూటర్లలో పరిశీలిస్తూ, డ్రిల్లింగ్‌చేశారు. దీనికిముందుగాకాగజ్‌నగర్ మండలంలోని అనుకోడ, చుంచుపల్లి, గన్నారం, చింతకుంట గ్రామాల మీదుగా కేబుల్‌లైన్లువేస్తూ సర్వే నిర్వహించారు. డ్రిల్లింగ్‌చేయగావచ్చే ధ్వని తరంగాల ద్వారా నిక్షేపాలను పసిగడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**కుమురంభీం– మంచిర్యాల– భద్రాచలంమీదుగా..**

రెండవదశలో సర్వేకాగజ్‌నగర్ మండలంలోని పెద్దవాగునుంచి కుమురంభీం జిల్లాతోపాటు మంచిర్యాలజిల్లా మీదుగా భద్రాచలం జిల్లాల్లో ప్రాథమిక సర్వేలునిర్వహిస్తామని సంస్థ అధికారులు తెలిపారు. ఈ జిల్లాల్లోని అన్ని మండలాల్లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించి 8 నెలలపాటు సర్వే చేయన్నట్లువెల్లడించారు. నిక్షేపాలున్న స్థలాలను గుర్తించి పూర్తిస్థాయి సర్వేలుచేపడతామని తెలిపారు. కుమురంభీంజిల్లాతోపాటు మంచిర్యాల పరిసర ప్రాంతాల్లోని భీమినిమండలం నందుగులగూడ గ్రామ పరిసరాల్లో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలున్నట్లుప్రాథమిక సర్వేలో వెల్లడైనట్లుపేర్కొన్నారు.


ధ్వనితరంగాలను గ్రహించే అధునాతన కంప్యూటర్లుకలిగిన వాహనం

### పూర్తిస్థాయి సర్వేలు చేపడతాం

కుమురంభీం జిల్లాలోనిపలుగ్రామాల్లో ఓఎన్‌జీసీ ఆధ్వర్యంలో ఆయిల్, గ్యాస్ నిక్షేపాలకోసం ప్రాథమిక సర్వేలు చేపడుతున్నాం. సర్వేల రిపోర్టులు, డ్రిల్లింగ్‌లో వెల్లడైనఫలితాల ఆధారంగా 8 నెలలపాటు పూర్తిస్థాయి సర్వేలు చేపడతాం. నిక్షేపాల తీరునుబట్టి స్థానికంగా వెలికితీత ప్రారంభమవుతుంది.

– సత్తిబాబు, ఓఎన్‌జీసీ, పీఆర్వో

# విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

**మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన**

**దస్తురాబాద్(ఖానాపూర్):** విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఓ నిండు ప్రాణం బలైంది. నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి.. అయితే హైఓల్టేజ్.. లేకుంటే లోఓల్టేజ్ సరఫరా అవుతోందని అధికారులకు చెప్పినా వినిపించుకోలేదంటూ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మృతుని బంధువుల కథనం ప్రకారం.. రాంపూర్ గ్రామానికి రెండు నెలలుగా లోఓల్టేజ్,.. హైఓల్టేజ్ సరఫరా అవుతోంది. దీంతో ఇళ్లలోని పరికరాలు కాలిపోతున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు పలుమార్లు విద్యుత్ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా మరమ్మతు చేయలేదు. ఆదివారం గ్రామానికి చెందిన కొయ్యాడి మహేశ్ (32) ఇంట్లో విద్యుత్ హైఓల్టేజ్ కారణంగా మంటలు చెలరేగాయి. వాటిని ఆర్పేందుకు నీళ్లుచల్లే ప్రయత్నంలో మహేశ్‌కు విద్యుత్‌షాక్ తగిలి అక్కడిక్కడే మృతిచెందాడు.

**గ్రామస్తుల ఆందోళన..**

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మహేశ్ మృతి చెందాడని, మృతదేహంతో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట.. తర్వాత ప్రధాన రహదారిపై సుమారు నాలుగు గంటల పాటు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా చేశారు. దస్తురాబాద్, కడెం ఎస్సైలు అశోక్, కృష్ణకుమార్ జోక్యం చేసుకుని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


రహదారిపై ధర్నా చేస్తున్న గ్రామస్తులు, (ఇన్‌సెట్‌లో) కొయ్యాడి మహేశ్

- జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం రెండో దశ 600 మెగావాట్ల ప్లాంట్‌లో శనివారం రాత్రి విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది.


**भारतीय खाद्य निगम**
**భారత ఆహార సంస్థ**
ప్రాంతీయ కార్యాలయం, 3వ అంతస్తు, HACA భవన్, పబ్లిక్ గార్డెన్ రోడ్, హైదరాబాద్–04

NIT No. Engg/01/2019-20 తేది: 07.06.2019

**ఇ-టెండర్లు కోరుతూ ప్రకటన**

దిగువ తెలిపిన పనుల కోసం భారత ఆహార సంస్థ తరఫున అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (CE), రీజినల్ ఆఫీస్, హైదరాబాద్ వారు https://eprocure.gov.in/eprocure/app ద్వారా రెండు బిడ్ల విధానం క్రింద ఆన్‌లైన్ పర్సంటేజ్ రేటు టెండర్లు కోరుతున్నారు. బిడ్ దాఖలుకు ఆఖరు తేది మరియు సమయం 19.06.2019న మ.3.00 గం.వరకు. **పనుల పేరు:** చర్లపల్లి, సనత్‌నగర్, నల్గొండ, మిర్యాలగూడ, ఖమ్మం, కాజీపేట్, జమ్మికుంట, మంచిర్యాల & డిచ్‌పల్లి వద్ద BSC/FSD డిపోలో ARMO పనులు. **బిడ్ దాఖలుకు ఆఖరు తేది మరియు సమయం 19.06.2019న మ.3.00 గం.వరకు.** బిడ్ ఫారాలు మరియు ఇతర వివరాలను వెబ్‌సైట్ www.eprocure.nic.in మరియు www.fci.gov.in నుండి పొందవచ్చును.

అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (CE)


# అన్ని వరాలిచ్చేది కేశవస్వామియే..

- శ్రీమన్నారాయణుడు కొలువైన తోటపెల్లి గ్రామం మహిమాన్వితమైంది
- సీఎం కేసీఆర్ కృషితో పురాతన ఆలయాలకు పూర్వ వైభవం
- చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్టాపన వేడుకల్లో హరీశ్‌రావు


తోటపెల్లిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. పక్కన చిన జీయర్‌స్వామి

**బెజ్జంకి (సిద్దిపేట):** ఒక్కో దేవుడు ఒక్కో వరమిస్తే అన్ని వరాలిచ్చే దేవుడు శ్రీచిన్నకేశవ స్వామి అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మండలంలోని ఆయన స్వగ్రామమైన తోటపెల్లిలో కొత్తగా నిర్మించిన శ్రీచెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్టాపన వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేశవుడు అంటే నారాయణుడు అని సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే కొలువైన తోటపెల్లి ప్రాంతం ఎంతో మహిమాన్వితమైనదన్నారు. స్వామి మన గ్రామంలో కొలువుదీరడం పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. ఈ ఆలయాన్ని చిన్న జీయర్ స్వామి కరకమలములతో ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. 'తోటపెల్లిలో ఇటీవల బొడ్రాయిని ప్రతిష్టించుకున్నాం. రామాలయం నిర్మించుకున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలను పునరుద్ధరించడం, నాటి సంప్రదాయ పరంపర కొనసాగించడం చాలా సంతోషంగా ఉంది. ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న ప్రాచీన ఆలయాల పునరుద్ధరణ చేయడం ఎంతో పుణ్యం'అని పేర్కొన్నారు. చెన్నకేశవ స్వామి ఆలయాలు రెండున్నాయని.. ఒకటి మిట్టపల్లిలో మరోటి తోటపెల్లి గ్రామంలో ఉన్నాయన్నారు. తోటపెల్లితోపాటు బెజ్జంకి మండలం ఒక ఆధ్యాత్మికత క్షేత్రమని, కాకతీయుల చరిత్రకు ఆనవాళ్లని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా ప్రాచీన ఆలయాలకు ప్రసిద్ధి అని, వాటి పూర్వ వైభవానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని సీఎం సెంట్‌మెంట్ ఆలయం కోనాయపల్లె వేంకటేశ్వరస్వామి, కొమురవెల్లి మల్లన్న, నాచారం, బెజ్జంకిలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయాలను ఆయన అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో ఏటా బ్రహ్మోత్సవాలు జరిగే విధంగా కృషి చేస్తామన్నారు. జిల్లాలో 250 మంది గ్రామీణ ప్రాంత పూజారులకు ధూప, దీప నైవేద్యాల కింద నెలకు రూ.6 వేలు ఇస్తున్నట్లు తెలిపారు.


**భారతీయ రిజర్వ్ బ్యాంక్**
**RESERVE BANK OF INDIA**
www.rbi.org.in

**8 సంవత్సరాల రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీస్ వేలం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ₹1500.00 కోట్ల (ముఖ విలువ) మొత్తాన్ని వేలం ద్వారా విక్రయించడానికి ఆఫర్ చేసింది.

మల్టిపుల్ ప్రైస్ ఫార్మాట్ క్రింద రాబడి ఆధారిత వేలం భారతీయ రిజర్వ్ బ్యాంకు కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ (E-Kuber) మీద **11 జూన్ 2019** (మంగళవారం)న నిర్వహించబడుతుంది. మరింత సమాచారం కొరకు **07 జూన్ 2019** (శుక్రవారం) తేదీ నాటి భారతీయ రిజర్వ్ బ్యాంకు వారి పత్రికా ప్రకటనను RBI వెబ్ సైట్ (www.rbi.org.in)ను చూడండి.

"మీకు డబ్బు ఆశచూపుతూ వచ్చే ఇమెయిల్స్/ఎస్ఎంఎస్‌లకు/కాల్స్ వల్ల మీరు మోసపోవద్దు"

**నవోదయ విద్యాలయ సమితి**
(మానవ వనరుల మంత్రిత్వ శాఖలో పని చేయుచున్న స్వయం ప్రతిపత్తి సంస్థ)
B-15, సెక్టార్ 62, నోయిడా, ఉత్తర్ ప్రదేశ్

**ప్రవేశ ప్రకటన**

**2019-20 విద్యా సంవత్సరానికై జవహర్ నవోదయ విద్యాలయాలలో పదకొండవ తరగతిలో లాటరల్ ఎంట్రీ ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సేకరించడమైనది. అయితే మొదటి దశలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను నమోదు చేయుటకు చివరి తేది 15-06-2019 వరకు పొడగించడమైనది**

మొదటి దశ వరకు విజయవంతంగా దరఖాస్తులను సమర్పించిన అభ్యర్థులు తమ ఇతర వివరాలను 2 మరియు 3 దశల ద్వారా 17-06-2019 వరకు సమర్పించవచ్చు. మరిన్ని వివరాలకై దయచేసి www.navodaya.gov.in లేదా www.nvsadmissionclasseleven.in అను వెబ్‌సైట్‌లను సంప్రదించవచ్చు.

డిప్యూటి కమిషనర్


# సెక్యూరిటీ గార్డులే డాక్టర్లు!

## ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో రోగుల ఇక్కట్లు



**ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, నర్సులు అందించాల్సిన వైద్య సేవలను ఆసుపత్రిలో సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లు అందిస్తున్నారు. సమయానికి డాక్టర్లు అందుబాటులో ఉండకపోవడంతో రోగులు, వారి బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆస్పత్రిలో మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రభుత్వం రూ. 20 కోట్ల వ్యయంతో నిర్మించింది. రెండేళ్ల క్రితం ఇక్కడ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కేసీఆర్ కిట్‌లు ప్రవేశపెట్టడంతో ఇక్కడ ప్రతి రోజూ 30కి పైగా ప్రసవాలు జరుగుతున్నాయి. అయితే సిబ్బంది నిర్లక్ష్యంతో తరచూ పెద్దాస్పత్రి వార్తల్లోకి ఎక్కుతోంది. ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు, స్వీపర్లే సెలైన్లు అమర్చుతూ, ఇంజెక్షన్లు వేస్తున్న దృశ్యాలు ఆదివారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఇక ఇక్కడ కాన్పు అయిన తర్వాత ఆడపిల్ల పుడితే ఒకరేటు, మగ పిల్లాడు పుడితే మరో రేటు చొప్పున వసూళ్లు కూడా చేస్తుండడం గమనార్హం.

# ఇంత దౌర్భాగ్య పాలన ఊహించలేదు



## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

**జగిత్యాల:** 'రాష్ట్రం ఏర్పడితే తెలంగాణ అందరికీ ఆదర్శంగా ఉంటుందని అనుకున్నాం. అయితే ఇంత దౌర్భాగ్య పాలన ఉంటుందని ఊహించలేదు. శాసనసభలో ప్రశ్నించే గొంతు లేకుండా టీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తోంది'అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జగిత్యాలలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ కోసం కాంగ్రెస్ పార్టీ టీఆర్‌ఎస్‌తో కలసి ఎన్నికల్లో పోటీ చేసిందని, కానీ వారు ఎమ్మెల్యేలను బెదిరించి తమ పార్టీలో చేర్చుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం నియంతృత్వ పోకడకు పోతోందని ఆరోపించారు. ప్రశ్నించే వారు లేకుంటే చట్ట సభలు ఎందుకన్నారు. స్పీకర్‌కు సైతం స్వతంత్రం లేకుండా పోయిందన్నారు. కేటీఆర్ టీఆర్‌ఎస్ సభ్యులను కాంగ్రెస్‌లో కలుపుకున్నట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందని, గతంలో వారు కాంగ్రెస్‌లో చేరారే తప్ప విలీనం చేయలేదన్నారు. ఎంఐఎం పార్టీ ప్రతిపక్ష హోదా అడగడం విడ్డూరంగా ఉందన్నారు. టీఆర్‌ఎస్, ఎంఐఎం కలిసే పోటీ చేశాయని, మళ్లీ అందులో హోదా అడగడం దేనికని ప్రశ్నించారు. ప్రజల కోసం ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# పసుపు బోర్డు ఏర్పాటు చేస్తాం

## నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



**జగిత్యాల:** లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆదివారం జగిత్యాలలోని ఎస్సారెస్పీ గెస్ట్‌హౌస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుకు ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రైతుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. గల్ఫ్‌లో ఉన్న రాష్ట్ర కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, అక్కడివారి సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకునేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జగిత్యాల నియోజకవర్గం ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపర్చడం, మెజార్టీ ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు సైతం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



# యాదాద్రిలో భక్తుల రద్దీ

**యాదగిరికొండ:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు తదితర ప్రాంతాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. సుమారు 25 వేల మంది స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానికి 4 గంటలు పట్టిందని భక్తులు తెలిపారు.

# రక్తంతో సీఎంకు లేఖ

## సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగ సంఘం నేత వినతి



**హుజూరాబాద్‌రూరల్:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆదివారం సీఎం కేసీఆర్‌కు రక్తంతో లేఖ రాసి ఫ్యాక్స్ ద్వారా పంపించారు. ఉద్యోగులకు 40 శాతం ఐఆర్‌ను వెంటనే చెల్లించాలని, పీఆర్సీ రిపోర్ట్‌ను కమిషన్ వెంటనే ముఖ్యమంత్రికి అందజేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయసు 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

**తలమడుగు (ఆదిలాబాద్):** ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. కోడద్ గ్రామానికి చెందిన రైతు ప్రమోద్ (32)కు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. మరో ఎనిమిదెకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. గతేడాది పత్తి, కంది సాగు చేశాడు. పెట్టుబడి కోసం ఆదిలాబాద్‌లోని ఆంధ్రా బ్యాంకులో రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. ప్రైవేటు వ్యక్తుల నుంచి మరో రూ.3 లక్షల అప్పు తీసుకున్నాడు. పంటలు సరిగ్గా పండకపోవడంతో అప్పులు తీర్చలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యాడు. పెట్టుబడి కోసం ప్రయత్నించగా.. ఎవరూ ఇవ్వలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన శనివారం రాత్రి క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ దశరథ్ తెలిపారు.





Authorized Dealers: Nalgonda: Venkataramana Hero, Ph: 7799766404. Miryalaguda: Sri Krishna Hero, Ph: 7799766371.
Suryapeta: Sri Venkata Lakshmi Hero, Ph: 7799766429.

Authorized Service Centers: Bhuvanagiri: Krishna Agencies, Ph: 9246969796. Motkur: Sri Lakshmi Motors, Ph: 88866 08099.
Kodad: Sri Spandana Motors, Ph: 98660 29997. Aleru: Sri Ganesh Motors, Ph: 7095113333.

Authorized Representative of Dealers: Mothe: Shri Mahalakshmi Motors, Ph: 9010679685. Mellachervu: SK Motors, Ph: 9848566249. Devarakonda: Aditya Motors, Ph: 9440460858. Huzurnagar: SS Motors, Ph: 9989900970. Munagala: Sri Aditya Motors, Ph: 9951500877. Kondamallepally: SK Motors, Ph: 9640371612. Chityal: Vinayaka Motors, Ph: 9848997163. Munugode: Classic Bikes Ph: 9912539689. Chandur: Sai Krishna Motors, Ph: 9704746009. Thipparthy: Sai Pranathi Motors, Ph: 9963520170. Gutta: Sri Lakshmi Ganapathi Motors, Ph: 9848248887. Pochampally: Sri Vigneswarra Motors, Ph: 9666272880. Choutuppal: Kanishk Motors, Ph: 9848216587. Nakrakal: Sai Venkateswara Motors, Ph: 7793967150. Neredcherla: Deepu Motors, Ph: 8096507007.

సాక్షి
# సాహిత్యం



నల్లగొండ | సోమవారం
జూన్ | 10 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారినామ సంవత్సరం. ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు. జ్యేష్ఠ మాసం. తిథి శు.అష్టమి రా.11.57 వరకు, తదుపరి నవమి. నక్షత్రం పుబ్బ సా.4.16 వరకు, తదుపరి ఉత్తర. వర్జ్యం రా.11.00 నుంచి 12.06 వరకు. దుర్ముహూర్తం ప.12.22 నుంచి 1.14 వరకు, తదుపరి ప.2.58 నుంచి 3.51 వరకు. అమృత ఘడియలు: ఉ.10.20 నుంచి 11.46 వరకు

సూర్యోదయం : 5.28, సూర్యాస్తమయం : 6.26
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

## నమాజ్ వేళలు

ఫజర్ : 4.20
జొహర్ : 12.15
అసర్ : 4.52
మగ్రీబ్ : 6.50
ఇషా : 8.11

## ఈవారం పుస్తకాలు



### తెలంగాణలో అలభ్య శాసనాలు, గ్రంథాలు

సంపాదకుడు: డాక్టర్ కె.ముత్యం; ఉపసంపాదకుడు: మహమ్మద్ అక్బర్; పేజీలు: 248; వెల: 250; ప్రచురణ: తెలుగు విభాగం, శాతవాహన విశ్వ విద్యాలయం, మల్కాపూర్ రోడ్, కరీంనగర్ -505 001; ప్రతులకు: నవోదయ బుక్ హౌజ్.

### ఎందరో శిరీషలు (కథల సంపుటి)



రచన: గంటి భానుమతి; పేజీలు: 126; వెల: 120; ప్రతులకు: రచయిత్రి, ఫ్లాట్ నం. 205, బ్లాక్-1, మే ఫ్లవర్ పార్క్ అపార్ట్‌మెంట్స్, అన్నపూర్ణ కాలనీ, మల్లాపూర్, హైదరాబాద్ -76. ఫోన్: 040-27151439

### వ్యాస నీరాజనం (సాహిత్య వ్యాసాలు)



రచన: డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి; పేజీలు: 166; వెల: 200; ప్రతులకు: ఎన్.ఎస్.మూర్తి, సత్య శ్రీ పబ్లికేషన్స్, ఫ్లాట్ నం. 405, థర్డ్ ఫ్లోర్, రాజారాణి సరోవర్ అపార్ట్‌మెంట్స్, శాస్త్రి నగర్ ఎదురుగా, థర్డ్ లేన్, బరంపుర - 760 002. గంజాం జిల్లా, ఒడిశా. ఫోన్: 9078743851

### వెలుతురు గబ్బిలం (కవిత్వం)



రచన: బండారి రాజ్‌కుమార్; పేజీలు: 136; వెల: 60; ప్రతులకు: కవి. ఇంటి నం. 1-133, పాత మగ్దుంపురం గ్రామం, చెన్నారావు పేట పోస్ట్, వరంగల్ రూరల్ -506 332. ఫోన్: 9959914956

### వాళ్లు గెలవాలి (నవల)



రచన: శిరంశెట్టి కాంతారావు; పేజీలు: 208; వెల: 150; ప్రతులకు: రచయిత, ఇంటి నం. 1-1-177, శ్రీనివాస పురం కాలనీ, పాత పాల్వంచ - 507 115. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. ఫోన్: 9849890322

### నీల్లింకని నేల (రాయలసీమ కథల సంకలనం)



సంపాదకులు: ఎస్.ఎం.డి. ఇనాయతుల్లా, కెంగార మోహన్; పేజీలు: 144; వెల: 150; ప్రతులకు: ఇనాయతుల్లా, ఇంటి న. 80-129సి6బి, అబ్బాస్ నగర్, కర్నూలు-2. ఫోన్: 9849367922

## బుక్ ప్రపంచం

జాతకాలు చూడక ముందా?
పుస్తకాలకు ప్రూఫులు
చూసేవాడ్ని బాబూ!



కథాసారం

# అల్పజీవి ఉపకారం





**'చచ్చిపో - నీ వల్ల ఎవ్వరికీ ఉపకారం జరిగి ఉండకపోతే నువ్వెందుకూ? చచ్చిపో' పిచ్చివాడు నవ్వాడు. వెంకట్రావు చెవుల్లో ఆ మాటలు మారుమ్రోగుతున్నాయి.**

**ఆ**ఫీసు నుంచి బయటపడి రోడ్డు మీదికి మరలగానే వెంకట్రావు స్వేచ్ఛగా చేతులు దులుపుకున్నాడు. ఉదయాన్నుంచి తాను రాసిన కాగితాలు, తిన్న చీవాట్లు లెక్కకు మించిపోయినాయి. అనుదినమూ జరిగే విషయాలు అట్టే బాధ పెట్టవు. నిత్యం చచ్చేవాడికి ఏడిచే వాడెవడూ?

'ఏం వెంకట్రావ్?'

ఎవరో పిలుస్తున్నారు. గిరుక్కున వెనక్కి తిరిగాడు. పూర్వ మిత్రుడు ఆచారి తనవైపే నడచి వస్తున్నాడు. తానూ, వాడూ పూర్వం గడిపిన చక్కటి రోజులూ, వాడి చేష్టలు, తనకనేక విధాల వాడు చేసిన ఉపకారాలు జ్ఞప్తికి వచ్చాయి.

'ఎప్పుడొచ్చావురా?'

'ఇప్పుడే బస్సు దిగాను'

వెంకట్రావుకి మంచి రోజులు కరువు. డబ్బు కరువు. స్నేహితులు కరువు- ఇప్పుడు మాటలూ కరువయ్యాయి.

'హెల్తు ఆఫీసులో పని మీద వచ్చాను'

'అహా.'

ఇద్దరూ మౌనంగా నడుస్తున్నారు. కాఫీ హోటలు దగ్గరకి వస్తున్న కొద్దీ వెంకట్రావు గుండెల్లో దడ ఎక్కువ కాసాగింది. ఆవేళ ఒకటో తారీఖు. జీతం తెచ్చుకుంటున్నాడు. ఆచారికి కాఫీ ఇచ్చుకోవాలి. వాడి చేత డబ్బులు ఇప్పిస్తే ఏం బాగుంటుంది? ఆచారి ఏమీ ప్రయత్నం లేకుండానే హోటల్లోకి దారి తీసాడు. వెంకట్రావు గుండెలు చేతుల్లో పెట్టుకుని వెనక నడిచాడు.

ఇద్దరూ ఓ మూల కూర్చొన్నారు. సర్వర్ 'ఏం కావాలి సార్' అన్నాడు. 'రెండు స్వీట్...' ఆచారి నిస్సందేహంగా ఆర్డరు చేసేసరికి గతుక్కుమన్నాడు వెంకట్రావు. రెండు ఆర్లు పన్నెండణాలు.

'ఒకటే తీసుకురా...' అన్నాడు ఎంత తగ్గినా మంచిదేనని.

'అదేమిటిరా? కాశీలో వదిలిపెట్టి వచ్చావేంటీ?'

'ఆహా, స్వీటెందుకని'

సర్వరు తెల్లబోయి చూసి, వెళ్ళి రెండు స్వీట్లు తెచ్చాడు. వెంకట్రావు కాలుతున్న ఇనుములాగ నోట్లో పెట్టుకున్నాడు. స్వీట్ ఆరణాలు, హాట్ ఓ పావలా, కాఫీ వెధవది... స్పెషలు హోటలు- ఎనిమిదణాలు. రెండూం పావలా. వెంకట్రావు జేబులోని డబ్బువేపు చూసుకున్నాడు. ఒక్క రూపాయి తగ్గినా రుక్మిణమ్మ చేసే రాద్ధాంతమూ, గోలా చెవిలో మారుమ్రోగ సాగాయి. పోనీ ఆచారిని బిల్లు పే చెయ్యనిస్తే? 'ఛా' తనకెన్నిసార్లు ఇచ్చుకోలేదు కాఫీ? ఎలా లేదన్నా ఆచారి చేస్తున్న అయ్యవారి ఉద్యోగం కన్నా ఎక్కువ ఉద్యోగమే చేస్తున్నాడు.

బూంది... కాఫీ... సర్వరు ఇచ్చిన బిల్లూ తీసుకున్నాడు వెంకట్రావు. ఇంతసేపూ ఏం మాట్లాడుతున్నాడో తనకి తెలీదు. ఆచారి బిల్లు తీసుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు.

వెంకట్రావు బిల్లు ఇచ్చుకుని బయటకి నడిచాడు. వెనకాలే ఆచారి రెండు కిళ్ళీలు కొని, ఒకటి వెంకట్రావుకిచ్చాడు.

'మరి నే వెళ్తానూ' అన్నాడు ఆచారి.

వెంకట్రావుకి తన పరువు ప్రతిష్ఠలు త్రాసులో ఉన్నట్లు కనిపించాయి. ఆలోచించకుండా 'రాత్రికి ఇంటికి వచ్చేయ్' అన్నాడు.

'చెప్పలేన్రా, మూడొంతులు వస్తాన్లే'

ఆచారి అటువైపు నడిచాడు. వెంకట్రావు ఇంటివైపు నడిచాడు.

• • •

గుమ్మం ఎక్కి, తలుపు తోసుకుని వెంకట్రావు గదిలోకి వెళ్ళాడు. చొక్కా తీసి కొయ్యపాగాకి తగిలించాడు. రుక్మిణమ్మ 'ఏం ఆలస్యం అయింది?' అన్నది.

'చిన్న పని ఉండి ఆలస్యం అయిందిలే'

అతని జేబు తడుముతున్న రుక్మిణమ్మ ఒకసారి డబ్బంతా లెక్కచూసి, 'డబ్బు తక్కువుందేం?' అంది. 'కొంచెం ఖర్చు చేసాను' దోషిలా అన్నాడు వెంకట్రావు.

'ఎందుకనీ?'

'స్నేహితుడొచ్చాడులేవే'

'ఇలా తగలేస్తారని తెలిసే నేను గోల పెడుతూంటాను. హయ్యో? ఎంత దుబారా? ఎవడో వస్తే మూడు రూపాయల ఖర్చా?'

'రెండుంపావలాయే'

అంతటితో ఆ పతివ్రత శాంతించినందుకు సంతోషించాడు. తరువాత విషయం ఇంకా భయపెడుతూనే ఉంది. నెమ్మదిగా, 'రాత్రికి వాడిని భోజనానికి రమ్మన్నాను' అన్నాడు.

'ఎవరినీ?'

'నా స్నేహితుడ్నే'

'ఇక్కడ సేవ చేసేందుకో మనిషుందని, అడ్డమైన వాళ్ళనీ నా పీకలమీదకి తెచ్చి ఎక్కిస్తే నేనేమీ చెయ్యలేను' అంది.

'అదికాదే, వాడు నాకు చాలా...'

'వీల్లేదంటే వీల్లేదు' రూలింగు ఇచ్చేసింది.

వెంకట్రావుకి కోపం రాదు. వచ్చినా లాభం లేదనే విషయం తెలుసు. రుక్మిణిని బతిమాలసాగాడు. ఇంకెప్పుడూ ఎవర్నీ ముందరగా తన అనుమతి తీసుకోకుండా భోజనానికి పిలవనని వెంకట్రావు దగ్గర మాట తీసుకుని, రాత్రి మిత్రుడిని పిలిచినందుకు క్షమించింది.

• • •

వీధి అరుగుమీద కూర్చొని వచ్చేపోయేవాళ్ళని చూస్తున్నాడు వెంకట్రావు. ఎవడో పిచ్చివాడల్లే ఉన్నాడు. వీధంతా ధూళిచేస్తూ వస్తున్నాడు. దారినపోతోన్న ప్రతీవాడి చెయ్యి పట్టుకుని ఏదో అరుస్తున్నాడు. ఒకడి చెయ్యి పట్టుకుని, 'నువ్వు పుట్టినందువల్ల ఏం ఉపకారం జరిగింది?' అని అడిగాడు. చెయ్యి స్వంతదారు తెల్లబోయి చూస్తుంటే వికటంగా ఒక అట్టహాసం చేసి వాణ్ణి వదిలి మరో చెయ్యి తీసుకున్నాడు. వెంకట్రావు భయపడ్డాడు తన జోలికి వస్తాడని. లేవబోయాడు. అయినా పిచ్చివాడు గభీమని వచ్చి చెయ్యి పట్టుకున్నాడు. 'నువ్వు పుట్టినందువల్ల లోకానికి ఏం ఉపకారం జరిగింది?' అని అరిచాడు.

వెంకట్రావు ఇంతసేపూ పిచ్చివాడికి భయపడ్డాడు కాని, ఏదో శాంతితో వెలుగుతూన్న వాడి కళ్ళని చూశాక, అతని ప్రశ్న వెయ్యి రెట్ల బలంతో భయపెట్టసాగింది.

'చచ్చిపో - నీ వల్ల ఎవ్వరికీ ఉపకారం జరిగి ఉండకపోతే నువ్వెందుకూ? చచ్చిపో' పిచ్చివాడు నవ్వాడు. వెంకట్రావు చెవుల్లో ఆ మాటలు మారుమ్రోగుతున్నాయి. పిచ్చివాడు వెళ్ళిపోతున్నాడు.

వెంకట్రావ్ కూర్చున్న చోటునుంచి లేవలేకపోయాడు. తాను ఎవరికి ఉపకారం చేశాడు?

ఎనిమిదయింది. ఆచారి జాడలేదు. అప్పుడే రుక్మిణికి కోపం రాసాగింది. వేగంగా ఆచారి వస్తే బాగుండుననుకున్నాడు.

ఎనిమిదిన్నర, తొమ్మిది. ఆచారి రాలేదు.

ఈ మాత్రం దానికి నన్ను చంపేరు. స్నేహితుడు వస్తానని ఎందుకు చెప్పాడు? రుక్మిణి మొగుణ్ణీ, మిత్రుణ్ణీ తిట్టి భోజనం చేసింది. కోపంలో వెంకట్రావుకి అన్నం పెట్టడం మరిచిపోయింది.

• • •

వీధి అరుగుమీద పడుకున్న వెంకట్రావు అర్ధరాత్రి లేచాడు. వెన్నెల విరివిగా కాస్తోంది. ఆ నిశ్శబ్ద వాతావరణంలో అతనికి సాయంత్రం నించీ జరిగినదంతా జ్ఞాపకం వచ్చింది. నువ్వు పుట్టడం వల్ల లోకానికి ఏం ఉపకారం జరిగింది?

చిన్నప్పుడు వారాలు చేసుకుని చదివి స్కూల్ ఫైనల్ పాసయ్యాడు. తరువాత గుమాస్తాగా చేరాడు. నాటినుంచి నేటివరకూ అదే ఉద్యోగం. వచ్చిన కాగితానికల్లా నంబరు వెయ్యడం, అది ఎవరికి చెందాలో వాళ్ళకి పంపడం, వెళ్ళాల్సిన కాగితాలకి పోస్టేజి సరిగ్గా అతికించి చిరునామా వ్రాసి పంపడం.

ఇందులో ఏం ఉపకారం జరిగింది? గృహస్థుడుగానైనా తానెవరికై నా ఉపకారం చేశాడా? ఈ గయ్యాళి భార్యతో ఎవ్వరికీ ఓ పూట అన్నం పెట్టడానికైనా తనకి స్వతంత్రం లేదు. తనవల్ల ప్రయోజనం లేదు లోకానికి. పిచ్చివాడు చెప్పాడు. తను చచ్చిపోవాలి. వాడు పిచ్చివాడు కాదు, మహాజ్ఞాని.

మరణం ద్వారా పొందబోయే సుఖాలు వెంకట్రావు కళ్ళకి కనబడసాగాయి. తప్పు కాగితాలు పంపినందుకు గుమాస్తాలు తిట్టరు. అర్ధమృతుడిగా ఈ జీవితం గడపనక్కరలేదు.

వెంకట్రావు లేచాడు. ఎలా చచ్చిపోవాలనే సమస్య ముఖ్యమైనది కాదు. ఊరుబయట నుయ్యి ఉంది. చావుల నుయ్యి. తొందరగా నడవసాగాడు. ఈ కష్టాలకీ, ఈ జీవితానికీ, ఈనాటితో స్వస్తి. నుయ్యి కనిపిస్తోంది వెన్నెట్లో. తనకోసమే అది అక్కడ ఉన్నట్లు కనిపిస్తోంది. నవ్వుదామనుకున్నాడు. నవ్వలేకపోయాడు. కాళ్ళు నెమ్మదిగా అడుగువెయ్యడం ప్రారంభించాయ్.

హఠాత్తుగా ఆ ప్రశాంతతని చీల్చుకుంటూ ఓ వికటాట్టహాసం వినిపించింది. భూత ప్రేత పిశాచ...

ఎవరూ కాదు. పిచ్చివాడు. నూతి పక్కనించి నడిచివచ్చి వెంకట్రావు చెయ్యి పట్టుకుని, 'ఎందుకొచ్చావ్?' అన్నాడు. 'చచ్చిపోడానికి.'

నిశ్చింతగా చెప్పాడు వెంకట్రావు, నేను ఎవరికీ ఉపకారం చెయ్యలేదు అని. ఈసారి నవ్వాడు పిచ్చివాడు. మూర్ఖుడివి అని అరిచాడు. వెంకట్రావ్ తెల్లబోయాడు. 'నువ్వు చావద్దు, పో' అన్నాడు. వెంకట్రావుకి కొండంత ధైర్యం వచ్చింది.

'కాదు నువ్వే చెప్పావు చావమని.'

'లేదు. నువ్వు ఉపకారం చేశావు. నీవల్ల ప్రపంచానికి గొప్ప ప్రమాదం తప్పించబడింది' అన్నాడు పిచ్చివాడు.

'నావల్లనా? ఉపకారమా?' అన్నాడు.

'నీ భార్య గయ్యాళి కదూ. ఆమెని పెళ్ళాడి ఓ మనిషిని రక్షించావు. ఆ బాధలన్నీ వాడికి బదులు నువ్వు అనుభవిస్తున్నావ్. ఇంతకన్నా ఉపకారం ఏముంది?' అన్నాడు పిచ్చివాడు.

వెంకట్రావు ఇక ముందడుగు వెయ్యలేకపోయాడు. వెనుదిరిగి వేగంగా నడవసాగాడు. తనవల్ల లోకానికి ప్రయోజనం ఉంది. పరుగు... వేగం... మహావేగం.

మర్నాడు ఉదయం వెంకట్రావుకి పెద్ద జ్వరం వచ్చింది. అలా జబ్బు పడ్డందుకు రుక్మిణి అతణ్ణి చెడ తిట్టి పోసింది. ●



ఇచ్ఛాపురపు జగన్నాథరావు (1931-2017) కథ 'పరిమళించిన నిర్గంధ కుసుమం'కు ఇది సంక్షిప్త రూపం. జగన్నాథరావు విశాఖపట్నంలో జన్మించారు. ఎక్సైజ్ శాఖలో పని చేశారు. ఆయన రచనలు 13 సంపుటాలుగా వెలువడినాయి. వానజల్లు, చేదు కూడా ఒక రుచే, ఎదురద్దాలు ఆయన కథా సంపుటాల్లో కొన్ని. ఎక్కువగా సంభాషణల పద్ధతిలో ఈయన కథలు రాస్తారు.

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

కొత్త బంగారం

# నిను వీడిన నీడ





మార్సీ వోగల్

**'నా**కిద్దరు తండ్రులుండేవారు. ఇప్పుడు ఒక్కరూ లేరు. మొదటి మరణం ఉద్దేశపూర్వకమైనది. రెండోది కణాలు తెచ్చిపెట్టిన ప్రమాదం.' డెత్ అండ్ అదర్ హోలీడేస్ నవలికకు కథానాయికా, కథకురాలూ అయిన ఏప్రిల్ తన సవతి తండ్రి విల్సన్ క్యాన్సర్‌తో పోయినప్పుడు చెప్పుందీ మాటలు. 'నాకు 16 ఏళ్ళున్నప్పుడు, నాన్న బెల్టుతో ఉరేసుకున్నాడు. తన డాట్సన్ కారు నాకు వదిలిపెట్టాడు. క్లచ్ వేయడం నేర్చుకోడానికే నెలలు పట్టాయి' అంటుంది ఇరవైల్లో ఉన్న ఏప్రిల్. నవలికలో ఉండే ఆమె సొంత తండ్రి గురించిన వివరాలవి మాత్రమే.

అమెరికాలోని లాస్ ఏంజెలిస్‌లో విల్సన్ చనిపోయిన 1998 వసంతకాలం నుండీ 1999 శీతాకాలం వరకూ కొనసాగే కథనంలో ఉన్న నాలుగు అధ్యాయాలకీ, నాలుగు రుతువుల పేర్లుంటాయి. 'తన జ్ఞాపకాలు చెదిరిపోకుండా ఉండేందుకు' రోజూ ఒక ఫొటో తీసుకుంటానన్న ఏప్రిల్ నిర్ణయంతో మొదలవుతుంది మార్సీ వోగల్ రాసిన యీ పుస్తకం.

విల్సన్‌కూ, సవతి కూతురుకీ బాగా పడేది. 'నీ జీవితం ఇప్పుడే ప్రారంభమవుతోంది' అని విల్సన్ తను చనిపోయేముందు ఏప్రిల్‌కు చెప్తాడు. దాన్తో పాటు 'మొదలుపెట్టింక, పద' అని రాసిస్తాడు. ఆ వసంతకాలంలోనూ, వేసవిలోనూ చుట్టూ ఉన్న ప్రపంచం యథావిధిగా సాగుతుండగా, ఏప్రిల్ మాత్రం నిర్వీర్యురాలవుతుంది. ఇద్దరు తండ్రులూ, పెళ్ళవబోయే ఆప్తమిత్రురాలు లిబ్బీ గుర్తొస్తుంటారు. ఆకురాలు కాలపు మొదటి రోజు, లిబ్బీ ప్రధానపు రోజు ఫొటోలను డెవలప్ చేస్తూ, 'అక్కడే ఉన్నానే! నా కెమెరా రికార్డ్ చేసినది నా మనస్సెందుకు పట్టుకోలేకపోయిందో!' అనుకుంటుంది. కారణం- పూల్ పక్కన కూర్చున్న హ్యూగో కజిన్ విక్టర్, అతని కుక్క ఏర్గోస్‌నీ తను గమనించకపోవడం. ఏప్రిల్, విక్టర్ ప్రేమలోపడి కలిసి తోటపని చేస్తారు. రహస్యాలు పంచుకుంటారు.

ఏప్రిల్ థెరపిస్ట్ వద్దకి వెళ్తుంది. అయితే- తండ్రి ఆత్మహత్యా, విల్సన్ మరణం గురించిన తన అనుభూతులు వ్యక్తపరచలేకపోతుంది. కానీ, జిమ్‌లో తారసపడిన ఒక అపరిచితుడు- తన తండ్రి కూడా అలాగే మరణించాడని చెప్పినప్పుడు, 'మేమిద్దరం ఆత్మహత్యకు కొడుకూ కూతుళ్ళం' అనుకుంటుంది. ప్రేమలో భద్రత అన్న ఆమె భావం కాస్తా, 'ఏదీ శాశ్వతం కాదు' అన్న అభిప్రాయానికి మారినప్పుడు, 'ఏర్గోస్ ముసలి కుక్క. విక్టర్ పిరికివాడు' అనేసుకుని, 'తన్ని తాను చంపుకోగలిగే నీలాంటి మనిషిని ప్రేమించదలచుకోలేదు' అని అతనికి చెప్తుంది. సంవత్సరం గడిచి వసంతకాలం ప్రవేశిస్తుండగా- ఏప్రిల్, విల్సన్ సలహా పాటించి, విక్టర్‌తో రాజీపడి, ముందుకు కదిలి జీవితం ప్రారంభిస్తుంది.

నవలికలో, ఏప్రిల్ యూదు కుటుంబ సభ్యుల మనస్తత్వాలూ, అలవాట్ల వివరాలూ చాలానే ఉంటాయి. డిపార్టుమెంట్ స్టోర్‌లో ఏప్రిల్ కొన్న సామాన్లేమేమిటో కూడా పేర్లూ, బరువుతో సహా విశదంగా ఉంటాయి. అన్ని అధ్యాయాల్లోనూ విల్సన్ గురించిన చిన్న ఉటంకింపులుంటాయి.

హాస్యం, కోపం, బాధ సమపాళ్ళలో కనపరిచే నవలిక- మృత్యువు, వేదన గురించినదైనప్పటికీ రచయిత్రి శైలివల్ల, మనుష్యుల జీవితాలను యథాతథంగా చూపుతుంది. మరణాన్ని మనం ఎంత పట్టించుకోకపోయినా అది పక్కనే తచ్చాడుతుందని చెబుతుంది. కవయిత్రయిన వోగల్ భాష ఆకర్షణీయమైనది. ఒక సంవత్సరపు ఆవేదనను చూపించే 126 పేజీలున్న ఈ పుస్తకాన్ని 2018లోప్రచురించినది మెల్విల్ హౌస్. 'మయామి బుక్ ఫెయిర్ ప్రైజ్ ఫర్ ద బెస్ట్ నొవెలా' మొట్టమొదటి అవార్డు గెలుచుకుంది. అమెరికాలో నవలికలను గౌరవించే ఒకే ఒక అవార్డు ఇది. కాలిఫోర్నియాలో పుట్టిన వోగల్- అనువాదకురాలు కూడా. సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీనుండి పీహెచ్‌డీ చేసి, ప్రస్తుతం పోస్ట్ డాక్టరల్ స్కాలర్‌గా ఉన్నారు.

❖ కృష్ణ వేణి

గ్రేట్ రైటర్

# సెర్వాంటేజ్



స్పానిష్ భాషలో అత్యంత గొప్ప రచయిత మిగెల్ డె సెర్వాంటేజ్ (1547-1616). ఆయన ప్రభావం ఎంత గొప్పదంటే, స్పానిష్‌ను సెర్వాంటేజ్ భాష అనుకునేంత. స్పెయిన్ రాజధాని మాడ్రిడ్ దగ్గరలో జన్మించాడు సెర్వాంటేజ్. వాళ్ల నాన్న క్షురక వైద్యుడు. ఆ కాలంలో క్షురకులు చిన్న చిన్న వైద్యాలు కూడా చేసేవాళ్లు. ఆ కాలపు అందరు యువకుల్లాగే గొప్ప భవిష్యత్ వెతుక్కుంటూ రోమ్ వెళ్లాడు సెర్వాంటేజ్. గుమస్తాగా, సైనికుడిగా పని చేశాడు. ఓ సందర్భంలో సముద్ర దొంగలకు చిక్కి ఐదేళ్లపాటు నిర్బంధం అనుభవించాడు. అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడు. ఎడమచేయిని కోల్పోయాడు. (రాయడం ద్వారా) కుడిచేతికి కీర్తిని మిగల్చడం కోసం ఎడమచేతిని నష్టపోయానని సరదాగా చెప్పుకున్నాడు. ఈ అనుభవాలన్నీ ఆయన రచనా వ్యాసంగానికి ముడిసరుకు అయ్యాయి. స్పెయిన్‌కు తిరిగి వచ్చిన తర్వాత, మధ్య తరగతి జీవితం బతికాడు. 1605లో రాసిన డాన్ కిహోటి ఆయనకు ప్రసిద్ధిని తెచ్చిపెట్టింది. ఆ వ్యంగ్య నవల తర్వాత్తర్వాత సుమారు 140 భాషల్లోకి అనువాదమైంది. అత్యంత ఎక్కువ భాషల్లోకి అనువాదమైన పుస్తకాల్లో ఇదీ ఒకటి. నాటకాలూ, కథలూ, ఇతర నవలలూ రాశాడు. జీవితంలోని అబద్ధాన్ని నిరసించడమూ, మనస్తత్వానికి పట్టం కట్టడమూ ఆయన రచనల్లో కనబడుతుంది. సెర్వాంటేజ్ 'కుక్కల సంభాషణ' కథంటే సిగ్మండ్ ఫ్రాయిడ్‌కు చాలా ఇష్టం. దాన్ని మూలంలో చదవడానికి ఫ్రాయిడ్ స్పానిష్ నేర్చుకున్నాడు. సెర్వాంటేజ్, ఆ కాలపు మరో గొప్ప రచయిత షేక్స్పియర్ ఇద్దరూ 1616లో ఒకేరోజు సమాధి కావడం విశేషం.

సాహిత్య మరమరాలు

# సుబ్బారెడ్డి అంటే తెలంగాణవాడు కాదు!



**ము**ప్పయ్యేళ్ల కిందటి మాట. మిత్రుడు కోట్ల వెంకటేశ్వరరెడ్డి కవితాసంపుటి 'గుండె కింద తడి' (ఏప్రిల్ 1987) ఆవిష్కరణ సభ మహబూబ్‌నగర్‌లో జరిగింది. ఆవిష్కర్త డాక్టర్ సి.నారాయణరెడ్డి. వక్తలు కె.శివారెడ్డి, ఎం.కె.సుగమ్ బాబు. నిర్వాహకులు కాతోజు, వేణు సంకోజు.

ఆ రోజు హైదరాబాదు నుంచి నారాయణరెడ్డిగారి కారులో ఆయనతో పాటు శివారెడ్డి, సుగమ్ బాబు, వెంకటేశ్వరరెడ్డి, నేనూ మహబూబ్‌నగర్ వెళ్లాం. ఆ రెండు గంటల ప్రయాణంలో సినారె ఎంత సరదాగా, ఎన్ని కబుర్లు చెప్పారో! ఆయన మిమిక్రీ కూడా చేస్తారని అప్పుడే నాకు తెలిసింది.

వెంకటేశ్వరరెడ్డి తన పుస్తకాన్ని ఆ ఊరిలోని నటరాజ్ థియేటర్ యజమాని ఎన్.పి.సుబ్బారెడ్డికి అంకితమిచ్చాడు. సభానంతరం సుబ్బారెడ్డి తన థియేటర్ లోని ఒక గదిలో సినారె, శివారెడ్డి, సుగమ్ బాబులకు ఆతిథ్యం ఏర్పాటు చేశాడు. మా భోజనాలయ్యాక వెంకటేశ్వరరెడ్డీ, నేనూ ఆ గది బయటే నిరీక్షిస్తూ నిలబడ్డాం. అప్పుడప్పుడు సుగమ్ బాబు సిగరెట్ తాగడానికి బయటికి వచ్చి, లోపలి విశేషాలు చెప్పి వెళ్లేవాడు. 'మీరు ఈ ప్రాంతంవారు కావడానికి వీల్లేదే' అన్నారట నారాయణరెడ్డిగారు ఆ థియేటర్ యజమానితో. 'ఎందుకు?' అన్నాడట ఆయన. 'సుబ్బారెడ్డి అనే పేరు తెలంగాణలో ఉండదు' అన్నారట సినారె. అప్పుడాయన తను ఎక్కడి నుంచి వచ్చి మహబూబ్‌నగర్‌లో స్థిరపడ్డాడో చెప్పాడట. సుబ్బారెడ్డి, సుబ్బారావు, సుబ్బయ్య వంటి పేర్లు తెలంగాణలో ఉండవనే విషయం అప్పటిదాకా నాకు తెలీదు.

రాత్రి దాదాపు పదకొండింటికి హైదరాబాదుకు తిరుగుప్రయాణం. వెంకటేశ్వరరెడ్డి నన్ను ఆ రాత్రికి అక్కడే ఉండిపొమ్మన్నాడు కాని నారాయణరెడ్డిగారు రమ్మనడంతో నేను కూడా బయలుదేరాను.

*(జూన్ 12న సినారె వర్ధంతి.)*

❖ గాలి నాసరరెడ్డి

ప్రతిధ్వనించే పుస్తకం

# అనాసక్తి యోగము



**ఒ**క పర్యాయం గాంధీజీ జైలులో ఉన్నప్పుడు, మిత్రులు అడిగిన మీదట భగవద్గీత వ్యాఖ్యానానికి పూనుకున్నారు. అది పుస్తకంగా 1929లో వెలువడింది. దాన్ని 'అనాసక్తి యోగము' పేరిట తెలుగులోకి ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య, పోతరాజు సీతారామారావు అనువదించారు. అందులో గీతను తాను ఎలా అర్థం చేసుకున్నాడో, దానికి అంత ప్రాధాన్యత ఎందుకు ఇచ్చాడో ముందుమాటలో వివరించారు మహాత్ముడు. అందులోంచి కొన్ని భాగాలు ఇక్కడ: పుస్తకం ఆర్కైవ్.ఆర్గ్‌లో ఉచితంగా చదవొచ్చు.

'దేహమున్నచోట కర్మ యుండనే యుండును. దాని నుండి ముక్తి పొందినవారు లేరు. కర్మయున్నప్పు డందేదో యొక దోషముండక మానదు. ముక్తి నిర్దోషికే కదా లభించును. అట్లయినచో కర్మబంధనము నుండి లేక దోషస్పర్శము నుండి ముక్తి కలుగుట యెట్లు? సమస్త కర్మలను కృష్ణార్పణ మొనరించి అనగా మనో వాక్కాయ కర్మలను పరమేశ్వరు నియందు హోమము చేసి అని నిశ్చయాత్మక శబ్దములతో గీత ప్రత్యుత్తరమిచ్చినది.'

'జ్ఞానము కేవల శుష్క పాండిత్యముగ మారిపోవునేమోయని తలచి గీతాకారుడు జ్ఞానముతో భక్తిని చేర్చి దానికి ప్రథమ స్థాన మిచ్చియున్నాడు.' 'స్థితప్రజ్ఞుని లక్షణములే భక్తుని విషయమున వర్ణించియున్నాడు. తాత్పర్య మేమన, గీతాభక్తి బాహ్యాచారము కాదు. గ్రుడ్డితనముతో కూడిన శ్రద్ధ కాదు.'

'ఎవ్వడితరులను ద్వేషింపడో, ఎవ్వడు కరుణకు నిధియో, ఎవ్వని కహంకార మమకారములు లేవో, ఎవ్వనికి సుఖదుఃఖములును, శీతోష్ణములను సమములైయున్నవో, ఎవ్వడు నిత్యసంతుష్టుడై యుండునో, ఎవ్వని నిశ్చయము మార్పునొందనిదై సదా యేకరీతి నుండునో, ఎవ్వనికి లోకము భయపడదో, లోకమున కెవ్వడు భయపడడో, ఎవ్వడు భూషణ వలన సంతోషమును దూషణము వలన దుఃఖము పొందకుండునో, ఎవ్వడేకాంతవాస మపేక్షించునో, ఎవ్వడు స్థిరబుద్ధి కలిగి యుండునో, వాడు భక్తుడు.'

'ఒక వైపున కర్మ బంధనరూపమై యున్నది. ఇది నిర్వివాదాంశము. రెండవ వైపున దేహి ఇచ్ఛతోనే కాక అనిచ్ఛతో సైతము కర్మ చేయుచుండును. శారీరక మానసిక చేష్టలన్నియు కర్మలు. అట్లగుచో కర్మ చేయుచున్నను, మనుష్యుడు బంధవిముక్తు డెట్లగును? నేనెరిగినంత వరకు ఈ సమస్యను గీత పరిష్కరించిన విధముగా మరియే ధర్మగ్రంథమును పరిష్కరించి యుండలేదు. ''ఫలాసక్తిని విడువుము. కర్మ చేయుము.'' ''ఆశారహితుడవై కర్మ చేయుము'' అని గీత పల్కుచున్నది. కర్మ విడుచువాడు పతితుడగును. కర్మ చేయుచున్నను దాని ఫలము విడుచువాడు ఊర్ధ్వగతి కేగును.'

'(గీతాకారుడు) మోక్షమునకును వ్యవహారమునకును మధ్య భేదముంచలేదు. వ్యవహారమునకుపయోగపడని ధర్మము ధర్మము కాదనుట గీతాభిప్రాయమని నా నమ్మిక. అనగా గీతామతానుసారము ఆసక్తి లేకుండ చేయ వీలులేని కర్మములన్నియు త్యాజ్యములు. ఇట్టి సువర్ణ నియమమనేక ధర్మసందేహముల నుండి మానవుని రక్షింపగలదు. ఈ మతానుసారము హత్య అసత్యము వ్యభిచారము మున్నగు కర్మలు వానియంతట అవియే త్యాజ్యములై పోవును. మానవ జీవితము సరళమగును. సరళత్వమందు శాంతి యుదయించును.'

## రారండోయ్

- పాణి రచన 'వ్యక్తిత్వమే కవిత్వం' (వరవరరావు కవిత్వ విశ్లేషణ) ఆవిష్కరణ సభ జూన్ 17న సాయంత్రం 6 గంటలకు దొడ్డి కొమురయ్య హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనుంది. ఆవిష్కర్త: బి.విజయభారతి. దేవిప్రియ, వసంత్ కన్నభిరాన్, కె.శివారెడ్డి, ఎండ్లూరి సుధాకర్, కాత్యాయనీ విద్మహే వక్తలు. నిర్వహణ: మలుపు బుక్స్.
- తెలంగాణ సాహిత్య అకాడమీ నెలనెలా నవలా స్రవంతిలో భాగంగా జూన్ 14న సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో భాస్కరభట్ల కృష్ణారావు 'వెల్లువలో పూచిక పుల్లలు'పై ఆడెపు లక్ష్మీపతి ప్రసంగిస్తారని అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి తెలియజేస్తున్నారు. అధ్యక్షత: నందిని సిధారెడ్డి.
- పాలమూరు సాహితీ అవార్డుకు 2018లో ముద్రితమైన వచన కవితా సంపుటాల మూడు ప్రతులను జూన్ 30లోగా డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, ఇం. నం. 8-5-38, టీచర్స్ కాలనీ, మహబూబ్ నగర్ - 509001 చిరునామాకు పంపాలి.
- మఱ్ఱిమాను - తరతరాల వారసత్వం అంశంపై కవితలు జూన్ 30లోగా రాసి పంపాల్సిందిగా 'రంజని' ప్రధాన కార్యదర్శి కోరుతున్నారు. చిరునామా: రంజని తెలుగు సాహితీ సమితి, ఎ.జి. ఆఫీసు, హైదరాబాద్ - 500004. వచ్చిన వాటిల్లో ఉత్తమమైన వాటికి అద్దేపల్లి రామమోహనరావు స్మారక సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు.

పదం పలికింది - పాట నిలిచింది

# వెన్నెల మాటాడునా వెదజల్లును చల్లదనాలు



శ్రీనివాసరావు. కాంచన, కృష్ణంరాజు నటీనటులు.

**ఏ**మీ చేయనక్కర్లేదు. అసలు మాటలు కూడా అవసరం లేదు. మౌనంలో ఒకరికొకరం మరింతగా అర్థమవుతాం. వెన్నెలకు చల్లదనమే మాట. మల్లికకు పరిమళమే మాట. హృదయానికి చెవులుంటే జగతిలోని ప్రతి నాదమూ వినబడుతుంది. బతుకు అనురాగమయం అవుతుంది. నీతి నిజాయితి చిత్రం కోసం డాక్టర్ సి.నారాయణరెడ్డి రాసిన పాట ఇది. సంగీతం సాలూరి రాజేశ్వరరావు. పాడిన వారు పి.సుశీల. 1972లో వచ్చిన ఈ చిత్రానికి దర్శకుడు సింగీతం

మాటలకందని భావాలు
మంచి మనసులు చెపుతాయి
కవితలకందని భావాలు
కంటిపాపలే చెబుతాయి
వెన్నెల మాటాడునా
వెదజల్లును చల్లదనాలు

మల్లిక మాటాడునా
కురిపించును పరిమళాలు
మాటరాని పాపాయి
బోసినవ్వు చాలదా
ఏనాడు పలకని దైవం
ఈలోకము లేలదా

పిల్లగాలి పరుగులలో
వెల్లివిరియు గీతికలు
కొండవాగు తరగలలో
కోటిరాగ మాలికలు
హృదయానికి చెవులుంటే
జగమంతా నాదమయం
కనగలిగిన మనసుంటే
బ్రతుకే అనురాగమయం

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం
10-6-2019



మళ్లీ మళ్లీ భయపెడతా
– సినిమా పేజీలో



అమ్మానాన్న తర్వాతే ఆడపిల్లలకు ఏదైనా!
చిక్కేమిటంటే..
ప్రేమను కూడా వాళ్లు.. అమ్మలానో నాన్నలానో చూస్తారు.
ప్రేమ అనే అమ్మ ఒడిలో సేద తీరుతారు.
ప్రేమ అనే నాన్న భుజాలెక్కి 'చల్ చల్ గుర్రం' అంటారు.
ప్రేమను అంతగా నమ్ముతుంది అమ్మాయి.
అమ్మానాన్నే.. ప్రేమను అస్సలు నమ్మరు.
కూతురిపై అంత ప్రాణం.. పరువునెక్కడ తోసేస్తుందోనని!
పరువంటే అంత ప్రేమ.. ప్రాణాల్నెక్కడ తీసేస్తుందోనని!
పెళ్లంటే.. అటు ఏడు తరాలు, ఇటు ఏడు తరాలు చూస్తాం.
తర్వాతేమౌతుందో మనం చూడబోయేది లేదు.
'నీలాగే నన్ను చూసుకుంటాడు నాన్నా' అని
కూతురు నమ్మకంగా చెప్పినా కూడా..
పరువును పక్కన పెట్టి, కూతుర్ని దగ్గరకు తీసుకోలేమా?!

# లవింగ్ డాటర్స్

**ఒ**క యేడాది కిందటో.. అంతకు ముందో స్టార్ గోల్డ్ సెలెక్ట్ అనే చానల్ 'ప్యార్ కియాతో డర్నా క్యా' అనే పాట లైన్‌తో ఓ యాడ్ వీడియో తీసింది. టామ్మీ లమ్కిన్ అనే 41 ఏళ్ల విదేశీ మహిళను పెళ్లి చేసుకున్న 22 ఏళ్ల హితేశ్ చావ్దాను 'క్రాస్ కాంటినెంటల్ కనెక్షన్'గా, మాధురి (ట్రాన్స్ జెండర్), జయ్ శర్మ జంటను 'ట్రాన్స్ కన్వెన్షనల్ వాలంటెన్స్'గా సయ్యద్ అలీ, ఇందర్‌జిత్ నాగి (సేమ్ సెక్స్ లవ్) లను' పార్ట్‌నర్స్ ఇన్ ప్రైడ్'గా, అయిదు గురు మనమలు, మనమరాండ్ల తాత.. 76 ఏళ్ల మహేశ్ భై, తొమ్మిది మంది మనమలు, మనమరాండ్ల అమ్మమ్మ.. 65 ఏళ్ల రంజనా బెన్‌ల సహజీవనాన్ని 'ఫుల్ టైమ్ లవ్ ఇన్ లవర్స్'గా, ఇద్దరు పిల్లల తల్లి అయిన జెన్ని ఫర్ బరూచా, ఓ బిడ్డ తండ్రి అయిన సందీప్ నైతానీని పెళ్లాడడం 'సెకండ్ టైమ్ లక్కీ ఇన్ లవ్'గా, వరుణ్ షా, అలిషా అహ్మద్ అనే యువజంటను 'ఇంటర్ ఫెయిత్ బ్యూస్'గా, యాసిడ్ అటాక్‌కు గురైన లలితా బన్సీ, రవిశంకర్ అనే జంట ప్రేమను 'సోల్ మేట్స్ బియాండ్ ఆర్డినరీ'గా వర్ణించింది ఆ యాడ్!



'స్టార్ గోల్డ్ సెలెక్ట్' చానల్ 'ప్యార్ కియాతో డర్నా క్యా' యాడ్ వీడియోలోని జంటలు

ఇప్పుడెందుకీ ప్రస్తావన? వాలంటైన్స్ డే ఎప్పుడో అయిపోయింది కదా! చిరాగ్గా ఐబ్రోస్ కలుసుకుంటాయని తెలుసు! కానీ సందర్భం ఉంది. మారుతీరావు దగ్గర్నుంచి నిన్నమొన్న హైదరాబాద్‌లో ఒక అన్న తన చెల్లెలు ఇష్టపడి పెళ్లిచేసుకున్న అబ్బాయిని నడి రోడ్డు మీద పొడిచి పొడిచి చంపడం వరకు.. యేడాది కాలంలో దాదాపు అరడజను ప్రేమ హత్యలు జరిగి ఉంటాయి. వాట్సాప్‌లో వైరల్ కాకుండా దాక్కున్న దారుణాలు ఇంకొన్ని ఉండొచ్చు! కులం, మతం, ప్రాంతానికి అతీతంగా జరిగినవే ఇవన్నీ! అంటే కులం, మతం కాదు ప్రాబ్లం.. ప్రేమ కదా సమస్య! కాదు... స్త్రీ! ఆమెకు మెదడు ఉండడం, ఆలోచించగలగడం, ఆమెకు అభిరుచి ఉండడం, ఆస్వాదించాలనుకోవడం! ఆమెకంటూ స్వంత వ్యక్తిత్వం ఉండాలనుకోవడం నచ్చని సమాజం చేసే ఘాతుకం అది. అనాగరికం అని నిర్ధారించిన కాలం నుంచి నాగరికం అనుకుంటున్న నేటి దాకా మార్పు రానిది.. రాలేనిది మహిళల విషయంలోనే. మారనిది.. ఆమెను ప్రాపర్టీగా చూస్తున్న అభిప్రాయమే! స్త్రీని సొంత ఆస్తిగా భావించడం వల్లే ప్రేమ హత్యలైనా.. దాడులైనా! అవును కుల వ్యవస్థను కాపాడుకోవడానికి వివాహ వ్యవస్థ ఎలా ఉపయోగపడుతోందో.. స్త్రీని ప్రాపర్టీగా స్థిరపర్చడానికి వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ అలాగే తోడ్పడుతున్నాయని నిపుణుల అభిప్రాయం.

ఆ మాటకొస్తే మన దగ్గర పిల్లలను పెద్దవాళ్లందరూ తమ ప్రాపర్టీగానే చూస్తారు.. ఇందులో అమ్మాయి, అబ్బాయి అనే వ్యత్యాసం లేదు అంటున్నారు కొందరు. నిజమే.. కాని మేజర్ అయ్యాక అబ్బాయి స్వతంత్రుడయి తన ఈడు అమ్మాయిని తన ఆస్తిగా పరిగణించే కోవలోకి వచ్చేస్తాడు అని వాదన లేకుండా ఒప్పుకుంటున్న వాళ్లూ ఎక్కువే. అందుకే కుల, మత, ప్రాంతాలకతీతంగా తండ్రి, సోదరుడి చేతుల్లో ప్రేమ హత్యకు గురవుతోంది. తండ్రి, సోదరుడు, భర్త, కొడుకు సంరక్షణలో ఉంటోంది స్త్రీ ఓ ఆస్తిగా!

''అబద్ధం ఎందుకు చెప్పావ్?'' మెడిసిన్ చదువుతున్న కూతురిని గద్దిస్తాడు తండ్రి.

''కాలేజ్‌కే కాదు.. హాలిడేస్‌లో హ్యాంగవుట్‌కీ వెళ్లాలనుంటుంది.. ఆడ, మగ ఫ్రెండ్స్‌తో! వాళ్లను ఇంటికి పిలవాలనుంటుంది.. కాని మీరు ఒప్పుకోరు. అందుకే అబద్ధం చెప్పా. మీరు ఒప్పుకుంటే నిజమే చెప్పేదాన్ని... చెప్తా కూడా'' అంటుంది ఆ అమ్మాయి ఏడుస్తూ!

ఇది గల్లీ బాయ్ సినిమాలో డైలాగ్. అంటేఏంటీ? పిల్లలు.. మెయిన్‌గా ఆడపిల్లలు ఆడింది ఆట, పాడింది పాటగా చూడమంటారా?

కన్నెర్ర చేయకండి. ఆడపిల్లలే కాదు.. ఏ పిల్లల విషయంలో గుడ్డిగా ఉండమని ఎవరూ చెప్పరు! కాని మన కఠిన నిబంధనల వల్ల పిల్లలు మన కళ్లుగప్పే ప్రమాదం ఉందని సూచించడానికే పైన సన్నివేశం. వాళ్లు వేసుకునే బట్టల దగ్గర్నుంచి చదువు, కెరీర్.. అమ్మాయిలకైతే కట్టుకోబోయే మొగుడిని కూడా మనమే నిర్ణయిస్తున్నాం. వాళ్లను ఇండివిడ్యువల్స్‌గా కాక డిపెండెంట్స్‌గా పెంచుతున్నాం. ఫ్రెండ్స్‌లా కాక బానిసలుగానే చూస్తున్నాం (తప్పు పట్టుకోకండి.. ఆలోచించండి.. ఎక్కువ శాతంగా ఉన్న పరిస్థితి గురించే). ఆ సినిమాలోని ఆ అమ్మాయి నిజాయితీని గ్రహించినట్టే.. మన పిల్లల్లోని నిజాయితీని గుర్తిస్తే.. వాళ్లకు బెత్తం పట్టుకున్న మాస్టర్‌లా దర్శనమివ్వకుండా హగ్ చేసుకునే ఫ్రెండ్‌లా కనిపిస్తాం. చనువుగా దగ్గర కూర్చుంటారు. చర్చిస్తారు. విశ్లేషణ నేర్చుకుంటారు. చేయబోయేది చెప్తారు. తల్లీ దండ్రిని గైడ్‌లా చూస్తారు.

కాలం మారింది. కానుగ బడులు లేవు (ఉండాలని ఉద్దేశం కాదు). కార్పొరేట్ స్కూల్స్ వచ్చాయి.ఇంటర్నేషనల్ సిలబస్ కరిక్యులమ్‌తో. సెల్ ఫోన్స్, వీడియో గేమ్స్.. పిజ్జాలు, బర్గర్స్,.. ఇంకా ఇతరత్రా ఆధునిక అలవాట్లకు వాళ్లను ఎక్స్‌పోజ్ చేస్తున్నాం. పెద్దయ్యాక మంచి కెరీర్‌తో రూపాయిల్లో కాకుండా డాలర్స్ అండ్ పౌండ్స్‌లలో వాళ్ల సంపాదన ఉండాలని బలంగా కోరుకుంటున్నాం, ఇంత చక్కటి ఫౌండేషన్ వేస్తే ఉండకుండా పోతుందా అనీ అంతే బలంగా విశ్వసిస్తున్నాం! ఈ మొత్తం ప్రయాణంలో వాళ్లు ఎక్స్‌ప్లోర్ చేసుకున్న థింగ్స్ కూడా కొన్ని ఉంటాయి. కుల, మత, ఆస్తి, అంతస్థుల (ఇప్పుడైతే జెండర్ కూడా)ను చూడని ప్రేమ కూడా వాటిల్లో ఒకటి. పేరెంట్స్ అన్నిటికీ బాధ్యత వహించాలి. వాళ్ల ప్రేమకు కూడా. పెద్దల అభిప్రాయాన్ని గౌరవిస్తే ఓకే.. తమ అభిప్రాయానికే కట్టుబడి ఉన్నా ఓకే. భరోసా ఇస్తే సమస్యలను పరిష్కరించుకునే తెగువ చూపిస్తారు. భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దుకుంటారు. బెదిరిస్తే పారిపోతారు. వెంటబడి ప్రాణాలు తీస్తే మనక్కాకుండా పోతారు. అర్థంలేని జీవితాన్ని మనకు మిగిలిస్తారు. పిల్లలు.. అందునా అమ్మాయిలు మన పరువు ట్యాగ్‌ను మోసే బ్యాగేజ్ కారు. మనకు ప్రేమను పంచే వారసులు. కులం, మతం, ఆస్తి, అంతస్తు, ప్రాంతాల మధ్య సరిహద్దులు చెరిపేసే వారధులు!

పైన యాడ్ చెప్పే విషయం కూడా అదే! ఇద్దరు మనుషులు కలిసి ఉండడానికి కులం, గోత్రం, ఆస్తి, అంతస్తు కాదు.. ప్రేమ ఉండాలి.. భిన్న మనస్తత్వాలను గౌరవించుకుని ముందుకు సాగే స్నేహం కావాలి. అన్నీ చూసుకొని సమ ఉజ్జీలమని నిర్ధారించుకున్న తర్వాత రెండు కుటుంబాలు కలిసి చేసిన పెళ్లిళ్లెన్నో విచ్ఛిన్నమైన ఉదాహరణలు బోలెడు. లక్షల్లో కట్నాలు తీసుకొని మోసం చేసి పోయిన భర్తలు.. దాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని బిడ్డకు ఇవ్వలేక అదే పరువు పేరుతో నోట్లో బాధను కుక్కుకొని బయటి ప్రపంచానికి మొహం చూపించకుండా బతుకీడుస్తున్న తల్లిదండ్రులూ కోకొల్లలు. మంచిచెడులు అన్నిట్లో ఉంటాయి. పరువు అనే పురుగును పక్కన పెడితే... అంతా మనవాళ్లే. ఈగోను ఈగలా తోలేస్తే అంతా ప్రేమమయమే!

– సరస్వతి రమ

## మనం శాశ్వతం కాదు

రెక్కలొచ్చే వరకే బిడ్డను చూసుకుంటుంది పక్షి. ప్రకృతిలో ఏ జీవికైనా వర్తించే సూత్రం ఇది. పిల్లలతో ఎల్లకాలం ఉండలేం. మనం శాశ్వతం కాదు. కాబట్టి చిన్నప్పటి నుంచే వాళ్లను ఇండివిద్యువల్‌గా పెంచాలి. కుటుంబ వ్యవస్థను బలంగా విశ్వసించే వాళ్లలో నేను ఒకదాన్ని. మంచి కుటుంబం మంచి జనరేషన్‌ను తయారు చేస్తుందని నమ్ముతాను. మంచి కుటుంబం అంటే ఆరోగ్యకరమైన ఆలోచనలున్న అమ్మా, నాన్న. పిల్లల్ని ఇండివిద్యువల్స్‌గా పెంచే, చూసే పేరెంట్స్. అలాగే అమ్మాయి, అబ్బాయి మధ్య డిఫరెన్స్ చూపకుండా.. ముఖ్యంగా ఆడపిల్లలను ప్రాపర్టీగా భావించని తల్లిదండ్రులున్న ఫ్యామిలీ. పిల్లల జీవితాలకు సంబంధించి మనకున్న అభిప్రాయం చెప్పడం తప్పు కాదు.. పట్టుబట్టడమే వద్దు. మనం చెప్పినా వాళ్లు తమ ఒపీనియన్ మీదే ఉంటే రెస్పెక్ట్ చేయడమే మంచిది. కనీసం వాళ్ల మంచిచెడులను చూసుకోగలుతాం కదా! పరువు కోసం హత్య చేసిన వాళ్లెవరూ పిల్లల్ని పోగొట్టుకొని సంతోషంగా ఉంటారని అనుకోను.



– డాక్టర్ పద్మా పాల్వాయి,
సైకియాట్రిస్ట్, హైదరాబాద్

### ఇండివిద్యువల్‌గా పెంచాలి

**పి**ల్లలను ఇండివిద్యువల్‌గా పెంచడం చాలా ఇంపార్టెంట్. అల్లరి చేస్తుంటే భరించమని కాదు. సరిచేయాలి. కాని వాళ్ల అభిరుచులను.. అంటే చదువు, కెరీర్, లైఫ్ పార్ట్‌నర్ దాకా అన్నీ పెద్దవాళ్లే నిర్ణయిస్తున్నారు. ఇక్కడ పెద్దవాళ్లు రియలైజ్ కావాల్సింది ఏదీ పర్మినెంట్ కాదు అని. పిల్లల ఇష్టాయిష్టాలను గౌరవించాలి. గైడెన్స్ ఇవ్వాలి.

– స్వేచ్ఛ, అడ్వకేట్,
హైదరాబాద్



సహచరుడు గౌతమ్‌తో అడ్వకేట్ స్వేచ్ఛ

### మా నాన్న పెంచినట్టే నేనూ..!

**స్వే**చ్ఛ నా కూతురు. తన చిన్నప్పటి ఫ్రెండ్ గౌతమ్‌తో సహజీవనం చేద్దామనుకుంటున్నాను అని నాతో చెప్పినప్పుడు నేనేమీ ఆశ్చర్యపోలేదు. అది నా కూతురి వ్యక్తిగత విషయం. మా నాన్న మమ్మల్ని ఇండివిద్యువల్‌గానే పెంచాడు. నేనూ నా కూతురిని అలాగే పెంచాను. తను సంతోషంగా ఉండడమే నాకు కావల్సింది. ఉంటుంది అన్న నమ్మకమూ ఉండింది. గౌతమ్ కూడా అడ్వకేట్. భార్యాభర్తల మధ్య ఉండాల్సింది ఈగో కాదు ఫ్రెండ్‌షిప్. స్వేచ్ఛ, గౌతమ్‌ల మధ్య ఉన్నది అదే. ఈ ఫ్రెండ్‌షిప్ ఒకరిపట్ల ఒకరికి గౌరవాన్ని పెంచుతుంది. పెళ్లికి ముందు పరిచయం, స్నేహం, ప్రేమ లేకపోతే ఇది సాధ్యపడదని నా అభిప్రాయం.



– బి. జ్యోతి, 'మహిళామార్గం' పత్రిక ఎడిటర్,
(మానవ హక్కుల న్యాయవాది దివంగత పురుషోత్తమ్ రెడ్డి సహచరి)

### ప్రాపర్టీ అనే భావనతోనే..!

**ప**రువు హత్యలకు కారణాలుగా కులం, మతం బయటకు కనపడుతున్నాయి. కాని మహిళను ప్రాపర్టీగా భావించడం వల్ల జరుగుతున్న దారుణాలు అవి. నేను హిందూ అమ్మాయిని (యెదుళ్ల జ్యోతి) పెళ్లి చేసుకున్నాను. మాకు ఇద్దరు కూతుళ్లు. ఇన్నేళ్లలో మా మధ్య మతం ఇష్యూయే కాలేదు. మా పిల్లల స్కూల్, కాలేజ్ అప్లికేషన్స్‌లో కూడా నేనెక్కడా మతాన్ని మెన్షన్ చేయలేదు. ఇండియన్ అనే రాశా. ఇబ్బందులు ఎదురయ్యాయి. అయినా వెనక్కి పోలేదు. పోరాడాను. నిన్న మా పెద్దమ్మాయి రోషిణీ జబీన్ పెళ్లి అయింది. ఫ్రాన్స్‌లో ఎమ్మెస్ చేసింది. అక్కడే క్లాస్‌మేట్ (కర్ణాటకకు చెందిన అబ్బాయి)ను ఇష్టపడింది. మాకు చెప్పింది. ముందు నుంచీ మా పిల్లలను ఇండివిద్యువల్స్‌గానే పెంచాం. ఏదైనా మాతో షేర్ చేసుకునే చనువిచ్చాం. అందుకే తన ప్రేమ విషయమూ చెప్పింది. మంచి చెడులు చర్చించాం. అబ్బాయీ వాళ్ల తల్లిదండ్రులతో చెప్పాడు. మా మతాంతర వివాహం గురించి ప్రస్తావించాం. ఒప్పుకున్నారు. స్టేజ్ మ్యారేజే చేస్తామన్నాం. దానికీ ఒప్పుకున్నారు. నిన్ననే అందరి ఆశీస్సులతో మ్యారేజ్ అయింది.

– మహ్మద్ వహీద్



భార్య యేసుల్లా జ్యోతి, కుమార్తె రోషిణీ జబీన్‌లతో వహీద్

---

మార్పు

# చూపురేఖలు

**కొత్త భావనలకు పాతవి ఎప్పుడూ సహాయ నిరాకరణగానే ఉంటాయి. ఆ మాత్రం ఒరిపిడి లేకుంటే మార్పు పరిపూర్ణం కాదు కూడా. కాలానికి తగ్గట్టు చూపూ ఉంటే బొట్టుందా, భుజాలపైకి కత్తిరించిన జుట్టుందా అని కళ్లు వెతుక్కోవు.**

● మాధవ్ శింగరాజు

> ఉద్యోగరీత్యా గానీ, ఒంటికి అనువుగా ఉండటం కోసం కానీ చీర కట్టు, బొట్టు మస్ట్ కాదనుకునే ఆధునిక మహిళాయుగంలోకి మనం వచ్చినప్పటికీ మనమికా 'భారతీయ స్త్రీమూర్తి' దగ్గరే ఆగిపోయాం. అవును ఎందుకు ఆగిపోయాం?!

**మ**న దగ్గర సిటీ బస్సుల్లో స్త్రీలకు కేటాయించిన సీట్లకు పసుపు రంగు ఉంటుంది. సీట్‌ల రాడ్‌లకు, సీటు వెనుక భాగానికీ పూసి ఉండే ఆ పసుపు రంగును బట్టి అవి స్త్రీల సీట్లని తేలిగ్గా గుర్తించవచ్చు. అదొక్క గుర్తే కాదు. కిటికీ పైన 'స్త్రీలు' అని రాసి ఉంటుంది. అది మాత్రమే కాదు. స్త్రీ బొమ్మ కూడా గీసి ఉంటుంది. ఇన్ని ఉన్నా ఆ స్త్రీల సీట్లలో కూర్చునే 'స్త్రీలు కాని వాళ్లు' ఉండనే ఉంటారు. స్త్రీల సీట్లను పసుపురంగుతో సూచించడం, స్త్రీల చిత్రాన్ని గియ్యడం, 'స్త్రీలకు మాత్రమే' అని రాయడం ఏళ్లుగా ఒక పద్ధతిలా వస్తోంది.

బస్సులు, రైళ్లలోనే కాదు.. స్త్రీలకు ప్రత్యేకం అని సూచించవలసిన ప్రతి చోటా ఏదో ఒక రంగు 'అటువైపు వెళ్లకండి' అని మగవాళ్లకు చెబుతూనే ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో పసుపు, ఇంకొన్ని ప్రాంతాల్లో పింక్. రంగైతే చదువులేని వాళ్లకు కూడా సూచనను వెంటనే అర్థం చేయిస్తుంది. (అదీ అర్థం కానివాళ్లకు స్త్రీ చిత్రం ఎలాగూ ఉంటుంది). అయితే ఈ రంగుల ఇండికేషన్ కూడా కొంతమందికి నచ్చడం లేదు. స్త్రీలకు పింక్ ఏమిటి? అసలు రంగేమిటి? అనే మాట వినిపిస్తోంది కొన్నాళ్లుగా. మన దగ్గరికింకా ఆ వాదన రాలేదు. వస్తే, పసుపు రంగేమిటి? స్త్రీలంటే పసుపూ కుంకుమలేనా ఏమిటి అనే అవకాశమైతే ఉంది. ఇప్పటికే కొన్ని దేశాల్లో జెండర్ సైనేజ్‌లను తొలగించడం మొదలైంది. సైనేజ్‌లంటే.. ఇది ఆడవాళ్లకు, ఇది మగవాళ్లకు అని సూచించే స్త్రీ, పురుషుల సంకేత చిత్రాలు. మనం మరీ అంతగా.. లైంగికస్పృహ లేనంతగా.. మనుషులంతా ఒక్కటే అన్నంతగా 'మానవీకరణ' చెందలేదు. స్త్రీని మనం చూసే దృష్టి ఒకటి ఉంటుంది కదా, అలా చూడ్డానికే అలవాటు పడి ఉన్నాం. దృష్టి అంటే నేత్రదృష్టి కాదు. మనో దృష్టి. అమ్మ బొమ్మ గియ్యమంటే పిల్లలు గుండ్రంగా ఒక సర్కిల్ గీసి, రెండు కళ్లు, రెండు చెవులు, ముక్కు వేసి, చక్కగా పాపిట తీసి, నుదుటి మధ్యలో బొట్టు పెట్టేస్తారు. చెవులకు రింగులు పెడతారు. నార్త్ పిల్లలైతే అమ్మ తల చుట్టూ చీర కొంగు కప్పుతారు. పెద్దవాళ్లమంతా కూడా పిల్లలుగా ఉండి ఎదిగినవాళ్లమే కాబట్టి భారతీయ స్త్రీమూర్తి అనగానే మన ఊహల్లోకి మొదట వచ్చే స్త్రీ రూపురేఖలు అమ్మవే. బొట్టు, తలచుట్టూ కొంగు. అందుకే స్త్రీలకు విడిగా కేటాయించిన సీట్ల దగ్గర, కౌంటర్‌ల దగ్గర, కంపార్ట్‌మెంట్‌ల మీద ఇప్పటికీ మాతృమూర్తిని తలపించే చిత్రం మాత్రమే కనిపిస్తుంది. ఉద్యోగరీత్యా గానీ, ఒంటికి అనువుగా ఉండడం కోసం కానీ చీర కట్టు, బొట్టు మస్ట్ కాదనుకునే ఆధునిక మహిళాయుగంలోకి మనం వచ్చినప్పటికీ మనమింకా 'భారతీయ స్త్రీమూర్తి' దగ్గరే ఆగిపోయాం. అవును ఎందుకు ఆగిపోయాం?!

రెండు నెలల క్రితం పశ్చిమ రైల్వే జనరల్ మేనేజర్ ఎ.కె.గుప్తా ముంబై లోకల్ ట్రైన్‌ల పనితీరు పర్యవేక్షణల విధుల్లో ఉన్నప్పుడు ఆయనకీ ఇలాగే ఆగిపోయిన ఆలోచన ఏదో కలిగింది. ట్రైన్‌లతో పోటీ పడి మరీ మహిళలు ఉద్యోగాలకు పరుగులు పెడుతూ, విశ్వాంతరాళాలకు సైతం రాకెట్‌లా దూసుకెళుతున్న ఈ కాలంలో ఇంకా ఆ సేమ్ ఓల్డ్ ట్రెడిషనల్ స్త్రీ మూర్తి చిత్రాన్నే బోగీలపై గీయించడం ఏమిటి అనుకున్నారు. వెంటనే ఆ చిత్రాన్ని ఆధునిక మూర్తిగా రీడిజైన్ చేయించారు. ఒక యువతి ఫార్మల్ సూట్‌లో ఉంటుంది. ఆమె జుట్టు చక్కగా భుజాల మీదికి వదిలేసి ఉంటుంది. నుదుటిపై బొట్టు ఉండదు. మనిషి నాజూకుగా ఉంటుంది. నాగరికంగా చేతులు కట్టుకుని ఉంటుంది. పెదవులపై కనిపించీ కనిపించని నవ్వు ఉంటుంది. ఈ చిత్రాన్ని గుప్తా దగ్గర ఉండి మరీ చేయించారు. ఇప్పటివరకు పన్నెండు కోచ్‌లు ఉండే రెండు రైళ్లకు వాటిని వేయించారు. ఇంకో రెండు వారాల్లో మిగతా 108 లోకల్ ట్రైన్‌లలోనూ మహిళా కంపార్ట్‌మెంట్‌ల మీద, లోపల మహిళలు కూర్చునే చోట ఈ ఆధునిక యువతి చిత్రాన్ని పెయింట్ చేయడం పూర్తవుతుంది. ఈ 'లోగో' మార్పు గురించి పశ్చిమ రైల్వే మే 27 ఉదయాన్నే ఒక సర్‌ప్రైజింగ్ ట్వీట్ పెట్టింది. 'కాలానుగుణంగా మారే ప్రయత్నంలో భాగంగా పశ్చిమ రైల్వే మహిళల కోచ్ మీద ఉండే మహిళా చిహ్నాన్ని ఆధునీకరిస్తోంది.' అని ఆ ట్వీట్‌లో ఉంది. వెంటనే రియాక్షన్ మొదలైంది. 'అమ్మలో ఆధునికం లేదనుకున్నారా మీరు..' అని ఒకరెవరో.. 'అమ్మ, నాన్న, ఒక తమిళమ్మాయి' సినిమాలో బండ్ల గణేశ్‌లా ఊగిపోయారు. ('ఆడపిల్లలంటే ఆటబొమ్మల్లా కనబడుతున్నారా మీకు..' అనేది బండ్ల గణేశ్ డైలాగ్ ఆ సినిమాలో). గుడ్ థాట్ అని ఒకరు అన్నారు. అలాగే ఒక సూచన కూడా చేశారు. బొత్తిగా ఒక ఉమన్‌నే కాకుండా, ఎత్నిక్ వేర్, ఆఫీస్ వేర్ ఇలా రకరకాల దుస్తులలో ఉన్న గ్రూప్ ఆఫ్ మహిళల్ని సింబల్‌గా పెడితే బాగుంటుందన్నారు. సునాల్ బాత్రా అనే అమ్మాయి.. 'వావ్! నిద్రలేవగానే ఒక అమేజింగ్ న్యూస్' అని ఎగ్జయిట్ అయింది. 'మోడర్నైజింగా! సిగ్గులేకపోతే సరి. భారతీయ సంప్రదాయాన్ని బ్యాక్‌వర్డ్‌నెస్ అంటున్నారా మీరు!' అని ఇంకొకరు. 'దిస్ ఈజ్ మియర్ టోకెనిజం' అని ఇంకో కామెంట్. 'టోకెనిజం' అంటే ఏమీ చెయ్యకుండానే చేసినట్లు కనిపించే ప్రయత్నం చెయ్యడం. మొత్తం మీద ఈ బొమ్మ మార్పు ఆలోచనను దాదాపుగా ఆడవాళ్లంతా 'ఎక్స్‌లెంట్' అన్నారు. మగవాళ్లంతా 'టైమ్‌కి బండ్లు నడపడం మీద దృష్టి పెట్టండి' అన్నారు. 'మీ డ్యూటీ ఏదో అది సక్రమంగా చెయ్యండి. సామాజిక మార్పు గురించి మీకెందుకు అనడం' ఇది. ఇంట్లో కూడా చూడండి. పిల్లలు ఉత్సాహంగా ఒక కొత్త సామాజికపరమైన ఆలోచనతో ఏదైనా బొమ్మను గీసుకొస్తే.. 'ఈ తెలివితేటలు ఎంసెట్‌లో చూపించు' అనేస్తాం. ఎంసెట్‌లో ర్యాంక్ సాధించడం ఒక్కటే మన ఇంట్లోంచి జరగవలసిన గొప్ప సామాజిక మార్పు అన్నట్లు! కొత్త భావనలకు పాతవి ఎప్పుడూ సహాయ నిరాకరణగానే ఉంటాయి. ఆ మాత్రం ఒరిపిడి లేకుంటే మార్పు పరిపూర్ణం కాదు కూడా.

పెరిగి పెద్దవుతున్నా కూడా సీసా పాలకు ముఖాన్ని తిప్పేసుకుంటూ తల్లిపాలకు మాత్రమే చేతులు చాచడానికి అలవాటు పడ్డ మారాల బిడ్డలా.. స్త్రీ తలకొంగులో మాత్రమే సంప్రదాయాన్ని చూడ్డానికి అలవాటు పడిన జీవనాడులు.. స్త్రీ తలదించుకుని నడవడంలో, తలకొంగు కప్పుకుని మాట్లాడటంలో సంప్రదాయం లేదనీ, స్త్రీని గౌరవించి ఆమెకు ఇవ్వవలసిన స్పేస్‌ని ఆమెకు ఇవ్వడంలో మాత్రమే సంప్రదాయం ఉందనీ గ్రహింపునకు వచ్చేవరకు ఈ ఇనిషియల్ ఘర్షణ ఉండేదే. కాలానికి తగ్గట్టు చూపూ ఉంటే బొట్టుందా, భుజాలపైకి కత్తిరించిన జుట్టుందా అని కళ్లు వెతుక్కోవు. ●






**సంప్రదాయం నుంచి ఆధునిక సంప్రదాయంలోకి :** ముంబై లోకల్ ట్రైన్‌లలోని స్త్రీల చిహ్నాలను పశ్చిమ రైల్వే ఆధునీకరిస్తోంది. బొట్టు, చీరకట్టుతో ఉన్న స్త్రీ చిహ్నాన్ని (సైనేజ్) తొలగించి, ఆ స్థానంలో ఫార్మల్ సూట్‌లో ఉన్న యువతి చిత్రాన్ని (పక్కన) పెయింట్ చేయిస్తోంది.

---

స్త్రీ శక్తి

# నూరేళ్ల నాటి తొలి అడుగు

**ఇది వందేళ్ల నాటి ఒక మహిళ కథ. 1919 ఆగస్టులో పుట్టిన లలిత కథ. కథ మాత్రమే కాదు, ఇప్పటి తరానికి ఆదర్శంగా నిలిచిన వనిత జీవితం. ఇప్పుడు టెన్త్ పూర్తి చేసిన వంద మంది అమ్మాయిల్లో తొంబై మంది ఎంచుకుంటున్న మార్గాన్ని ఆమె వందేళ్ల కిందటే ఎంచుకుంది: ఆమె తనకోసం ఎంచుకోవడమే కాదు ఇప్పటి అమ్మాయిలు ఇంజనీర్‌లు కావడానికి ఒక దారి కూడా వేసింది. ఆమె పేరు లలిత. మనదేశంలో ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకుని ఉద్యోగం చేసిన తొలి మహిళ.**



లలిత

**ల**లిత పేరులో లాలిత్యం ఉంది కానీ ఆమె జీవితం అంత సుకుమారంగా ఏమీ సాగలేదు. వారిది చెన్నైలోని తెలుగు కుటుంబం. శుద్ధసంప్రదాయమైన కుటుంబం కూడా. ఏడుగురిలో ఐదో సంతానం. తండ్రి ఇంజనీర్. కొడుకులను కూడా ఇంజనీరింగ్ చదివించారు. కానీ ఆడపిల్లలను పదో తరగతి దాటనివ్వలేదు. లలితకు పదో తరగతితో చదువు అయిందనిపించి పదిహేనో ఏట పెళ్లి చేశారు. ఆ తరవాత రెండేళ్లకే ఆమె ఓ పాపాయికి తల్లయింది. కొద్ది నెలలకే భర్త పోయాడు. పద్దెనిమిదేళ్లకు వితంతువు అనే ముద్రకు తలవంచాల్సి వచ్చింది. సమాజం వేసిన ముద్ర కంటే కఠినమైన ముద్ర అత్తగారు వేశారు. 'శాపగ్రస్తురాలు' అనే ముద్ర అది! లలిత అనే పేరునే మర్చిపోయారు వాళ్లు.

### నవ సమాజ నిర్మాణం

సమాజంలో వితంతువుకు ఎదురవుతున్న అవమానాలను తుడిచేయాలనుకున్నారు లలిత. 'నేను చదువుకుంటాను' అని పుట్టింటి వాళ్లతో చెప్పారు. తండ్రి ఆమెకు అండగా నిలిచాడు. డాక్టర్ కోర్సు చేయమని సలహా ఇచ్చారామెకి. మహిళలు ఇంజనీరింగ్ రంగంలో అడుగు పెట్టని రోజులవి. లలిత మాత్రం ఒకటే మాట చెప్పారు. 'వివాహిత అలాంటి దుస్తులు ధరించాలి, వితంతువు ఇలాంటి దుస్తులు ధరించాలి... అంటూ మూఢత్వంలో మగ్గిపోతున్న సమాజంలో మార్పు రావాలి. కొత్త సమాజ నిర్మాణం జరగాలి. అది నాతోనే జరుగుతుంది. వితంతువు కూడా ఎవరికీ తీసిపోకుండా రాణిస్తుందని నిరూపిస్తాను' అన్నదామె స్థిరంగా. ''డాక్టర్ అయితే ఏ అర్ధరాత్రో కేసు వస్తే బిడ్డను ఒంటరిగా వదిలి వెళ్లాల్సి వస్తుంది. ఇంజనీర్ ఉద్యోగంలో అలాంటి ఇబ్బంది ఉండదు'' అని తన తల్లిని సమాధాన పరిచింది లలిత.



ఇంజనీరుగా విధి నిర్వహణలో లలిత

### 'షీ' సర్టిఫికేట్‌లు

**ల**లిత తండ్రి సుబ్బారావు చెన్నైలోని గిండిలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజ్‌లో ప్రొఫెసర్. ఆయనే లలితను కాలేజ్ ప్రిన్సిపల్ దగ్గరకు తీసుకెళ్లారు. ఇంజనీరింగ్‌లో చేరుతానని తొలిసారిగా ఒక మహిళ అడ్మిషన్ అడగడం వారికి కూడా ఆశ్చర్యమే. లలితకు సీటివ్వడంతోపాటు ఆమె కోసం హాస్టల్ భవనంలో మార్పులు కూడా చేయించారు ప్రిన్సిపల్. అలా కాలేజ్‌లో చేరారు లలిత. వందలాది మంది యువకుల మధ్య ఒక్క యువతి. కోర్సు పూర్తయిన తర్వాత ఆమెకు సర్టిఫికేట్ ఇచ్చేటప్పుడు మరో ధర్మసంకటం ఎదురైంది. అప్పటి వరకు కాలేజ్ సర్టిఫికేట్ ప్రొఫార్మాలో 'హీ' అని ఉండేది. లలిత కోసం సర్టిఫికేట్‌లలో 'హీ/షీ' అని కొత్తగా ముద్రించారు. లలిత ఇంజనీరింగ్‌లో చేరిన తర్వాత ఏడాది ఆ కాలేజ్ మహిళలకు కూడా ప్రవేశం కల్పిస్తున్నట్లు ప్రకటన జారీ చేసింది. ఆమె ఇంజనీరింగ్ కోర్సులో ఉండగానే ఆ కాలేజ్‌లో మరో ఇద్దరు మహిళలు చేరారు.

### అంతర్జాతీయ సదస్సులకు!

ఇంజనీరింగ్ పట్టా పుచ్చుకున్న తర్వాత లలిత సిమ్లా, కోల్‌కతాలలో ఉద్యోగం చేశారు. తండ్రి పరిశోధనల్లో సహాయం చేశారు. ఆయన జెలోక్టోమోనియమ్ అనే సంగీత పరికరాన్ని, ఎలక్ట్రిక్ ఫ్లేమ్ స్టవ్, పొగరాని స్టవ్‌లను కనిపెట్టారు. ఇంజనీర్‌గా లలిత సాధించిన విజయాలే ఆమెను అంతర్జాతీయ వేదికకు తీసుకెళ్లాయి. అమెరికా, న్యూయార్క్‌లో 1964లో జరిగిన తొలి మహిళా ఇంజనీర్‌లు, సైంటిస్టుల సదస్సుకు ఆమెకు ఆహ్వానం వచ్చింది. యాభై ఐదేళ్లకే తుది శ్వాస వదిలిన లలిత... తన జీవితాన్ని కూతుర్ని పెంచుకోవడానికి, ఇంజనీరింగ్ పరిశోధనలకే అంకితం చేశారు. *(లలిత కూతురు శ్యామల అమెరికాలో స్థిరపడ్డారు. ఆమె తాజాగా ఇండియన్ మీడియాతో పంచుకున్న విషయాలివి)*

– మంజీర

## లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! మీరు మంచి సలహాలు ఇస్తుంటారు కానీ.. బావమరదళ్ల విషయంలో నాకు ఎందుకో నచ్చదు. ఎందుకంటే మాది పెద్దలు కుదిర్చిన బావామరదళ్ల సంబంధమే. మాకు పెళ్లి జరిగి ఏడేళ్లు అవుతోంది. పిల్లలు బాగానే పుట్టారు. ఇద్దరు పిల్లలు. అయితే ఇప్పుడు నా సమస్య ఏంటంటే.. నా బావ (భర్త) వేరే అమ్మాయితో చాట్ చేస్తున్నాడు. ఎవరని అడిగితే ఫ్రెండ్ అంటున్నాడు. నన్ను కాస్త అవాయిడ్ చేస్తున్నాడు. ఏం చేస్తే తను మారతాడో సలహా ఇవ్వండి ప్లీజ్.

– కావ్యలత

నీ పిల్లల విషయంలో చాలా సంతోషం బంగారం!!

కానీ.. కోరికోరి తప్పు చెయ్యకూడదు కదా నాన్నా!!

మేనరికం వల్ల పిల్లల్లో హెల్త్ ప్రాబ్లమ్ వచ్చే అవకాశాలు ఎక్కువని సైన్స్ క్లియర్‌గా చెబుతోంది. అలాంటప్పుడు తప్పు చెయ్యకూడదు కదా చెల్లీ. నువ్వు ఆ విషయంలో అదృష్టవంతురాలివి. నీలాగా చాలామంది ఉన్నారు. కానీ కొందరు.. పిల్లల్ని కని బాధపడుతున్న వారున్నారు. వాళ్లకు మనం ఏం సమాధానం చెబుతాం చెల్లీ!?

*'మరి.. సెకెండ్ విషయం గురించి ఏం చెయ్యాలి సార్?'*

మేనరికం కదా.. పెద్దలు కుదిర్చిన సంబంధమే కదా.. మరి ఆ పెద్దలే యాక్షన్ తీసుకోవాలి. పెద్దలకు చెప్పి మొగుడ్ని మందలించి చూడాలి. నిజంగా తాను వేరే వ్యవహారం చేస్తుంటే కోర్టుకెళ్లి శిక్ష పడేలా చెయ్యాలి.

*'భర్తకు శిక్ష వేయించి పిల్లలకు నాన్న లేకుండా చెయ్యాలా సార్? ఇదేం న్యాయం సార్??'*

వాడు చేస్తున్నది న్యాయమా? పిల్లల్ని అడ్డు పెట్టుకుని..?? ''ఆ!! ఏం చేస్తుందిలే'' అని పెంట పనులు చేస్తే నా చెల్లి జీవితం ఏం కావాలి? మారితే నా చెల్లెలికి ఓకే అవ్వచ్చు. నాకైతే ఓకే కాదు నీలూ!

*'కానీ కొంచెం సద్దుబాటు ధోరణిలో కాపురం కాపాడుకోవాలి కదా సార్?'*

ఏంటి నీలూ! నువ్వు కూడా..? ఆడపిల్లలు అలా ఆలోచిస్తే ఇక బ్యాడ్ మొగుళ్లు రెచ్చిపోరా..? భార్య అఫైర్ చేస్తే మొగుళ్లు ఊరుకుంటారా? రచ్చ చేసి.. బజారుకు ఈడ్చి.. అమ్మాయి లైఫ్ ఖతం చెయ్యరా???

*'శాంతించండి సార్!! కావ్యలతా! విన్నావుగా!? విషయం తెలుసుకుని, ముందు తనతో సీరియస్‌గా మాట్లాడు. లేకపోతే పెద్దలను ఇన్వాల్వ్ చెయ్యి. నువ్వు నిస్సహాయురాలివని మాత్రం ఫీలై, అలా వదిలెయ్యొద్దు. గాడ్ బ్లెస్ యూ!!'*

lovedoctorram@sakshi.com

## కాసుకో సుడోకు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 9 | | 7 | 4 | 3 | 5 | | |
| | | 3 | 1 | 2 | | | | |
| | 7 | 4 | | | | | 3 | |
| | 1 | | 5 | | | 8 | | 7 |
| | 3 | 5 | 4 | | 1 | 6 | 9 | |
| 6 | | 8 | | | 2 | | 1 | |
| | 2 | | | | | 7 | 8 | |
| | | | | 1 | 8 | 4 | | |
| | | 6 | 2 | 9 | 7 | | 5 | 3 |

**నిబంధనలు:**
ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 9 | 4 | 5 | 6 | 1 | 8 | 7 | 3 |
| 5 | 6 | 8 | 4 | 3 | 7 | 2 | 1 | 9 |
| 1 | 3 | 7 | 9 | 8 | 2 | 5 | 6 | 4 |
| 8 | 7 | 9 | 2 | 4 | 3 | 1 | 5 | 6 |
| 4 | 5 | 2 | 6 | 1 | 8 | 3 | 9 | 7 |
| 3 | 1 | 6 | 7 | 5 | 9 | 4 | 2 | 8 |
| 9 | 4 | 5 | 8 | 2 | 6 | 7 | 3 | 1 |
| 7 | 2 | 3 | 1 | 9 | 4 | 6 | 8 | 5 |
| 6 | 8 | 1 | 3 | 7 | 5 | 9 | 4 | 2 |

# జూలైలో జాయినింగ్



● వరుణ్‌తేజ్

**వా**ల్మీకి సెట్లో హీరోయిన్ లేకుండా వరుణ్ తేజ్ షూటింగ్ చేస్తున్నారు. ఈ వాల్మీకి జోడీ జూలైలో ఎంట్రీ ఇస్తారని లేటెస్ట్‌గా తెలిసింది. హరీష్ శంకర్ దర్శకత్వంలో వరుణ్ తేజ్ హీరోగా 'వాల్మీకి' అనే చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. పూజాహెగ్డే కథానాయిక. తమిళ నటుడు అధర్వ మురళి కీలక పాత్రలో నటిస్తారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ చిత్రం తమిళ సూపర్‌హిట్ 'జిగర్‌దండ' సినిమాకి రీమేక్. ఇందులో వరుణ్ తేజ్ తొలిసారి నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో జరుగుతోందట. జూలై నుంచి 'వాల్మీకి' టీమ్‌లో జాయిన్ అవుతారట పూజా హెగ్డే. మరోవైపు ఈ సినిమాను సెప్టెంబర్ 6న రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



● పూజా హెగ్డే

# చాణక్య వ్యూహం

**అ**వును.. తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి వ్యూహాలు పన్నుతున్నారు గోపీచంద్. మరి.. ఈ వ్యూహాలు ఎంత వరకు సఫలం అయ్యాయి? అతనికి ఎదురైన అడ్డంకులు ఏంటి? అనే ఆసక్తికర అంశాలు ప్రస్తుతానికి సస్పెన్స్. గోపీచంద్ హీరోగా తిరు దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. ఈ చిత్రానికి 'చాణక్య' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో మెహరీన్, జరీనా ఖాన్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఎ.కె.ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. ఈ సినిమా టైటిల్ లోగోను దర్శక–నిర్మాతలు ఆదివారం ఆవిష్కరించారు. ''యాభై శాతానికి పైగా చిత్రీకరణ ముగిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. త్వరలోనే ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: అజయ్ సుంకర, అభిషేక్ అగర్వాల్, సంగీతం: విశాల్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికపాటి, మాటల రచయిత: అబ్బూరి రవి.



● గోపీచంద్

# ఆ రెండూ హైలైట్

-జీవితారాజశేఖర్



● ప్రశాంత్ వర్మ, సి. కల్యాణ్, జీవితారాజశేఖర్

'**పీ**ఎస్వీ గరుడవేగ 126.18ఎమ్' వంటి విజయవంతమైన చిత్రం తర్వాత రాజశేఖర్ హీరోగా నటించిన చిత్రం 'కల్కి'. 'అ!' ఫేమ్ ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆదాశర్మ, నందితా శ్వేత, పూజితా పొన్నాడ, స్కార్లెట్ విల్సన్ కథానాయికలుగా నటించారు. శివానీ శివాత్మిక సమర్పణలో హ్యాపీ మూవీస్ పతాకంపై సి. కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా జీవితారాజశేఖర్ మాట్లాడుతూ– ''డిఫరెంట్ మాస్ ఎంటర్‌టైనర్ కల్కి. ఆల్రెడీ విడుదల చేసిన కమర్షియల్ ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తోంది. కొత్త తరహాలో కమర్షియల్ అంశాలు మేళవించి ప్రశాంత్ వర్మ బాగా తీశారు. కథ, ప్రశాంత్ డైరెక్షన్ సినిమాకు హైలైట్‌గా ఉంటాయి. తప్పకుండా మా చిత్రం ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు. ''పక్కా కమర్షియల్ చిత్రమిది. ఇప్పటికే విడుదల చేసిన కమర్షియల్ ట్రైలర్, టీజర్‌కు ఎంతమంచి స్పందన వస్తోందో సినిమా విడుదల అయిన తర్వాత కూడా అంతే స్పందన వస్తుందన్న నమ్మకం ఉంది. శ్రవణ్ భరద్వాజ్ అద్భుతమైన సంగీతం అందించారు. త్వరలోనే పాటల్ని విడుదల చేసి, ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహిస్తాం'' అన్నారు సి. కల్యాణ్. ''ఇండియా–పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ ఎంత ఉత్కంఠగా సాగుతుందో ఈ సినిమా కూడా ప్రేక్షకులకు అంత ఉత్కంఠను రేకెత్తిస్తుంది. కల్యాణ్ గారు ఖర్చుకు వెనకాడకుండా 'కల్కి' నిర్మించారు'' అన్నారు దర్శకుడు ప్రశాంత్ వర్మ. నాజర్, అశుతోష్ రాణా, రాహుల్ రామకృష్ణ, సిద్ధూ జొన్నలగడ్డ తదితరులు ఇతర పాత్రల్లో నటించారు.

# మళ్లీ మళ్లీ భయపెడతా



● తమన్నా

**మి**ల్కీ బ్యూటీ తమన్నా హారర్ సినిమాల మీదే ఎక్కువ దృష్టి పెట్టినట్టున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న సినిమాలు, ఇటీవల రిలీజ్ అయిన సినిమాలను గమనిస్తే ప్రేక్షకులను భయపెట్టే హారర్ మూడ్‌లోనే తమన్నా ఉన్నట్టు అనిపిస్తోంది. గత వారంలో 'దేవి 2' చిత్రంతో తమిళ్, తెలుగు ప్రేక్షకులను భయపెట్టిన ఆమె వచ్చే వారం 'కామోషి' అనే హిందీ సినిమాతో బాలీవుడ్ ప్రేక్షకులనూ భయపెట్టనున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న మరో తమిళ సినిమా కూడా హారర్ చిత్రమే. విశేషమేటంటే ఆ సినిమా తాప్సీ నటించిన 'ఆనందో బ్రహ్మ' చిత్రానికి రీమేక్ అని తెలిసింది. రోహన్ వెంకటేశన్ అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సింగిల్ షెడ్యూల్‌లో ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేయనున్నారట.

# మీ ప్రేమాభిమానాలు ఇంకా బాగున్నాయి

- ఉపేంద్ర



● కిరణ్ తోటంబైల్, సోను గౌడ, ఉపేంద్ర, ఆర్. చంద్రు

''**వి**శాఖపట్టణం అందమైన ప్రదేశం. ఇక్కడికి వచ్చాక థ్రిల్లయ్యా. ఇక్కడి ప్రజలు అదృష్టవంతులు. శని, ఆదివారాలు బీచ్‌లో ఎంజాయ్ చేయవచ్చు. ఈ వాతావరణం చాలా బాగుంది. అంతకు మించి మీ ప్రేమాభిమానాలు ఇంకా బాగున్నాయి'' అని ఉపేంద్ర అన్నారు. ఆయన హీరోగా తెరకెక్కిన తాజా చిత్రం 'ఐ లవ్ యు'. 'నన్నే ప్రేమించు' అన్నది ఉపశీర్షిక. రచిత రామ్ హీరోయిన్‌గా నటించారు. 'కృష్ణమ్మ కలిపింది ఇద్దరినీ' తో టాలీవుడ్‌కి దర్శకుడిగా పరిచయం అయిన ఆర్. చంద్రు శ్రీ సిద్ధేశ్వరా ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలకానుంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో నిర్వహించిన 'ఐ లవ్ యు' సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో ఉపేంద్ర మాట్లాడుతూ– ''చంద్రుగారితో ఇది నా రెండో సినిమా. 'రా' చిత్రంలాగా ఉంటుంది. క్లయిమాక్స్‌కి వచ్చేసరికి ఇది మహిళల సినిమా అవుతుంది. ప్రేమ అంటే ఏంటి? నిజమైన ప్రేమను ఎలా చూపించాలి? అనే చక్కటి సందేశంతో చేసిన చిత్రమిది. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్, యాక్షన్, పంచ్ డైలాగ్స్ ఉంటాయి. తప్పకుండా భార్యాభర్తలు చూడాల్సిన చిత్రమిది'' అన్నారు. ఆర్. చంద్రు మాట్లాడుతూ– ''విశాఖపట్టణానికి నేను రావడం ఇది రెండోసారి. గంటా శ్రీనివాసరావుగారు వాళ్లబ్బాయి రవితో సినిమా చేయాలనడంతో తొలిసారి వచ్చాను. మలయాళ 'ప్రేమమ్' రీమేక్ చేద్దామనుకున్నాం, కానీ, కుదరలేదు. భవిష్యత్తులో తప్పకుండా రవితో సినిమా చేస్తాను. ఉప్పీసార్‌తో 'బ్రహ్మ' చేశాను. ఇప్పుడు 'ఐ లవ్ యు' రెండో సినిమా. 'ఐ లవ్ యు' ఎక్కడ.. ఎవరికి... ఎలా... చెప్పాలనే సందేశంతో రూపొందించిన చిత్రమిది. ఉపేంద్రగారితో మళ్లీ మళ్లీ సినిమా చేయాలనిపిస్తుంది. కుదిరితే ఏడాదికి ఒకసారి లేదా రెండేళ్లకు ఒకసారి సినిమా చేయాలనుకుంటున్నా'' అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ డా. కిరణ్ తోటంబైల్, నటి సోను గౌడ, కెజిహెచ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. అర్జున పాల్గొన్నారు.

# కథ బాగుంటే రిలీజ్ అవుతుంది



● నరేశ్ కుమార్, మంజునాథ్, కశిష్ ఓహ్రా,చేతన్

**చే**తన్ మద్దినేని, కశిష్ ఓహ్రా జంటగా నరేశ్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫస్ట్ ర్యాంక్ రాజు'. మంజునాథ్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఈ నెల 21న విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ– ''ఇప్పటికే విడుదలైన మా సినిమా టీజర్, పాటలకు మంచి స్పందన లభిస్తోంది. ఇదే విధంగా సినిమాని కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని నమ్మకంగా ఉన్నాం'' అన్నారు. ''నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన మా నిర్మాతకు థ్యాంక్స్. చదువు 100 శాతం, బుద్ధి సున్నాగా ఉన్న వ్యక్తి జీవితంలో ఎదురైన సమస్యలు, వాటిని తను పరిష్కరించుకున్నదే ఈ చిత్ర కథ. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తెరకెక్కించాం'' అన్నారు దర్శకుడు నరేశ్. ''నేనూ ఒకప్పుడు ఫస్ట్‌ర్యాంక్ స్టూడెంట్‌నే. చిన్న సినిమాలు రిలీజ్ కావు అన్నది పెద్ద ట్రాష్. కంటెంట్ బావుంటే తప్పకుండా రిలీజ్ అవుతాయి. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ సంస్థ రిలీజ్ చేస్తోంది. ఫస్ట్ నుండి మాకు సపోర్ట్ అందిస్తున్న డైరెక్టర్ మారుతిగారికి థ్యాంక్స్'' అన్నారు చేతన్. ''సినిమా ప్రేక్షకుల్ని కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తుంది'' అన్నారు కశిష్ ఓహ్రా.



● రణ్‌వీర్, దీపిక

## మూడోసారి

**బా**లీవుడ్ యంగ్ కపుల్ రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్‌లను ఫ్యాన్స్ ముద్దుగా దీప్‌వీర్ అని పిలుస్తారనే సంగతి తెలిసిందే. వివాహం తర్వాత తొలిసారి వీరిద్దరూ స్క్రీన్ మీద కనిపించబోతున్నారని తెలిసింది. 1983 క్రికెట్ ప్రపంచకప్ ఆధారంగా తెరకెక్కుతున్న '83' చిత్రంలో కపిల్ దేవ్ పాత్రను రణ్‌వీర్ చేస్తున్నారు. ఇందులో కపిల్ భార్య రోమి దేవి పాత్రలో దీపిక నటిస్తారని టాక్. కబీర్ ఖాన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల కానుంది. గతంలో రణ్‌వీర్, దీపిక 'రామ్‌లీలా, పద్మావత్' సినిమాల్లో కలిసి నటించిన సంగతి తెలిసిందే. సో.. ముచ్చటగా మూడోసారి జోడీ కడుతున్నారన్నమాట.



● అనుష్కా శర్మ

## కోలీవుడ్ కాలింగ్

**కో**లీవుడ్ నుంచి ఈ మధ్య బాలీవుడ్ భామలకు కబురు వెళుతోంది. ఆల్రెడీ ఆ కబురు అందుకున్న కంగనా రనౌత్ జయలలిత జీవితం ఆధారంగా రూపొందనున్న తమిళ సినిమాకి సైన్ చేశారు. ఇప్పుడు అనుష్కా శర్మకు తమిళ పరిశ్రమ నుంచి కబురు వెళ్లిందట. అది కూడా హిందీలో అనుష్కా శర్మ నటించిన 'పరీ' తమిళ రీమేక్‌లో ఆమెనే నటించమని ఓ నిర్మాత ఆఫర్ ఇచ్చారట. హిందీ 'పరీ'కి అనుష్కా శర్మ ఓ నిర్మాతగా కూడా వ్యవహరించారు. గత ఏడాది మార్చిలో విడుదలైన ఈ సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ మూవీ అని కొందరు అభినందించారు, మరికొందరు 'అంత బాగా లేదు' అన్నారు. అనుష్కా శర్మ నటనకు అందరూ మంచి మార్కులు వేశారు. ఈ సినిమాని ఎంతో ఇష్టపడ్డారు కాబట్టే అనుష్క నిర్మించారు కూడా. మరి అంతగా ఇష్టపడ్డారు కాబట్టి తమిళ రీమేక్‌లో ఆమె నటిస్తారా? వేచి చూడాలి.



● సుమయ

## అందమైన ప్రేమకథ

**రా**మ్ ప్రణీత్, సుమయ జంటగా నిఖిలేష్ తొగరి దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'ప్రేమజంట'. సన్ వుడ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై మహేష్ మొగుళ్లూరి నిర్మించారు. ఈ సినిమాని స్క్రీన్ మ్యాక్స్ పిక్చర్స్ పతాకంపై దగ్గుబాటి వరుణ్ ఈ నెల 28న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేష్ మొగుళ్లూరి మాట్లాడుతూ– ''తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. రామ్ ప్రణీత్, సుమయ జోడి అందంగా ఉంటుంది. నిఖిలేష్ తొగరి ఈ సినిమాను బ్యూటిఫుల్‌గా తెరకెక్కించారు. సినిమాలో 5 పాటలున్నాయి. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఇటీవల విడుదలైన పాటలకు మంచి స్పందన వస్తోంది. సెన్సార్ నుంచి 'యు/ఎ' సర్టిఫికెట్ వచ్చింది. సినిమా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది''అన్నారు. ''అందమైన ప్రేమకథ ఇది. మహేష్‌గారి సహకారంతో అనుకున్న టైమ్‌కి పూర్తి చేశాం. ఔట్‌పుట్ బాగా వచ్చింది. ఈ చిత్రానికి సంగీతం కూడా అందించాను. రామ్ ప్రణీత్ , సుమయలకు తొలిచిత్రమే అయినా ఎంతో సహజంగా నటించారు. దక్షిణ కాశీగా పేరు పొందిన ఆదిలాబాద్, ప్రకాశం జిల్లా పరిసర ప్రాంతాల్లో ఎక్కువ భాగం ఈ సినిమా చిత్రీకరించాం'' అని నిఖిలేష్ తొగరి అన్నారు.







పరిచయం శ్రీలక్ష్మిరెడ్డి, సోషల్ వర్కర్



'ఎలా ఉన్నావ్..'
అని అడుగుతాం ఆత్మీయులు ఎదురైతే.
శ్రీలక్ష్మి అడగరు... చూస్తారు.
ఎలా ఉన్నారో ఆమెకు తెలిసిపోతుంది!
డాక్టర్‌లు స్టెతస్కోప్ పెట్టి కనిపెడతారు.
డాక్టరు కాని శ్రీలక్ష్మి మనసు పెట్టి గ్రహిస్తారు.
అభాగ్యులకు ఆరోగ్య భాగ్యాన్ని కలిగిస్తారు.
అందుకే ఆమెకు శ్రీలక్ష్మి కాదు...
ఆరోగ్యశ్రీలక్ష్మి అన్నదే తగిన పేరు.

# ఆరోగ్య శ్రీ లక్ష్మి

దాసరి శ్రీలక్ష్మీరెడ్డి పుట్టింది, పెరిగింది నెల్లూరు జిల్లా, ఆత్మకూరులో. పెళ్లితో ఖమ్మం జిల్లా కోడలయ్యారామె. పిల్లల చదువు కోసం 1997లో హైదరాబాద్‌కి రావడం ఆమె జీవితంలో పెద్ద టర్నింగ్ పాయింట్. అప్పటి వరకు ఆమె సాధారణ మైన గృహిణి, రుద్రాక్షపల్లిలోని పెద్ద భూస్వామి కుటుంబం కోడలు. ఇదే ఆమె గుర్తింపు. భర్త, ముగ్గురు పిల్లలతో ఇల్లే ప్రపంచంగా గడిచిపో యింది. కుటుంబం హైదరాబాద్ రావడంతో ఆమెలో ఉన్న సోషల్ వర్కర్ బయటికొచ్చింది. హైద రాబాద్‌లోని రామకృష్ణ మఠం ఆమెను సమాజం కోసం పనిచేసేలా తీర్చిదిద్దింది. సామాజిక కార్యక ర్తగా మలిచింది. పేదరికం కారణంగా ఎవరూ వైద్యా నికి దూరం కాకూడదని నమ్ముతారామె. అనారో గ్యాలు మనిషి ఆర్థిక పరిస్థితులను చూసి ఆగిపోవు. డబ్బు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేరని... జబ్బులు దరిచేరకుండా ఉండవు. అందుకే ఆరోగ్యం అందించడానికి ఎక్కువగా కృషి చేశారు శ్రీలక్ష్మి. అన్ని అనారోగ్యాల కంటే కంటి చూపు దెబ్బతినడం నిజంగా శాపమే. అందుకే దృష్టిలోపం ఉన్న పేదవా ళ్లకు మెరుగైన కంటి చికిత్సను అందించడం మొదలు పెట్టారు. అలా దోమల్‌గూడలోని సాధూరామ్ కంటి ఆసుపత్రి సేవను నిరుపేద కాలనీలకు చేర్చడానికి వారధి అయ్యారు శ్రీలక్ష్మి. డాక్టర్ల సహకారంతో వారాంతాల్లో కాలనీల్లో హెల్త్‌క్యాంపులు పెట్టించారు. పేషెంట్ మందులు, కళ్లద్దాలకు అయ్యే ఖర్చును ఇప్పటికీ ఆమే పెట్టుకుంటున్నారు. ఆపరేషన్ అవస రమైన వాళ్లను హాస్పిటల్‌కి తీసుకెళ్లి వైద్యం చేయించే వరకు ఆ పేషెంట్ బాధ్యత ఆమెదే. కాలనీలో మెడి కల్ క్యాంపులో ఉచితంగా సర్వీస్ ఇవ్వడానికి డాక్టర్లు సంతోషంగా అంగీకరించేవారు, కానీ కాలనీవాసు లను వైద్య పరీక్షకు తీసుకురావడమే పెద్ద సవాల్‌గా ఉండేదని అన్నారు శ్రీలక్ష్మి.

## నా గుర్తింపు నేనే

''నన్ను నేను... ఫలానా ఇంటి ఆడపడుచుని, ఫలానా ఇంటి కోడలిని, ఫలానా లాయర్ భార్యని అని, కలె క్టర్ తల్లి, డాక్టర్ తల్లి... అని పరిచయం చేసుకోవడం సంతోషంగా ఉంటుంది. అలాగని ఆ గుర్తింపుల దగ్గరే ఆగిపోకూడదని కూడా అనుకున్నాను. నా గుర్తింపును నేనే అవాలని నా కోరిక. అందుకు రామకృష్ణ మఠం నాకు ఒక మార్గాన్ని చూపించింది. ఆ దారిలో నాకు చేత నైనంతగా సహాయం చేస్తున్నాను. దోమల్‌గూడ, మహబూబ్‌నగర్, కొడం గల్, కోస్గి, రావులపల్లి, కరీంనగర్‌లో సర్వీస్ చేశాను. నేను కనిపించగానే 'లక్ష్మక్కా!' అని నోరారా పిలిచి వాళ్ల బాధలు చెప్పుకుంటారు. మొదట్లో వైద్య శిబిరాలకే పరిమితమయ్యాను. కానీ కాలనీల్లో తిరుగుతున్నప్పుడు వాళ్ల ఎదుర్కొనే అనేక సామాజిక సమస్యలు కూడా తెలిశాయి. అందుకో సమే నేను నడుపుతున్న 'శ్రీలక్ష్మి స్కూల్ ఆఫ్ సోషల్ వర్క్' ఆఫీస్‌లో న్యాయస లహా విభాగం కూడా ఏర్పాటు చేశాను. 'మహిళా సమస్యలు, మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు– చైతన్యం' కూడా నా సర్వీస్‌లో భాగమయ్యాయి.

**అత్తగారి వర్ధంతికి పేదవారుండే కాలనీల్లో చీరల పంపిణీ, మామగారి పేరు మీద ఆయన వర్ధంతి రోజున సొంతూరు రుద్రాక్షపల్లిలో రాష్ట్ర స్థాయి ఆటల పోటీలు నిర్వహించడం శ్రీలక్ష్మికి ఇష్టమైన వ్యాపకాలు. "ఇన్నేళ్లుగా నేను ఇన్ని పనులు చేయగలుగుతున్నానంటే నాలో పని చేయాలనే తపన ఉండడం, ఇంత ఖర్చు ఎందుకు అనకుండా మా వారు డబ్బి వ్వడమే" నంటారామె నవ్వుతూ. పెద్ద కొబ్బరి బోండాలు పండించినందుకు హార్టికల్చర్ శాఖ నుంచి ఉత్తమ వ్యవసాయ దారుల అవార్డు భర్తతో కలిసి అందుకున్నారు శ్రీలక్ష్మి. వర్మీ కంపోస్టు తయారీ, వేస్ట్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో సర్వీ స్‌కి రాష్ట్రపతి అవార్డు, రామకృష్ణమఠం ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డు, సిటీ సెంట్రల్ లైబ్రరీలో ముగ్గుకి ఫస్ట్ ప్రైజ్ (గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఫొటోలు, మధ్యలో వైఎస్ఆర్ ఫొటోతో వేసిన థీమ్ ముగ్గు) అందుకోవడం శ్రీలక్ష్మికి అమూల్య మైన సందర్భాలు.**



## ఖైదీలకు వైద్యం

అల్పాదాయ వర్గాల కాలనీల్లో పని చేయడం ఒక ఎత్తయితే చంచల్‌గూడ జైలు ఖైదీలకు వైద్య సహాయం చేయడం మరో ఎత్తు. శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు వైద్యపరీక్షలు చేయించడానికి జైలు అధికా రులు అనుమతిచ్చారు. డాక్టర్ల బృందంతో జైల్లో పరీ క్షలు నిర్వహించాం. అయితే సమస్య అంతా... వాళ్లకు ఆపరేషన్‌లు చేయించడం దగ్గర మొదలైంది. అప్పటి వరకు పేదవాళ్లకు సాధూరామ్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించేదాన్ని. ఖైదీలను బయటి హాస్పిట ల్‌కు తీసుకెళ్లడానికి వీల్లేదు, ప్రభుత్వ వైద్యశాలలోనే చేయించాలని తెలిసింది. ఖైదీలకు కంటి ఆపరేషన్‌లు చేయడానికి సరోజినీదేవి ప్రభుత్వ కంటి ఆసుపత్రి వైద్య అధికారులు తేదీలు ఖరారు చేశారు. అయితే వాళ్లను జైలు నుంచి బయటికి పంపించడానికి నిబం ధనలు చాలా పటిష్టంగా ఉంటాయి. హోమ్ మంత్రిని కలిసి అనుమతి తీసుకోవాల్సి వచ్చింది. అది కూడా 'ఆపరేషన్ తర్వాత జైలుకి తరలించే వరకు బాధ్యత వహిస్తానని, ఆ ఖైదీల్లో ఎవరైనా పారిపోతే నాదే పూచీకత్తు' అని రాసి సంతకం చేసిన తర్వాత పంపించారు. ఖైదీలకు వైద్యం కోసం ఇంత రిస్క్ చేశానని తెలిసి 'ముందు వెనుక ఆలోచించ కుండా చేస్తూ పోవడమేనా' అని మావాళ్లు కోప్ప డ్డారు.

## మనమే దారి చూపించాలి

హైదరాబాద్‌కి వచ్చిన తర్వాత దాదాపుగా కొత్త ప్రపంచాన్ని చూశాననే చెప్పాలి. 'ట్రైనింగ్' అనే ప్రక టన కనిపిస్తే చాలు.. వెళ్లిపోయేదాన్ని. ఫినాయిల్, సోప్ ఆయిల్, ఇతర క్లీనింగ్ మెటీరియల్ తయారీతో పాటు బ్యూటీషియన్ కోర్సు, చిప్స్ తయారీ, క్యాండిల్ మేకింగ్, కంప్యూటర్ కోర్సు కూడా చేశాను. నేను నేర్చుకున్నవన్నీ పేద మహిళలకు నేర్పిస్తు న్నాను. భర్త తాగుడుకు బానిసయ్యి, పిల్లలను పోషిం చలేక ఆత్మహత్యకు పాల్పడే వాళ్లను చూసినప్పుడు మనసు పిండేసినట్లయ్యేది. 'మనిషిలో జీవనో త్సాహం ఉండాలి. మరణం దేనికీ సమాధానం కాదు'... ఈ మాట చెప్పడానికే 'వై వియ్ డై... హౌ వియ్ లివ్' అని కౌన్సెలింగ్ కూడా మొదలు పెట్టాను. అయితే... చనిపోవాలనుకునే వాళ్లకు బతుకు మీద ఆశ కలిగించడంతో మన బాధ్యత తీరి పోదు, వాళ్లకు బతకడానికి ఒక దారి చూపించగలిగి తేనే ఒక జీవితాన్ని కాపాడిన వాళ్లమవుతాం. నిజా నికి బతకడానికి దారి తెలిస్తే ఎవరూ చనిపోవాలను కోరు కూడా. అందుకే ఆ మహిళలకు నేను నేర్చు కున్న స్కిల్స్‌లో శిక్షణ ఇస్తున్నాను. కుటీర పరిశ్రమ ఏర్పాటు చేయించడంతోపాటు, ఆ మహిళలు తయారు చేసిన ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ వంటి వాటిని మార్కెట్ చేయడానికి హాస్పిటళ్లతో మాట్లా డడం కూడా నేనే. నా భర్త స్నేహితుల్లో చాలామంది డాక్టర్లు ఉండడం నాకు బాగా ఉపయోగపడింది. మహిళా ఖైదీలకు కూడా కుటీర పరిశ్రమ నిర్వహ ణకు అవసమైన స్కిల్ ట్రైనింగ్ ఇచ్చాను. కార్పెంటరీ, స్వెటర్ అల్లకంలో కూడా శిక్షణ ఇప్పించాం. ఐఏఎస్ ఆఫీసర్ రామలక్ష్మిగారి సహాయంతో ఆ మహిళా ఖైదీ లకు లోన్‌లు ఇప్పించాను. సమాజం కోసం చేసిన ప్రతి పనిలోనూ నేను ఆనందాన్ని ఆస్వాదించాను. అయితే బెగ్గర్స్ రీహాబిలిటేషన్ చేసేటప్పుడు ఒక్కో సారి సహనానికి పరీక్షగా ఉండేది. వాళ్లకు హోమ్‌లో షెల్టర్ ఇచ్చి తిండి, దుస్తులు ఇస్తుంటే... వాళ్ల మాత్రం గంజాయి ఇప్పించమని ఒకరు, సిగరెట్ లేక పోతే ఉండలేమని కొందరు సతాయించేవాళ్లు.

## నా కూతురు చెప్పిన మాట

సోషల్ లైఫ్‌లో ఎదురయ్యే అనేకానేక పురస్కా రాలు, తిరస్కారాల గురించి మా అమ్మాయి ఒకటే మాట చెప్తుండేది. 'ఎవరైనా సరే... తమకు ప్రత్యే కంగా గుర్తింపు రావాలని కోరుకుంటే చాలదు. ఆ వ్యక్తి ఆ గౌరవానికి తగిన వ్యక్తి అని ఎదుటి వాళ్లకు అనిపించాలి. అదే అసలైన గుర్తింపు' అని, డిజర్వ్‌కీ డిజైర్‌కీ మధ్య తేడా తెలుసుకోవాలని చెప్తుంటుంది. నేను పెంచిన పాపాయి.. ఇంత పరిణతితో మాట్లా డుతుంటే నా పెంపకంలో ఇంతటి సంస్కారంతో పెరిగిందా లేక తను నేర్చుకున్న మంచి భావాలతో తనే నన్ను తీర్చిదిద్దుతోందా అనిపిస్తుంటుంది. మనం వేదిక మీద ఒక పురస్కారాన్ని అందుకుంటు న్నప్పుడు ప్రేక్షకులు మనసులో ''అవును, ఈమె చాలా సేవ చేసింది. ఫలానా చోట ఫలానా సర్వీస్ చేయడం మాకు తెలుసు'' అనుకోవాలి. అదే అసలైన గౌరవం. అవార్డులు అందుకుంటున్నప్పుడు నాకు మా అమ్మాయి చెప్పిన మాట గుర్తుకు వస్తుండేది. ప్రతి పురస్కారమూ ఎంతో కొంత సంతోషాన్నిచ్చి తీరుతుంది. ఆ జ్ఞాపికను చూసినప్పుడు దాని వెనుక ఉన్న నా శ్రమ గుర్తుకు వస్తుంటుంది. అన్నింటికంటే ఎక్కువ సంతోషాన్నిచ్చింది మాత్రం వైఎస్ఆర్ చేతుల మీద పురస్కారం అందుకోవడమే. అది కూడా ఎంత కాకతాళీయంగా జరిగిందంటే... రవీం ద్రభారతిలో ఉగాది పురస్కారాల ప్రదానం జరుగు తోంది. నన్ను ఉత్తమ సోషల్ వర్క్ అవార్డుకు ఎంపిక చేశారు. నేను వెళ్లడం కొంచెం ఆలస్యమైంది. వైఎస్ ఆర్ గారు రావడం కూడా ఆలస్యం కావడంతో కార్య క్రమం సమయానికి జరగాలనే ఉద్దేశంతో మంత్రుల చేతుల మీదుగా మొదలు పెట్టమని చెప్పార్ట వైఎస్ఆర్. నేను అవార్డు అందుకోవడానికి వేదిక మీదకు వెళ్లేటప్పటికి ఆయన కూడా వచ్చేశారు. ఆయనంటే నాకు పిచ్చి అభిమానం. ఆయన చేతుల మీద అవార్డు అందుకునే అదృష్టం ఉండడంతోనే నేను కార్యక్రమానికి ఆలస్యమైనట్లున్నాను. ఆయన నన్ను చూసి 'ఇక్కడ కూడా ఉన్నావా. ఎప్పుడూ ఏదో ఒక పని చేస్తూనే ఉంటావా పిచ్చితల్లీ' అని నవ్వారు. అంతకు ముందు నేను చాలాసార్లు భర్త చేతిలో మోసపోయిన అమ్మాయిలకు న్యాయం చేయమని ఆయన దగ్గరకు తీసుకెళ్లాను. వైఎస్ ఆర్ ఆ మహిళలతో మాట్లాడి 'కేసు డీల్ చేయమని సబిత మ్మకు రాస్తున్నాను. వీళ్లను సబితమ్మ దగ్గ రకు తీసుకెళ్లు' అని పంపించేవారు. అందుకే ఆయన నన్ను అవార్డుల వేదిక మీద చూడ గానే ఆ మాట న్నారు. అప్పుడు నేను 'నాకు స్ఫూర్తి మీరే, మీరు చేసి నంత చేయలేను, కానీ నేను చేయగలి గినంత చేస్తాను' అని చెప్పాను. అప్పుడు తీసిన ఈ ఫొటో చూసుకుంటే ఆయన మాటలు ఇప్పుడు వింటున్నట్లే ఉంటుంది'' అంటూ వైఎస్ఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఫొటో చూపిస్తూ ఉద్వేగానికి లోనయ్యారు శ్రీలక్ష్మి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: కె. రమేశ్ బాబు

## పరి పరిశోధన

### ఆ పదార్థంతో 30 రకాల కేన్సర్ల గుర్తింపు

ప్రాణాంతకమైన కేన్సర్ వ్యాధిని గుర్తించేం దుకు శాస్త్రవేత్తలు నిరపాయకరమైన కొత్త పద్ధతిని కనుక్కున్నారు. 68జీఏ –ఫాపీ అనే రేడియోధార్మిక పదార్థాన్ని శరీరంలోకి పంపించిన తరువాత పెట్/సీటీ స్కాన్ల ద్వారా దాదాపు 30 రకాల కేన్సర్లను గుర్తిం చవచ్చునని వీరు అంటున్నారు. ద జర్నల్ ఆఫ్ న్యూక్లియర్ మెడిసిన్ తాజా సంచికలో ప్రచురితమైన వివరాల ప్రకారం.. ఈ పదా ర్థాన్ని వాడటం శరీరానికి ఏమాత్రం హాని కలిగించదు. కేన్సర్ కణితుల్లో 90 శాతం వరకూ ఉండే ఫైబ్రో బ్లాస్ట్‌లను గుర్తించడం ద్వారా ఈ కొత్త పద్ధతి పనిచేస్తుంది. సాధా రణ ఫైబ్రోబ్లాస్ట్‌కు, కేన్సర్ కణితి ఫైబ్రోబ్లా



స్ట్‌కు మధ్య ఎంతో వ్యత్యాసం ఉంటుందని ఫైబ్రోబ్లాస్ట్ ఆక్టివేషన్ ప్రొటీన్ ప్రత్యేకత దీనికి కారణమని ఈ పరిశోధనల్లో పాల్గొన్న జర్మన్ శాస్త్రవేత్త హెబర్‌కార్న్ తెలిపారు. ఈ పద్ధతిని తాము 28 వేర్వేరు కేన్సర్లు ఉన్న 80 మంది రోగులపై పరీక్షించామని సత్ఫలి తాలు సాధించామని ఆయన తెలిపారు. అయితే 68జీఏ –ఫాపీతో తీసిన చిత్రాలు వ్యాధి దశకు అనుగుణంగా ఉన్న నేప థ్యంలో ఈ పద్ధతిని అటు వ్యాధి నిర్ధారణ తోపాటు చికిత్స పద్ధతులను సిద్ధం చేసేం దుకూ సమర్థంగా వాడుకోవచ్చునని వివ రించారు. పైగా ఈ పద్ధతిని ఉపయోగించేం దుకు రోగులు నిరాహారంగా ఉండాల్సిన అవసరమూ ఉండదని, రేడియోధార్మిక పదార్థాన్ని ఎక్కించేటప్పుడు పడుకుని ఉండాల్సిన అవసరమూ లేదని.. ఇవన్నీ రోగికి ఎంతో సాంత్వన కలిగించే అంశాలని చెప్పారు. 68జీఏ –ఫాపీ పదార్థానికి కొన్ని రేడియో న్యూక్లియోటైడ్‌లను చేర్చడం ద్వారా భవిష్యత్తులో కేన్సర్ చికిత్సకు కూడా ఈ పద్ధతి వాడే అవకాశముందని అంచనా.

## హెల్త్ టిప్

ఒక గ్లాసు నీటిలో రెండు యూకలిప్టస్ ఆకులను వేసి మరిగించి తాగితే జలుబు భారం తగ్గుతుంది.



# స్వాభావిక ఆహారాలతోనే మలబద్ధకం వదిలించుకోవడం ఎలా?



చాలా మందికి రోజు ప్రారంభం కావడం చాలా ఇబ్బందిగా జరుగు తుంది. చాలామందిలో పొద్దున్నే సాఫీగా జరగా ల్సిన మలవిసర్జన అనే ప్రక్రియ నరకప్రాయంగా జరు గుతుంది. ఉదయమే ఆ పనికాస్తా సజావుగానూ, సాఫీగానూ జరిగితే రోజంతా హాయిగా ఉంటుంది. కానీ పొద్దున్నే మలవిసర్జన ప్రక్రియ హాయిగా జరగక పోతే ఆ ఇబ్బంది రోజంతా కొనసాగుతూనే ఉంటుంది.

## కారణాలేమిటి?

ఇటీవల మన జీవనశైలిలో వచ్చిన మార్పులు, మన ఆహారపు అలవాట్లు మలబద్ద కానికి కారణమవుతున్నాయి. గతంలో మనం తీసుకునే ఆహారంతో పీచుపదార్థాలు తగినం తగా అంది మలవిసర్జన సాఫీగా జరిగేది కానీ ఇటీవల ప్రతివారూ తమ ఆహారంలో జంక్‌ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వంటి అంశాలు మల బద్ధకం సమస్యను మరింత ఎక్కువ చేస్తున్నాయి.

## పీచుపదార్థాల పరిమాణం ఎంత ఉండాలి?

నిజానికి మనం రోజూ తినే పండ్లు ఇతర ఆహార పదా ర్థాలతోనే ఈ సమస్యను తేలిగ్గా అధిగమించవచ్చు. యాభై ఏళ్లు దాటిన ప్రతి పురుషుడికీ ప్రతి రోజూ 38 గ్రాములు, అదే మహి ళకు అయితే 25 గ్రాముల పీచు పదార్థాలు అవసరం.

## పీచుపదార్థాలు ఎలా ఉపయోగపడతాయి?

మన మలం పలచగా ఉండి, సాఫీగా జారాలంటే పెద్దపేగులో తగినంత నీరు ఉండాలి. పీచు ఉన్న పదార్థాలు ఆహారంలో ఉంటే... సదరు ఆహారం జీర్ణమై, శరీరంలోకి ఇంకే ప్రక్రియలో ఉంటే పేగుల్లో ఉన్న నీటినంత టినీ పేగులు లాగేయకుండా ఈ పీచు అడ్డు పడుతుంది. అందుకే మలం మృదువుగా ఉండి, విరేచనం సాఫీగా అవుతుంది. మనం తీసు కునే ఆహారంలో ప్రతిరోజూ కనీసం 20 – 35 గ్రాముల పీచు ఉండాలి. అప్పుడు చాలా తేలికగా మల విసర్జన సాధ్యమవుతుంది. ఇక కనిష్టంగా 10 గ్రాముల పీచుకు తక్కువ కాకుండా ఉంటే, మల విసర్జన కొంతవరకు తేలిగ్గా జరుగు తుంది. స్వాభావికంగానే పీచు లభ్యమయ్యే ఈ ఆహార పదార్థాలు తీసుకోండి. మలవిసర్జన తేలిగ్గా జరిగేలా చూసుకోండి.

పై ఐదు పదార్థాలూ రోజూ మీ ఆహారంలో ఉండేలా చూసుకుంటే మలబద్ధకం ఇక మీ దరిచేరదు. అలాగే మీ ఆహా రంలో తాజా ఆకుకూరలు, కూరగాయలు ఉండే లా చూసుకోవ డం కూడా మల బద్ధకాన్ని తగ్గిస్తుంది.

| ఆహార పదార్థం పేరు (100 గ్రాములు) | పీచు పరిమాణం |
|---|---|
| 1. అంజీర (ఫిగ్) | 8.5 గ్రాములు |
| 2. జామపండులో | 5.2 గ్రాములు |
| 3. కొత్తిమీర | 32.6 గ్రాములు |
| 4. కొలకేసియా ఆకులు | 16.0 గ్రాములు |
| 5. కుసుమగింజలు | 34.9 గ్రాములు |



## గ్యాస్ట్రోఎంటరాలజీ కౌన్సెలింగ్స్

# కామెర్లు ఎందుకొస్తాయి...?

**నేను వృత్తిరీత్యా కాంట్రాక్ట్ పనులు చేస్తుండటం వల్ల ఎక్కువగా ఊళ్లు తిరుగుతూ ఉంటాను. ఈమధ్య ఆకలి మందగించింది. నీరసంగా ఉండి ఎక్కువ సమయం నిద్రపోవాలనిపిస్తోంది. జ్వరంగా, అలసటగా ఉంటోంది. అప్పుడప్పుడూ కళ్లు పచ్చగా కనిపిస్తున్నాయి. తరచూ ఒళ్లంతా దురదలు కూడా వస్తున్నాయి. ఆసుపత్రికి వెళ్లి చూపించుకుంటే కామె ర్లని చెప్పారు. వెంటనే చికిత్స ప్రారంభించాలని కూడా అన్నారు. అసలు కామెర్ల వ్యాధి ఎందుకు వస్తుంది? ఒకసారి వ్యాధికి గురైతే పూర్తిగా తగ్గడం సాధ్యమేనా? నా లివర్‌కు ఏమైనా ప్రమాదం ఉంటుందా? దయచేసి కామెర్ల వ్యాధి గురించి వివ రంగా చెప్పండి.**

**– సూర్యనారాయణరెడ్డి, కడప**

చర్మం, కళ్లలోని తెల్లటి భాగం పసుపుపచ్చ రంగుకు మారడమే కామెర్ల (జాండిస్)కు కొండ గుర్తు. రక్తంలో బైలిరుబిన్ అనే పదార్థం అధికంగా చేరడం అన్నది ఈ కండిషన్‌కు దారితీస్తుంది. బైలి రుబిన్ అనేది పసుపురంగులో ఉండే ఒక వ్యర్థ పదార్థం. ఎర్రరక్తకణాలలోని హిమోగ్లోబిన్ తొలగి పోయాక మిగిలిపోయే భాగం ఇది. బైలిరుబిన్ పరి మాణం ఎక్కువైనప్పుడు అది చుట్టుపక్కల కణజా లాలోకి చేరి వాటికి పసుపురంగును కలిగిస్తుంది. సాధారణంగా రక్తంలోని బైలిరుబిన్‌ను కాలేయం తొలగిస్తుంటుంది. అది కాలేయానికి చేరగానే అక్కడ దానిపై కొన్ని రసాయనాలు పనిచేస్తాయి. ఆ రసాయన చర్యలతో అది అన్‌కాంజుగేటెడ్ బైలిరుబిన్ అనే పదార్థంగా తయారవుతుంది. కాలేయం దీన్ని పైత్యరసంలోకి పంపిస్తుంది. ఈ జీర్ణరసం ద్వారా ఆహారంలోకి చేరిన బైలిరుబిన్ జీర్ణప్రక్రియ చివరివరకూ కొనసాగి చివరకు మలంతో విసర్జితమవుతుంది. మలానికి రంగు దీనివల్లనే ఏర్పడుతుంది. అనేక కారణాలు, అల వాట్లు, వైరల్ ఇన్ఫెక్షన్స్ వల్ల ఈ ప్రక్రియకు ఆటంకం ఏర్పడి కామెర్ల వ్యాధి వస్తుంది.

## గుర్తించడం ఎలా?

సాధారణంగా బయటకు కనిపించేది, అత్యధి కులకు తెలిసింది చర్మం, కళ్లు పచ్చగా మారడం. ఇది మొదట తల భాగంతో ప్రారంభించి క్రమంగా శరీరమంతా వ్యాపిస్తుంది. ఈ పచ్చదనం కాకుండా మరికొన్ని లక్షణాలు కూడా ఈ వ్యాధిలో కనిపిస్తుం టాయి. అవి...

- **దురదలు** : చర్మంలో బైల్ సాల్ట్స్ అధికంగా చేరడం వల్ల శరీరమంతటా దురదలు వస్తాయి.
- **అలసట** : స్పష్టమైన ఏ కారణం లేకుండానే విప రీతమైన అలసట కనిపిస్తుంది. బరువు తగ్గిపో తుంది.
- **జ్వరం** : హఠాత్తుగా జ్వరం వస్తుంది. వాంతుల వుతాయి.
- **నొప్పి** : పొట్టలో తీవ్రమైన నొప్పి వస్తుంది.
- **మలమూత్రాల రంగు మారడం** : సాధారణంగా కొద్దిపాటి లేత పసుపురంగుతో తేటగా ఉండే మూత్రం చిక్కగా గోధుమరంగులో వస్తుంది. అలాగే మలం పసుపు, ఆకుపచ్చ రంగులో ఉండటం కూడా కామెర్ల వ్యాధి లక్షణాలలో ముఖ్యమైనది.



## కారణాలు

ప్రధానంగా రెండు కారణాల వల్ల జాండిస్ సోకుతుంది. వీటిలో మొదటిది శరీరంలోని బైలిరు బిన్ అత్యధికంగా ఉత్పత్తి అవుతుండటం. రెండో సహజంగా ఉత్పత్తి అవుతున్న బైలురుబిన్‌ను కాలేయం తొలగించలేకపోవడం. ఈ రెండు సంద ర్భాల్లోనూ బైలిరుబిన్ శరీర కణజాలంలో చేరి స్థిర పడుతుంది. కామెర్లవ్యాధి సోకిన వ్యక్తి శరీర అంత ర్భాగంలో కొన్ని స్పష్టమైన మార్పులు కనిపిస్తాయి.

- **కాలేయం వాపు** : ఇలా వాపు రావడం వల్ల బైలి రుబిన్‌ను గుర్తించి, దాన్ని తొలగించే సామర్థ్యం మందగించి, రక్తంలో ఆ వ్యర్థపదార్థం పరి మాణం పెరుగుతూపోతుంది.
- **బైల్‌డక్ట్ వాపు** : పైత్యరసం నాళం వాపు కార ణంగా ఆ జీర్ణరసం ప్రవించడానికీ, తద్వారా బైలిరుబిన్ తొలగించడానికి ఆటంకంగా తయా రవుతుంది. దాంతో కామెర్ల వ్యాధి కనపడు తుంది.
- **పైత్యరస నాళంలో అడ్డంకులు** : ఇది బైలిరుబి న్‌ను తొలగించే ప్రక్రియకు ఆటంకం కలిగి స్తుంది.
- **హీమోలైటిక్ అనీమియా** : భారీసంఖ్యలో ఎర్రర క్తకణాలు విచ్ఛిన్నమైనప్పుడు శరీరంలో పెద్ద మొత్తంలో బైలిరుబిన్ తయారవుతుంది. మలే రియా, థలసీమియా వ్యాధుల వల్లగానీ లేదా కొన్ని రకాల ఔషధాల వల్ల ఎర్రరక్తకణాలు భారీగా విచ్ఛిన్నమవుతాయి.
- **గిల్బర్ట్ సిండ్రోమ్** : వంశపారంప ర్యంగా ఏర్పడే ఈ పరిస్థితి వల్ల పైత్యర సాన్ని విడుదల చేయగల ఎంజైముల సామర్థ్యం దెబ్బతింటుంది.
- **కొలెస్టాటిస్** : ఈ కండిషన్‌లో కాలేయం నుంచి పైత్యరసం విడుద లకు అడ్డంకులు ఏర్పడతాయి. దాంతో కాంజెగేటెడ్ బైలిరుబిన్ విసర్జితం కావ డానికి బదులు కాలేయంలోనే ఉండి పోతుంది.

వయోజనుల్లో మరికొన్ని తీవ్ర మైన కారణాల వల్ల కామెర్ల వ్యాధి వస్తుంది. వీటిలో కొన్ని ప్రాణాంతక మైన పరిస్థితులకూ దారితీయవచ్చు. మితిమీరిన మద్యపానం (నాలుగేళ్లకు పైబడి), హెపటైటిస్ బి, సి వైరస్‌ల ఇన్ఫెక్షన్‌ల వల్ల ఎక్కువమంది కామెర్ల వ్యాధికి గురవుతుంటారు. హెపటైటిస్ ఏ, ఈ వైరస్‌ల వల్ల కూడా కామెర్లు వస్తాయి. ఇవి ప్రమాదకరం. కలుషిత మైన నీళ్లు, తిండి వల్ల ఈ తీవ్రమైన హెపటైటిస్ ఏ, ఈ వైరస్‌లు శరీరంలోకి చేరుతుం టాయి.

## వ్యాధి నిర్ధారణ



చాలా సందర్భాల్లో పేషెంట్ ఆరోగ్య చరిత్రను తెలుసుకో వడం, భౌతికంగా పరీక్షిం చడం, పొట్టదగ్గర పరిశీ లించడం ద్వారా డాక్టర్లు కామెర్ల వ్యాధిని గుర్తి స్తారు. పొట్టలో ఏమైనా గడ్డలు ఉన్నాయా, కాలేయం గట్టిపడిందా అని పరిశీలించి చూస్తారు. కాలేయం గట్టిగా మారడం సిర్రోసిస్ వ్యాధిని సూచి స్తుంది. అది అలా గట్టిగా మారడం క్యాన్సర్ లక్షణం. కామెర్ల తీవ్రతను తెలు సుకోడానికి చాలా రోగనిర్ధారణ పరీక్షలు ఉన్నాయి. వీటిలో మొదటిది లివర్ ఫంక్షన్ పరీక్ష. కాలేయం సరిగా పనిచేస్తున్నదీ లేనిదీ దీనితో వెల్లడవుతుంది. రోగిలో వ్యక్తమవుతున్న లక్షణాలకు కారణాలు బయటపడని పక్షంలో బైలిరుబిన్ పరిమాణం, రక్తపు తాజా పరిస్థితిని అర్థం చేసుకోడానికి బైలురు బిన్ టెస్ట్, ఫుల్ బ్లడ్ కౌంట్, కంప్లీట్ బ్లడ్ కౌంట్, హెపటైటిస్ వైరస్‌ల పరీక్షల వంటి వివిధ రకాల పరీక్షలను డాక్టర్లు సూచిస్తారు. నాళాలకు అడ్డం కులు ఏర్పడిన కారణంగా కామెర్లు వచ్చినట్లు అను మానిస్తే ఎమ్మారై స్కాన్, అబ్డామినల్ అల్ట్రాసోనో గ్రఫీ, కాట్‌స్కాన్ వంటి పరీక్షలు చేయిస్తారు. సిర్రో సిస్, క్యాన్సర్, ఫాటీలివర్ ఏర్పడినట్లు అనుమానం కలిగితే బయాప్సీ చేయించాల్సిందిగా సూచిస్తారు.

## చికిత్స

చాలామంది అవగాహన లేక జాండిస్‌కు నాటుమందులు వాడుతుంటారు. ఇది చాలా ప్రమాదకరం. ప్రాణాంతకం కూడా. కామెర్లకు ఇప్పుడు మంచి చికిత్స అందుబాటులో ఉంది. కామెర్లకు సరైన చికిత్స తీసుకోకపోతే కాలేయం దెబ్బతినే ప్రమాదం ఉంది. కామెర్లకు చికిత్స చేసే ముందర ఆ వ్యాధికి దారితీసిన కారణాలను గుర్తిం చేందుకు పరీక్షలు జరుపుతారు. వాటిని అదుపుచే యడం, నివారించడానికి చికిత్స చేస్తారు. రక్తహీ నత కారణంగా ఏర్పడిన కామెర్లను రక్తంలో ఎర్రర క్తకణాలను అభివృద్ధిపరచడం ద్వారా అదుపుచే స్తారు. ఇందుకు ఐరన్ సప్లిమెంట్లు, ఐరన్ ఎక్కు వగా ఉండే ఆహారం సిఫార్సు చేస్తారు. హెపటైటిస్ కారణంగా వచ్చే కామెర్లను తగ్గించడానికి యాంటీ వైరల్ మందులు, స్టెరాయిడ్స్ ఇస్తారు. నాళాలలో అడ్డంకుల కారణంగా కామెర్లు వస్తే, శస్త్రచికిత్స ద్వారా ఆ ఆటంకాలను తొలగిస్తారు. ఏమైనా మందులు వాటం వల్ల వాటిలోని రసాయనాల వల్ల కామెర్లు వస్తే మొదట వాటి వాడకాన్ని నిలిపే స్తారు. ప్రత్యామ్నాయ ఔషధాలను సిఫార్సు చేయడంతో పాటు వాటి దుష్ఫలితాలను తగ్గిం చేందుకు అవసరమైన చికిత్స అందిస్తారు. హెప టైటిస్ ఏ, ఈ వైరస్‌ల వల్ల వచ్చే కామెర్లు చాలా ప్రమాదకరం. దీనిలో హఠాత్తుగా కామెర్ల వ్యాధి సోకి ప్రాణాపాయ ప్రమాదం ముంచుకువచ్చే అవకాశం ఉంది. కాలేయమా ర్పిడి మాత్రమే దీనికి నమ్మకమైన చికిత్స. సజీవులై వారి నుంచి లేదా బ్రెయిన్ డెడ్ అయిన దాత నుంచి సేకరించిన ఆరోగ్యకర మైన కాలేయంతో అవయవమార్పిడి ఆపరేషన్ చేస్తారు.



డా. బి. రవిశంకర్,
సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
సికింద్రాబాద్

ఫ్యామిలీ డాక్టర్

# సాక్షి భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
10-6-2019


## విద్య, ఉద్యోగ సమాచారం

### ఎంఆర్‌పీఎల్‌లో 41 పోస్టులు

కర్ణాటకలోని ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ అయిన మంగళూర్ రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ (ఎంఆర్‌పీఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 41 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**విభాగాల వారీ ఖాళీలు**

1. ఇంజనీర్: 26 (కెమికల్-6, మెకానికల్-9, ఎలక్ట్రికల్-3, ఇన్‌స్ట్రుమెంటేషన్-4, సివిల్-3, ఇన్ఫర్మేషన్ సిస్టమ్-1).
- **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/బీఎస్సీ ఇంజనీరింగ్ ఉత్తీర్ణత.

2. లేబొరేటరీ సూపర్‌వైజర్-10.
- **అర్హత:** కెమిస్ట్రీ విభాగంలో ఎంఎస్సీ ఉత్తీర్ణత.

3. హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్-5.
- **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీఏ/పీజీ ఉత్తీర్ణత.
- **వయసు:** 28 ఏళ్లకు మించకూడదు. ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; పీడబ్ల్యూడీలకు పదేళ్లు గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** ఇంజనీరింగ్, లేబొరేటరీ సూపర్‌వైజర్ పోస్టులను గేట్-2019 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా; హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను యూజీసీ నెట్ డిసెంబర్-2018 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.100; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 4, 2019.
- **వెబ్‌సైట్:** www.mrpl.co.in

### వైఎస్‌ఆర్‌హెచ్‌యూలో ఎంఎస్సీ, పీహెచ్‌డీ ప్రవేశాలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని వెంకటరామన్న గూడెంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ 2019-20కి గాను ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

1. ఎంఎస్సీ (హార్టికల్చర్)
- **అర్హత:** బీఎస్సీ (హార్టికల్చర్)/బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ ఉత్తీర్ణత.

2. పీహెచ్‌డీ (హార్టికల్చర్)
- **అర్హత:** సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎంఎస్సీ (హార్టికల్చర్) ఉత్తీర్ణత.
- **విభాగాలు:** ఎంటమాలజీ, ఫ్రూట్ సైన్స్, ప్లాంట్ పాథాలజీ, వెజిటేబుల్ సైన్స్ తదితర విభాగాలున్నాయి.
- **వయసు:** 2019, జులై 1 నాటికి 40 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్, ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **పరీక్ష తేదీలు:** ఎంఎస్సీ- జులై 24, 2019; పీహెచ్‌డీ జులై 25, 2019.
- **కౌన్సెలింగ్ తేదీలు:** ఎంఎస్సీ-ఆగస్టు 6, 2019; పీహెచ్‌డీ ఆగస్టు 7, 2019.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** జులై 5, 2019.
- **వెబ్‌సైట్:** www.drysrhu.edu.in


సాక్షి ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో...
❖ జనరల్ స్టడీస్ మెటీరియల్
విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM
SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి




ఇంటర్మీడియెట్ స్పెషల్

- ఇంటర్మీడియెట్‌లో సీబీఎస్‌ఈ వర్సెస్ స్టేట్‌బోర్డ్
- జాతీయస్థాయి ప్రవేశ పరీక్షలకు సీబీఎస్‌ఈ అనుకూలమనే అభిప్రాయం
- స్టేట్‌బోర్డ్ సిలబస్‌లోని మ్యాథ్స్ జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌కు కలిసొస్తుందంటున్న నిపుణులు

త్వరలో కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంకానుంది. పదోతరగతి పూర్తిచేసుకున్న విద్యార్థుల తదుపరి గమ్యం.. ఇంటర్మీడియెట్. మరి ఇంటర్మీడియెట్‌లో ఏ గ్రూప్ తీసుకోవాలి.. భవిష్యత్ లక్ష్యాల సాధనకు ఏ బోర్డు సిలబస్ బెటర్?! మెడికల్, ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లకు సరిపోయే బోర్డ్ ఏది.. ఏ బోర్డ్‌ను ఎంపిక చేసుకుంటే.. ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుంది. సీబీఎస్‌ఈ, రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియెట్ బోర్డుల్లో ఏది బెటర్, ఎందుకు? రెండు బోర్డుల సిలబస్ సానుకూల, ప్రతికూల అంశాల గురించి తెలుసుకుందాం..

# ఇంటర్‌కు ఏ బోర్డ్ బెటర్?

'ఇంటర్మీడియెట్ అర్హతగా జాతీయస్థాయిలో నిర్వహించే ఇంజనీరింగ్, మెడికల్ ప్రవేశ పరీక్షలు సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగానే జరుగుతున్నాయి. అలాంటప్పుడు సీబీఎస్‌ఈలో +1లో చేరితే మంచిదేమో..!'
– ఇది పలువురు విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయం.

'జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో... సీబీఎస్‌ఈ కంటే ఇంటర్మీడియెట్ బోర్డ్ సిలబస్‌తోనే బాగా రాణించే అవకాశముంది'
– ఇది మరికొందరు విద్యార్థులు, తల్లిదండ్రుల వాదన.

ఇలా.. ఇంటర్మీడియెట్/+1లో చేరే విషయంలో బోర్డ్ ఎంపికలో ఏటా తల్లిదండ్రులు ఎంతో గందరగోళానికి గురవుతున్న పరిస్థితి. ఈ సమస్యకు పరిష్కారం.. ఆయా బోర్డ్‌ల గ్రూప్‌లు, సిలబస్, బోధన, లెర్నింగ్ విధానాలను తెలుసుకోవడమే అంటున్నారు నిపుణులు!!

### 'గ్రూప్'లు ఇలా..

- సీబీఎస్‌ఈ +2 స్థాయిలో ప్రస్తుతం ప్రధానంగా మూడు స్ట్రీమ్(గ్రూప్)లు అందుబాటులో ఉన్నాయి. అవి.. సైన్స్, కామర్స్, హ్యుమానిటీస్.
- సైన్స్ స్ట్రీమ్‌లో మెడికల్, నాన్-మెడికల్ పేరుతో రెండు సబ్ స్ట్రీమ్స్ విధానం అమలవుతోంది.
- నాన్-మెడికల్ స్ట్రీమ్‌లో విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లతో పాటు ఏదైనా ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌ను చదవాలి. దీన్ని పీసీఎం గ్రూప్‌గా పిలుస్తున్నారు.
- మెడికల్ స్ట్రీమ్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లను, ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌ను చదవాలి. దీన్ని పీసీబీ గ్రూప్‌గా పేర్కొంటున్నారు.
- కామర్స్ స్ట్రీమ్‌లో అకౌంటెన్సీ, బిజినెస్ స్టడీస్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌ను చదవాల్సి ఉంటుంది.
- హ్యుమానిటీస్.. మిగతా స్ట్రీమ్‌లతో పోల్చితే విభిన్నం, వినూత్నం అని చెప్పొచ్చు. ఈ స్ట్రీమ్‌లో విద్యార్థులకు కోర్ సబ్జెక్ట్ విధానంలో హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జాగ్రఫీ, సోషియాలజీ, సైకాలజీ.. ఇలా అనేక సబ్జెక్టులు అందుబాటులో ఉంటాయి.

### స్టేట్ బోర్డ్‌లో ఇలా..

రాష్ట్ర స్థాయిలో ఇంటర్మీడియెట్ బోర్డ్‌లో.. ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ ప్రధాన గ్రూప్‌లు. వీటిలో చేరిన విద్యార్థులు ఫస్ట్ లాంగ్వేజ్,



సెకండ్ లాంగ్వేజ్‌తోపాటు గ్రూప్ సబ్జెక్ట్‌లుగా నిర్దేశించిన మూడు సబ్జెక్ట్‌లను చదవాల్సి ఉంటుంది. సీబీఎస్‌ఈ బోర్డ్ మాదిరిగా ఆప్షనల్ సబ్జెక్ట్‌ను ఎంపిక చేసుకునే అవకాశం స్టేట్ బోర్డ్ సిలబస్‌లో ఉండదు.

### 'మెడికల్' లక్ష్యమైతే

ఇంటర్మీడియెట్ తర్వాత ఎంబీబీఎస్ లక్ష్యంగా నీట్, ఎయిమ్స్, జిప్‌మర్ వంటి పరీక్షల్లో రాణించాలనుకునే విద్యార్థులు సీబీఎస్‌ఈ బోర్డ్‌లో చేరితే మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదేవిధంగా ఇంజనీరింగ్‌లో చేరేందుకు వీలుకల్పించే జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లలో మెరుగ్గా రాణించాలన్నా సీబీఎస్‌ఈ బోర్డ్ మేలనే మాట వినిపిస్తోంది. ఈ ప్రవేశ పరీక్షల సిలబస్ ప్రధానంగా సీబీఎస్‌ఈ కరిక్యులం ఆధారంగా రూపొందించడమే ఇందుకు కారణం. అయితే స్టేట్‌బోర్డ్ సిలబస్‌లో మ్యాథమెటిక్స్ విస్తృతంగా ఉండటం జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో ఎంపీసీ విద్యార్థులకు కలిసొస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

### కామర్స్

కామర్స్ స్ట్రీమ్ విద్యార్థులు.. భవిష్యత్తులో సీఏ, సీఎస్, ఐసీడబ్ల్యూఏ, బీబీఏ, ఎంబీఏ వంటి కోర్సుల్లో మెరుగ్గా రాణించేందుకు సీబీఎస్‌ఈ బోర్డ్ సిలబస్ అనుకూలమనే అభిప్రాయం వినిపిస్తోంది. భవిష్యత్తులో ఆయా ప్రొఫెషనల్ కోర్సులకు అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలను +2 స్థాయిలోనే అందిపుచ్చుకునే అవకాశం సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారా లభిస్తోంది.

### పోటీ పరీక్షలకు ఏ సిలబస్

భవిష్యత్తులో ఉద్యోగ నియామక పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనుకునే విద్యార్థులు.. స్టేట్ బోర్డ్, హ్యుమానిటీస్(హెచ్‌ఈసీ) గ్రూప్‌లో చేరడం మేలన్నది నిపుణుల సలహా. ఆయా పోటీ పరీక్షలకు నిర్దేశించిన సిలబస్‌లో అధిక శాతం సంబంధిత రాష్ట్రాల్లో ప్రాధాన్యం సంతరించుకున్న అంశాల ఆధారంగానే ఉంటుంది. దానికి అనుగుణంగానే ఇంటర్ బోర్డ్ హెచ్‌ఈసీ గ్రూప్ సిలబస్ కూడా ఉండటం ఉపయుక్తం. హెచ్‌ఈసీ తర్వాత రాష్ట్రాల్లోనే యూనివర్సిటీల్లో సంప్రదాయ బీఏలో చేరొచ్చు. తద్వారా డిగ్రీ అర్హతతో నిర్వహించే గ్రూప్-1, గ్రూప్-2, ఇతర ఉద్యోగ నియామక పరీక్షల్లో మెరుగ్గా రాణించేందుకు వీలవుతుంది. జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో మాత్రం సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగా ప్రశ్నలు అడుగుతున్నారు.

### సీబీఎస్‌ఈ.. లెర్నింగ్ బై డూయింగ్

బోధన విషయానికొస్తే సీబీఎస్‌ఈ, స్టేట్ బోర్డ్‌ల మధ్య ఎంతో వ్యత్యాసం కనిపిస్తోంది. సీబీఎస్‌ఈలో లెర్నింగ్ బై డూయింగ్ విధానంలో ప్రాక్టికల్ ఆధారిత, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు అధిక ప్రాధాన్యం ఉంటోంది. ఫలితంగా సైన్స్, మ్యాథమెటిక్స్ విద్యార్థులకు అప్లికేషన్ ఓరియెంటేషన్ అలవడుతోంది. అదే స్టేట్ బోర్డ్ విధానంలో ప్రాక్టికల్ అప్రోచ్ ఆధారిత టీచింగ్, లెర్నింగ్ చాలా తక్కువ.

### స్టేట్ బోర్డ్.. బట్టీ విధానం

స్టేట్ బోర్డ్‌లో ప్రధానంగా బట్టీ విధానం కనిపిస్తోంది. సబ్జెక్టును అవగాహన చేసుకోవడం కంటే పరీక్షల కోసం గుర్తుంచుకునే పద్ధతిని అనుసరిస్తున్నారు. జేఈఈ-మెయిన్, అడ్వాన్స్‌డ్, ఎంసెట్ పరీక్షల కోసం ఇంటర్ తొలిరోజు నుంచే ఆయా పరీక్షల పాత ప్రశ్నపత్రాల సాధన, వీక్లీ టెస్ట్‌లతో విద్యార్థులు పుస్తకాలకే పరిమితమవుతున్నారు. ఫలితంగా పరీక్షల్లో అడిగే అప్లికేషన్ ఓరియెంటెడ్ ప్రశ్నలకు సమాధానాలు గుర్తించలేకపోతున్నారు. అంతేకాకుండా నిరంతరం పరీక్షల కోణంలో చదువు కొనసాగిస్తుండటంతో విద్యార్థుల్లో ప్రాక్టికల్ దృక్పథం లోపిస్తోందనే వాదన ఉంది.

### స్టేట్ బోర్డ్.. సిలబస్ మార్చినా

స్టేట్ బోర్డ్ విద్యార్థులు.. జాతీయస్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షల్లో రాణించాలనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం ఇంటర్మీడియెట్ స్టేట్ బోర్డ్ సిలబస్‌లో మార్పులు చేశారు. ముఖ్యంగా ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో దాదాపు 80 శాతం సిలబస్ సీబీఎస్‌ఈ సిలబస్‌కు సరితూగే విధంగా మార్చారు. కానీ.. బోధన పరంగా అందుకు అనుగుణమైన మౌలిక సదుపాయాలు లేకపోవడం, బోధన సిబ్బంది కొరత కారణంగా సిలబస్ మార్చినా.. బట్టీ విధానంలోనే అభ్యసనం సాగిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

### ఉమ్మడి సిలబస్ రానుందా!

జాతీయస్థాయి పరీక్షల్లో సీబీఎస్‌ఈ విద్యార్థులే ముందంజలో నిలుస్తున్నారనే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. దేశ వ్యాప్తంగా ఉమ్మడి సిలబస్ రూపొందించేందుకు శ్రీకారం చుట్టింది. అందుకోసం మాజీ కేబినెట్ సెక్రటరీ టి.ఎస్.ఆర్.సుబ్రమణియన్ నేతృత్వంలో అయిదుగురు సభ్యుల కమిటీని నియమించింది. ఈ కమిటీ గతేడాది కొత్త విద్యావిధానంపై నివేదిక సమర్పించింది. అందులో ఉమ్మడి సిలబస్ అంశాన్ని గట్టిగా సిఫార్సు చేసింది. దీనివల్ల అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయనే తెలిపింది. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీల్లో నూటికి నూరు శాతం సిలబస్ ఒకే మాదిరిగా ఉండేలా ఎన్‌సీఈఆర్‌టీ ఆధారంగా రూపొందించాలని పేర్కొంది. హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ తదితర గ్రూప్‌ల విషయంలో 70 శాతం ఉమ్మడి సిలబస్‌ను, 30 శాతం సంబంధిత రాష్ట్ర అంశాలను జోడించి రూపొందించాలని సిఫార్సు చేసింది. దీనిపై గతేడాది అన్ని రాష్ట్రాల విద్యా శాఖమంత్రులతో సమావేశం సైతం నిర్వహించారు. వాస్తవానికి ఈ విధానాన్ని 2019 విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని భావించినా.. కొంత సమయం పడుతుందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

#### సీబీఎస్‌ఈ

**సానుకూలతలు:**
- జాతీయస్థాయి పరీక్షలన్నీ సీబీఎస్‌ఈ సిలబస్ ఆధారంగానే జరుగుతున్న పరిస్థితి.
- ఏటా కరిక్యులంలో తాజా పరిస్థితులకు అనుగుణంగా మార్పులు.
- లెర్నింగ్ బై డూయింగ్ విధానం, ప్రాక్టికల్ అప్రోచ్‌కు ప్రాధాన్యం.

**ప్రతికూలతలు:**
- మ్యాథ్స్‌కు ప్రాధాన్యం తక్కువ.
- సీబీఎస్‌ఈ పాఠశాలల సంఖ్య తక్కువగా ఉండటం.
- బ్యాచిలర్ డిగ్రీ స్థాయిలో ఒకేషనల్ కోర్సుల పరంగా పరిమిత అవకాశాలు.

#### స్టేట్ బోర్డ్..

**సానుకూలతలు:**
- స్థానిక పరిస్థితులపై అవగాహన కల్పించే విధంగా సిలబస్.
- మ్యాథ్స్ విస్తృతంగా ఉండటం.
- వార్షిక పరీక్షల కోణంలో కలిసొచ్చే అంశం.

**ప్రతికూలతలు:**
- కరిక్యులంలో నిరంతర మార్పులు లేకపోవడం.
- మౌలిక సదుపాయాల కొరత.
- ప్రాక్టికల్ అప్రోచ్ లేకపోవడం.

#### ఆసక్తికి అనుగుణంగా..

సీనియర్ సెకండరీ లెవల్‌లో బోర్డ్‌ను ఎంపిక చేసుకునే ముందు విద్యార్థులు తమ సహజ ఆసక్తులను విశ్లేషించుకోవాలి. సీబీఎస్‌ఈలో ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యం ఉంటుంది. విద్యార్థులు ఒకటికి రెండుసార్లు ఆలోచించి బోర్డ్, స్కూల్ ఎంపికలో నిర్ణయం తీసుకోవాలి.
– **వసంత రామన్**, ప్రిన్సిపాల్, డీపీఎస్ పబ్లిక్ స్కూల్.

---



కెరీర్ ట్రెండ్స్

- పని వేళల విషయంలో మారుతున్న యువత దృక్పథం
- ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్‌పై పెరుగుతున్న ఆసక్తి
- ఇంటి నుంచే పని పట్ల సానుకూల వైఖరి
- తాజాగా ఓ సర్వేలో వెల్లడి

# నచ్చే పనివేళలు..

ఉద్యోగం.. విధి నిర్వహణ.. నిర్దిష్టంగా పని వేళలు.. షిఫ్ట్‌ల విధానంలో 24×7 వాతావరణంలో కార్యాలయంలో కార్యకలాపాలు.. సిబ్బందికి షిఫ్ట్‌ల వారీగా నిర్దిష్ట పని వేళల కేటాయింపు- ఇవన్నీ మనకు తెలిసినవే..! కానీ, ప్రస్తుతం యువత(మిలీనియల్స్) వైఖరి మారుతోంది. ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ (నచ్చే పనివేళలు).. వర్క్ ఫ్రమ్ హోమ్‌ను కోరుకుంటున్న వారి సంఖ్య పెరుగుతోంది!! తాజాగా ప్రముఖ జాబ్ పోర్టల్ 'షైన్ డాట్ కామ్' నిర్వహించిన సర్వేలో పనివేళలకు సంబంధించి యువత తమ ఆలోచనలను స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తాజా సర్వే వివరాలు.. ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల ఉద్యోగులకు, కంపెనీలకు కలిగే ప్రయోజనాలు, ప్రతికూలతల గురించి తెలుసుకుందాం...

నైన్ టు ఫైవ్.. టెన్ టు సిక్స్.. ఇవి సాధారణంగా కార్పొరేట్ ఉద్యోగంలో పనివేళలు. గత తరం సర్దుకుపోయింది. ఎలాంటి వేళలైనా పర్వాలేదు.. కొలువు ఉంటే చాలనుకుంది. కానీ..నేటి తరం యువత(మిలీనియల్) ఆలోచన మాత్రం ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ ఉండాలని.. ఇంటి నుంచి పని చేస్తామంటూ తమ మనోగతాన్ని వెల్లడిస్తోంది. తాజాగా ప్రముఖ జాబ్ పోర్టల్ షైన్‌డాట్ కామ్ నిర్వహించిన సర్వేలో ఏకంగా 60 శాతం మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం గమనార్హం.

### ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్

షైన్ డాట్ కామ్ సంస్థ ఫ్యూచర్ ఆఫ్ ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ పేరుతో.. ఫ్లెక్సిబుల్ వర్కింగ్, వర్క్ ఫ్రమ్ హోమ్‌పై మిలీనియల్ యువతలో నెలకొన్న ఆలోచనను తెలుసుకునేందుకు దేశ వ్యాప్తంగా 22 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వయసు వారితో సర్వే నిర్వహించింది. ఇందులో అరవై శాతం మందికి పైగా ఉద్యోగులు ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలకు మొగ్గు చూపారు. దీనివల్ల కంపెనీల్లో వలసలు తగ్గుతాయని, సంస్థలకు ప్రతిభావంతులు చేజారకుండా ఉంటారని సర్వే నివేదిక స్పష్టం చేసింది.

### ఐటీ నుంచి అన్ని రంగాలకూ!

వాస్తవానికి ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం ఐటీ రంగంలో కొన్నేళ్ల క్రితం నుంచే అమలవుతోంది. ఇప్పుడు తాజాగా అకౌంటింగ్, ఫైనాన్స్, హెచ్‌ఆర్, అడ్మినిస్ట్రేషన్ వంటి ఇతర రంగాల్లోని ఉద్యోగులు సైతం ఇలాంటి విధానం కోరుకోవడం విశేషం. దీనివల్ల వర్క్ లైఫ్, పర్సనల్ లైఫ్ మధ్య సమతుల్యత పాటించడానికి వీలవుతుందని మిలీనియల్స్ చెబుతున్నారు. నిర్దిష్ట పనివేళల వల్ల తప్పనిసరిగా ఆఫీసులోనే ఉండాల్సి వస్తోందని.. దీనివల్ల వర్క్ లైఫ్, పర్సనల్ లైఫ్ మధ్య సమతుల్యత దెబ్బతింటోందంటున్నారు.

### ఇప్పటికే పలు సంస్థల్లో అమలు

ఫ్లెక్సిబుల్ వర్కింగ్ విధానాన్ని పలు సంస్థలు ఇప్పటికే అందుబాటులోకి తెచ్చాయి. తమకు ఫ్లెక్సిబుల్ వర్కింగ్ ఆప్షన్స్ ఉందని 43 శాతం మంది పేర్కొనగా.. 52 శాతం మంది మాత్రం ఈ విధానం తమ సంస్థల్లో లేదని చెప్పారు. 39 శాతం మంది ప్రతిరోజు ఫ్లెక్సిబుల్ వర్కింగ్ విధానం అమలుచేస్తే బాగుంటుందని పేర్కొన్నారు. 6.36 శాతం మంది మాత్రమే వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి మొగ్గు చూపడం గమనార్హం. మరోవైపు ప్రతినెలలో కనీసం ఒకసారి లేదా రెండుసార్లు ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ వెసులుబాటు కల్పిస్తే బాగుంటుందని దాదాపు 40 శాతం మంది చెప్పడం విశేషం.

### ఇబ్బందులు కూడా..

ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం వల్ల తమకు ఇబ్బందులు కూడా ఉన్నాయని పలువురు చెప్పారు. దాదాపు 20 శాతం మంది ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంవల్ల తాము బాగా పనిచేసినప్పటికీ ఉన్నతాధికారుల నుంచి సరైన గుర్తింపు లభించదన్నారు. అదే విధంగా ఏవైనా సందేహాలుంటే సహచర ఉద్యోగులను సంప్రదించి నివృత్తి చేసుకునే విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు.

### 'నిర్దిష్ట వేళల'తో పోల్చితే

ఆఫీసులో ఉండి నిర్దిష్ట పని వేళల్లో పని చేయడంతో పోల్చితే వర్క్ ఫ్రమ్ హోమ్‌తో ఇబ్బందులు కూడా ఉన్నాయని పలువురు పేర్కొన్నారు. వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో ఒక టాస్క్‌ను నిర్దిష్ట సమయంలో ఆపేసే అవకాశం ఉండదని తెలిపారు. అనుక్షణం ఉన్నతాధికారులకు, క్లయింట్లకు అందుబాటులో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. వర్క్ ఫ్రమ్ హోం విధానంలో నిరంతరం ఆఫీస్ మెయిల్స్ చెకింగ్, క్లయింట్ కాల్స్‌కు సమాధానం చెప్పడం వంటి బాధ్యతలు ఉంటాయని 22 శాతం మంది పేర్కొనడం గమనార్హం. దీనికి బదులు నిర్దిష్టంగా ఆఫీసు పనివేళల్లోనే తమకు ఇచ్చిన టాస్క్‌ను పూర్తిచేస్తే వర్క్ లైఫ్, పర్సనల్ లైఫ్ బ్యాలెన్స్ చేసుకోవడం సాధ్యమేనని పేర్కొంటున్నారు.

### 'ప్రొడక్టివిటీ' పెరుగుతుందా?

వాస్తవానికి ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాలపై ప్రపంచవ్యాప్తంగా ఎప్పటి నుంచో చర్చ జరుగుతోంది. వీటితో ఉద్యోగుల ప్రొడక్టివిటీ పెరుగుతుందని గతంలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ చేసిన సర్వే స్పష్టం చేసింది. ఇటీవల ప్రఖ్యాత హార్వర్డ్ బిజినెస్ స్కూల్ సైతం పరిశోధన చేసి ఈ విధానం సంస్థలకు అనుకూలమని పేర్కొంది. ప్రధానంగా ఉద్యోగుల్లో పని సంతృప్తి పెరుగుతుందని, వలసల రేటు తగ్గుతుందని.. ఇవన్నీ సంస్థలకు ప్రయోజనకరమని పేర్కొంది.

### మన దేశంలో ఇబ్బందే

మన దేశ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుంటే.. వర్క్ ఫ్రమ్ హోమ్, ఫ్లెక్సిబుల్ వర్కింగ్ విధానాలు అమలు కష్టమేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది అటు ఉద్యోగులకు, ఇటు యాజమాన్యాలకు.. ఇద్దరికీ వర్తిస్తుందన్నది ఇండస్ట్రీ వర్గాల వాదన. ప్రధానంగా వర్క్ ఫ్రమ్ హోమ్ విధానంలో ఇంటర్నెట్ యాక్సెస్, క్లయింట్ రిలేషన్‌షిప్ కొనసాగించడం కష్టంగా ఉంటుందని, దీనికి కుటుంబ వాతావరణం ప్రధాన కారణంగా కనిపిస్తుందని సదరు వర్గాలు పేర్కొంటున్నాయి. ఇవే కొన్ని సందర్భాల్లో సమస్యలుగా మారి ఉద్యోగుల పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపే ఆస్కారం కూడా ఉందంటున్నారు. అంతేకాకుండా వారు భావిస్తున్న వర్క్ లైఫ్, పర్సనల్ లైఫ్ బ్యాలెన్స్ కూడా సాధ్యం కాకపోవచ్చని వాదన వినిపిస్తోంది.

### ఐటీ రంగంలో తప్పదు

ఐటీ రంగంలో మాత్రం ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోం విధానం తప్పనిసరి అంటున్నారు. ప్రస్తుతం క్లౌడ్ సర్వీసెస్, ఐఓటీ ప్రవేశంతో నిరంతరం క్లయింట్ సంస్థలకు అందుబాటులో ఉండాల్సి ఉంటుంది. కాబట్టి సంబంధిత టాస్క్‌లు నిర్వహించే ఉద్యోగులు నిరంతరం సేవలు అందించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో ఐటీ రంగంలో వర్క్ ఫ్రమ్ హోమ్, ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్ వల్ల ఉద్యోగులు మానసికంగా కొంత ఉపశమనం పొందే అవకాశం ఉందని ఐటీ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

### ఆసక్తి ఉన్నా... సవాళ్లు ఎన్నో

మొత్తంగా సర్వే నివేదికను గమనిస్తే.. యువత ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ పట్ల ఆసక్తి చూపుతోంది. అయితే పలు కారణాల వల్ల సవాళ్లు కూడా ఎదురవుతున్నాయని పేర్కొనడం గమనార్హం.



#### యువత అభిప్రాయాలు

**ఫ్లెక్సిబుల్ వర్కింగ్ అవర్స్‌పై ఆసక్తి.. కారణాలు**
- వర్క్-లైఫ్ సమతుల్యత-59.92 శాతం.
- ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం-13.88 శాతం.
- రవాణా ఖర్చుల్లో తగ్గుదల-6.37 శాతం.
- కుటుంబ సభ్యులతో గడిపే అవకాశం-5.52 శాతం.
- పని పరంగా స్వేచ్ఛ, ఆరోగ్య పరమైన కారణాలు-14.31 శాతం.

**వర్క్ ఫ్రమ్ హోమ్.. ఎదురయ్యే సమస్యలు/సవాళ్ల పరంగా యువ ఉద్యోగులు పేర్కొంటున్న అంశాలు, వారి సంఖ్య శాతాల్లో...**
- నిర్దిష్ట సమయంలో పనిని ఆపే వీలు ఉండదు- 21.95 శాతం.
- పర్సెప్షన్ ఇష్యూస్- 19.83 శాతం.
- కొలీగ్స్‌తో కోఆర్డినేషన్ సమస్యలు- 17.56 శాతం.
- ముఖాముఖి చర్చల పరంగా ఇబ్బంది - 13.46 శాతం.
- టైమ్ జోన్ వ్యత్యాసాలు- 11.19 శాతం.
- ఇంటి వద్ద వ్యక్తిగత సమస్యలు- 10.06 శాతం.
- టీమ్‌ను సమర్థంగా పర్యవేక్షించే వీలు లేకపోవడం- 5.95 శాతం.

**1** ప్రపంచ కప్ చరిత్రలో ఆస్ట్రేలియాపై మొదట బ్యాటింగ్‌కు దిగిన ఓ జట్టు 300కుపైగా పరుగులు చేయడం ఇదే తొలి సారి. ప్రపంచ కప్‌లో ఆస్ట్రేలియాపై ఓ జట్టు చేసిన అత్యధిక స్కోరు ఇదే (352/5).

**27** ఇప్పటివరకు ప్రపంచ కప్‌లలో భారత ఆటగాళ్లు చేసిన సెంచరీల సంఖ్య. ఈ జాబితాలో ఆస్ట్రేలియా (26 సెంచరీలు)ను వెనక్కి నెట్టి భారత్ టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది.

**2** ప్రపంచ కప్‌లో ఆసీస్‌పై సెంచరీ చేసిన రెండో భారత బ్యాట్స్‌మన్ ధావన్. 1999లో ఇదే ఓవల్ మైదానంలో అజయ్ జడేజా శతకం బాదాడు.

**12** ప్రపంచ కప్‌లో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మ్యాచ్‌లు. ఏ రెండు జట్ల మధ్య ఇంతకంటే ఎక్కువ జరగలేదు.

**2** ప్రపంచకప్ మ్యాచ్‌లో భారత్ తరఫున టాప్-3 బ్యాట్స్‌మెన్ 50కంటే ఎక్కువ స్కోరు చేయడం ఇది రెండోసారి. 2011లో దక్షిణాఫ్రికాపై సెహ్వాగ్, సచిన్, గంభీర్ ఇలా చేశారు.



ఓవల్ మైదానంలో తనయుడు గౌతమ్‌తో కలిసి భారత్, ఆస్ట్రేలియా మ్యాచ్‌ను తిలకిస్తున్న హీరో మహేశ్ బాబు



# సరిలేరు నీకెవ్వరు!

## 12వ సారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ నెగ్గిన రాఫెల్ నాదల్

**ఫైనల్లో థీమ్‌పై గెలుపు • రూ.18 కోట్ల 8 లక్షల ప్రైజ్‌మనీ సొంతం**

ఎర్రమట్టి కోర్టులపై తనకు తిరుగులేదని స్పెయిన్ టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ మరోసారి నిరూపించాడు. టెన్నిస్ చరిత్రలోనే ఎవరికీ సాధ్యం కాని రీతిలో ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌ను రికార్డు స్థాయిలో 12వసారి సొంతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో గతేడాది ఫలితమే పునరావృతం అయింది. గత సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాదీ డొమినిక్ థీమ్‌ను ఓడించి నాదల్ చాంపియన్‌గా నిలిచాడు.

**పారిస్:** ఊహించిన ఫలితమే వచ్చింది. ఎలాంటి అద్భుతం జరగలేదు. మట్టికోర్టులపై మకుటంలేని మహరాజు తానేనని రాఫెల్ నాదల్ మళ్లీ చాటి చెప్పాడు. ఈ స్పెయిన్ స్టార్ రికార్డుస్థాయిలో 12వ సారి ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను హస్తగతం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో రెండో సీడ్ రాఫెల్ నాదల్ 6–3, 5–7, 6–1, 6–1తో నాలుగో సీడ్ డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)ను ఓడించాడు. 3 గంటల ఒక నిమిషంపాటు జరిగిన ఈ తుది సమరంలో నాదల్ మూడు ఏస్‌లు సంధించి, తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేశాడు. 38 విన్నర్స్ కొట్టిన అతడు 31 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు థీమ్ ఏడు ఏస్‌లు సంధించి, నాదల్ సర్వీసును రెండుసార్లు బ్రేక్ చేయగలిగాడు. 31 విన్నర్స్ కొట్టిన అతడు 38 అనవసర తప్పిదాలు చేశాడు. విజేత రాఫెల్ నాదల్‌కు ట్రోఫీతోపాటు 23 లక్షల యూరోలు (రూ. 18 కోట్ల 8 లక్షలు), రన్నరప్ థీమ్‌కు 11 లక్షల 80 వేల యూరోలు (రూ. 9 కోట్ల 27 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

వేర్వేరు టోర్నమెంట్‌లలో నాలుగుసార్లు క్లే కోర్టులపై నాదల్‌ను ఓడించిన రికార్డు కలిగిన డొమినిక్ థీమ్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు వచ్చేసరికి మాత్రం చేతులెత్తేస్తున్నాడు. గతేడాది వరుసగా మూడు సెట్లలో ఓడిపోయిన థీమ్‌కు ఈసారి మాత్రం ఒక సెట్‌ను గెలిచిన సంతృప్తి మిగిలింది. ఫైనల్ తొలి సెట్‌లో థీమ్ ఐదో గేమ్‌లో నాదల్ సర్వీస్‌ను బ్రేక్ చేసి 3–2తో ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ వెంటనే థీమ్ సర్వీస్‌ను నాదల్ బ్రేక్ చేసి స్కోరును 3–3తో సమం చేశాడు. ఎనిమిదో గేమ్‌లో మరోసారి థీమ్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన నాదల్ సెట్‌ను 6–3తో గెల్చుకున్నాడు. రెండో సెట్‌లో ఇద్దరూ హోరాహోరీగా పోరాడారు. ఆఖరికి 12వ గేమ్‌లో నాదల్ సర్వీస్‌ను బ్రేక్ చేసి థీమ్ సెట్‌ను 7–5తో దక్కించుకున్నాడు. అయితే ఫ్రెంచ్ ఓపెన్‌లో అద్వితీయమైన రికార్డు ఉన్న నాదల్ ఒక్కసారిగా విజృంభించాడు. థీమ్‌ను ఏమాత్రం తక్కువ అంచనా వేయకుండా పూర్తి నియంత్రణతో ఆడుతూ మూడో సెట్‌లో ఒక గేమ్, నాలుగో సెట్‌లో ఒక గేమ్ కోల్పోయి గెలుపు ఖాయం చేసుకున్నాడు.

> 12వసారి ఫ్రెంచ్ ఓపెన్ ట్రోఫీని అందుకుంటున్న అనుభూతిని మాటల్లో వర్ణించలేను. ఫైనల్లో ఓడిపోవడం ఎంత బాధ కలిగిస్తుందో తెలుసు. ఏనాటికైనా నువ్వు (థీమ్) ఈ టైటిల్ సాధిస్తావు.
>
> **- నాదల్**

**1** టెన్నిస్ చరిత్రలో ఒకే గ్రాండ్‌స్లామ్ టోర్నీని అత్యధికంగా 11 సార్లు గెలిచిన రికార్డు ఆస్ట్రేలియా క్రీడాకారిణి మార్గరెట్ కోర్ట్ (ఆస్ట్రేలియన్ ఓపెన్) పేరిట ఉంది. తాజా టైటిల్‌తో ఈ రికార్డును నాదల్ బద్దలు కొట్టాడు.

**93** ఫ్రెంచ్ ఓపెన్‌లో నాదల్ గెలిచిన మ్యాచ్‌ల సంఖ్య. బరిలోకి దిగాక కేవలం రెండుసార్లు మాత్రమే నాదల్ (2009లో సోడెర్లింగ్ చేతిలో ప్రిక్వార్టర్ ఫైనల్లో; 2015లో జొకోవిచ్ చేతిలో క్వార్టర్ ఫైనల్లో) ఓడిపోయాడు.

**6** నాదల్ 12 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ (2005, 2006, 2007, 2008, 2010, 2011, 2012, 2013, 2014, 2017, 2018, 2019) సాధించగా.... ఆరుసార్లు వేర్వేరు ప్రత్యర్థులపై గెలిచాడు. ఫైనల్స్‌లో ఫెడరర్‌పై నాలుగు సార్లు, జొకోవిచ్, థీమ్‌లపై రెండుసార్లు, రాబిన్ సోడెర్లింగ్, పుయెర్టా, డేవిడ్ ఫెరర్, వావ్రింకాలపై ఒక్కోసారి గెలిచాడు.

**18** ఓవరాల్‌గా నాదల్ గెలిచిన గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ (12 ఫ్రెంచ్; 3 యూఎస్ ఓపెన్, 2 వింబుల్డన్, 1 ఆస్ట్రేలియన్ ఓపెన్). అత్యధిక గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన రికార్డు రోజర్ ఫెడరర్ (20) పేరిట ఉంది. ఓవరాల్‌గా నాదల్ కెరీర్‌లో 82 సింగిల్స్ టైటిల్స్ సాధించాడు.

# కంగారూలను కసిగా...

సరిగ్గా మూడు నెలల క్రితం సొంతగడ్డపై భారత్‌కు ఆసీస్ చేతిలోనే వన్డే సిరీస్‌లో పరాభవం ఎదురైంది. 358 పరుగులు చేసి సునాయాసంగా గెలుస్తామనుకున్న మ్యాచ్‌లో కూడా కంగారూలు మనకు షాకిచ్చారు. ఆ జట్టు చేతిలో వరుసగా మూడు ఓటముల తర్వాత ప్రపంచకప్ పోరుకు సిద్ధమైన భారత్ ఆ కసినంతా తీర్చుకుంది. మెగా టోర్నీ సమరంలో ఆసీస్‌ను చిత్తుగా ఓడించి విశ్వ వేదికపై మరో విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. ఈసారి 352 పరుగులు చేసి సవాల్ విసిరిన కోహ్లి సేన మళ్లీ ఎలాంటి పొరపాటుకు అవకాశం ఇవ్వలేదు. తమ బౌలింగ్ బలగంతో ప్రత్యర్థిని కుప్పకూల్చి ఫేవరెట్ హోదాను మరింత పటిష్టం చేసుకుంది. ఐసీసీ టోర్నీల్లో తన అద్భుత ఆటను కొనసాగిస్తూ ధావన్ మరో శతకం చేయడం... కోహ్లి, రోహిత్, పాండ్యా అండగా నిలవడం భారత్ విజయానికి కారణమయ్యాయి.

## ప్రపంచ కప్ పోరులో భారత్ ఘనవిజయం

- 36 పరుగులతో ఆస్ట్రేలియా చిత్తు
- శిఖర్ ధావన్ సెంచరీ
- మెరిసిన కోహ్లి, రోహిత్
- రాణించిన భువనేశ్వర్, బుమ్రా



ధావన్

**లండన్:** ప్రపంచ కప్‌లో భారత్ కీలక సమరంలో తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆదివారం ఇక్కడి ఓవల్ మైదానంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత్ 36 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 352 పరుగులు చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' శిఖర్ ధావన్ (109 బంతుల్లో 117; 16 ఫోర్లు) సెంచరీతో చెలరేగగా... విరాట్ కోహ్లి (77 బంతుల్లో 82; 4 ఫోర్లు, 2 సిక్సర్లు), రోహిత్ శర్మ (70 బంతుల్లో 57; 3 ఫోర్లు, 1 సిక్స్), హార్దిక్ పాండ్యా (27 బంతుల్లో 48; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు. అనంతరం ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 316 పరుగులకు ఆలౌటైంది. స్టీవ్ స్మిత్ (70 బంతుల్లో 69; 5 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ వార్నర్ (84 బంతుల్లో 56; 5 ఫోర్లు), అలెక్స్ క్యారీ (35 బంతుల్లో 55 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. బుమ్రా, భువనేశ్వర్ చెరో 3 వికెట్లు తీశారు.



కోహ్లి

### భారీ భాగస్వామ్యం...

127, 93, 81... తొలి మూడు వికెట్లకు భారత బ్యాట్స్‌మెన్ నెలకొల్పిన పార్ట్‌నర్‌షిప్‌లు ఇవి. ఆరంభంలో పదునైన బౌలింగ్‌ను ఓపిగ్గా, సమర్థంగా ఎదుర్కొని ఓపెనర్లు పరుగులు సాధిస్తే, ఆ తర్వాతి బ్యాట్స్‌మెన్ దూకుడు జట్టుకు భారీ స్కోరును అందించింది. ఇన్నింగ్స్ ఆరంభంలో రోహిత్, ధావన్‌లను కమిన్స్, స్టార్క్ కట్టిపడేశారు. వీరిద్దరు వేసిన తొలి ఏడు ఓవర్లలో ఒకే ఒక బౌండరీ కొట్టిన భారత్ 22 పరుగులే చేయగలిగింది. 2 పరుగుల వద్ద రోహిత్ ఇచ్చిన క్యాచ్‌ను కూల్టర్ నైల్ వదిలేయడం కూడా మరో కీలక మలుపు. అయితే కూల్టర్ నైల్ వేసిన తర్వాతి ఓవర్లో ధావన్ మూడు ఫోర్లు బాదడంతో జోరు మొదలైంది. ఆ తర్వాత మ్యాక్స్‌వెల్, జంపా, స్టొయినిస్ బౌలింగ్‌లో భారత ఆటగాళ్లు సునాయాసంగా పరుగులు రాబట్టారు. ఈ క్రమంలో ముందుగా 53 బంతుల్లో ధావన్, ఆ తర్వాత 61 బంతుల్లో రోహిత్ అర్ధ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యం దాటిన తర్వాత ఎట్టకేలకు రోహిత్ ఔట్ కావడంతో ఆసీస్ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత మరింత వేగంగా దూసుకుపోయిన ధావన్ 95 బంతుల్లోనే సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. మరో ఎండ్‌లో కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా కొన్ని చూడచక్కటి షాట్లు ఆడాడు. భారీ షాట్‌కు ప్రయత్నించి ధావన్ వెనుదిరిగిన తర్వాత 55 బంతుల్లో కోహ్లి హాఫ్ సెంచరీ పూర్తయింది. అతని ఆటలో ముఖ్యంగా స్టార్క్ బౌలింగ్‌లో కొట్టిన రెండు సూపర్ సిక్సర్లు హైలైట్‌గా నిలిచాయి. తర్వాత వచ్చిన ఎమ్మెస్ ధోని (14 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిని కొనసాగిస్తూ స్టార్క్ ఓవర్లో వరుసగా ఫోర్, సిక్స్ కొట్టాడు. చివరి ఓవర్లో స్టొయినిస్ అద్భుత క్యాచ్‌కు ధోని, కోహ్లి ఔటైనా... రాహుల్ (11 నాటౌట్) స్కోరును 350 పరుగులు దాటించాడు. చివరి 10 ఓవర్లలో భారత్ 116 పరుగులు సాధించింది.

### రాణించిన స్మిత్...

దాదాపు అసాధ్యమైన విజయలక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం లభించలేదు. ఓపెనర్లు వార్నర్, ఫించ్ (35 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్) తమ స్వభావానికి విరుద్ధంగా అతి నెమ్మదిగా, జాగ్రత్తగా ఆడటంతో పరుగులు రావడమే గగనమైపోయింది. కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన భువీ, బుమ్రా కలిసి తొలి 7 ఓవర్లలో 19 పరుగులే ఇచ్చారు. అనంతరం పాండ్యా ఓవర్లో ఆసీస్ దూకుడు ప్రదర్శించింది. వరుస బంతుల్లో ఫించ్ 6, 4, 4 బాదగా, అంతకు వార్నర్ కొట్టిన ఫోర్‌తో ఓవర్లో మొత్తం 19 పరుగులు వచ్చాయి. జాదవ్ చక్కటి ఫీల్డింగ్‌కు ఫించ్ రనౌట్ కావడంతో ఆసీస్ మొదటి వికెట్ కోల్పోయింది. వార్నర్ తీవ్రంగా శ్రమించి (77 బంతుల్లో) అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. చివరకు చహల్ బౌలింగ్‌లో అతని ఆట ముగిసింది. మరోవైపు స్మిత్ క్రీజ్‌లోకి వచ్చిన దగ్గరనుంచి చక్కటి షాట్లతో చకచకా పరుగులు రాబట్టాడు. ఖాజా (39 బంతుల్లో 42; 4 ఫోర్లు, 1 సిక్స్) నుంచి అతనికి తగిన సహకారం లభించింది. ఖాజాను బుమ్రా బౌల్డ్ చేయగా... భువీ బంతికి స్మిత్ వికెట్ల ముందు దొరికిపోయాడు. స్టొయినిస్ (0), మ్యాక్స్‌వెల్ (14 బంతుల్లో 28; 5 ఫోర్లు) వెనుదిరగడంతో ఆసీస్ విజయంపై ఆశలు కోల్పోయింది. వరల్డ్ కప్‌లో వేగంగా అర్ధసెంచరీ చేసిన (25 బంతుల్లో) ఆసీస్ ఆటగాడిగా గుర్తింపు పొందిన క్యారీ జట్టును మాత్రం గెలిపించలేకపోయాడు.



### సున్నా నుంచి సూపర్‌గా...

ధావన్ 37వ ఓవర్ చివరి బంతికి ఔట్ కాగా, మిగిలిన ఓవర్లలో మరింత వేగంగా పరుగులు సాధించే లక్ష్యంతో భారత్ నాలుగో స్థానంలో పాండ్యాను పంపించింది. అతను తన పాత్రను సమర్థంగా పోషించాడు. వ్యక్తిగత స్కోరు '0' వద్ద కూల్టర్ నైల్ బౌలింగ్‌లో పాండ్యా ఇచ్చిన సునాయాస క్యాచ్‌ను కీపర్ క్యారీ వదిలేసి భారత్‌కు మేలు చేశాడు. ఆ తర్వాత పాండ్యా చెలరేగిపోయాడు. మ్యాక్స్‌వెల్, జంపా బౌలింగ్‌లో ఒక్కో సిక్సర్ కొట్టిన అతను కమిన్స్ ఓవర్లో వరుసగా 6, 4 బాదాడు. కమిన్స్ తర్వాతి ఓవర్లో మరో ఫోర్ కొట్టి అదే ఓవర్లో ఔట్ కావడంతో అతని మెరుపు ఇన్నింగ్స్ ముగిసింది.

### అలా పూర్తయింది...

ధావన్ కొంత ఉత్కంఠభరిత రీతిలో తన 17వ వన్డే సెంచరీని అందుకున్నాడు. స్టొయినిస్ బౌలింగ్‌లో 99 వద్ద సింగిల్ తీసేందుకు ప్రయత్నించి అతను వెనక్కి తగ్గాడు. అప్పటికే నాన్‌స్ట్రయికర్ కోహ్లి చాలా ముందుకొచ్చేశాడు. ఫీల్డర్ విసిరిన డైరెక్ట్ హిట్ వికెట్లకు తగిలినా... డైవ్ చేసిన కోహ్లి బతికిపోయాడు. బంతి స్టంప్స్‌ను తాకి దూరంగా వెళ్లడంతో బ్యాట్స్‌మెన్ సింగిల్ రాబట్టారు. దీంతో ధావన్ శతకం పూర్తయింది. టీవీ రీప్లేలో అంతా బాగుందని తేలిన తర్వాతే ధావన్ సంబరాలు చేసుకున్నాడు.

### భారంగా మారిన బెయిల్స్!



ఒకసారి కాదు, రెండు సార్లు కాదు... ఏకంగా ఐదు సార్లు! ఈ ప్రపంచ కప్‌లో బంతి స్టంప్స్‌కు తగిలి కూడా బెయిల్స్ కింద పడకపోవడంతో బ్యాట్స్‌మన్ ఔట్ కాకుండా తప్పించుకున్న ఘటన మళ్లీ జరిగింది. తాజాగా భారత్‌తో మ్యాచ్‌లో వార్నర్ కూడా ఇలాగే బతికిపోయాడు. బుమ్రా బౌలింగ్‌లో అతని బ్యాట్ అంచుకు తగిలిన బంతి స్టంప్స్‌ను ముద్దాడింది. కానీ బెయిల్స్ మాత్రం కింద పడనంటూ మొరాయించాయి. అప్పుడు వార్నర్ స్కోరు 1! ప్రపంచ కప్‌లో వాడుతున్న మిరుమిట్లు గొలిపే 'జింగ్ బెయిల్స్' బరువుగా ఉండటమే దీనికి కారణం. ఈ టోర్నీలో ఇంతకుముందు నాలుగు సార్లు డి కాక్ (బౌలర్ రషీద్), కరుణరత్నే (బౌల్ట్), గేల్ (స్టార్క్), స్టోక్స్ (సైపుద్దీన్) ఇలా బతికిపోయారు. ప్రపంచ కప్‌లో ఐసీసీ దీనికి ఏమైనా పరిష్కారం కనుగొంటుందేమో చూడాలి.

### ధోని గ్లవ్స్ మారాయి...



ధోని కీపింగ్ గ్లవ్స్‌కు సంబంధించి చెలరేగిన వివాదానికి ఆసీస్‌తో మ్యాచ్‌లో ముగింపు లభించింది. ఈ మ్యాచ్‌లో ధోని కీపింగ్ గ్లవ్స్ మారాయి. ఆర్మీ రెజిమెంట్ గుర్తు 'బలిదాన్ బ్యాడ్జ్' ఉన్న గ్లవ్‌లను వాడవద్దని ఐసీసీ స్పష్టంగా చెప్పడంతో అతను వాటిని పక్కన పెట్టాడు. స్పాన్సర్ సహా ఎలాంటి లోగో కనిపించని గ్లవ్స్‌తో అతను కీపింగ్ చేశాడు.

### 'వీలైతే అభినందించండి డ్యూడ్'



ట్యాంపరింగ్ వివాదంలో నిషేధం ముగిసి చాలా రోజులవుతున్నా ప్రేక్షకులు స్మిత్, వార్నర్‌లను మన్నించేలా లేరు. థర్డ్‌మ్యాన్ ప్రాంతంలో స్మిత్ ఫీల్డింగ్ చేస్తుండగా భారత ప్రేక్షకులు 'చీటర్, చీటర్' అంటూ గేలి చేశారు. కొద్దిసేపు దీనిని గమనించిన కోహ్లి, పాండ్యా వికెట్ పడ్డ సమయంలో ప్రేక్షకుల వద్దకు వెళ్లాడు. అలా ప్రవర్తించవద్దంటూ మందలించిన భారత కెప్టెన్... స్మిత్ కోసం చప్పట్లు కొట్టి ప్రోత్సహించాలని కూడా కోరాడు. ఆ తర్వాత భారత ప్రేక్షకుల తరఫున తానే స్వయంగా స్మిత్‌కు క్షమాపణలు చెప్పినట్లు కోహ్లి వెల్లడించాడు.

## స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (సి) క్యారీ (బి) కూల్టర్ నైల్ 57; ధావన్ (సి) (సబ్) లయన్ (బి) స్టార్క్ 117; కోహ్లి (సి) కమిన్స్ (బి) స్టొయినిస్ 82; హార్దిక్ పాండ్యా (సి) ఫించ్ (బి) కమిన్స్ 48; ధోని (సి అండ్ బి) స్టొయినిస్ 27; రాహుల్ (నాటౌట్) 11; కేదార్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 352.**
**వికెట్ల పతనం:** 1–127, 2–220, 3–301, 4–338, 5–348. **బౌలింగ్:** కమిన్స్ 10–0–55–1, స్టార్క్ 10–0–74–1, కూల్టర్ నైల్ 10–1–63–1, మ్యాక్స్‌వెల్ 7–0–45–0, జంపా 6–0–50–0, స్టొయినిస్ 7–0–62–2.

**ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** వార్నర్ (సి) భువనేశ్వర్ (బి) చహల్ 56; ఫించ్ (రనౌట్) 36; స్మిత్ (ఎల్బీ) (బి) భువనేశ్వర్ 69; ఖాజా (బి) బుమ్రా 42; మ్యాక్స్‌వెల్ (సి) (సబ్) జడేజా (బి) చహల్ 28 ; స్టొయినిస్ (బి) భువనేశ్వర్ 0; క్యారీ (నాటౌట్) 55; కూల్టర్ నైల్ (సి) కోహ్లి (బి) బుమ్రా 4; కమిన్స్ (సి) ధోని (బి) బుమ్రా 8; స్టార్క్ (రనౌట్) 3; జంపా (సి) (సబ్) జడేజా (బి) భువనేశ్వర్ 1; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (50 ఓవర్లలో ఆలౌట్) 316.**
**వికెట్ల పతనం:** 1–61, 2–133, 3–202, 4–238, 5–238, 6–244, 7–283, 8–300, 9–313, 10–316.
**బౌలింగ్:** భువనేశ్వర్ 10–0–50–3, బుమ్రా 10–1–61–3, పాండ్యా 10–0–68–0, కుల్దీప్ 9–0–55–0, చహల్ 10–0–62–2, జాదవ్ 1–0–14–0.

## పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ర | నె.ర.రే. | పా |
|---|---|---|---|---|---|---|
| న్యూజిలాండ్ | 3 | 3 | 0 | 0 | +2.163 | 6 |
| ఇంగ్లండ్ | 3 | 2 | 1 | 0 | +1.307 | 4 |
| భారత్ | 2 | 2 | 0 | 0 | +0.539 | 4 |
| ఆస్ట్రేలియా | 3 | 2 | 1 | 0 | +0.483 | 4 |
| శ్రీలంక | 3 | 1 | 1 | 1 | -1.517 | 3 |
| పాకిస్తాన్ | 3 | 1 | 1 | 1 | -2.412 | 3 |
| వెస్టిండీస్ | 2 | 1 | 1 | 0 | +2.054 | 2 |
| బంగ్లాదేశ్ | 3 | 1 | 2 | 0 | -0.714 | 2 |
| దక్షిణాఫ్రికా | 3 | 0 | 3 | 0 | -0.952 | 0 |
| అఫ్గానిస్తాన్ | 3 | 0 | 3 | 0 | -1.493 | 0 |

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, ర–రద్దు, నె.ర.రే–నెట్ రన్‌రేట్, పా–పాయింట్లు

## దక్షిణాఫ్రికా గెలిచేనా?

**నేడు వెస్టిండీస్‌తో మ్యాచ్**

- మధ్యాహ్నం గం.3 నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

**సౌతాంప్టన్:** వరుసగా మూడు పరాజయాలతో ప్రపంచ కప్‌లో క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న దక్షిణాఫ్రికాకు మరో కఠిన పరీక్ష. ఆ జట్టు సోమవారం సౌతాంప్టన్‌లో వెస్టిండీస్‌తో తలపడనుంది. ఒకదాంట్లో గెలిచి, మరోటి ఓడిన కరీబియన్లకిది మూడో మ్యాచ్. మామూలుగా చూస్తే మొత్తం వన్డే గెలుపోటముల గణాంకాల్లో వెస్టిండీస్‌పై సఫారీలది తిరుగులేని ఆధిపత్యం. గత మూడు కప్‌లలోనూ వారిపై విజయం సాధించింది. కానీ, ఇప్పుడు పరిస్థితి అంతా తారుమారైంది. సెమీస్ రేసులో నిలవాలంటే దక్షిణాఫ్రికా తప్పక గెలవాల్సి ఉండగా, కరీబియన్లు మంచి ఫామ్‌లో ఉన్నారు. ఇరు జట్లు ఇప్పటివరకు ప్రపంచ కప్‌లో ఆరు మ్యాచ్‌ల్లో తలపడితే... నాలుగింటిలో సఫారీలు, రెండింటిలో కరీబియన్లు నెగ్గారు.




"మ్యూచువల్ ఫండ్ లోని రిస్క్‌ని అర్థం చేసుకుని ఇన్వెస్ట్ చేయడం నిజమే మరి."

- మ్యూచువల్ ఫండ్‌లోని రిస్క్‌ని అర్థం చేసుకున్న తర్వాతనే అందులో ఇన్వెస్ట్ చెయ్యండి
- ఎక్కువ కాలం పెటుబడి పెట్టగల డబ్బునే ఇన్వెస్ట్ చెయ్యండి

MUTUAL FUNDS
నిజమే మరి

మరింత సమాచారానికై mutualfundssahihai.com ని సందర్శించండి | @mutualfundssahihai | @MFSahiHai | Mutual Funds Sahi Hai
మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు మార్కెట్‌లోని సంక్షోభాలకు లోబడి ఉంటాయి, స్కీముకి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్‌నీ జాగ్రత్తగా చదవండి.

1102.2019C



నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం ప్రగతిభవన్‌లో అభినందిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

# 27 కాలేజీల్లో ప్రవేశాలకు నో

- 183 కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు
- జేఎన్‌టీయూ ఓకే చెప్పినవి 156 కాలేజీలే



సాక్షి, హైదరాబాద్: ఈ సారి 27 ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్టీయూ) అనుమతి నిరాకరించింది. దీంతో వాటిల్లోని దాదాపు 8 వేలకు పైగా సీట్లు రద్దయ్యాయి. జేఎన్‌టీయూ ఇటీవల కాలేజీలకు జారీ చేసిన అనుబంధ గుర్తింపు లెక్కలు తేలాయి. రాష్ట్రంలోని 183 ఇంజనీరింగ్ కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా జేఎన్‌టీయూ 156 కాలేజీలకు గుర్తింపును జారీ చేసింది. దీంతో 27 కాలేజీలకు ఈసారి బీటెక్‌లో ప్రవేశాలు చేపట్టడానికి వీల్లేదు. అయితే వాటిల్లో ఎక్కువ శాతం కాలేజీల్లో వసతులు లేని కారణంగా అనుబంధ గుర్తింపును జేఎన్‌టీయూ నిరాకరించింది. మరికొన్ని కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ గతంలో ప్రవేశాలు లేని కారణంగా చివరలో విరమించుకున్నాయి. దీంతో ఆయా కాలేజీలతోపాటు ఇతర కాలేజీల్లో 8 వేలకు పైగా సీట్లు రద్దయ్యాయి. గతేడాది రాష్ట్రంలోని 202 కాలేజీల్లో ప్రవేశాల కోసం యాజమాన్యాలు అనుబంధ గుర్తింపు ఇవ్వాలని జేఎన్‌టీయూకు దరఖాస్తు చేసుకున్నాయి. వాటిల్లోని 174 కాలేజీల్లో 793 కోర్సులకు సంబంధించిన 86,176 సీట్ల భర్తీకి అనుబంధ గుర్తింపు ఇచ్చింది. ఈ సారి 183 కాలేజీలు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకుంటే అందులో 156 కాలేజీల్లోని 686 కోర్సులకు సంబంధించి 77,500 సీట్ల భర్తీకి అనుబంధ గుర్తింపును జారీ చేసింది. వీటితోపాటు ఫార్మసీ ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్ కోర్సులకు, కాలేజీలకు కూడా అనుబంధ గుర్తింపును జారీ చేసింది. ఫార్మసీలో గతేడాది 76 కాలేజీలకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకోగా, 73 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చింది. ఈ సారి 73 కాలేజీలు దరఖాస్తు చేసుకోగా, అందులో 67 కాలేజీలకు గుర్తింపు ఇచ్చింది. గతేడాది 17 ఎంబీఏ, ఎంసీఏ కాలేజీలు దరఖాస్తు చేసుకుంటే 16 కాలేజీలకు అనుబంధ గుర్తింపు ఇచ్చింది. ఈ సారి 13 కాలేజీలు దరఖాస్తు చేసుకుంటే 11 కాలేజీలకే అనుబంధ గుర్తింపు ఇచ్చింది.

### కోర్సుల వారీగా అనుబంధ గుర్తింపు వివరాలు..

| | ప్రస్తుతం | | గతేడాది | |
|---|---|---|---|---|
| కోర్సు | కాలేజీలు | సీట్లు | కాలేజీలు | సీట్లు |
| బీటెక్ | 156 | 77,500 | 174 | 86,176 |
| బీఫార్మసీ | 74 | 6,020 | 82 | 6,520 |
| ఎంటెక్ | -- | 4,542 | 74 | 5,685 |
| ఎం.ఫార్మసీ | -- | -- | 66 | 2,460 |
| ఎంబీఏ | 132 | 9,945 | 138 | 12,675 |
| ఎంసీఏ | 03 | 180 | 03 | 180 |

## కేరళలో రుతుపవనాల విస్తరణ

### నేడు, రేపు రాష్ట్రంలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ అరేబియా సముద్రం, లక్ష దీవులు, కేరళ ప్రాంతాలకు రానున్న 24 గంటల్లో నైరుతి రుతుపవనాలు పూర్తిగా విస్తరించే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. అయితే ఆదివారంలో పలుచోట్ల సూర్యుడు మండిపోయాడు. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, హన్మకొండ, ఖమ్మం, రామగుండంల్లో 43 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. నిజామాబాద్‌లో 42, నల్లగొండలో 41, మెదక్‌లో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రత నమోదు కాగా, మహబూబ్‌నగర్‌లో మాత్రం అత్యంత తక్కువగా 37 డిగ్రీలు, హైదరాబాద్‌లో 39 డిగ్రీలు రికార్డయింది.

## నిబంధనల ప్రకారమే ఆర్జిత సెలవులివ్వాలి

### డీఈఓలకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ఆర్జిత సెలవుల (ఈఎల్స్) జారీలో నిబంధనలను పాటించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు బి.సుధాకర్ స్పష్టం చేశారు. ఆదివారం సాక్షిలో 'ఆర్జిత సెలవుల పేరిట టీచర్ల అక్రమార్జన'శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఈఎల్స్ జారీలో నిబంధనలు పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే జారీ చేయాలని, ఈఎల్స్ ఎవరెవరికి ఇచ్చారనే వివరాలను ప్రభుత్వ పరీక్షల విభాగానికి సమర్పించాలని స్పష్టం చేశారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదివారం ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# పక్కాగా పదోన్నతులు

- బోధనాసుపత్రుల్లోని వైద్యులకు నిర్ణీత కాల ప్రమోషన్లు
- త్వరలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం... ప్రభుత్వ వైద్యుల సంఘం నేతల వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీలు, వాటి అనుబంధ బోధనాసుపత్రుల్లో పని చేసే వైద్యులకు శుభవార్త. వారికి ఇక నుంచి నిర్ణీతకాలంలో పదోన్నతులు లభిస్తాయి. గతేడాదే ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినా సాంకేతిక కారణాలతో అది అమలుకాలేదు. ఆ తర్వాత వరుసగా ఎన్నికలు రావడంతో ఇప్పటివరకు ఆ ఉత్తర్వులు సవరణకు నోచుకోలేదు. సవరణలు కోరుతూ వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. అందుకు సంబంధించిన ఫైలుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి నరహరి 'సాక్షి'కి తెలిపారు. 2016 యూజీసీ వేతన సవరణను అనుసరించి ఉత్తర్వులు వెలువడతాయని ఆయన ప్రకటించారు. తాజా నిర్ణయం ప్రకారం.. బోధనాసుపత్రుల్లో పనిచేసే అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీసు నాలుగేళ్లు నిండితే యథావిధిగా వారికి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి లభిస్తుంది. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్‌గా ఆరేళ్ల సర్వీసు నిండితే యథావిధిగా వారికి ప్రొఫెసర్‌గా పదోన్నతి లభిస్తుంది. మరోవైపు అసోసియేట్ ప్రొఫెసర్లకు మూడేళ్లు నిండాక స్కేల్‌లో మార్పు తీసుకొస్తారు. అంటే వారికి మధ్యలో ఒక ఆర్థిక ప్రయోజనం కల్పిస్తారు.

**పదోన్నతుల కోసం ఎదురుచూపు...**

ప్రస్తుతం పదోన్నతులు అత్యంత అశాస్త్రీయంగా ఉన్నాయన్న విమర్శ ఉంది. ఎవరైనా రిటైరయ్యాకే అంటే ఖాళీలు ఏర్పడ్డాకే పదోన్నతులు లభిస్తున్నాయి. ఒక్కోసారి పదేళ్లకు, పదిహేనేళ్లకు పదోన్నతులు వచ్చినవారూ ఉన్నారు. ఈ పరిస్థితిని మార్చాలని వైద్యులు ఎన్నాళ్లుగానో డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో బోధనాసుపత్రుల్లో పనిచేస్తున్న దాదాపు 3 వేల మంది వైద్యులకు ప్రయోజనం కలుగనుంది. అంతేకాదు వారికి పదోన్నతి వచ్చిన ప్రతీసారి కూడా స్కేల్స్‌లోనూ మార్పులుంటాయి. ప్రొఫెసర్‌గా ఉన్న వారికి తదుపరి పదోన్నతి లేకపోయినా మధ్యమధ్యలో స్కేల్స్‌లో నిర్ణీత సమయం ప్రకారం మార్పులు జరుగుతుంటాయి. ఇక వైద్యులకు ఖాళీలు లేకపోయినా నిర్ణీత కాలంలో పదోన్నతులు ఇవ్వడంతో ఒక్కోసారి వారి హోదా మారుతుందే కానీ పనిలో మార్పు ఉండదు. ఖాళీలు ఏర్పడ్డాకే వారు ఇతర పోస్టులకు మారుతారు. అంటే అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు ఖాళీలు లేకపోయినా నాలుగేళ్లకు అసోసియేట్‌గా పదోన్నతి లభిస్తే, అతను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానే విధులు నిర్వహిస్తారు. అక్కడ ఖాళీ ఏర్పడితేనే అతని విధులు మారుతాయి. ముఖ్యమంత్రి ఆమోదం తెలిపినందున త్వరలోనే సవరణ ఉత్తర్వులు వెలువడతాయన్న ఆశాభావాన్ని డాక్టర్ నరహరి వ్యక్తం చేశారు.

# శ్రీవారిని దర్శించుకున్న మోదీ

- ఆయన వెంట గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం వైఎస్ జగన్
- అనంతరం ముగ్గురికీ వేద పండితుల ఆశీర్వచనం

తిరుమల: ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం రాత్రి తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కూడా ఉన్నారు. శ్రీలంక రాజధాని కొలంబొ నుంచి శ్రీవారి దర్శనార్థం మోదీ ప్రత్యేక విమానంలో ఆదివారం సాయంత్రం చిత్తూరు జిల్లా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమలలోని పద్మావతి అతిథి గృహం వద్దకు చేరుకున్నారు. అక్కడ గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టీటీడీ ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ ప్రధానికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ముగ్గురూ అతిథిగృహంలో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆ తర్వాత మోదీ, నరసింహన్, వైఎస్ జగన్ నేరుగా శ్రీవారి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకోగా ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. మొదటగా ధ్వజస్తంభానికి మొక్కుకుని బంగారు వాకిలి నుంచి ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి వైభవం, ప్రాశస్త్యాన్ని ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు మోదీకి వివరించారు. ఆలయ జీయర్లు శేషవస్త్రంతో సత్కరించారు. దర్శనానంతరం ప్రధాని, గవర్నర్, ఏపీ సీఎం వకుళామాతను, విమాన వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. హుండీలో కానుకలు సమర్పించిన ప్రధాని.. వెండివాకిలి నుంచి వెలుపలకి వచ్చారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు ముగ్గురికీ వేద ఆశీర్వచనం చేశారు. ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం మోదీ, వైఎస్ జగన్ ఆలయం వెలుపలకు రాగానే భక్తులు పెద్దఎత్తున హర్షధ్వానా లు చేశారు. ప్రధాని, సీఎం వారికి అభివాదం చేస్తూ పద్మావతి అతిథిగృహానికి పయనమయ్యారు. విశ్రాంతి తీసు కున్న అనంతరం రేణిగుంట విమానాశ్రయానికి బయలుదేరారు.



రేణిగుంట విమానాశ్రయంలో ప్రధానికి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



దర్శనానంతరం శ్రీవారి ఆలయంలో ప్రధాని నరేంద్ర మోదీ, గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం వైఎస్ జగన్, టీటీడీ ఈవో సింఘాల్



ఆదివారం తిరుపతిలో ప్రజాధన్యవాద సభలో ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

# ఏపీకి అండగా ఉంటాం

### ఇక్కడ బలమైన ప్రభుత్వం ఏర్పడింది • వైఎస్ జగన్‌కు అభినందనలు: ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, తిరుపతి/రేణిగుంట: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఏపీలో బలమైన ప్రభుత్వం ఏర్పడింది. ఆయనకు.. మంచి నేతలను ఎన్నుకున్నందుకు రాష్ట్ర ప్రజలకు అభినందనలు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఏపీకి అన్ని విధాల సంపూర్ణ సహకారం అందిస్తాం'.. అని భారత ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ప్రధానమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి తిరుపతికి వచ్చిన మోదీ రేణిగుంట విమానాశ్రయం సమీపంలో బీజేపీ నేతలు ఏర్పాటుచేసిన 'ప్రజా ధన్యవాద సభ'లో ప్రసంగించారు. 'బాలాజీ పాదపద్మాల సాక్షిగా నాకు మరోసారి అధికారం అప్పగించిన భారత దేశ ప్రజలందరికీ కృతజ్ఞతలు.. స్వామికి నా ప్రణామాలు'.. అంటూ శ్రీవారి నామస్మరణతో మోదీ తెలుగులో ప్రసంగం ప్రారంభించారు. 'రెండోసారి విజయం సాధించిన తర్వాత శ్రీవారి ఆశీర్వాదం తీసుకోవడానికి వచ్చాను. అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి తిరుపతి రావడం ఆనందంగా ఉంది. 130 కోట్ల భారత ప్రజల ఆశయాలు తీర్చాలని శ్రీవారిని ప్రార్థిస్తున్నాను. శ్రీలంక పర్యటన ఆలస్యం కావడంవల్ల ఇక్కడికి కొంచెం ఆలస్యంగా వచ్చాను. అందుకు క్షమించండి. ఎన్నికలు గెలవడం మాత్రమే కాదు.. ప్రజల మనస్సులను కూడా గెలవాల్సి ఉంది. కేంద్రంలో బలమైన ప్రభుత్వం ఏర్పడింది.. ప్రజలందరి ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషిచేస్తుంది'.. అని మోదీ అన్నారు. దేశంలో ప్రజల ఆకాంక్షలు పెరగటం దేశ సౌభాగ్యంగా భావిస్తున్నానని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే, వాటిని తాము నెరవేర్చడంలేదని కొందరు మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజల విశ్వాసం పొందినప్పుడే పాలకులు శక్తివంతులవుతారని వ్యాఖ్యానించారు. సత్యనిష్ఠతో దేశ సేవ చేస్తామన్నారు. వచ్చే ఐదేళ్లలో దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తామని ప్రధాని ధీమా వ్యక్తంచేశారు. దేశం ముందు ప్రస్తుతం రెండు ప్రధాన అవకాశాలున్నాయని, వాటిని మనం పోగొట్టుకోకూడదని మోదీ కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతోందని.. దేశానికి ఏదో ఒకటి చేయాలని ప్రజలందరూ సంకల్పించాలని పిలుపునిచ్చారు. ఐదేళ్ల అనుభవం.. అవినీతి రహిత పాలన అందించడం ద్వారా 130 కోట్ల మంది ప్రజలు అందరూ ఆశీర్వదించారని తెలిపారు. మహాత్మాగాంధీ 150 సంవత్సరాల వేడుకకు సిద్ధమౌతున్నామన్నారు. ప్రజలను సంఘటితం చెయ్యటం తమ లక్ష్యమని ప్రధాని తెలియజేశారు.

**ఏపీ ప్రజలు విజ్ఞానవంతులు**

ఏపీలో ప్రజలు విజ్ఞానవంతులని.. స్టార్టప్ కార్యక్రమంలో ఎంతో నిష్ణాతులైన వారు ఉన్నారని ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన ఆంధ్రప్రదేశ్, తమిళ ప్రజలకు ధన్యవాదాలు చెప్పారు. ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టారని.. ప్రజల ఆకాంక్షల మేరకే కేంద్రంలోని ప్రభుత్వం పనిచేస్తుందని హామీ ఇస్తున్నానన్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను కొనియాడారు. జగన్‌రెడ్డి నాయకత్వంలో ఏపీలో శక్తివంతమైన ప్రభుత్వం ఏర్పాటైందని ప్రశంసించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచెయ్యాలని ఆకాంక్షించారు. ఏపీ ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని స్పష్టంచేశారు. అభివృద్ధిలో దూసుకుపోవడానికి అన్ని అవకాశాలున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని చెప్పారు. కొత్తదనం సృష్టించటంలో నవ్యాంధ్ర దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. అన్ని రాష్ట్రాలు కలిస్తేనే నవ భారత్ సాధ్యమవుతుందని మోదీ ఆశాభావం వ్యక్తంచేశారు. కాగా, సభలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ ఏపీ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, లక్ష్మణ్.. కేంద్ర మాజీమంత్రి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ, టీడీపీలో ఎన్టీఆర్ ఆశయాల్లేవని, నారావారి ఆశయాలు మాత్రమే ఉన్నాయని ఎద్దేవా చేశారు.

**ప్రధాని మోదీకి ఘనస్వాగతం**

అంతకుముందు.. ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం 5.20గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఆయనకు గవర్నర్ నరసింహన్, ఏపీ సీఎం వైఎస్ జగన్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు.

# ఎస్సై, కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ వేగవంతం

- 14 నుంచి 22 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- రాష్ట్రవ్యాప్తంగా 18 వెరిఫికేషన్ కేంద్రాలు
- అభ్యర్థుల వ్యక్తిగత ఖాతాలకు ఇంటిమేషన్ లెటర్స్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీసు నియామక బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) రిక్రూట్‌మెంట్ ప్రక్రియను వేగవంతం చేసింది. దీనిలో భాగంగా ఇటీవల బోర్డు నిర్వహించిన సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీసు కానిస్టేబుల్ (టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్) తుది రాతపరీక్షల్లో అర్హత సాధించిన వారి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ 14వ తేదీ నుంచి 22 వరకు నిర్వహించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా వెరిఫికేషన్ ప్రక్రియ కోసం అభ్యర్థులు హాజరుకావాల్సిన 18 కేంద్రాల వివరాలను ఆదివారం వెల్లడించింది. ఆయా కేంద్రాల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరుకావాల్సిన అభ్యర్థులకు ఇంటిమేషన్ లెటర్స్‌ను పంపించింది. ఈ లెటర్స్ 'httpr://www.-trprb.in/'లో వ్యక్తిగత ఖాతాల్లో జూన్ 12న ఉదయం 8 గంటల నుంచి నుంచి జూన్ 13న రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. కాగా, ఎడిటింగ్ కోసం దరఖాస్తు చేసిన ఏ-టైప్ అభ్యర్థులకు జూన్ 20, 21 తేదీల్లో వెరిఫికేషన్ ఉంటుంది.

**వెరిఫికేషన్ కేంద్రాల వివరాలు..**

ఆదిలాబాద్: ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, ఎస్పీ ఆఫీసు, ఆదిలాబాద్; సైబరాబాద్: సీపీ ఆఫీస్, గచ్చిబౌలి, హైదరాబాద్; హైదరాబాద్: మెట్రో బ్యారక్స్, బేగంపేట మెట్రోస్టేషన్ పక్కన, హైదరాబాద్; కరీంనగర్: సీపీ కార్యాలయం, కరీంనగర్; ఖమ్మం: సీపీ కార్యాలయం, ఖమ్మం; కొత్తగూడెం: సీఆర్‌క్లబ్, ప్రకాశం స్టేడియం ఎదురుగా, పోస్టాఫీసు సమీపంలో; మహబూబాబాద్: ఎస్పీ కార్యాలయం, మహబూబాబాద్; మహబూబ్‌నగర్: ఎస్పీ కార్యాలయం, మహబూబ్‌నగర్; నాగర్‌కర్నూల్: ముస్లిం మైనార్టీ కాలేజ్, ఈద్గా వద్ద, సిరిపురం రోడ్డు, నాగర్‌కర్నూల్; నల్లగొండ: ఎస్పీ కార్యాలయం, నల్లగొండ; నిజామాబాద్: సీపీ ఆఫీస్, నిజామాబాద్; రాచకొండ: సీపీ క్యాంప్ ఆఫీస్, ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ఎల్బీనగర్; రామగుండం: సీపీ ఆఫీస్, రామగుండం; సంగారెడ్డి: ఎస్పీ ఆఫీస్, సంగారెడ్డి; సిద్దిపేట: టీటీసీ బిల్డింగ్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా, బైపాస్ రోడ్; సూర్యాపేట: ఎస్పీ ఆఫీస్, వరంగల్; టీఎస్ఎల్‌పీఆర్‌బీ: సీపీ ఆఫీస్ గచ్చిబౌలి, హైదరాబాద్; వరంగల్: సీపీ ఆఫీస్, వరంగల్.

**ఈ డాక్యుమెంట్లు తప్పనిసరి..**

- ఇంటిమేషన్ లెటర్లు అందిన పోలీసు అభ్యర్థులు ప్రకటించిన తేదీల్లో ఉదయం 9 గంటల కల్లా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలి.
- ఎడిటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత పత్రం (ట్రాన్సెక్షన్ ఫాం)తో అక్కడ ఉన్న సిబ్బందిని సంప్రదించాలి.
- డ్రైవర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు హెవీమోటార్ వెహికల్ లైసెన్స్‌ను తప్పకుండా తీసుకురావాలి.
- ఫొటోలు, విద్యార్హత, స్టడీ/బోనఫైడ్, కులం, స్థానికత, ఆధార్, ఏజెన్సీ, ఎక్స్‌సర్వీస్‌మెన్, హోంగార్డు, ఎన్‌సీసీ తదితర సర్టిఫికెట్లు సంబంధిత ఇతర అన్ని పత్రాలు తీసుకురావాలని టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు.
- అన్ని ధ్రువీకరణపత్రాలు 2014 జూన్ 2 తరువాత జారీ చేసినవై ఉండాలి.

## ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలి

### పద్మశాలీ ఉద్యోగుల సంఘం పిలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రతి సోమవారం పద్మశాలీ ఉద్యోగులు, కులబాంధవులు చేనేత వస్త్రాలను ధరించాలని తెలంగాణ పద్మశాలీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన అధ్యక్షతన ఇక్కడ జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. అలాగే వచ్చే ఆగస్టు నెలలో రాష్ట్ర ప్రతినిధుల సభను నిర్వహించడం, అన్ని పాత జిల్లా కేంద్రాల్లో పద్మశాలీ మ్యారేజ్ బ్యూరోలు ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను నిర్వహించడం వంటి పలు తీర్మానాలను కూడా చేశారు. ఈసందర్భంగా పేద పద్మశాలీ విద్యార్థులకు అవసరమైన సహాయం అందించాలని జిల్లా కార్యవర్గాలను కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాస్ యాదగిరి, కోశాధికారి లకుం నవీన్ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రాహుల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బీటెక్‌లో ఆన్‌లైన్ వ్యాల్యుయేషన్

- ఈ విద్యా సంవత్సరపు వార్షిక పరీక్షల నుంచి అమలు
- ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఎంటెక్‌లో అమలు
- మూల్యాంకనంలో రెండు దశల వెరిఫికేషన్
- తేడాలు వస్తే మరోసారి మూల్యాంకనం
- జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: జేఎన్‌టీయూ పరిధిలో ఇకపై ఆన్‌లైన్‌లో వ్యాల్యుయేషన్ చేసేందుకు కసరత్తు ప్రారంభమైంది. ప్రస్తుతం ఎంటెక్‌లో ప్రయోగాత్మకంగా ఆన్‌లైన్ వ్యాల్యుయేషన్‌ను విధానాన్ని ప్రవేశపెట్టిన జేఎన్‌టీయూహెచ్.. ఇకపై బీటెక్‌లోనూ దానిని అమలుచేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇటీవల జరిగిన ఎంటెక్ పరీక్షల్లో ఆన్‌లైన్ మూల్యాంకన విధానాన్ని అమలు చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో బీటెక్‌లో చేరే విద్యార్థుల సెమిస్టర్ పరీక్షల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్‌లో చేపట్టాలని భావిస్తున్నట్లు జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. మరోవైపు పరీక్షల మూల్యాంకన విధానంలో పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక లెక్చరర్ జవాబు పత్రాన్ని మూల్యాంకనం చేసిన తరువాత అతనికి తెలియకుండానే దానిని మళ్లీ మరో లెక్చరర్‌తో మూల్యాంకనం చేయిస్తున్నామని, తద్వారా మూల్యాంకనంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఒకవేళ ఆ ఇద్దరు చేసిన మూల్యాంకనంలో భారీ తేడాలు ఉంటే మొదట మూల్యాంకనం చేసిన లెక్చరర్‌ను పిలిపించి మళ్లీ మూల్యాంకనం చేయిస్తున్నామని వెల్లడించారు. దీనివల్ల ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. మరోవైపు జేఎన్‌టీయూలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గతేడాది ఎంటెక్‌లో ఫోరెన్సిక్ సైన్స్ అండ్ సెక్యూరిటీ కోర్సును ప్రవేశపెట్టిన తాము ఈసారి ఎంటెక్‌లో 80 సీట్లతో డేటా సైన్స్ కోర్సును ప్రవేశపెడుతున్నట్లు వివరించారు.

**కొత్త కోర్సులకు కాలేజీల దరఖాస్తు**

ఈసారి రాష్ట్రంలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు, కొన్ని డిమాండ్ ఉన్న కోర్సుల్లో సీట్లను పెంచుకునేందుకు కాలేజీల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి వివరించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ వంటి కోర్సులను ప్రారంభించేందుకు అనుబంధ గుర్తింపు కోసం పలు కాలేజీలు దరఖాస్తు చేసుకున్నాయని వివరించారు. వాటి విషయంలో నిర్ణయం తీసుకునే ముందు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిపారు. గతంలోనే ప్రభుత్వం రాష్ట్రంలో అదనంగా ఇంజనీరింగ్ కాలేజీలు, సీట్లు వద్దని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ అనుమతి కోరినట్లు వివరించారు.

**నెలాఖరులో ఇంటర్వ్యూలు..**

ఈ నెలాఖరులో 36 ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించాలని భావిస్తున్నట్లు ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. దీనికోసం 340 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. మరోవైపు యూనివర్సిటీ, యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ కాలేజీల్లో 154 అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని, రోస్టర్ విధానంపై స్పష్టత వచ్చిన వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు.

# రవిప్రకాశ్ కేసులో తొలగని ఉత్కంఠ

- నేడు న్యాయస్థానం ముందుకు పోలీసులు
- సుప్రీం ఆదేశాలు పాటించరు.. విచారణకు సహకరించడం లేదు
- కేసును ప్రభావితం చేసే ధోరణిని వివరించనున్న పోలీసులు
- తదుపరి చర్యల కోసం విజ్ఞప్తి
- ఫోర్జరీ చేశానని ఇప్పటికే అంగీకరించిన రవిప్రకాశ్



సాక్షి, హైదరాబాద్: ఫోర్జరీ, నిధుల మళ్లింపు, లోగో విక్రయం తదితర కేసుల్లో పోలీసులు దర్యాప్తు మరింత వేగవంతం చేశారు. దర్యాప్తులో సహకరించని టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ వైఖరిని న్యాయస్థానం దృష్టి తీసుకెళ్లి, న్యాయమూర్తి ఇచ్చే ఆదేశాల అనుసారంగా ముందుకు సాగేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే టీవీ9కి సంబంధించి అటు హైదరాబాద్, ఇటు సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో నమోదైన కేసుల ఆధారంగా పలు సాక్ష్యాలు సంపాదించిన పోలీసులు మరిన్ని ఆధారాల సేకరణలో తలమునకలయ్యారు. ఇప్పటికే ఫోర్జరీ కేసులో సంస్థ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు రవిప్రకాశ్ అంగీకరించిన నేపథ్యంలో పోలీసులు మిగిలిన కేసులపై దృష్టి సారించారు. ఈ కేసులో శివాజీ–రవిప్రకాశ్ మధ్య నడిచిన లావాదేవీలు, పాతతేదీలతో నకిలీపత్రాల సృష్టికి సంబంధించి పలు వివరాలను పోలీసులు సంగ్రహించిన విషయం తెలిసిందే. చానల్ నుంచి నిధులను తన సొంత ఖాతాకు బదిలీ చేసిన విషయంలోనూ పోలీసుల వద్ద పక్కా ఆధారాలు ఉన్నట్లు తెలిసింది. అదే సమయంలో బంజారాహిల్స్ పోలీసులు సేకరించిన ఆధారాలు కూడా కేసులో కీలకం కానున్నాయి. దాదాపు రూ.100 కోట్ల విలువ చేసే టీవీ9 లోగోను కేవలం రూ.99 వేలకు విక్రయించడంపైనా పోలీసుల సందేహాలు కొలిక్కి వస్తున్నట్లు సమాచారం. అందుకు సంబంధించిన పత్రాలను ఇప్పటికే స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటి విశ్వసనీయతపై నిగ్గు తేల్చనున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో కీలక నిందితుడు సినీనటుడు శివాజీ తనకు మంచి మిత్రుడని చెప్పిన రవిప్రకాశ్.. అతన్ని ఎందుకు మోసం చేయాల్సి వచ్చిందన్న ప్రశ్నలకు మౌనం వహించడం విశేషం. మరోవైపు సైబరాబాద్ పోలీసులపైనా రవిప్రకాశ్ బెదిరింపులకు దిగడం కూడా గమనార్హం. ఈ మొత్తం వ్యవహారంలో రవిప్రకాశ్ విచారణను సాంతం పోలీసులు వీడియోలో చిత్రీకరించారు. రెండు కమిషనరేట్లలో పోలీసులు ఇప్పటిదాకా సేకరించిన ఆధారాలు సరిపోలేదని అనిపిస్తే.. మరోసారి రవిప్రకాశ్‌ను విచారించే అవకాశాలు ఉన్నాయి.

**న్యాయస్థానం ఆదేశాలతో ముందుకెళతాం..**

రవిప్రకాశ్ కేసు విషయమై ఏసీపీ సీహెచ్‌వై శ్రీనివాస్ కుమార్ సైబరాబాద్ కమిషనరేట్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ కేసు దర్యాప్తు ఫిర్యాదులోని అంశాల ఆధారంగా జరుగుతోంది. తదుపరి విచారణ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకూ జరిగిన దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలను సోమవారం న్యాయస్థానం ముందుంచుతాం. తదుపరి దర్యాప్తు ముందుకుసాగేలా అవసరమైన ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థిస్తాం.. అని అన్నారు.

**లోపల ఒకలా.. బయట మరోలా..**

కేసు సాంతం రవిప్రకాశ్ వ్యవహారశైలి వింతగా ఉంటూ వస్తోంది. లోపల విచారణలో ఒకలా.. బయట మీడియాకు మరోలా కనిపిస్తూ.. విచారణను ప్రభావితం చేసేందుకు యత్నిస్తున్నారు. లోపల మాత్రం దర్యాప్తునకు సహకరించడం లేదు. పైగా కేసు నమోదైనప్పటి నుంచి కోర్టులో పిటిషన్ల విచారణ జరుగుతున్నపుడు వాటిపై ప్రభావం చూపేలా 9వ తేదీన ఒకసారి, 22వ తేదీన మరోసారి వీడియోలు రిలీజ్ చేశాడు. విచారణకు హాజరైనప్పుడు మాత్రం ఏ ప్రశ్నలకు సమాధానం చెప్పడం లేదు. పైగా ప్రశ్నావళి రాసిస్తే.. తాను వాటికి సమాధానాలు రాసిస్తాను అంటూ వెటకారంగా మాట్లాడుతున్నారు. ఓ పది నిమిషాలు ప్రశ్నలు అడిగాక తల టేబుల్‌పై పెట్టుకుని పడుకుంటున్నారు. విచారణకు సంబంధించిన వీడియో రికార్డింగ్ అంతా తనికివ్వాలంటూ పోలీసులను కోరుతున్నారు. ఆరునెలల తరువాత అసలు యుద్ధం మొదలుపెడతా అంటూ బెదిరింపు ధోరణిలో మాట్లాడుతున్నారు. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా ఒక్కటి కూడా పాటించకుండా విచారణకు సహకరించడం లేదు.



తమిళనాడులోని పల్లవరం మున్సిపాలిటీలోని ఈశ్వరీనగర్‌లో నీటి ఎద్దడి తీవ్రమైంది. దీంతో స్థానిక బావిలో నీటిని తోడుకునేందుకు పోటీ ఎక్కువైంది. దీనిని నివారించేందుకు అక్కడి వారు లాటరీ పద్ధతిని ఆశ్రయించారు. (ఇన్‌సెట్) లాటరీ తీస్తున్న మహిళలు

## షా అధికార నివాసానికి ఘన చరిత్ర



**న్యూఢిల్లీ:** కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు త్వరలో కేటాయించనున్న కొత్త నివాసానికి ఘన చరిత్ర ఉంది. బ్రిటిష్ పాలకుల హయాంలో పార్లమెంట్ భవన వాస్తుశిల్పి సర్ హెర్బర్ట్ బేకర్ విశాలమైన ఈ భవనంలోనే ఉన్నారని చరిత్ర చెబుతోంది. స్వతంత్ర భారతంలో ఇద్దరు సొలిసిటర్ జనరళ్లు, మాజీ ప్రధానులు వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్ కూడా ఇందులో నివసించారని చరిత్రకారిణి, రచయిత స్వప్నా లిడ్లే తెలిపారు. బ్రిటిష్ పాలకుల హయాంలో రాజధాని ఢిల్లీ ప్రధాన వాస్తుశిల్పి సర్ ఎడ్విన్ లండ్సీర్ ల్యుటెన్ అయినప్పటికీ, ప్రభుత్వ సెక్రటేరియట్ ఉండే నార్త్, సౌత్ బ్లాకులతో పాటు పలు కీలక భవనాల రూపకల్పన చేసిన సర్ బేకర్.. ప్రస్తుతం 6ఏ నంబర్‌తో ఉన్న ఈ భవనంలోనే నివసించారు. అంతకుముందు ఈ భవనాన్ని హేస్టింగ్స్ రోడ్‌లోని 8వ నంబర్ భవనంగా పరిగణించేవారు. స్వాతంత్ర్యానంతరం ఇది కృష్ణమీనన్ మార్గ్‌లోని 8వ నంబర్ బంగ్లాగా మారిపోయింది. ఇందులో ఉన్న చివరి ప్రముఖుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి. ఆయన దాదాపు 14 ఏళ్లపాటు ఉన్నారు. గత ఏడాది ఆగస్టులో వాజ్‌పేయి మరణించడంతో డిసెంబర్‌లో కుటుంబసభ్యులు ఈ ఇంటిని ఖాళీ చేశారు. బ్రిటిష్ చక్రవర్తి 5వ జార్జి కాలంలో 1911లో దేశ రాజధాని కోల్‌కతా నుంచి ఢిల్లీకి మారిన విషయం తెలిసిందే. లండన్‌లోని రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రిటిష్ ఆర్కిటెక్ట్స్ వద్ద కూడా ఈ భవనం ఫొటో భద్రంగా ఉందని స్వప్నా లిడ్లే అన్నారు. హోంమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అమిత్ షా ప్రస్తుతం అక్బర్ రోడ్డులోని 11వ నంబర్ బంగ్లాలో ఉంటున్నారు. త్వరలోనే ఆయనకు కృష్ణమీనన్ మార్గ్‌లోని 6ఏ భవనాన్ని ప్రభుత్వం కేటాయించే అవకాశాలున్నాయి.

## ఈడీని హోంశాఖలోకి తేవాలి

**న్యూఢిల్లీ:** అమిత్‌షా హోంశాఖ బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ఇంతవరకు ఆర్థిక శాఖ పరిధిలో ఉన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని హోంశాఖ పరిధిలోకి బదిలీ చేయాలంటూ ప్రధానికి లేఖ రాశారు. ఈడీ ఆర్థిక శాఖలోని రెవెన్యూ పరిధిలో పనిచేస్తుంది. ఇది మనీ లాండరింగ్ చట్టం (పీఎంఎల్ఏ), విదేశీ మారక నిర్వహణ చట్టానికి (ఫెమా) సంబంధించిన కేసులను పర్యవేక్షిస్తుంది. ఫెమా కింద నమోదైన అనేక కేసులు ఐపీసీ, ఆయుధ నిరోధక కేసులేనని దూబే ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ విధానం వల్ల ఈడీ స్వతంత్రంగా వ్యవహరించలేకపోతోందని చెప్పారు. ఈడీ అధికారులు ఆర్థిక శాఖ పరిధిలో ఉండడం వల్ల ఈ నిబంధనల కారణంగా పూర్తి స్థాయి అధికారాలు వినియోగించుకోవడంలో ఇబ్బంది అవుతుందని, ఐపీసీ తదితర కేసుల కింద నిందితులను అరెస్టు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పీఎంఎల్ఏ కేసులను ఈడీ నేరుగా విచారించాలంటే, హోంశాఖ పరిధిలోకి తీసుకురావడం తప్పనిసరి అని దూబే పేర్కొన్నారు. ఫలితంగా దాని పనితీరు మరింత మెరుగవుతుందని, హోంశాఖకు నిష్పాక్షికమైన, చురుకైన వ్యక్తి నాయకత్వం కింద మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశముందని ఆయన అన్నారు.

## బ్రహ్మోస్-సుఖోయ్ అనుసంధానం వేగవంతం



**న్యూఢిల్లీ:** 40కి పైగా సుఖోయ్ యుద్ధ విమానాలకు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను అమర్చే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ రంగ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)తోపాటు బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్)లు సంయుక్తంగా ఈ పనులు చేపడుతున్నాయి. 2020లోపు ఈ పనులు పూర్తవ్వాల్సి ఉండగా, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బ్రహ్మోస్-సుఖోయ్‌ల అనుసంధానం పూర్తయితే ఆసియా ప్రాంతంలో కదన రంగంలో వాయుసేన శక్తి సామర్థ్యాలు గణనీయంగా మెరుగుపడతాయని ఐఏఎఫ్ తెలిపింది. అలాగే బాలాకోట్‌పై దాడి, అనంతర పరిస్థితులపై చేసిన సమీక్షలో భారత్ దగ్గర మరింత శక్తిమంతమైన వాయు రక్షణ వ్యవస్థ ఉంటే ప్రతీకార దాడి చేసే ధైర్యం పాక్‌కు ఉండేది కాదని అధికారులు అభిప్రాయపడ్డారు. దీంతో వాయుసేన సామర్థ్యాలను మెరుగుపరచాలని ప్రభుత్వం నిర్ణయించిందని అధికారులు చెప్పారు.

## 'షాంఘై'లో జిన్‌పింగ్‌తో భేటీ కానున్న మోదీ

**బీజింగ్:** కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కెక్‌లో జూన్ 13–14 తేదీల్లో జరిగే షాంఘై సహకార సదస్సు(ఎస్‌సీవో)కు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరవుతారని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లు కాంగ్ తెలిపారు. ఈ సదస్సు సందర్భంగా ఆయన భారత ప్రధాని మోదీతో భేటీ అవుతారని వెల్లడించారు. విదేశీ పర్యటనలో భాగంగా ఈ నెల 12 నుంచి 16 వరకూ జిన్‌పింగ్ కిర్గిజిస్తాన్, తజకిస్తాన్‌లను సందర్శిస్తారని పేర్కొన్నారు. బిష్కెక్‌లో జరిగే సమావేశంలో జిన్‌పింగ్, మోదీలు పలు ద్వైపాక్షిక అంశాలపై చర్చిస్తారని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన ప్రధాని మోదీకి జిన్‌పింగ్ హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పిన సంగతి తెలిసిందే. చైనా, భారత్, పాక్ సహా 8 దేశాలు ఎస్‌సీవోలో సభ్యులుగా ఉన్నాయి.

## 8 ఏళ్ల బాలికపై హత్యాచారం

**భోపాల్:** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఎనిమిదేళ్ల బాలికపై హత్యాచారం ఘటన వెలుగులోకి వచ్చింది. బాలిక మృతదేహాన్ని కాలువ పక్కన పడేయగా ఆదివారం గుర్తించినట్లు పోలీసులు చెప్పారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఆ బాలికపై అత్యాచారం చేసిన అనంతరం గొంతు నులిమి చంపినట్లు తేలింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు పోలీస్ సిబ్బంది సస్పెండయ్యారు. నిందితుల ఆచూకీ తెలిపిన వారికి రూ. 20 వేలు ఇవ్వనున్నట్లు అధికారులు ప్రకటించారు. శనివారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో ఆ పాప ఏదో కొనడానికి కమలా నగర్‌లోని తన ఇంటి బయటకు వచ్చి, తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు బాలిక కోసం గాలించారనీ, ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఓ కాలువ పక్కన వాళ్లకు పాప మృతదేహం కనిపించిందని ఐజీ యోగేశ్ దేశ్‌ముఖ్ చెప్పారు. ఓ నిందితుడు విష్ణు మోహరే అని తాము గుర్తించామనీ, పరారీలో ఉన్న అతడి కోసం గాలిస్తున్నామని ఏఎస్పీ అఖిల్ పటేల్ చెప్పారు. విష్ణు బంధువులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాలిక తల్లిదండ్రులు ఆరోపించడంతో ఏఎస్సై సహా ఆరుగురిని సస్పెండ్ చేసినట్లు హోం మంత్రి బాలా బచ్చన్ తెలిపారు.

## హాంకాంగ్‌లో మిలియన్ మార్చ్



వివిధ నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిని చైనాకు పంపించే ప్రక్రియను మరింత సులభతరం చేసే చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆదివారం హాంకాంగ్‌లో చేపట్టిన నిరసన ప్రదర్శనలో పది లక్షల మంది పాల్గొన్నారు. ఈ సవరణతో హాంకాంగ్ స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బతింటుందని వారు తెలిపారు.

# ఉగ్రవాదం ఉమ్మడి శత్రువు

- కలిసి ఎదుర్కోవాలని భారత్, శ్రీలంక నిర్ణయం
- శ్రీలంక అధ్యక్షునితో ప్రధాని మోదీ భేటీ
- భారత ప్రధానికి గొడుగుపట్టిన సిరిసేన
- ఈస్టర్ ఉగ్రదాడి మృతులకు మోదీ నివాళి



కొలంబోలో ప్రధాని మోదీకి గొడుగు పట్టిన శ్రీలంక అధ్యక్షుడు సిరిసేన

**కొలంబో:** ఉగ్రవాదం ఉమ్మడి శత్రువని, దానిని ఎదుర్కొనేందుకు ఐక్య, నిర్దిష్ట కార్యాచరణ అవసరమని భారత్, శ్రీలంక అభిప్రాయపడ్డాయి. ఏప్రిల్‌లో ఈస్టర్ పర్వదినాన జరిగిన బాంబు దాడుల విషాదం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న శ్రీలంకకు సంఘీభావం తెలిపేందుకు భారత ప్రధాని మోదీ ఆదివారం కొలంబో చేరుకున్నారు. మాల్దీవుల్లో రెండు రోజుల పర్యటన ముగించుకుని వచ్చిన మోదీకి అధ్యక్షుడు సిరిసేన ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలు వివిధ అంశాలపై చర్చలు జరిపారు. ఈస్టర్ ఉగ్రదాడుల అనంతరం శ్రీలంకకు వెళ్లిన మొదటి నేత భారత ప్రధాని కావడం గమనార్హం. 'అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేనను పది రోజుల్లో రెండోసారి కలుసుకున్నాను. ఉమ్మడి ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు ఐక్య, నిర్దిష్ట కార్యాచరణ అవసరమని భావించాం. శ్రీలంక భద్రత, ఉజ్వల భవిష్యత్తులో భాగస్వామి అయ్యేందుకు భారత్ కట్టుబడి ఉంది'అని సిరిసేనతో భేటీ అనంతరం మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక, ఉమ్మడి ప్రాధాన్య అంశాలపై చర్చలు జరిపారని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రవీశ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గౌరవార్థం విందు ఏర్పాటు చేసిన సిరిసేన.. ఆయనకు ధ్యానముద్రలో ఉన్న బుద్ధుని శిల్పం ప్రతిని బహూకరించారు. అనురాధపురలో ఉన్న ధ్యానబుద్ధుని భారీ శిల్పం 4 నుంచి 7వ శతాబ్దాల మధ్య ఏర్పాటైందని ప్రధాని కార్యాలయం వివరించింది. ఈ విగ్రహ నమూనాను తెల్లటేకుతో రూపొందించేందుకు నిపుణులకు రెండేళ్లు పట్టిందని తెలిపింది.

### ఉగ్రదాడి మృతులకు నివాళి

ప్రధాని మోదీ కొలంబో ఎయిర్‌పోర్టు నుంచి అధ్యక్షుని కార్యాలయానికి వెళ్లే దారిలోనే ఉన్న సెయింట్ ఆంథోనీ చర్చిని సందర్శించారు. ఈ సందర్భంగా బాంబుదాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. 'పిరికిపందల ఉగ్ర చర్య శ్రీలంక స్థైర్యాన్ని దెబ్బతీయలేదు. శ్రీలంక ప్రజలకు భారత్ తోడుగా ఉంటుంది'అని మోదీ అన్నారు. ఈస్టర్ పండగ రోజు ఉగ్రదాడులకు గురైన చర్చిల్లో ఇది ఒకటి. ఏప్రిల్‌లో తౌహీద్ జమాత్ అనే ఉగ్ర సంస్థ జరిపిన దాడుల్లో వందలాది అమాయకులు మృతి చెందిన విషయం తెలిసిందే.

### మోదీకి అమూల్య కానుక

ప్రధాని మోదీకి శ్రీలంక అధ్యక్ష నివాసం వద్ద ఘన స్వాగతం లభించింది. ఆ సమయంలో వర్షం పడుతుండటంతో అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన ప్రధాని మోదీకి స్వయంగా గొడుగుపట్టారు. అధ్యక్ష భవనం ప్రాంగణంలో మోదీ అశోక మొక్కను నాటారు. అనంతరం ప్రధాని రణిల్ విక్రమసింఘేతో సమావేశమయ్యారు. ప్రతిపక్ష నేత మాజీ అధ్యక్షుడు మహింద రాజపక్సే, తమిళ పార్టీల కూటమి నేత ఆర్.సంపతన్‌తోనూ సమావేశమయ్యారు. శ్రీలంకలోని భారత సంతతి ప్రజలతో మాట్లాడిన అనంతరం మోదీ స్వదేశానికి తిరుగు పయనమయ్యారు. ప్రధాని మోదీ 2015, 2017 సంవత్సరాల్లో కూడా శ్రీలంకలో పర్యటించారు. గత నెలలో జరిగిన ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీలంక అధ్యక్షుడు సిరిసేన హాజరయ్యారు.

## రుతుపవనాల ఆలస్యం.. తగ్గిన వర్షపాతం

- 9 రోజుల్లో 45 శాతం లోటు వర్షపాతం నమోదు
- భారత వాతావరణ శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ:** భారత్‌లోకి నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా ప్రవేశించడం వర్షపాతంపై గణనీయమైన ప్రభావం చూపిందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. సాధారణంగా జూన్ 1న రుతుపవనాలు భారత్‌లోకి ప్రవేశించాల్సి ఉన్నప్పటికీ, వారం రోజులు ఆలస్యంగా ఈ నెల 8న కేరళ తీరాన్ని తాకాయని చెప్పింది. దీనివల్ల గత 9 రోజుల్లో 45 శాతం లోటు వర్షపాతం నమోదైందని పేర్కొంది. సాధారణంగా ఈ పాటికి 32.4 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 17.7 మి.మీ వర్షం మాత్రమే కురిసిందని పేర్కొంది. బలహీనమైన ఎల్‌నినో పరిస్థితులు, రుతుపవనాల మందకొడి కారణంగా జూన్‌లో లోటు వర్షపాతం ఊహించినదాని కంటే అధికంగా ఉండే అవకాశముందని ఐఎండీ చెప్పింది. ప్రస్తుతం అరేబియా సముద్రంలో అల్పపీడన ద్రోణి ఏర్పడిందనీ, ఇది క్రమంగా బలపడుతూ తుపానుగా మారే అవకాశముందని తెలిపింది. ఈ సీజన్‌లో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, గోవా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో 66 శాతం లోటు వర్షపాతం నమోదైందని ఐఎండీ తెలిపింది. కచ్, సౌరాష్ట్ర ప్రాంతాల్లో వంద శాతం లోటు వర్షపాతం నమోదైందని పేర్కొంది. దక్షిణాదిన లోటు వర్షపాతం 29 శాతం కాగా, తమిళనాడు, కేరళలో రుతుపవనాలు విస్తరించాయని చెప్పింది. మరోవైపు రాజస్తాన్, మధ్యప్రదేశ్, విదర్భతో పాటు హరియాణా, ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో వచ్చే 2 రోజులు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించింది.

## కేరళపై ప్రధానిది సవతి ప్రేమ

**మోదీ వ్యాఖ్యలను ఖండించిన రాహుల్‌గాంధీ**



రాజమ్మను ఆప్యాయంగా హత్తుకున్న రాహుల్

**తిరువంబడి (కేరళ):** తన సొంత నియోజకవర్గం వారణాసి మాదిరిగా కేరళ కూడా తనకెంతో ప్రియమైనదన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఖండించారు. బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాలపై ప్రధాని సవతి ప్రేమ చూపిస్తున్నారని ఆరోపించారు. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి తనను గెలిపించినందుకు గానూ అక్కడి ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతూ రాహుల్ కేరళలో పర్యటిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం ఆయన కోజికోడ్ జిల్లాలోని ఎంగపూజ, గురువాయూర్, ముక్కాం ప్రాంతాల్లో సభలు, రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. 'బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు, లేని రాష్ట్రాలతో మోదీ వేర్వేరుగా వ్యవహరిస్తారు. కేరళలో సీపీఐ అధికారంలో ఉంది కాబట్టి ఈ రాష్ట్రాన్ని మోదీ ఎప్పటికీ ఉత్తరప్రదేశ్‌లా భావించలేరు. వయనాడ్, కేరళ అభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం సహకరిస్తుందని నేను భావించడంలేదు. కేరళపై బీజేపీది సవతి ప్రేమ. బీజేపీ నేతలకు ద్వేషం, కోపంతో కళ్లు మూసుకుపోయాయి. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను పాటించని వారిని భారతీయులుగా భావించడం లేదు'అని అన్నారు. సీపీఐ, కాంగ్రెస్ పార్టీలకు సిద్ధాంతాలపరంగా విభేదాలు ఉన్నప్పటికీ.. పార్టీలను పక్కనపెట్టి వయనాడ్ అభివృద్ధికి కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. ఇలాంటి సహకారం బీజేపీ నుంచి రావడం లేదన్నారు. కేరళలో మూడు రోజుల పాటు సాగిన రాహుల్ పర్యటన ఆదివారంతో ముగిసింది. రాహుల్ పర్యటనల్లో జనం భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పలువురు యువత 'రాహుల్ పడ (ఆర్మీ)', 'రాహుల్ వీ నీడ్ యూ'అని రాసిన టీషర్టులతో అలరించారు.

### తనను ఎత్తుకున్న నర్సును కలిసిన రాహుల్

రాహుల్‌కు ఆదివారం ఓ ప్రత్యేక అనుభవం ఎదురైంది. రాహుల్ పుట్టినప్పుడు ఢిల్లీ ఆస్పత్రిలో నర్సుగా పనిచేసిన రాజమ్మ వవాథిల్ (72)ను ఆయన కలుసుకున్నారు. తాను పుట్టగానే ఎత్తుకున్న రాజమ్మను రాహుల్ గాంధీ ఆప్యాయంగా హత్తుకున్నారు. అనంతరం ఆమె కుటుంబసభ్యులతో కాసేపు ముచ్చటించారు.

## బిహార్ బయట ఎన్డీయేలో ఉండం

- కేంద్రంలో మాత్రం ఎన్డీయేలోనే..
- ప్రశాంత్ కిషోర్ సంస్థతో మా పార్టీకి సంబంధం లేదు: త్యాగి



పార్టీ సమావేశంలో పాల్గొన్న కేసీ త్యాగి, ప్రశాంత్ కిషోర్, సీఎం నితీశ్‌కుమార్

**పట్నా:** ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) బిహార్ బయట ఎన్డీయేలో భాగంగా ఉండబోదని ఆ పార్టీ సీనియర్ నేత కేసీ త్యాగి అన్నారు. ఢిల్లీ, హరియాణా, జార్ఖండ్, జమ్మూ కశ్మీర్‌ల్లో త్వరలో జరగబోయే ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. పార్టీని మరిన్ని రాష్ట్రాలకు విస్తరించడం, 2020 నాటికి జాతీయ పార్టీ హోదాను పొందడం లక్ష్యంగా పని చేస్తామని త్యాగి చెప్పారు. జేడీ(యూ) జాతీయ కార్యవర్గ సమావేశాలు ఆదివారం పట్నాలో నితీశ్ అధ్యక్షతన జరిగాయి. అక్కడ త్యాగి మాట్లాడుతూ 'మేం జేడీ(యూ)ను జాతీయ పార్టీ చేయాలనుకుంటున్నాం. ప్రస్తుతం బిహార్, అరుణాచల్ ప్రదేశ్‌ల్లో మాత్రమే మాది గుర్తింపు పొందిన పార్టీ. రాబోయే నాలుగు రాష్ట్రాల ఎన్నికల్లో మా సర్వశక్తులూ ఒడ్డి పోరాడుతాం. 2020 నాటికి జాతీయ హోదా సాధించేందుకు మా ప్రయత్నం ఇదే' అని స్పష్టం చేశారు. అయితే కేంద్రంలో మాత్రం ఎన్డీయేలోనే కొనసాగుతామనీ, వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఉమ్మడిగానే పోరాడుతామని త్యాగి తెలిపారు. ఎన్డీయేలో భాగమైన జేడీ(యూ)కు కేంద్ర మంత్రివర్గంలో ఒక పదవి ఇవ్వజూపగా తిరస్కరించడం తెలిసిందే. కాగా, జేడీ(యూ) ఉపాధ్యక్షుడు, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌కు చెందిన కంపెనీ ఐ–పీఏసీతో జేడీ(యూ)కు ఎలాంటి సంబంధమూ లేదని కూడా త్యాగి స్పష్టం చేశారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని గురువారం ప్రశాంత్ కిశోర్ కోల్‌కతాలో కలిశారు. దీంతో త్వరలో ఆయన మమతతో కలిసి పనిచేసి, బీజేపీని 2021లో ఓడిస్తారనే వార్తలు వెలువడిన నేపథ్యంలో ఆయన ఈ స్పష్టత నిచ్చారు. ఐ–పీఏసీ తమ పార్టీలో భాగం కాదని అన్నారు.

# ధిక్కరించిన ధీరవనితలు!

### దుష్ప్రచారం.. భౌతిక దాడులపై తిరుగుబావుటా

- ఎదురొడ్డి నిలిచి.. లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన మహిళలు



పార్లమెంట్‌కు ఎన్నికవడమంటే మాటలా.. అంగబలం, అర్థబలం కనీస అర్హత. లేదంటే పెద్దనాయకుల ఆశీర్వాదం, అండ అయినా ఉండాలి. ఇవేమీ లేకుండా ఎన్నికల రణంలోకి అడుగుపెట్టిన ఈ సామాన్య మహిళలకు అడుగడుగునా వేధింపులు, దాడులు, సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలతో అడ్డంకులు ఎదురయ్యాయి. అయితే తమను అవేవీ అడ్డుకోలేవని రుజువు చేస్తూ ఆకాశమంత విజయాల్ని అందుకున్న నారీమణులకు భారత చట్టసభ సాదరంగా ఆహ్వానం పలుకుతోంది. వీరి విజయం సాధించిన వైనం గొప్పది. చారిత్రకమైంది.

### బ్యాంకు ఉద్యోగి కావాలనుకుని..



➤ చంద్రాణి ముర్ము (ఒడిశా, బీజేడీ)

ఈనెల 16వ తేదీన 26వ బర్త్‌డే జరుపుకోనున్న ఒడిశాకు చెందిన చంద్రాణి ముర్ము 17వ లోక్‌సభలో పిన్నవయస్కురాలైన సభ్యురాలు. మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి బ్యాంకు ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు ప్రిపేరవుతోన్న చంద్రాణికి అనూహ్యంగా కియోంజా లోక్‌సభ టికెట్ వచ్చింది. విజయం అంత తేలికగా వరించలేదామెను. సోషల్ మీడియాలో మార్ఫింగ్ చేసిన ఫొటోలు ఆమెను మానసిక వేదనకు గురిచేశాయి. 'నేనొక సాధారణ మహిళను. నన్ను నిజంగా జనం ఆమోదిస్తారా అని చాలా సంకోచించాను. కానీ, ప్రజలకు నచ్చిన గుణమేదో నన్ను ముందుకు సాగేలా చేసింది'అంటూ ఎన్నికల్లోకి అడుగుపెట్టిన క్షణాలను గుర్తుచేసుకున్నారు చంద్రాణి. ఈమె తాత హరిహర్ సోరెన్ గతంలో కాంగ్రెస్ ఎంపీ.

### మార్క్సిస్టుల కోటలో పాగా వేశారు



➤ రమ్యా హరిదాస్ (కేరళ, కాంగ్రెస్)

విద్య, ఆరోగ్యంలాంటి ఎన్నో రంగాల్లో తనదైన స్థానాన్ని నిలబెట్టుకుంటోన్న కేరళ నుంచి 17వ లోక్‌సభకు ఎన్నికైన ఏకైక సభ్యురాలు రమ్యా హరిదాస్(32). సంగీతంలో డిగ్రీ చేసిన రమ్య సామాజిక స్పృహ,జానపద గానంతో ప్రజల హృదయాలను కొల్లగొట్టారు. ఐదు దశాబ్దాల తరువాత మార్క్సిస్టుల కంచుకోటలో పాగా వేశారు. రెండుసార్లు ఎంపీ అయిన పీకే బిజూని 1.58 లక్షల ఓట్ల తేడాతో మట్టి కరిపించారు. ఈమె తల్లిదండ్రులు నిరుపేదలు. ఈమెలోని ప్రతిభను గుర్తించిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ మిగతా వారిని కాదని టికెట్ ఇచ్చారు. దీంతో స్థానిక నేతల నుంచి సహాయనిరాకరణ ఎదురైంది. కమ్యూనిస్టులు బురదచల్లే యత్నం చేశారు. రాళ్లతో దాడి చేయించారు. అయినా, తట్టుకుని నిలబడి గెలుపు సాధించారు.

### జానపద గీతంతో జనం మనసు గెలిచారు



➤ ప్రమీలా బిసోయీ (ఒడిశా, బీజేడీ)

2019 లోక్‌సభ ఎన్నికల్లో పరిమళించిన మరో మహిళా కుసుమం ప్రమీలా బిసోయీ! ఐసీడీఎస్ హెల్పర్‌గా ఉన్న ప్రమీలకు ఎంపీ టికెట్ ఇస్తామంటూ ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ ఆహ్వానించినా చార్జీలకు డబ్బుల్లేక తిరస్కరించారు. ఇది తెలిసిన సీఎం స్వయంగా కారు పంపి ప్రమీలను భువనేశ్వర్‌కు రప్పించారు. అత్యంత సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ప్రమీల 'రాజకీయాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. ఆ ప్రయత్నం కూడా చేయలేదు'అన్నారు. భారీ ఉపన్యాసాలకు బదులు తనకు తెలిసిన విద్య జానపదగీతాలను ఆలపించి ప్రజల మనసులను గెలిచారు. నిరుపేదల వలసలను నివారించేందుకు తమ ప్రాంతంలో చిన్న పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తానంటున్నారీమె.

### నా విజయం అందరికీ స్ఫూర్తి



➤ నుస్రత్ జహా (పశ్చిమబెంగాల్, టీఎంసీ)

పశ్చిమబెంగాల్ ఉత్తర పరగణా జిల్లాలోని బాసిర్ హాట్ నుంచి టీఎంసీ తరపున పోటీకి దిగి భారీ మెజారిటీతో విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు నటి నుస్రత్ జహా. పేద పిల్లల షెల్టర్ హోంల కోసం ఎన్జీవోతో కలిసి పనిచేశారు. 'నేను సొంత ఇల్లు కొనుక్కోవడానికి ముందు పిల్లల కోసం షెల్టర్ హోం కట్టిస్తా'అని ప్రకటించారు నుస్రత్. పాశ్చాత్య దుస్తుల్లో పార్లమెంట్ ఎదుట ఆమె నిలబడి ఉన్నట్లుగా మార్ఫింగ్ చేసిన ఫొటోలను రాజకీయ విరోధులు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసినా ఆమె జంకలేదు. 'నేను ఎవరిని అనేది ధరించిన దుస్తులను బట్టి తెలియదు. నాపైన వచ్చిన తప్పుడు ప్రచారాలను పక్కన పెట్టి నేను విజయం సాధించాను. మిగతా వారికి స్ఫూర్తిగా నిలిచాను'అంటున్నారు నుస్రత్.

### హరియాణా నుంచి ఏకైక మహిళ



➤ సునితా దుగ్గల్ (హరియాణా, బీజేపీ)

పురుషాధిపత్యానికి మారుపేరుగా నిలిచే ఖాప్ పంచాయితీ పునాదులున్న హరియాణా నుంచి ఒక మహిళ చట్టసభలకు ఎన్నికవడం నిజంగా విశేషమే. హరియాణా నుంచి పార్లమెంట్‌కు ఎన్నికైన ఏకైక మహిళ సునితా దుగ్గల్. ఎంపీగా ఎన్నికవడానికి ఆమె ఎన్నో అవరోధాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. అయితే ప్రభుత్వాధికారుల కుటుంబం నుంచి రావడం వల్ల సునితా దుగ్గల్ వాటిని ఎదుర్కోగలిగారు. మాజీ రెవెన్యూ అధికారి అయిన సునితా 2014లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. దేశంలోనే స్త్రీ, పురుష నిష్పత్తి అతి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో హరియాణా ఒకటి. బీజేపీ ప్రభుత్వం చేపట్టిన ప్రయత్నంతో హరియాణాలో లింగ నిష్పత్తి చాలా వరకు మెరుగైందని తెలిపారు దుగ్గల్.

## బెంగాల్ హింసపై కేంద్రం ఆందోళన

**సందేశ్‌ఖలీ/న్యూఢిల్లీ:** పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ), బీజేపీ శ్రేణుల మధ్య ఘర్షణల అనంతరం కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై కేంద్ర హోంశాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బెంగాల్‌లో శాంతిభద్రతలను పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. హింసను అరికట్టడంలో సీఎం మమతా బెనర్జీ ప్రభుత్వం విఫలమయిందని విమర్శించింది. ఆందోళనలు, అల్లర్లను నియంత్రించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని హితవు పలికింది. ఉత్తర 24 పరగణాల జిల్లాలో టీఎంసీ, బీజేపీ శ్రేణుల మధ్య చెలరేగిన ఘర్షణల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో బీజేపీ, టీఎంసీ నేతలు మాటలయుద్ధానికి దిగారు. టీఎంసీ శ్రేణుల దాడుల్లో బీజేపీ కార్యకర్తలు సుకాంత మొండల్, ప్రదీప్ మొండల్, శంకర్ మొండల్ చనిపోయారని బీజేపీ ప్రధాన కార్యదర్శి సయతన్ బసూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఘర్షణల్లో కయూమ్ మొల్లాహ్ అనే టీఎంసీ కార్యకర్త చనిపోయినట్లు టీఎంసీ నేతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇద్దరు బీజేపీ కార్యకర్తల మృతదేహాలతో కోల్‌కతాలోని పార్టీ కార్యాలయానికి కమలనాథులు ఊరేగింపుగా తీసుకురాగా, పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకున్నారు. మరోవైపు సీఎం మమతా బెనర్జీ తన ప్రసంగాల ద్వారా రాజకీయ ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్నారని బీజేపీ నేత ముకుల్‌రాయ్ ఆరోపించారు. తమ కార్యకర్తల చావుకు నిరసనగా బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగడంతో 11 మంది మహిళలు సహా 62 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. మరోవైపు రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని పశ్చిమబెంగాల్ ప్రభుత్వం కేంద్రానికి జవాబు ఇచ్చింది. సంఘవిద్రోహక శక్తుల కారణంగా చెలరేగిన అల్లర్లపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని స్పష్టం చేసింది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్

సోమవారం
10-6-2019


**స్టాక్ మార్కెట్లు** (శుక్రవారం ముగింపు)

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్ | 86 ▲ | 39,616 |
| నిఫ్టీ | 27 ▲ | 11,871 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

| విదేశీ సూచీలు | | |
|---|---|---|
| నాస్‌డాక్ | 7,742 | ▲ 127 |
| డోజోన్స్ | 25,984 | ▲ 263 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,332 | ▲ 72 |
| డాక్స్ | 12,045 | ▲ 92 |
| షాంఘై | 2,828 | ▼ 34 |
| నికాయ్ | 20,885 | ▲ 111 |

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 68.48 | 70.12 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 86.42 | 89.54 |
| € | యూరో | ఎస్‌బీఐ | 76.63 | 79.52 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 62.68 | 65.08 |
| AUS | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.32 | 49.47 |
| SS | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 49.88 | 51.63 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 17.75 | 19.51 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.18 | 19.73 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 10.79 | 9.43 |

# పెట్టుబడి నిర్ణయాల్లో... మహిళలూ ముందుండాలి..

**పెట్టుబడి నిర్ణయాల్లో మహిళల పాత్ర సగమే**
**పురుషులతో పోలిస్తే సగం మందే సొంత నిర్ణయాలు**
**నిర్ణయాలు తీసుకునే వారి వెనుక జీవిత భాగస్వాముల ప్రోత్సాహం**
**డీఎస్‌పీ విన్‌వెస్టర్ పల్స్ సర్వేలో ఆశ్చర్యకర అంశాలు**

పురుషులతో సమానంగా మహిళలూ తమ శక్తి సామర్థ్యాలను చాటుకుంటున్నారు. సొంతంగా వ్యాపారాలను సృష్టిస్తున్న వారు... ఉన్నత ఉద్యోగాల్లో రాణిస్తున్న వారు... వ్యాపార సామ్రాజ్యాలను ఒంటిచేత్తో నడిపిస్తున్న వారు... ఎందరో ఉన్నారు. అయితే, ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలకు వచ్చే సరికి వారిలో ఎక్కడో తటపటాయింపు..! పెట్టుబడి నిర్ణయాల్లో పురుషులతో సమానంగా రాణించే సామర్థ్యాలు ఉన్నా కానీ, వనితలు చొరవగా ముందుకు రావడం లేదని డీఎస్‌పీ విన్‌వెస్టర్ పల్స్ సర్వే ఫలితాలు చూస్తే అర్థమవుతోంది. మన దేశంలో మగవారితో పోలిస్తే ఇన్వెస్ట్‌మెంట్ విషయాల్లో సొంతంగా నిర్ణయాలు తీసుకుంటున్న స్త్రీలు సగం మందేనట. ఇలా ముందుకు వచ్చే వారి వెనుక వారి భర్తల ప్రోత్సాహమే ప్రధాన కారణంగా ఉంటోంది. పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే స్త్రీల వెనుక ప్రోత్సాహం అందించేవారిలో తల్లిదండ్రుల కంటే జీవిత భాగస్వాముల సంఖ్యే అధికంగా ఉంది. కొందరు తమంతట తామే ఉత్సాహంగా ముందుకు వస్తుంటే, కొందరు మాత్రం తప్పనిసరై ఈ దిశగా అడుగులు వేస్తున్నట్టు డీఎస్‌పీ విన్‌వెస్టర్ పల్స్ 2019 సర్వే పేర్కొంది.

**చిన్న వయస్సు నుంచి ఇన్వెస్టింగ్ పాఠాలు...**

'సీనియర్ స్థాయి నిపుణులు, ఫండ్ మేనేజర్లలోనూ మహిళలు ఉన్నప్పటికీ, రిటైల్ ఇన్వెస్టర్లుగా మహిళలు పెద్దగా ముందుకురాకపోవడం ఆశ్చర్యకరమైన అంశమని'' డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ప్రెసిడెంట్ కల్పేన్ పారిక్ తెలిపారు. ''మహిళల్లో ఎక్కువ మంది తల్లిదండ్రుల కంటే భర్తల నుంచే ఎక్కువ ప్రోత్సాహం పొందుతుండటం గమనించాల్సిన విషయం. తమ కుమార్తెలకు చిన్న వయసు నుంచే ఇన్వెస్టింగ్ గురించి నేర్పాలని తండ్రులకు నా మనవి. ఇన్వెస్టింగ్ విషయంలో మహిళలు ముందే విద్యావంతులు కావాల్సిన అవసరం ఉందని మా సర్వే ఎత్తిచూపుతోంది'' అని డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ సేల్స్, మార్కెటింగ్ హెడ్ అదితి కొఠారి తెలిపారు.



**సర్వే ఇలా...**

పరిశోధనా సంస్థ నీల్సన్‌తో కలసి డీఎస్‌పీ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ ఈ సర్వే నిర్వహించింది. డబ్బు విషయాల్లో వారి లక్ష్యాలు, వారి అభిప్రాయాలను తెలుసుకుంది. ఇన్వెస్ట్‌మెంట్, వారసత్వం విషయాల్లో మహిళలు, పురుషుల ప్రవర్తనను ప్రధానంగా తెలుసుకునే ప్రయత్నం చేసింది. దేశవ్యాప్తంగా 8 పట్టణాల్లో 4,013 మంది మహిళలు, పురుషుల అభిప్రాయాలను ఈ సర్వేలో భాగంగా తెలుసుకున్నారు. మెట్రో నగరాలు ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరుతోపాటు ఇండోర్, కొచ్చి, లూధియానా, గువాహటి పట్టణాలను ఈ సర్వే కవర్ చేసింది. మొత్తం 4,013 మందిలో 1,853 మంది మగవారు కాగా, 2,160 మంది స్త్రీలు. 25–60 ఏళ్ల వయసు గ్రూపులోని వారే వీరంతా. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి అభిప్రాయాలను సర్వేలో భాగంగా తెలుసుకున్నారు. ఉద్యోగాలు చేస్తున్న వారు లేదా గతంలో కనీసం 2 ఏళ్ల పాటు ఉద్యోగం చేసిన వారు, అవివాహితులు, వివాహితులు, పిల్లల్లేని వారు లేదా పెళ్లయి పిల్లలు ఉన్న వారు కూడా ఇందులో ఉన్నారు. మహిళలు తమ పెట్టుబడి నిర్ణయాల బాధ్యతలను తీసుకునే దిశగా వారిని ప్రోత్సహించడం, వారిలో నమ్మకాన్ని ప్రోది చేయడం ద్వారా తమ ఆర్థిక విషయాల నిర్వహణకు మరొకరిపై ఆధారపడే పరిస్థితి లేకుండా చూడటమే ఈ సర్వే ఉద్దేశమని డీఎస్‌పీ విన్‌వెస్టర్ పల్స్ సర్వే పేర్కొంది.

**లక్ష్యాలు**

తమ వారసుల విద్య, వారి వివాహాలు, సొంతిల్లు, రుణాల్లేని జీవితం, అత్యున్నత ప్రమాణాలతో కూడిన జీవితం ఈ లక్ష్యాలు పురుషులు, స్త్రీలకు ఒకే తీరులో ఉన్నాయి. తమ పిల్లలకు సంబంధించిన లక్ష్యాల్లో పురుషులతో పోలిస్తే స్త్రీలకే కొంత ఆసక్తి ఎక్కువగా ఉంది. మహిళల టాప్–3 లక్ష్యాల్లో మొదటి రెండు పిల్లల విద్య, వివాహాలే. పిల్లల విద్య పట్ల 34 శాతం మంది, వారి వివాహాల పట్ల 29 శాతం మంది మహిళలు ప్రాధాన్యం చూపిస్తుంటే, పురుషుల శాతం ఈ లక్ష్యాల విషయంలో 31, 26 శాతంగానే ఉంది. సొంతంగా వెంచర్ ఏర్పాటు చేయాలని 26 శాతం మంది, రిటైర్మెంట్‌కు ప్రణాళిక వేసుకోవాలని 23 శాతం మగవారు భావిస్తుంటే, ఈ విషయాల్లో స్త్రీలు 23 శాతం, 20 శాతంగానే ఉన్నారు. మరింత ఆసక్తి కలిగించే అంశం... ఒంటరి పురుషులతో పోలిస్తే ఒంటరి మహిళలు ఎక్కువ మంది తమకు పుట్టబోయే పిల్లల భవిష్యత్తు లక్ష్యాల గురించి ఆలోచిస్తున్నారు. పిల్లల విద్య కోసం 22 శాతం, వివాహాల కోసం 23 శాతం ఒంటరి మహిళలు ఆలోచిస్తుంటే, ఈ విషయంలో మగవారు 16 శాతం, 12 శాతంగానే ఉన్నారు. తమ లక్ష్యాలను సాధించుకోవడం, మెరుగైన జీవితం, విజయం, మెరుగైన ఆరోగ్యం విషయాల్లో స్త్రీ, పురుషులు సరిసమానంగా ఉన్నారు.

**ఆర్థిక విషయాల్లో మహిళల పాత్ర**

మార్కెట్ ఆధారిత స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్ తదితర పెట్టుబడుల విషయాల్లో పూర్తిగా తమదే నిర్ణయమని 12 శాతం మంది మహిళలు చెప్పారు. ఈ విషయంలో మగవారి శాతం 31. అంటే పురుషులతో పోలిస్తే మూడింట ఒకవంతుగానే ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, బంగారం, ఆభరణాల కొనుగోళ్ల విషయాల్లో తమ నిర్ణయమే ఫైనల్ అని చెప్పిన మహిళలు 28 శాతం మంది. ఈ విషయంలో మగవారు 17 శాతంగా ఉన్నారు. 39 శాతం మంది మహిళలు ముందు పెట్టుబడుల ప్రణాళిక వేసుకుని, దీనికి తగ్గట్టు నెలవారీ ఖర్చులను సర్దుబాటు చేసుకుంటామని చెప్పారు. అంటే వారి మొదటి ప్రాధాన్యత ప్రణాళికే. ఆర్థిక సలహాదారులను సంప్రదించి వారి సూచనలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే మహిళలు 42 శాతం కాగా, పురుషులు 46 శాతం మంది ఉన్నారు.





**పిల్లల పట్ల బాధ్యత**

తమ పిల్లల విషయంలో బాధ్యతగా ఉంటామని 55 శాతానికి పైగా చెప్పారు. అయితే, కుమార్తెల పట్ల బాధ్యతగా ఉంటామన్న వారు 51% అయితే, కుమారుల పట్ల బాధ్యత వ్యక్తం చేసిన వారు 58% మేర ఉన్నారు. తమ కుమారులు, కుమార్తెలకు పెట్టుబడుల విషయంలో భిన్నంగా సూచిస్తామని దాదాపు 48% మంది తెలిపారు. పిల్లలు చిన్న వయసు నుంచే... కాలేజీ నుంచి లేదా ఉద్యోగంలో చేరిన నాటి నుంచి పెట్టుబడుల నిర్ణయాలు తీసుకోవడాన్ని మొదలు పెట్టాలని ఎక్కువ మంది అభిప్రాయపడ్డారు. పిల్లలు 20 ఏళ్లు రాకముందే పెట్టుబడుల గురించి నేర్చుకోవాలని 65% మంది భావిస్తున్నారు. తమ సంపదను పిల్లలకు పంచుతామని అత్యధికంగా 76% మంది చెప్పారు. తమ వారసత్వ సంపదను కుమారులు, కుమార్తెలకు సమానంగా పంచుతామని 65% మంది చెప్పారు. మిగిలిన వారు కుమార్తెల కంటే కుమారులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామన్నారు. వీరిలో కుమారులకు 45%, కుమార్తెలకు 24% కేటాయిస్తామన్నది వారి మాట. తల్లుల్లో 22% మంది కుమారుల పట్ల ఎక్కువ మొగ్గు చూపారు. దీనికి వ్యతిరేక దిశలో తండ్రులు తమ కుమారుల (12%) కంటే కుమార్తెలకు (18%) మొగ్గు చూపారు.

**సర్వే హైలైట్స్**

- 64 శాతం మంది మగవారు పెట్టుబడులపై నిర్ణయాలు సొంతంగా తీసుకుంటున్నారు.
- మహిళలు మాత్రం 33 శాతం మందే స్వీయ నిర్ణయాలు తీసుకోగలుగుతున్నారు.
- వీరిలోనూ ముఖ్యంగా తమ భర్తల ప్రోత్సాహం కారణంగానే పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పిన వారు 33 శాతం. ఈ విషయంలో తల్లిదండ్రుల శాతం 24గానే ఉంది.
- తమ భర్తలు తమను ఇన్వెస్టింగ్‌లోకి ప్రవేశించేలా చేశారని చెప్పిన వారు 40 శాతం.
- తల్లిదండ్రులు తమను ఈ దిశగా అడుగులు వేయించారని చెప్పిన వారు 27 శాతం.
- నిర్ణయాలు తీసుకునే మగువల్లోనూ తాము తీసుకోగలమనే నమ్మకంతోనే ఆ పనిచేస్తున్నట్టు 30 శాతం మంది చెప్పారు.
- పిల్లల భవిష్యత్తు లక్ష్యాల విషయంలో తండ్రులతో పోలిస్తే తల్లుల పాత్ర ఎక్కువగా ఉండటం గమనార్హం. తల్లులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. సర్వేలో అభిప్రాయాలు తెలియజేసిన వారిలో ఎక్కువ మంది మహిళలు చెప్పిన మాట... తమ పిల్లలు 20 ఏళ్లు వచ్చే నాటికి ఇన్వెస్టింగ్ గురించి తెలుసుకోవాలని.
- పెట్టుబడుల దిశగా తమను తమ తల్లిదండ్రులు అడుగులు వేయించారని 40 శాతం మగవారు చెప్పారు. తల్లిదండ్రుల తర్వాత సహచర పనివారు తమను ఈ దిశగా నడిపించినట్టు చెప్పిన వారు 35 శాతం మంది.
- 25 ఏళ్లు రాకముందే తాము పెట్టుబడులు ఆరంభించామని చెప్పిన వారు 65 శాతంగా ఉన్నారు. 25 ఏళ్లలోపే ఇన్వెస్ట్‌మెంట్ ఆరంభించడం సరైనదని 76 శాతం మంది చెప్పారు.

ఇక స్వీయ పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే 33 శాతం మంది మగువల వెనుక వారి జీవిత భాగస్వామి లేదా తల్లిదండ్రుల ప్రోత్సాహం ప్రధానంగా ఉన్నట్టు ఈ సర్వే పేర్కొంది. తమ భర్తలు మరణించడం లేదా విడాకుల వల్ల తాము సొంతంగా పెట్టుబడి నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని 13 శాతం మంది మహిళలు చెప్పడం గమనార్హం. 30 శాతం మంది తాము సొంతంగా పెట్టుబడికి సంబంధించి నిర్ణయాలు తీసుకోగలమని చెప్పారు. ఇక? తమ పిల్లల విద్య, సొంతిల్లు, పిల్లల వివాహాలు, అప్పుల్లేని జీవితం, ఉన్నత ప్రమాణాలతో జీవించడం అనే ముఖ్యమైన లక్ష్యాల విషయంలో స్త్రీ, పురుషులు సరిసమానంగానే ఉన్నట్టు డీఎస్‌పీ సర్వే తెలిపింది. ఇన్వెస్ట్‌మెంట్ లేదా కారు లేదా ఇల్లు కొనుగోళ్ల నిర్ణయాల్లో పురుషుల ఆధిపత్యం ఉంటుంటే, బంగారం/ఆభరణాలు, రోజువారీ ఇంటి ఖర్చులు విషయంలో మహిళల పాత్ర కీలకంగా ఉంది.






# 1350 డాలర్లు దాటేయొచ్చు!!



**పసిడిపై పరిశీలకుల అంచనాలు**

గడిచిన ఏడాది కాలంగా చూస్తే గత వారంలో పసిడి మార్కెట్ అత్యుత్తమ పనితీరు కనపర్చింది. ఇదే ఊపు కొనసాగిస్తే.. కీలకమైన దీర్ఘకాలిక నిరోధ స్థాయి 1,350 డాలర్ల మార్కును సమీప కాలంలోనే దాటేసేయొచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. అమెరికాలో ఉద్యోగ కల్పన గణాంకాలు నిరుత్సాహకరంగా ఉండటంతో బంగారం ధరలు మళ్లీ 1,350 డాలర్ల చేరువకు దగ్గరయ్యాయి. ఫ్యూచర్స్ మార్కెట్లో ఆగస్టు కాంట్రాక్టుకు సంబంధించి పసిడి ఔన్సు (31.1 గ్రాములు) ధర 2.7 శాతం పెరిగి ఒక దశలో 1,347.10 డాలర్లుగా ట్రేడయ్యింది. గత నెలలో కనీసం 1,77,000 ఉద్యోగాల కల్పన జరగవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేసినప్పటికీ .. వాస్తవానికి కేవలం 75,000 ఉద్యోగాల కల్పన మాత్రమే జరగడం పసిడి ర్యాలీకి కారణమైనట్లు ఆర్థికవేత్తలు తెలిపారు. పసిడి మరింత అధిక స్థాయికి పరుగులు తీసేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని ఆర్‌జేవో ఫ్యూచర్స్ సంస్థ సీనియర్ మార్కెట్ అనలిస్ట్ ఫిలిప్ స్ట్రీబుల్ తెలిపారు. ఈ ఏడాది ఆఖరు నాటికి ఔన్సుకు 1,400 డాలర్లకు కూడా చేరగలిగేంత సత్తా కనిపిస్తోందని పేర్కొన్నారు. అయితే, ఇన్ని సానుకూలతలు ఉన్నప్పటికీ.. సాంకేతికంగా కొన్ని గట్టి నిరోధ స్థాయిలు కూడా ప్రతిబంధకాలుగా ఉంటున్నాయి. 2015లో కనిష్ట స్థాయిని తాకినప్పట్నుంచి 1,350 నిరోధ స్థాయిని పసిడి ఇప్పటి దాకా ఎనిమిది సార్లు పరీక్షిస్తూ వస్తోంది. ఏదైతేనేం.. పసిడి రేటు 1,350కి పైన పటిష్టంగా ముగిసిన పక్షంలో మధ్య కాలికంగా ఆ తర్వాత 1,360, 1,375 స్థాయిలకు చేరే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

# హెల్త్ ఇన్సూరెన్స్ చాలా అవసరం

**సంజయ్‌దత్తా**



చీఫ్ క్లెయిమ్స్, అండర్‌రైటింగ్ అండ్ రీఇన్సూరెన్స్ ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్

వైద్య బీమా నేటి రోజుల్లో ఎంతో కీలకమైనదని, ముఖ్యంగా వైద్య పరంగా అత్యవసర పరిస్థితుల్లో దీని అవసరం ఎంతో ఉందని ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ అండ్ అండర్ రైటింగ్స్ చీఫ్ సంజయ్ దత్తా పేర్కొన్నారు. వైద్య బీమా అవసరం ఏ మేరకు, అది ఏ విధంగా ఓ కుటుంబాన్ని ఆదుకుంటుందన్న విషయాల గురించి ఆయన ఇలా వివరించారు. బేసిక్ హెల్త్ ఇండెమ్నిటీ పాలసీ హాస్పిటల్ పాలైనప్పుడు కవరేజీనిస్తుంది. డాక్టర్ ఫీజులు, వైద్య చికిత్సల వ్యయాలను చెల్లిస్తుంది. భారతీయులకు హెల్త్ ఇన్సూరెన్స్ అవసరం. ఎందుకంటే అధిక రిస్క్‌తో కూడిన జీవన శైలి వ్యాధులు స్థూలకాయం, రక్తపోటు, మధుమేహం, గుండె జబ్బుల బారిన పడడం పెరిగిపోతోంది. ఆహార అలవాట్లు, జీవనశైలిలో మార్పులు, ఉదయం వేళల్లో ఒత్తిడి, పట్టణీకరణ పెరిగిపోవడం వంటివి వీటికి కారణాలు. మరోవైపు గత కొన్నేళ్లలో వైద్య వ్యయాలు రాకెట్‌లా పెరిగిపోయాయి. ఏటేటా వైద్య ద్రవ్యోల్బణం 7–8 శాతం ఉందని ఎన్నో నివేదికలు చెబుతున్నాయి. భారతీయులు వైద్య చికిత్సల కోసం అయ్యే వ్యయాల్లో 70 శాతాన్ని తమ జేబుల నుంచి ఖర్చు చేస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నివేదిక చెబుతోంది. ఊహించని వైద్య అవసరాలు ఎదురైతే కుటుంబ బడ్జెట్ మొత్తానికి పెద్ద చిల్లు పడుతుంది. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ అన్నది చాలా అవసరం.



**ప్రయోజనాలు**

తీవ్రమైన అనారోగ్యాలు, వైద్య ఖర్చులు, నగదు రహిత చికిత్సలతో పాటు, పన్ను ఆదా వంటి ప్రయోజనాలు వైద్య బీమాతో ఉన్నాయి. ఉద్యోగులకు తమ సంస్థ తరఫున బృంద బీమా పాలసీ ఉన్నా కానీ, విడిగా తమ కుటుంబానికి ఓ పాలసీ తీసుకోవాలి. చిన్న వయసులో ఉన్న వారు సాధారణంగా మంచి ఆరోగ్యంతో ఉన్నామని భావిస్తుంటారు. వారు వ్యాయామం చేయడంతోపాటు, ఆరోగ్యకరమైన ఆహారం, చెడు అలవాట్లు లేకపోవడం లేదా ఉన్నా కానీ పరిమిత అలవాట్లతో వారికి వైద్య బీమా ఆ వయసులో అవసరం అనిపించకపోవచ్చు. కానీ, గమనించాల్సిన అంశం ఏమిటంటే ఇలా ఆరోగ్యంగా ఉన్నప్పుడే, ఎటువంటి వైద్య సమస్యల్లేని సమయంలోనే హెల్త్ పాలసీ తీసుకోవడం మంచిది. అందుకే చిన్న వయసులోనే వైద్య బీమా పాలసీ తీసుకోవాలని సిఫారసు చేస్తుంటారు. దీనివల్ల పెద్ద వయసులో తీసుకునే పాలసీతో పోలిస్తే తక్కువ ప్రీమియానికే సమగ్ర కవరేజీతో కూడిన పాలసీ లభిస్తుంది. వయసుతోపాటు వైద్య బీమా పాలసీ కొనుగోలు వ్యయం కూడా పెరిగిపోతుంది. ఎందుకంటే వయసు పెరుగుతున్న కొద్దీ వైద్య సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. దీనివల్ల ప్రీమియం కూడా ఎక్కువవుతుంది. చిన్న వయసులోనే వైద్య బీమా పాలసీ తీసుకోవడానికి ఉన్న మరో కారణం... క్యుమిలేటివ్ బోనస్‌ను పొందొచ్చు. చిన్న వయసులో ఉన్న వారు క్లెయిమ్స్ చేసుకునే అవకాశాలు తక్కువ. క్యుములేటివ్ బోనస్ 50 శాతం వరకు సమ్ ఇన్సూర్డ్ మొత్తంలో లభిస్తుంది. దీంతో మీ వైద్య బీమా మొత్తం 150 శాతం అవుతుంది. కానీ ప్రీమియం మాత్రం 100 శాతం బీమాకు చెల్లిస్తే చాలు. చిన్న వయసులోనే ఎందుకు వైద్య బీమా తీసుకోవాలన్న దానికి ఇవి కొన్ని కారణాలు మాత్రమే. ఓ కుటుంబానికి ఆధారమైన వారు కుటుంబమంతటికీ కలిపి ఫ్యామిలీ ఫ్లోటర్ హెల్త్ పాలసీ తీసుకోవాలి. ప్రజలు వైద్య బీమాను దీర్ఘకాల ఇన్వెస్ట్‌మెంట్‌గా చూడాలి. తగినంత వైద్య బీమా కవరేజీ ఉన్న వారు ప్రశాంతంగా ఉండొచ్చు. ఆర్థిక భద్రతను కూడా ఇస్తుంది. అయితే, కొందరు తమకు వైద్య సమస్యలు ఆరంభమైన తర్వాతే వైద్య బీమా అవసరాన్ని గుర్తిస్తుంటారు. అందుకే ఆలస్యం చేయకుండా వైద్య పాలసీ తీసుకోవాలి.

# రిస్క్ ఉన్నా రాబడులు ఆశించే వారికి...

**కోటక్ ఎమర్జింగ్ ఈక్విటీ ఫండ్**




స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్ దిద్దుబాటుకు గురై ఆకర్షణీయ విలువలకు చేరాయి. గతేడాది స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 21 శాతం పతనం కాగా, మిడ్‌క్యాప్ సూచీ 12 శాతం మేర నష్టపోయింది. స్మాల్‌క్యాప్‌తో పోలిస్తే మిడ్‌క్యాప్ కంపెనీల్లో అస్థిరత కాస్త తక్కువ. ఈ తరుణంలో మంచి మిడ్‌క్యాప్ మ్యూచువల్ ఫండ్ పథకాన్ని ఎంచుకుని దీర్ఘకాలానికి ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులను సొంతం చేసుకునేందుకు అవకాశాలున్నాయి. అధిక రిస్క్ తీసుకున్నా గానీ, రాబడులు మెరుగ్గా ఉండాలనుకునే వారు కోటక్ ఎమర్జింగ్ ఈక్విటీ ఫండ్‌ను పరిశీలించొచ్చు.

**రాబడులు**

గడిచిన ఏడాది కాలంలో ఈ పథకంలో 9 శాతం నికర నష్టాలు ఉన్నాయి. కానీ, మిడ్‌క్యాప్ పథకాల రాబడులకు ప్రామాణికంగా చూసే నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 టీఆర్‌ఐ ఇండెక్స్ ఇదే కాలంలో 12.2 శాతం నష్టపోగా, దీంతో పోలిస్తే ఈ పథకంలో నష్టాలు కాస్త తక్కువే ఉన్నాయని భావించాల్సి ఉంటుంది. మూడేళ్ల కాలంలో వార్షికంగా 10.5 శాతం, ఐదేళ్లలో వార్షికంగా 19.2 శాతం చొప్పున ఈ పథకం ఇన్వెస్టర్ల పెట్టుబడులపై రాబడులను ఇచ్చింది. ఇదే కాలంలో నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ రాబడులు మూడేళ్లలో 9.3 శాతం, ఐదేళ్లలో 13.6 శాతంగానే ఉన్నాయి. ఇక పదేళ్ల కాలంలో చూసుకున్నా కానీ ఈ పథకం వార్షికంగా సగటున 17 శాతం చొప్పున రాబడులను ఇవ్వడం గమనార్హం. బుల్ మార్కెట్లలో బెంచ్ మార్క్ కంటే అధిక రాబడులను ఇవ్వడంతోపాటు, కరెక్షన్లలో బెంచ్ మార్క్‌తో పోలిస్తే నష్టాలు తగ్గినట్టు ఈ పథకం పనితీరును పరిశీలిస్తే తెలుస్తుంది. ఇతర పోటీ పథకాలు హెచ్‌డీఎఫ్‌సీ మిడ్‌క్యాప్ అపార్చునిటీస్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మిడ్‌క్యాప్, ఎల్‌అండ్‌టీ మిడ్‌క్యాప్ పథకాల కంటే మెరుగ్గా కోటక్ ఎమర్జింగ్ ఈక్విటీ నష్టాలను తక్కువకు పరిమితం చేయడాన్ని గమనించొచ్చు.




**పెట్టుబడుల విధానం:** అప్పుడే అభివృద్ధి చెందుతున్న లేదా అప్పటికే అభివృద్ధి ప్రయాణం ఆరంభించిన మిడ్‌క్యాప్ కంపెనీలను పరిశోధన ద్వారా గుర్తించి ఇన్వెస్ట్ చేయడం అ పథకం అనుసరించే విధానం. ఈ తరహా స్టాక్స్‌లో మోస్తరు అస్థిరతలు ఉండడమే కాదు, దీర్ఘకాలంలో మంచి రాబడులకూ అవకాశం ఉంటుంది. పోర్ట్‌ఫోలియోలో 82 శాతం పెట్టుబడులను మిడ్‌క్యాప్స్‌కు, స్మాల్‌క్యాప్‌నకు 12 శాతం చొప్పున కేటాయింపులు ప్రస్తుతం చేయగా, మరో 5 శాతాన్ని లార్జ్‌క్యాప్‌నకు కేటాయించింది. 2011, 2018 మార్కెట్ కరెక్షన్ల సమయాల్లో ఈ పథకంలో నష్టాలు బెంచ్ మార్క్‌తో పోలిస్తే తక్కువగా ఉన్నాయి. 2014 నుంచి ఈ పథకం స్థిరమైన రాబడులను అందిస్తోంది. 25 రంగాలకు చెందిన 65 స్టాక్స్‌ను పోర్ట్‌ఫోలియోలో కలిగి ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తం పెట్టుబడుల్లో 20 శాతాన్ని బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేసింది. తర్వాత కెమికల్స్ రంగానికి 15 శాతం, ఇంజనీరింగ్ 14 శాతం, కన్‌స్ట్రక్షన్ 9 శాతం, హెల్త్‌కేర్ రంగాల స్టాక్స్‌కు 9 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది.

**టాప్ హోల్డింగ్స్**

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| పీఐ ఇండస్ట్రీస్ | 3.71 |
| రామ్‌కో సిమెంట్స్ | 3.58 |
| అతుల్ | 3.42 |
| ఏయూ స్మాల్‌ఫైనాన్స్ | 3.29 |
| సుప్రీమ్ ఇండస్ట్రీస్ | 3.20 |
| స్కాఫ్లర్ ఇండియా | 3.07 |
| ఆర్‌బీఎల్ బ్యాంకు | 2.84 |
| థర్మాక్స్ | 2.83 |
| ఎస్‌ఆర్‌ఎఫ్ | 2.66 |
| సోలార్ ఇండస్ట్రీస్ | 2.56 |

**ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?**

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జూన్-2-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు- ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 6.6 | 6.8 | 6.75 |
| యాక్సిస్ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 6.5 | 7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.25 | 6.75 | 6.5 |
| కెనరా బ్యాంక్ | 6.2 | 6.75 | 6 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6.55 | 6.65 | 6.55 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.35 | 7 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 7.1 | 7.3 | 7.25 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6.75 | 7.1 | 7.25 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6.5 | 7.25 | 7.4 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 7.25 | 7.75 | 7.5 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 7.1 | 7.3 | 7 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 6.75 | 7 | 6.75 |
| ఎస్‌బీఐ | 6.4 | 7 | 6.7 |
| సిండికేట్ బ్యాంక్ | 6.35 | 7.05 | 7.15 |
| పీఎన్‌బీ | 6.95 | 7 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.65 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...



ఇతరుల తప్పులనుంచి పాఠాలు నేర్చుకోవాలి,
అన్నీ అనుభవంతో నేర్చుకోవాలంటే జీవితం చాలదు
- చాణక్యుడు. ఆర్థికవేత్త

## బొమ్మ-బొరుసు






# వాణిజ్య ఉద్రిక్తతలు... ప్రపంచ ఆర్థికానికి ముప్పు

## జీ20 ప్రకటన

**ఫుకోవా (జపాన్):** వాణిజ్య ఉద్రిక్తతలు అధ్వానంగా మారాయని, ఇవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ముప్పు అని జీ20 దేశాలు అంగీకరించాయి. ప్రపంచ ఆర్థిక వృద్ధి ఇప్పటికే తక్కువగా ఉండగా, వాణిజ్య ఉద్రిక్తతల రిస్క్‌తో ఇది ఇంకా తగ్గిపోతుందన్న ఆందోళన జీ20 దేశాల ప్రకటనలో వ్యక్తమైంది. మరీ ముఖ్యంగా వాణిజ్య, భౌగోళిక ఉద్రిక్తతలు తీవ్రతరం అయ్యాయని, అవసరమైన తదుపరి చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు పేర్కొంది. వాణిజ్య ఉద్రిక్తతలు పరిష్కారం కావాల్సిన అవసరాన్ని బలంగా చెప్పింది. జపాన్ పోర్ట్ పట్టణం ఫుకోవాలో రెండు రోజుల పాటు జరిగిన జీ20 దేశాల సమావేశం అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఈ సమావేశంలో అన్ని దేశాలు ఒక్కతాటిపై నిలవగా, అమెరికా మాత్రం వేరుగా వ్యవహరించింది. ప్రతీ ఒక్కరు వాణిజ్య ఉద్రిక్తతలు ఆర్థిక వృద్ధికి ముప్పుగా అభిప్రాయపడినట్టు, అమెరికా యంత్రాంగంలో ఈ తరహా భావన లేదని ఈయూ ఆర్థిక, మానిటరీ వ్యవహారాల కమిషనర్ పీరే మోస్కోవిసి తెలిపారు.

# పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణం కీలకం

- వాణిజ్య యుద్ధ భయాలు, క్రూడాయిల్ ధరలూ ప్రధానమే
- ఈ వారం మార్కెట్లకు దిశా నిర్దేశం చేసే అంశాలు

పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణం గణాంకాలతో పాటు అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధాలు, క్రూడాయిల్ ధరలు తదితర అంతర్జాతీయ అంశాలు ఈ వారం దేశీ మార్కెట్లకు దిశా నిర్దేశం చేయనున్నాయి. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగంలో నిధుల సంక్షోభ పరిస్థితులు గత వారం ఈక్విటీ మార్కెట్లను కలవరపర్చాయి. ఈ వారం కూడా ఇన్వెస్టర్లు ఈ అంశంపై దృష్టి సారించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ‘రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి వంటి కీలక డేటా ఆధారంగా మార్కెట్ ట్రేడింగ్ జరగొచ్చు. రుతుపవనాల పరిస్థితి ఎలా ఉండబోతుందన్నదీ ముఖ్యమే. ఇక రాబోయే బడ్జెట్‌పైనా అందరి దృష్టి ఉంటుంది. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం సంస్కరణలను అమలు చేయగలదన్న ఆశాభావం నెలకొంది. ఇక, అమెరికా–మెక్సికో–చైనా వాణిజ్య యుద్ధ భయాలు, ఈ నెలాఖరులో ఒపెక్ సమావేశం నేపథ్యంలో క్రూడాయిల్ ధరల కదలికలు తదితర అంతర్జాతీయ అంశాలు కీలకంగా ఉండనున్నాయి‘ అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు.



**బుధవారం గణాంకాలు..**

పారిశ్రామికోత్పత్తి, ద్రవ్యోల్బణం రేటు గణాంకాలు బుధవారం వెల్లడి కానున్నాయి. ఇక టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు శుక్రవారం మార్కెట్ వేళలు ముగిసిన తర్వాత వెల్లడవుతాయి. ‘ ఈ వారం ద్రవ్యోల్బణం గణాంకాలపై అందరి దృష్టి ఉంటుంది. ఆ గణాంకాల వెల్లడి తర్వాత వాణిజ్య యుద్ధం, డాలరుతో రూపాయి మారకం, ముడిచమురు ధరలు వంటి అంతర్జాతీయ అంశాలకు అనుగుణంగా దేశీ మార్కెట్లు సర్దుకోవడం మొదలుకావచ్చు. దేశీ అంశాలు కాస్త వెనక్కి పోయి.. ఈ విషయాలు మార్కెట్లకు చోదకంగా పనిచేయొచ్చు‘ అని ఎపిక్ రీసెర్చ్ సంస్థ సీఈవో ముస్తఫా నదీమ్ తెలిపారు. ‘ఫెడ్ సమావేశం, జీ20 సమావేశం, జూలైలో కేంద్ర బడ్జెట్ వంటి అంశాలు చూడాల్సి ఉంటుంది‘ అని కోటక్ సెక్యూరిటీస్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ జర్బాదే పేర్కొన్నారు. ఇక విదేశీ నిధుల ప్రవాహం, రూపాయి.. ముడి చమురు ధరల కదలికలు సైతం మార్కెట్‌కు కీలకంగా ఉండగలవని విశ్లేషకులు తెలిపారు.

**బలహీనంగా రూపాయి..**

రూపాయి మారకం విలువ ట్రేడింగ్ బలహీనంగా ఉండొచ్చని ఎడెల్‌వీజ్ సెక్యూరిటీస్ సంస్థ ఫారెక్స్ అండ్ రేట్స్ విభాగం హెడ్ సజల్ గుప్తా పేర్కొన్నారు. ఈ వారం డాలర్‌తో పోలిస్తే రూపాయి ట్రేడింగ్ 69.30–70.10 శ్రేణిలో తిరుగాడవచ్చని తెలిపారు. సాంకేతిక చార్ట్‌లపరంగా చూస్తే నిఫ్టీ 50 మధ్యంతరంగా అప్‌ట్రెండ్‌లోనే కొనసాగవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రీసెర్చ్ విభాగం హెడ్ దీపక్ జసానీ వివరించారు. ఇందుకు 11,769 పాయింట్ల మద్దతు స్థాయిని కాపాడుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**ఎఫ్‌పీఐల జోరు..**

విధానపరమైన సంస్కరణలు అమలవుతాయనే ఉద్దేశంతో విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. జూన్ మొదటి వారంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 7,095 కోట్లు దేశీ క్యాపిటల్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేశారు. వరుసగా నాలుగు నెలలుగా విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నికరంగా కొనుగోళ్లు జరుపుతున్నారు. మేలో రూ. 9,031 కోట్లు, ఏప్రిల్‌లో రూ. 16,093 కోట్లు, మార్చిలో రూ. 45,981 కోట్లు, ఫిబ్రవరిలో రూ. 11,182 కోట్లు (ఈక్విటీ, డెట్) క్యాపిటల్ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేశారు. డిపాజిటరీల తాజా గణాంకాల ప్రకారం జూన్ 3–7 మధ్యలో ఎఫ్‌పీఐలు నికరంగా రూ. 1,915 కోట్లు ఈక్విటీల్లో, రూ. 5,180 కోట్లు డెట్ సెగ్మెంట్‌లో ఇన్వెస్ట్ చేశారు. వారం మొత్తంలో ఒక రోజు కూడా ఉపసంహరణ జరగకపోవడం గమనార్హమని గ్రో సంస్థ సీవోవో హర్ష్ జైన్ చెప్పారు.

# ఆధార్ ఉన్న ప్రతి ఒక్కరికీ రూ.2 లక్షల రుణం!

- ప్రభుత్వరంగ సంస్థలకు స్వయంప్రతిపత్తి
- మోదీ సర్కారుకు అనిల్ అగర్వాల్ సూచనలు



**న్యూఢిల్లీ:** వేదాంత లిమిటెడ్ అధినేత అనిల్ అగర్వాల్ కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారుకు కీలక సూచనలు చేశారు. దేశంలో దాగి ఉన్న వనరులను వెలికి తీయాలని, ప్రభుత్వరంగ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థలకు స్వయంప్రతిపత్తి ఇవ్వాలని, ఆధార్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రధానమంత్రి ముద్రా యోజన కింద రూ.2లక్షల చొప్పున రుణం ఇవ్వాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వరంగ సంస్థలు 3 రెట్లు గొప్పగా పనిచేయగలవన్నారు. దేశంలో పేదరికాన్ని నిర్మూలించొచ్చని, ఉద్యోగాలను సృష్టించొచ్చని ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూ సందర్భంగాసూచించారు. భారత పరిస్థితిని ‘మదర్ ఇండియా’ సినిమాతో పోల్చారు. ‘‘ఆ సినిమాలో రైతు 100 క్వింటాళ్ల ధాన్యం పండిస్తే 80 క్వింటాళ్లను రుణమిచ్చిన వారు పట్టుకుపోతారు. అలాగే, భారత్‌లోనూ 50% ఆదాయాలను దిగుమతులపైనే ఖర్చు చేస్తున్నాం. ఆ తర్వాత వడ్డీలకు చెల్లింపులు పోగా మిగిలేది ఏమీ లేదు’’ అని అగర్వాల్ పేర్కొన్నారు. సహజవనరులు, ఎలక్ట్రానిక్స్ రంగాలకు భారీ ఉపాధి అవకాశాలను సృష్టించే సామర్థ్యాలున్నట్టు చెప్పారు. మినరల్స్, ఆయిల్, గ్యాస్ నిక్షేపాలను మరింత పెద్ద ఎత్తున వెలికితీయాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 10-6-2019

| | |
|---|---|
| విశాఖ | 375–00 |
| చిత్తూరు | 398–00 |
| వరంగల్ | 353–00 |
| చెన్నై | 405–00 |
| ముంబై | 405–00 |
| విజయవాడ | 345–00 |
| నమక్కల్ | 395–00 |
| గోదావరి | 345–00 |
| 9–6–2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 350–00 |
| రిటైల్ (ఒక గుడ్డుకు) | 4.10 |
| బెంగళూరు | 385–00 |
| ఢిల్లీ | 342–00 |
| కోల్‌కతా | 380–00 |

# ఆయిల్, చమురు బ్లాక్‌ల వేలం...

- ఓఎన్‌జీసీ, వేదాంత, ఆయిల్ ఇండియా టాప్
- ఈ మూడింటికే 30 బ్లాక్‌లు రిలయన్స్, బీపీకి కేజీ బేసిన్ బ్లాక్




**న్యూఢిల్లీ:** ప్రభుత్వరంగ ఆయిల్‌ఇండియా, ఓఎన్‌జీసీతోపాటు అనిల్ అగర్వాల్‌కు చెందిన వేదాంత లిమిటెడ్ తాజాగా ముగిసిన చమురు, గ్యాస్ బ్లాక్‌ల వేలంలో టాప్–3గా నిలిచాయి. రెండో దశ ఓపెన్ యాక్రేజ్ లైసెన్సింగ్ పాలసీ (ఓఏఎల్‌పీ) కింద 14 ఆయిల్, గ్యాస్ బ్లాక్‌లు, మూడో దశ ఓఏఎల్‌పీ కింద మరో 18 ఆయిల్, గ్యాస్, 5 కోల్‌బెడ్ మీథేన్ బ్లాక్‌లను కేంద్రం ప్రభుత్వం వేలానికి ఉంచింది. వీటిల్లో ఆయిల్ ఇండియాకు 12, ఓఎన్‌జీసీకి 9, వేదాంతకు తొమ్మిది చొప్పున మొత్తం 30 బ్లాక్‌లు ఈ మూడు కంపెనీలకే దక్కనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. రిలయన్స్–బీపీ సంయుక్తంగా కృష్ణా గోదావరి బేసిన్ (కేజీ బేసిన్)లో ఓ బ్లాక్‌ను దక్కించుకోనున్నాయి. ఈ బ్లాక్‌ను ఓఎన్‌జీసీ కంటే మించి బిడ్ చేయడం ద్వారా రిలయన్స్–బీపీలు దక్కించుకోవడం విశేషం. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ వివిధ కంపెనీలు సమర్పించిన బిడ్లను పరిశీలన పూర్తి చేసినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఇందులో ఓఎన్‌జీసీ, వేదాంత తొమ్మిది బ్లాకుల్లో టాప్ బిడ్డర్లుగా, 12 బ్లాక్‌ల్లో ఆయిల్ ఇండియా టాప్‌లో ఉన్నట్టు చెప్పాయి. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం అనంతరం విజేతలను ప్రకటించనున్నట్టు తెలిపాయి. 2017 జూలైలో కేంద్రం నూతనంగా ఓఏఎల్‌పీ విధానాన్ని ప్రవేశపెట్టింది. దీని కింద కంపెనీలు తమంతట తామే ఫలానా ప్రాంతంలో అన్వేషణ, ఉత్పత్తి విషయంలో ఆసక్తిని తెలియజేయవచ్చు.

# లాభంలో 8-10% వృద్ధి: నాట్కో

**హైదరాబాద్:** ఔషధ రంగ కంపెనీ నాట్కో ఫార్మాకు ఈ ఏడాది భారత్ పాటు బ్రెజిల్, కెనడా మార్కెట్లు కలిసి రానున్నాయి. ఈ మార్కెట్లలో 30–40 శాతం వృద్ధి ఉండొచ్చని కంపెనీ ఆశిస్తోంది. భారత మార్కెట్ ఒక్కటే 15–20 శాతం అధిక వ్యాపారం నమోదు చేయవచ్చని నాట్కో వైస్ చైర్మన్ రాజీవ్ నన్నపనేని వెల్లడించారు. ‘చాలా ఏళ్లుగా బ్రెజిల్ నుంచి ఆదాయం అంతంతే ఉంది. ఈ ఏడాది అక్కడ ఆదాయాన్నిచ్చే ఉత్పత్తులను విడుదల చేయనున్నాం. ఇక కెనడాలో కొత్త ఔషధాలను మార్కెట్ చేయడంతోపాటు కొన్ని వివాదాలు పరిష్కారం కానున్నాయి. ఇవి సాకారం అయితే మూడు మార్కెట్లలో కలిపి వృద్ధి 30–40 శాతం ఉంటుంది. భారత్‌లో 8–10 ఔషధాలను విడుదల చేయనున్నాం. బ్రెజిల్, కెనడాల్లో కలిపి ఎనిమిది వరకు ప్రవేశపెడతాం. మొత్తంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఆదాయం 7–8 శాతం, లాభం 8–10 శాతం అధికంగా సాధిస్తామని అంచనా వేస్తున్నాం’ అని వివరించారు.



# మా బంగారు గనుల్లో పెట్టుబడులు పెట్టండి

## అత్తిక గోల్డ్ అధినేతకు గునియా రాయబారి ఆహ్వానం

**సాక్షి బెంగళూరు:** పశ్చిమ ఆఫ్రికా గునియా దేశంలో పెట్టుబడులు పెట్టాలని ప్రముఖ వ్యాపారవేత్త, అత్తిక గోల్డ్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత బొమ్మనహళ్లి బాబును ఆ దేశ ప్రభుత్వం ఆహ్వానించింది. భారత్‌లోని ఆ దేశ రాయబారి ఫటోమటా బాల్డే ఇటీవల బెంగళూరులోని అత్తిక గోల్డ్ కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంగా ఈ మేరకు ఆహ్వానం పలికారు. బాబు మాట్లాడుతూ.. గునియాలోని బంగారు గనుల్లో పెట్టుబడులు పెట్టేందుకు పలు మార్లు ఆహ్వానం వచ్చిందని, త్వరలో వెళ్లి ఒప్పందం చేసుకుని వస్తానని మీడియాకు తెలిపారు. అత్తిక గోల్డ్ కంపెనీకి బెంగళూరులో 28 శాఖలతో కలిపి దేశవ్యాప్తంగా మొత్తం 150 బ్రాంచీలు ఉన్నట్లు తెలిపారు. రానున్న రెండేళ్లలో 200 శాఖలకు చేరుకుంటామని చెప్పారు.



ఫటోమటా బాల్డేకు జ్ఞాపిక అందజేస్తున్న బొమ్మనహళ్లి బాబు

# ఆదాయపన్ను మినహాయింపు 5 లక్షలకు పెంచాలి

## అసోచామ్ డిమాండ్

**న్యూఢిల్లీ:** వ్యక్తుల కనీస ఆదాయపన్ను మినహాయింపు పరిమితి ప్రస్తుతం రూ.2.5 లక్షలుగా ఉండగా, దీన్ని రూ.5 లక్షలకు పెంచాలని(రిబేటు రూపంలో కాకుండా) అసోచామ్ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. గత కొన్నేళ్లలో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ సూచన చేసింది. జూలై 5న కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ తీసుకురానున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక శాఖకు సమర్పించిన వినతి పత్రంలో ఈ డిమాండ్‌ను చేర్చింది. వేతన జీవులు, వేతనేతర పన్ను చెల్లింపుదార్ల మధ్య సమానత్వాన్ని తీసుకొచ్చేందుకు గాను స్టాండర్డ్ డిడక్షన్‌ను చట్టంలో తిరిగి ప్రవేశపెట్టాలని సూచించింది. స్థూల ఆదాయంలో 20 శాతం, గరిష్టంగా రూ.1,00,000 వరకు ప్రామాణిక మినహాయింపుగా అనుమతించాలని కోరింది. ఎల్‌టీసీలో వసతి, భోజన ఖర్చులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

**బ్రౌన్‌ఫీల్డ్ ఆస్తులను ప్రైవేటీకరించాలి: సీఐఐ**

న్యూఢిల్లీ: ఓడరేవులు, విమానాశ్రయాల వంటి నిర్వహణ సాధ్యమైన బ్రౌన్ ఫీల్డ్ ఆస్తుల్లో వాటాలను ప్రభుత్వం విక్రయించాలని సీఐఐ సూచించింది. ఇవి ప్రైవేటు రంగానికి తక్కువ రిస్క్ ఉన్న పెట్టుబడి అవకాశాలుగా పేర్కొంది. ‘‘ప్రభుత్వ నిర్వహణ సాధ్యమైన బ్రౌన్ ఫీల్డ్ ఆస్తులు... పోర్ట్‌లు, ఎయిర్‌పోర్ట్‌లు, విద్యుత్ ప్లాంట్లు, రహదారి ప్రాజెక్టులను విక్రయానికి తీసుకురావాలి’’ అని సీఐఐ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ చేయడానికి ప్రైవేటు ఇన్వెస్టర్లకు ఇవి తక్కువ రిస్క్ ఆప్షన్లు అవుతాయని, రిస్క్ తక్కువగా ఉండడం వల్ల అంతర్జాతీయ వెల్త్ ఫండ్స్‌కు, రుణదాతలకు, పెన్షన్ ఫండ్స్‌కు ఇవి ఆకర్షణీయ ప్రాజెక్టులు అవుతాయని అభిప్రాయపడింది. ప్రభుత్వం పెట్టుబడుల ఉపసంహరణకు ఇదో మార్గమని, ప్రైవేటు పెట్టుబడుల సైకిల్‌ను ఇది వేగవంతం చేస్తుందని సీఐఐ సూచించింది.




సాక్షి స్టాక్స్

| ఎన్‌బీసీసీ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | కొనొచ్చు |
|---|---|---|

**ప్రస్తుత ధర:** రూ.61 **టార్గెట్ ధర:** రూ.77

**ఎందుకంటే:** ఈ ప్రభుత్వ రంగ నిర్మాణ రంగ కంపెనీ గత ఆర్థిక సంవత్సర నాలుగో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఆదాయం 9 శాతం వృద్ధితో రూ.2,353 కోట్లకు పెరగ్గా, నిర్వహణ లాభ మార్జిన్ 1 శాతం మేర తగ్గి 7.5 శాతానికి పరిమితమైంది. పన్ను వ్యయాలు తక్కువగా ఉండటంతో నికర లాభం 8 శాతం వృద్ధితో రూ.153 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.12,500 కోట్ల ఆర్డర్లను సాధించింది. దీంతో మొత్తం ఆర్డర్లు రూ.80,000 కోట్లకు చేరాయి. ఇది గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆర్జించిన మొత్తం ఆదాయానికి దాదాపు 8 రెట్లు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.15,000 కోట్లకు మించిన ఆర్డర్లు రాగలవని కంపెనీ అంచనా వేస్తోంది. జైప్రకాశ్ ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్ట్‌లపై నిర్ణయం ఈ నెల 10న వెలువడుతుందని అంచనా. ఈ డీల్ ఎన్‌బీసీసీకే లభిస్తే, 21,000 గృహాల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. దీని కోసం ఈ కంపెనీ రూ.200–300 కోట్లు ఇన్వెస్ట్ చేసే అవకాశాలున్నాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే, 2,500 ఎకరాల భూమి, ఒక కోటి చదరపుటడుగుల ఫ్లోర్‌స్పేస్ ఇండెక్స్(ఎఫ్‌ఎస్‌ఐ)లు ఎన్ బీసీసీకి మిగులుతాయి. రానున్న క్వార్టర్లలో ప్రాజెక్ట్‌ల అమలు అంతంతమాత్రంగానే ఉండనున్నా, మరిన్ని ఆర్డర్లు రానున్నాయి. వివిధ ప్రాజెక్ట్‌లకు సంబంధించిన ఆమోదాలు లభించే అవకాశాలు మెరుగయ్యాయి. ఫలితంగా ప్రాజెక్ట్‌ల అమలు మెరుగుపడవచ్చు. మొత్తం మీద రెండేళ్లలో ఆదాయం 27 శాతం చక్రగతివృద్ధితో రూ.15,973 కోట్లకు పెరుగుతుందని భావిస్తున్నాం. నికర లాభం కూడా రెండేళ్లలో 28 శాతం చొప్పున చక్రగతిన వృద్ధి చెందగలవని అంచనా.

| ఐషర్ మోటార్స్ | బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ | కొనొచ్చు |
|---|---|---|

**ప్రస్తుత ధర:** రూ.19,880 **టార్గెట్ ధర:** రూ.23,500

**ఎందుకంటే:** కంపెనీకి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్(ఆర్‌ఈ–బుల్లెట్ బైక్)ల డిమాండ్ బలహీనంగా ఉంటోంది. ఈ బైక్ పునరుజ్జీవనం పొందిన 2008 నుంచి చూస్తే, డిమాండ్ బలహీనంగా ఉండటం ఇదే మొదటిసారి. కొత్త పోటీదారు (జావా) మార్కెట్లోకి వస్తున్నప్పటికీ, డిమాండ్ తగ్గడం సాధారణ(సైక్లికల్)మేనని, కంపెనీ భావిస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉండనున్నప్పటికీ, ఆ తర్వాత రికవరీ కాగలవని కంపెనీ అంచనా వేస్తోంది. ఈ బైక్‌ల నాణ్యతను మరింత మెరుగుపరచడానికి, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించడానికి, బ్రాండ్ వాల్యూను పెంచడానికి కంపెనీ ప్రయత్నాలు చేస్తోంది. భారత్‌తో సహా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ప్రీమియమ్ బైక్‌లకు పెరుగుతున్న డిమాండ్‌ను అందిపుచ్చుకునే అవకాశాలపై దృష్టి పెట్టింది. 250–750 సీసీ కేటగిరీ సెగ్మెంట్లలో మార్కెట్‌ను మరింతగా పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. పదేళ్లలో వాహన పరిశ్రమ సాధించే వృద్ధికి 2 రెట్ల వృద్ధిని లక్ష్యంగా పెట్టుకుంది. తన బైక్‌లను భారత్ స్టేజ్ సిక్స్(బీఎస్6) ప్రమాణాలకు అప్‌గ్రేడ్ చేస్తోంది. అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్న ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో మార్కెటింగ్ జోరుగా చేస్తోంది. కొత్త వేరియంట్లలో ఎగుమతులు పెంచుకునే ప్రయత్నాలు చేస్తోంది. కొత్తగా సీఈఓగా వచ్చిన వినోద్ దాసరి అనుభవం, నైపుణ్యం కంపెనీకి మేలు చేయగలవు. రెండేళ్లలో అమ్మకాలు 6% చక్రగతిన వృద్ధి చెందగల అంచనా.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

# రిలయన్స్ పవర్‌కు రూ.3,558 కోట్ల నష్టం

**న్యూఢిల్లీ:** అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ మార్చి త్రైమాసికంలో రూ.3,558.51 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.189 కోట్ల లాభం రావడం గమనార్హం. 2018–19 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.2,952 కోట్ల నష్టాన్ని ప్రకటించింది. అంత్రక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.840 కోట్లుగా ఉంది. డిబెంచర్ల జారీ ద్వారా నిధులు సమీకరించాలని ఈ నెల 8న జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయించింది.

# సెన్సెక్స్ తక్షణ అవరోధం 40,030

## మార్కెట్ పంచాంగం

మార్కెట్ అంచనాల్ని మించి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించినప్పటి నుంచి స్టాక్ సూచీలు కొత్త రికార్డుల్ని నెలకొల్పుతున్నప్పటికీ, ఆ రికార్డుస్థాయికి ఒక్కరోజుకూడా నిలుపుకోలేక అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. గత ఏడు ట్రేడింగ్ సెషన్లలో మూడు దఫాలు రికార్డుస్థాయికి చేరిన తర్వాత వెనువెంటనే 2–3 శాతం మేర పతనాల్ని చవిచూసాయి. గతవారం రిజర్వ్‌బ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించిన తర్వాత కూడా ఎన్‌బీఎఫ్‌సీల లిక్విడిటీ సంక్షోభం మార్కెట్ క్షీణతకు కారణమయ్యింది. ఇదేతరహా ట్రెండ్ మరికొద్దిరోజులు కొనసాగవచ్చని టెక్నికల్ చార్టులు వెల్లడిస్తున్నాయి. ఈ వారం సూచీల సాంకేతిక అంశాల విషయానికొస్తే...

**సెన్సెక్స్ సాంకేతికాలు...**




జూన్ 7తో ముగిసిన నాలుగురోజుల ట్రేడింగ్ వారంలో మరో కొత్త రికార్డుస్థాయి 40,312 పాయింట్ల వరకూ పెరిగిన బీఎస్‌ఈ సెన్సెక్స్..అటు తర్వాత 39,280 పాయింట్ల కనిష్టస్థాయికి పడిపోయింది. చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 98 పాయింట్ల నష్టంతో 39,616 పాయింట్ల వద్ద క్లోజయ్యింది. మే 31తో ముగిసినవారంలో 2 శాతం శ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనుకాగా, ఈ ఒడిదుడుకుల శ్రేణి గతవారం 3 శాతానికి పెరిగింది. ఈ వారం కూడా ఇదేతరహాలో హెచ్చుతగ్గులకు లోనైతే తొలుత 40,030 పాయింట్లస్థాయి అవరోధం కల్పించవచ్చు. అటుపైన ముగిస్తే మరోదఫా 40,310 పాయింట్ల స్థాయిని పరీక్షించవచ్చు. ఆపైన ముగింపు 40,650 పాయింట్ల స్థాయికి చేర్చవచ్చు. ఈ వారం తొలి నిరోధాన్ని దాటలేకపోయినా, బలహీనంగా ప్రారంభమైనా 39,300 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతుస్థాయిని ముగింపులో కోల్పోతే 38,825 పాయింట్ల వద్దకు పడిపోవొచ్చు. ఈ లోపున 38,570 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు.

**నిఫ్టీ తక్షణ అవరోధం 12,005**




గతవారం 12,103 వద్ద మరో కొత్త రికార్డుస్థాయిని నెలకొల్పిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ, అటుతర్వాత అమ్మకాల ఒత్తిడికి తలొగ్గి 11,770 వద్దకు పడిపోయింది. ఈ స్థాయి నుంచి వెనువెంటనే కొంతవరకూ కోలుకుని, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 52 పాయింట్ల నష్టంతో 11,871 వద్ద ముగిసింది. అమెరికా స్టాక్ సూచీలు జరుపుతున్న భారీ ర్యాలీ ప్రభావంతో ఈ వారం నిఫ్టీ గ్యాప్‌అప్‌తో ప్రారంభమైతే 12,005 స్థాయి తొలుత అవరోధం కల్పించవచ్చు. ఈ స్థాయిపైన నిలదొక్కుకుంటే 12,120 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపై 12,210 స్థాయి వరకూ ర్యాలీ కొనసాగవచ్చు. ఈ వారం తొలి నిరోధస్థాయిని అధిగమించలేకపోయినా, బలహీనంగా ప్రారంభమైనా 11,770 సమీపంలో తొలి మద్దతు లభ్యమవుతున్నది. ఈ మద్దతుస్థాయిలోపున ముగిస్తే, 11,655 వద్దకు తగ్గవచ్చు. ఈ స్థాయిని సైతం కోల్పోతే 11,615 వరకూ క్షీణించవచ్చు.

– పి. సత్యప్రసాద్

# బీమాకు యులిప్‌లు వద్దు!

**ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్(ఈఎల్‌ఎస్‌ఎస్)ల్లో కొంత, యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీ(యులిప్)ల్లో కొంత చొప్పున ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. ఇది సరైన నిర్ణయమేనా ?** *–రేవంత్, విజయవాడ*

బీమా తీసుకోవాలనుకుంటే టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలే తీసుకోవాలి. అంతేకాని యులిప్(యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ పాలసీ)లను అస్సలు ఏ మాత్రం పరిగణించకూడదు. యులిప్‌ల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల అదాయపు పన్ను చట్టం, సెక్షన్ 80 సి కింద పన్ను ప్రయోజనాలు లభించినప్పటికీ, బీమా, మదుపుకు సంబంధించి సరైన రాబడులు మీరు పొందలేరు. ఏ ఇన్వెస్టర్ అయినా, బీమాకు, ఇన్వెస్ట్‌మెంట్‌కు యులిప్ వంటి ఒకే సాధనంలో ఇన్వెస్ట్ చేయకూడదు. బీమా..... అత్యంత ముఖ్యమైన అవసరం కాబట్టి, సరైన ప్లానింగ్‌తో సరైన పాలసీని ఎంచుకోవాలి. ఒక వేళ ఏ వ్యక్తి అయినా సింగిల్‌గా ఉండి, ఆ వ్యక్తిపై ఆర్థికంగా ఆధారపడిన వాళ్లు ఎవరూ లేకపోతే, అసలు బీమా అవసరమే ఉండదు. కానీ మన దేశంలో ఇలాంటి సింగిల్ వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు. మీకు వివాహమై, మీకు పిల్లలు గనుక ఉన్నట్లయితే, మీకు బీమా అవసరం అధికంగా ఉంటుంది. ఏదిఏమైనా బీమా తీసుకునే పక్షంలో మొదటి ఎంపిక టర్మ్ ఇన్సూరెన్స్‌దే అని చెప్పవచ్చు. టర్మ్ ఇన్సూరెన్స్‌లో మనం చెల్లించాల్సిన ప్రీమియమ్ తక్కువగానూ, బీమా కవరేజ్ అధికంగానూ ఉంటుంది. మీ సంపద పెరుగుతున్న కొద్దీ, మీకు బీమా అవసరం తగ్గుతూ ఉంటుంది. ఇక పన్ను ప్రయోజనాల కోసం ఈఎల్‌ఎస్‌ఎస్‌ల్లో ఇన్వెస్ట్ చేయండి. ఇన్వెస్ట్‌మెంట్‌కైనా, బీమాకైనా యులిప్‌ల ఊసే వద్దు.

**నేను ఏడాది కాలంగా ఒక మల్టీక్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. అయితే ఇదే ఫండ్ కంపెనీకి చెందిన ట్యాక్స్–సేవింగ్ ఫండ్, నేను ఇన్వెస్ట్ చేస్తున్న మల్టీక్యాప్ ఫండ్ కంటే మంచి రాబడులను ఇస్తోంది. మల్టీక్యాప్‌లోని నా పెట్టుబడిని ఈ ట్యాక్స్‌సేవింగ్ ఫండ్‌కు బదిలీ చేయాలనుకుంటున్నాను. ఇది మంచిదేనా ?** *–సృజన, హైదరాబాద్*



**Q & A**

ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



మీరు ఏ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నారు ? ఎంత కాలం పాటు ఇన్వెస్ట్ చేయదల్చుకున్నారు.. తదితర వివరాలు లేకుండా ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం కష్టం. ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్స్‌కు లాక్–ఇన్ పీరియడ్ మూడేళ్లుగా ఉంటుంది. అంటే మూడేళ్ల పాటు మీరు మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉండదు. ఇది ఆయా ఫండ్ మేనేజర్లకు మంచి వెసులుబాటును ఇస్తుంది. మూడేళ్ల పాటు ఈ నిధులు వారికి అందుబాటులో ఉంటాయి. కాబట్టి ట్యాక్స్ సేవింగ్ ఫండ్ మేనేజర్లు మంచి ప్లానింగ్‌తో ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలు తీసుకుంటారు. మరోవైపు మూడేళ్లపాటు నిధులు మన దగ్గరే ఉంటాయనే ధిలాసాతో ఈ ట్యాక్స్ సేవింగ్ ఫండ్ మేనేజర్లు ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలపై పెద్దగా ఆసక్తి చూపరనే విమర్శ కూడా ఉంది. అయితే ట్యాక్స్ సేవింగ్ ఫండ్స్ భారీ రాబడులిచ్చిన దాఖలాలు పెద్దగా లేవు. అయితే ఇతర కేటగిరీ ఫండ్స్‌తో పోల్చితే మాత్రం ఇవి మంచి రాబడులనే ఇస్తున్నాయి. ఇతర కేటగిరీ ఫండ్స్‌కు ఉండే రిడంప్షన్ ఒత్తిడి ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్స్‌కు పెద్దగా ఉండదు. సాధారణంగా రూ. లక్షన్నర వరకూ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు పన్ను ప్రయోజనాలు లభిస్తాయి. కాబట్టి, ఈ పరిధిలోనే(రూ.లక్షన్నర లోపే) ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్స్‌ను ఎంచుకోండి. అంతకుమించి ఇన్వెస్ట్ చేయడం వృథాయే. ఎందుకంటే అనవసరంగా ఇన్వెస్ట్‌మెంట్స్ మూడేళ్లు లాక్–ఇన్ అయిపోతాయి.

**నేను రెండేళ్ల నుంచి 3 లార్జ్ క్యాప్ ఫండ్స్‌ల్లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. వీటి పనితీరు సంతృప్తికరంగానే ఉంది. వచ్చే నెల నుంచి నా వేతనం 20% దాకా పెరగబోతోంది. ఈ పెరిగిన దాంట్లో కొంత భాగాన్ని మిడ్–క్యాప్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. లేకుంటే మరో లార్జ్–క్యాప్ ఫండ్‌లోనే ఇన్వెస్ట్ చేయమంటారా ?** *–జబ్బార్, విశాఖపట్టణం*

సాధారణంగా లార్జ్ క్యాప్, మిడ్ క్యాప్, మల్టీ క్యాప్, వాల్యూ ఫండ్స్‌ను నిర్వహించే ఫండ్ మేనేజర్లకు ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాల్లో ఒకింత స్వేచ్ఛ ఉంటుంది. మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకుంటారు. మీరు కొత్తగా ఇన్వెస్ట్ చేయడానికి ఈ కేటగిరీ ఫండ్స్‌ల్లో దేనినైనా ఒక దానిని ఎంచుకోండి. 2–3 ఏళ్ల పాటు ఇన్వెస్ట్ చేయండి. అప్పటికల్లా ఈ తరహా ఫండ్స్‌ల్లో ఉండే ఒడిదుడుకులు, రాబడులు పట్ల మీకు ఒక అవగాహన వస్తుంది. మీ ఇన్వెస్ట్‌మెంట్స్‌ల్లో కనీసం 10–15% వరకూ మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్‌ల్లో ఇన్వెస్ట్ చేసేలా చూసుకోండి. సాధారణంగా చాలా మంది ఇన్వెస్టర్లు స్మాల్, మిడ్ క్యాప్ ఫండ్స్ మంచి పనితీరు కనబరుస్తున్నప్పుడే వాటిని గుర్తిస్తారు. వాటి పనితీరు బాగా ఉన్నప్పుడే ఆకర్షితులై, వాటిల్లో ఇన్వెస్ట్ చేస్తారు. ఆ తర్వాత వచ్చే రాబడులు వారిని నిరాశపరుస్తాయి. ఇప్పటివరకూ ఈ ఫండ్స్ పనితీరు నిరాశానకంగానే ఉంది. అందుకని మిడ్, స్మాల్ క్యాప్ ఫండ్స్ పనితీరు అంతంతమాత్రంగానే ఉన్నప్పుడే ఇన్వెస్ట్‌మెంట్ మంచిది.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

**ICFAI** Foundation for Higher Education
(Deemed-to-be University under Section 3 of the UGC Act, 1956)
Autonomous Institution. Accredited by NAAC with 'A+' Grade

**IcfaiTech**
Faculty of Science & Technology (FST)

**B.Tech./B.Sc. Admissions Counselling for EAMCET & JEE Students**

COUNSELLING SCHEDULE

| Date | Center | Address |
|---|---|---|
| June 16 & 17, 2019 | HYDERABAD | ICFAI Campus, Donthanapalli, Shankarpalli Road. |
| June 16 & 17, 2019 | VIJAYAWADA | 2nd Floor, DRR Complex, Opp. BSNL Office, Chuttugunta, Eluru Road. |

Candidates with **EAMCET ranks** between 1-55,000 and **JEE scores** of 55% and above can attend the Counselling as per the above schedule.

MERIT SCHOLARSHIPS*

| Category | 100% | 50% | 25% |
|---|---|---|---|
| EAMCET Ranks | 1 – 500 | 501 – 2000 | 2001 – 5000 |
| JEE Mains Percentile | 91 – 100 | 81 – 90 | 70 – 80 |

*(for First Semester only);
*Merit Scholarships based on Semester-wise performance are also available*

Students can apply for Education Loans at the Bank Stalls kept at the Campus on the day of Reporting for Admission (July 15, 2019).

Contact: Hyderabad: Himayatnagar (9390603249), Mehdipatnam (9849693698), Kukatpally (9966969982), Secunderabad (9966442904), Dilsukhnagar (9848390108), Other Locations (8498053801)

Toll-free: 1-800-599-0767 www.ifheindia.org

# ఏపీ మంత్రివర్గంలో సామాజిక న్యాయం

**బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య**



**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ మంత్రిమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు వర్గాలన్నింటికీ న్యాయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ దళిత, బహుజన వర్గాలకు ఈ స్థాయిలో మంత్రి పదవులు కేటాయించలేదన్నారు. ఇది నిజంగా చారిత్రాత్మక అంశమన్నారు. బీసీలకు స్పీకర్ పదవి ఇవ్వడం గొప్ప విషయమని, ఏపీ కేబినెట్‌లో బీసీలకు 7, ఎస్సీలకు 5, ఎస్టీ, మైనార్టీలకు 1, కాపులకు 4 మంత్రి పదవులు ఇచ్చారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ఎక్కువ పదవులు ఇవ్వడంతో వారి జీవితాల్లో తప్పకుండా మార్పు వస్తుందన్నారు. ఏపీ సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ సీఎం చూసి నేర్చుకోవాలన్నారు. తెలంగాణ మంత్రిమండలిలో బీసీలకు అన్యాయం జరిగిందని విమర్శించారు.

## ముగిసిన 'సాక్షి' జర్నలిజం స్కూల్ ప్రవేశ పరీక్షలు

**సాక్షి, హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో 'సాక్షి'జర్నలిజం స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం జరిగింది. 'సాక్షి'పీజీ డిప్లొమో ఇన్ జర్నలిజం కోర్సు కోసం 21 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాలు ఈ నెల 24న ప్రకటించనున్నట్లు ఆయన వివరించారు. ఈ నెల 12న పేపర్–1 పరీక్షా పత్రం'కీ' **www.sakshischoolofjournalism.com, www.sakshieducation.com, www.sakshi. com**వెబ్‌సైట్‌లలో ఉంటుందని వెల్లడించారు.







- రాజన్న సిరిసిల్లా, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లను పరస్పర బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి ఆదివారం ఉత్తర్వులిచ్చారు. సిరిసిల్లా జిల్లా కలెక్టర్ వెంకటరా మిరెడ్డిని సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా, సిద్దిపేట జిల్లా కలెక్టర్ క్రిష్ణభాస్కర్ ను సిరిసిల్లా జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు.










